అన్నమయ్య పదం - పరమార్థం



డా॥ తాడేపల్లి పతంజలి

శాంతా వేసంతా ప్రెస్టు
హైదరాబాద్

అన్నమయ్య
పదం - పరమార్థం

(100 అన్నమయ్య కీర్తనలకు వ్యాఖ్యానం)

సంకలనం, వ్యాఖ్యానం

డా॥ తాడేపల్లి పతంజలి



శాంతా-వసంతా ట్రస్టు

ప్లాట్ నెం : 16 & 17, గ్రీన్ వాక్ వేస్,

రాజేంద్రనగర్, హైదరాబాద్

Annamayya Padam - Paramaardam

(Commentry for 100 Sankeerthanas)

Compiled and Commentary :
Dr Tadepalli Patanjali
Ph : 9866691587
email : patanjali1576@gmail.com

ముద్రణ : **26 మే, 2016**

ప్రతులు : 1000

ముఖచిత్రం : బాపు

కవర్ డిజైన్ : **జి.రాజేష్. హైదరాబాద్**

డిటిపి : **టి.నవీన్, హైదరాబాద్**

వెల : **అమూల్యం**

ప్రతులకు :

శాంతా వసంతా ట్రస్టు

ప్లాట్ నెం : 16 & 17, గ్రీన్ వాక్ వేస్,

బుద్వేల్, రాజేంద్రనగర్,

హైదరాబాద్

email : svcthyd@gmail.com

www.shanthavasanthatrust.org

దండము దండము

దండము దండము నీకు దైవశిఖామణి
పండియు బండని మతి పాకముసేయు కొరకు
(అన్నమయ్య రేకు: 0371-01సం: 04-416)

❖ ❖ ❖

కన్న తల్లిదండ్రులు, ప్రత్యక్ష దైవాలు తాడేపల్లి సుశీల , పార్వతీశ శాస్త్రి దంపతులకు మొదటగా నమస్కారములు

అన్నమయ్య పద సేవలో స్వామి ఈ సేవకుని చేత వ్రాయిస్తున్న నాలుగవ పుస్తకం ఇది.

అన్నమయ్య అన్నమాట,(సుజనరంజని ప్రచురణ) అన్నమయ్య గీతోపదేశాలు,(సుజనరంజని ప్రచురణ) అన్నమయ్య కౌముది (శ్రీ రావి మోహనరావు గారి ప్రచురణ) ఇదివరలో వచ్చాయి.

ఇప్పుడు అన్నమయ్య పదం పరమార్థం.

ఈ పుస్తకానికి ప్రేరకులు పెద్దలు శ్రీ వరప్రసాదరెడ్డిగారు.

మార్చి 13వతేదీ ఆదివారం...

ఒక టీవీ ఛానల్ లో శ్రీ నాథుని హరవిలాస కావ్య ప్రవచన ధ్వని ముద్రణ (recording)కార్యక్రమంలో ఉన్నాను.

భారతదేశంలో హెపటైటిస్ బి వ్యాక్సిన్ను రూపొందించడానికి ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి కృషి చేసి విజయం సాధించి, ప్రజానీకానికి చాలా తక్కువ ఖర్చుతో హెపటైటిస్ బి వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చేలా చేసిన శాంతా బయోటిక్స్ అధినేత, పద్మ భూషణ్ వరప్రసాద్ రెడ్డి గారినుంచిఫోన్...

"అన్నమయ్య పదం- పరమార్థం పేరిట ఒక పుస్తకం వ్రాయండి. అన్నమయ్య సాహిత్యంలో కొత్తగా సృష్టించిన విశేషంగా ప్రయోగించిన పదాలు, సమాసాల వివరణ 100 వరకు చేయండి. పుస్తకంగా తెద్దా"మని కోరారు.

అన్నమయ్య వేంకటేశుడు మనస్సులో మెదిలాడు.

"అన్నమయ్య పద సేవక" బిరుదును నాకు అనుగ్రహించిన ఆత్మీయులు, పెద్దలు శ్రీ మహీధర సీతారామ శర్మ గారి సమర్థవంతమయిన నాయకత్వంలో

నడుస్తున్న "సుజనరంజని" సంస్థ ప్రచురించిన అన్నమయ్య అన్నమాట,అన్నమయ్య గీతోపదేశాలు అను నాపుస్తకాలకు ఆర్థిక సహకారము అందించిన వదాన్యులు శ్రీ వరప్రసాద్ రెడ్డి గారు.

శ్రీ వరప్రసాద్ రెడ్డి గారికి హృదయ పూర్వక ధన్యవాదములు తెలియ చేసి,వారి ముఖతః అన్నమయ్య వేంకటేశుడు ఆజ్ఞాపించాడని భావించిఅన్నమయ్య పదం - పరమార్థం మొదలుపెట్టాను.

23-03-2016 న మొదలుపెట్టిన కార్యక్రమం 28-04-2016 న అన్నమయ్య వేంకటేశుని దయతో 100 పదాల , పదబంధాల వివరణతో పూర్తయింది.

శ్రీ వరప్రసాద్ రెడ్డిగారు చెప్పినట్లు గానే - ఏప్రియల్ నెలాఖరుకి స్వామి పదాలకు "శతమానం భవతి" చేసాడు.

❖ ❖ ❖

అన్నమయ్య గురించి ఇప్పటికి నేను భగవంతునిదయతో వ్రాసిన నాలుగు పుస్తకాలలో వైవిధ్యం చూపటానికి ప్రయత్నించాను.

అన్నమయ్య అన్నమాటలో ప్రసిద్ధమయిన 60 అన్నమయ్య కీర్తనల వివరణ జరిగింది.

అన్నమయ్య గీతోపదేశాలులో అన్నమయ్య 25 కీర్తనలకి- భగవద్గీతకి మధ్య పోలికను ఆవిష్కరించే ప్రయత్నం జరిగింది.

అన్నమయ్య కౌముదిలో మొత్తం రేకులలో ఇప్పటివరకు లభించిన అన్నమయ్య 90 సంస్కృత కీర్తనల వివరణ జరిగింది.

ప్రస్తుతం ఈ అన్నమయ్య పదం -పరమార్థం పుస్తకంలో అన్నమయ్య కొత్తగా సృష్టించిన లేదా ప్రచారంలోకి తెచ్చిన 100 పదాలను కీర్తనల నేపథ్యంలో వివరించటం జరిగింది. ఉదాహరణకు ఇంద్రధనుస్సుకు సింగిణి, శుభవార్తకు మేలుసుద్ది మొదలైన పదాలు తన కీర్తనల్లో ప్రయోగించాడు.వీటి వివరణ కీర్తనల వ్యాఖ్యానంలో చేసాను

❖

"ఇంటింటా అన్నమయ్య "చలనచిత్రం కోసం రాఘవేంద్రరావుగారికి, కీరవాణి గారికి- అన్నమయ్య కీర్తనల్లో కొన్ని సందేహాలు వస్తే - తన స్వగృహంలో నన్ను - వారిని ఒకచోట కలిపి - సమావేశం ఏర్పాటు చేసి సంశయ నివృత్తి చేయించిన సాహిత్యాభిమాని శ్రీ వరప్రసాద్ రెడ్డిగారు.

అన్నమయ్య అన్నమాట లో ముందుమాట హృదయ లేఖిని లో వరప్రసాద్ రెడ్డి గారు ఇలా వ్రాసారు

....అన్నమయ్య వేలాది కీర్తనల్లో కేవలం 60 కీర్తనలు మాత్రమే ఈ పుస్తకంలో పాఠకులకు అందుతున్నాయి... మీరు మెచ్చి , రసాస్వాదనకై అర్థం తెలుసుకోగోరిన కీర్తనలు ఈ పుస్తకంలో చోటు చేసుకొని ఉండకపోతే వాటి వివరాలు మాకు తెలిపితే , డా.పతంజలిగారికి తెలిపి ఇటువంటి పుస్తకం వ్రాయమని అభ్యర్థిస్తాం."
(అన్నమయ్య అన్నమాట)

వరప్రసాదరెడ్డిగారికి నిష్కల్మషమైన సాహిత్య రసాభినివేశానికి దర్పణాలు వారు వ్రాసిన పై వాక్యాలు. గుండె నిండుగా జన్మాంతర సంస్కారం లేకపోతే ఇలాంటి మాటలు రావు. ఇది నేను వారిని పొగడటానికి అనటం లేదు. వారి సహృదయతను అభినందిస్తున్నాను.వారిని, వారి కుటుంబ సభ్యులందరిని అన్నమయ్య వేంకటేశుడు చల్లని చూపుతో కాపాడాలని ప్రార్థిస్తున్నాను.

❖ ❖ ❖

నేను పుస్తకం అంతా సిద్ధం చేసి పేజి మేకర్ ఫైల్ తో సహ వారికి పంపిన తరువాత వరప్రసాదరెడ్డి గారు ఫోన్ లో పుస్తకావిష్కరణ గురించి ఒక మాటన్నారు."విడిగా పుస్తకావిష్కరణ సభ ఏర్పాటు చేయించమంటారా? లేదా... చాగంటి వారు ఈనెల 26 న మా ఇంటికి వస్తున్నారు. మా ఇంట్లో చేద్దామా ?"

ఒకసారి నా గుజరాత్ పర్యటన వివరాలు చెక్ చేసుకొన్న తర్వాత వారికి ఆనందంతో జవాబిచ్చాను. వారి ఇంట్లో చాగంటి వారి చేతనే పుస్తకావిష్కరణ చేయిద్దామని, నా జన్మ ధన్యమవుతుందని విన్నవించాను.

'శ్రీవేంకటేశ నేనే పదరితిగాక/మంచితనములు నీవు మానబోయేవా (రేకు: 0373-04సం: 04-431) 'అన్నాడు అన్నమయ్య. 'వేంకటేశ్వరుడా ! తహతహతో నేను ఏవేవో మాటలు పేలుతుంటాను. పలుకుతుంటాను.నువ్వు అది పట్టించుకోవు. నీ మంచితనాలు చేసే పద్ధతిని నువ్వు మానుకోవు' అని దాని ఆర్థం.

ఈ సందర్భంలో ఇది నాకు కూడ అన్వయిస్తుంది.

ఓం అంటే ఢం ...రాని పతంజలి ఎక్కడ.. ? ప్రవచన చక్రవర్తి చాగంటివారు ఎక్కడ? వారు నా పుస్తకాన్ని అవిష్కరిస్తున్నారంటే ఇది అన్నమయ్య వేంకటేశుడు వరప్రసాదరెడ్డి గారి క్రియలో చూపిస్తున్న మంచితనం కదూ !

❖ ❖ ❖

డా॥ పప్పు వేణుగోపాల రావు గారు చెన్నైలో ఉంటున్న పండితులు. మదరాసు మ్యూజిక్ అకాడమీ కార్యదర్శి. సంగీత సమ్రాట్, నాట్యకళా సాగర, శాస్త్ర ఆచార్య శిరోమణి, వాచస్పతి, అవధాన శేఖర బిరుదాంచితులు.వారు నా "అన్నమయ్య పదం పరమార్థం" ఆసాంతం చదివి ఆశిషములు పలికారు. వారికి హృదయ పూర్వక ధన్యవాదములు. "యిట్టె మీకు రెండుచెతులెత్తొకమాటు మొక్కితే గట్టిగా నిహపరాలు గలిగె మాకు"(రేకు: 0109-03సం: 02-051) అను అన్నమయ్య మాటను ఇక్కడ జ్ఞాపకం చేసుకొంటున్నాను.

❖ ❖ ❖

ఫేస్ బుక్ , వాట్ సప్ మొదలయిన సామాజిక మాధ్యమాలలో నేను పోస్ట్ చేసిన అన్నమయ్య పదం పరమార్థం లోని కొన్ని పదాలకు చాలామంది స్పందించారు.ఆశీర్వదించారు.

'బొమ్మ, దేవుడు, పాట మూడూ బాగున్నవి. ఆలోచనా వ్యాఖ్యలో చిక్కబడుతున్నది. చిలకగా చిలకగా వెన్న పడడం ఖాయం. గామిడి పదానికి కిక్కడ రక్షకత్వం అర్థం తో అన్వయం పొసగుతున్నదా? ఆలోచించండి . **(ఆచార్య వేటూరి ఆనంద మూర్తి)**'

'ఎలయించు-భావార్థకం ఎలయింత- ఈఎలయించు నే సూరి శబ్దపల్లవంగా పేర్కొనినాడు. బాగున్నది మీ వివరణ!తెలుగు లోని ప్రాచీన పద బంధాలకు నెలవు అన్నమయ్య సాహిత్యం! వివేచన చేస్తే గాని కొన్నిటికి అర్థంబోధపడదుగదా!' **(శ్రీచొప్పకట్ల సత్యనారాయణ)**

'జమళి అంటే జోడు అనే పదం ఎప్పటినుంచో వాడుకలో ఉన్నదే కానీ అన్నమయ్య పానుపు విశేషంగా వాడడం గమనించ వలసిన విషయం.' **(శ్రీటేకు మళ్ళ వెంకటప్పయ్య)**

'అన్నమయ్య శృంగారకీర్తనల ముఖ్యోద్దేశం లౌకికమైన శ ృంగారకవిత్వం ద్వారా మనోల్లాసం. ఆపై మనస్సు క్రమంగా అలౌకికమైన భగవద్భక్తి పై ఆకర్షితమౌటమేనన్న మాట మీ వ్యాఖ్యానంద్వారా తేటతెల్లమౌతోందండీ! క్రొత్త తెలుగుపదాలను సార్థకంగా వెలికి తెస్తున్నమీ పాండిత్యానికి నమోవాకములు తెలియ జేస్తున్నా' **(శ్రీ వేంకటేశ్వర ప్రసాద్)**

'అన్నమయ్య కవిత్వములో సరళ ఆంధ్రకర్ణాటములు సొంపుగా ఇమిడిపోతాయి.

ఈ "ఏటవెట్టి" పదమూ అటువంటిదే.

రాయలసీమలో ముఖ్యముగా కడప జిల్లాలో మాంసము, బాలి అనే పదాలకు "ఏట" అనే పర్యాయపదము వాడడము పరిపాటి. "అత్తగారింట్లో సంక్రాంతికి ఏట (నంజుళ్ళు–మాంసము) ఏమి కోసినారు", "గంగమ్మకు ఏటలు (బలి)ఏమి పెట్టినారు" అనే మాటలు జనబాహుళ్యములో ఇప్పటికీ సర్వసాధారణముగా వినపడుతాయి

ఇక "వెట్టి"కి వస్తే అది పెట్టి అనే పదానికి కావ్య–సంధి–రూపాంతరముగా భావిస్తే ఇది నూటికి నూరుపాళ్ళు కడపజిల్లా మాండలికముగా సరిపోతుంది. ప్రాతఃస్మరణీయులు వేటూరి ప్రభాకరశాస్త్రిగారి కృషికి ఫలితముగా మనకు దొరికిన ఈ రాగిరేకులకు ముందే అన్నమయ్య పాటలు కడప జిల్లాలో పల్లెపదాలుగా పరిణమించడానికి ఈ వాడుకభాషా ప్రయోగమే కారణము. ఇటువంటి అన్నమయ్య పదభంగిమల మధురిమలు మాకు అందిస్తున్న మీకు నా ధన్యవాదములు. **(ఆలూరు హరీశ్)**

పతంజలి మహోదయులకు, సాంజలిబద్ధ నమోవాకములు. మీ పరిమళభరితమైన వ్యాఖ్యానముతోప్రొద్దున్నే మాకు అందరికీ కందికుడుముల విందు అందించినారు. రాయలసీమ వాసులమైన మాకు పూర్ణము చాలా ప్రశస్తమైన భక్ష్య విశేషము. ఇంకా త్రేన్పులు తగ్గలేదు. భక్ష్యముతో ప్రారంభించిన మీ కవితా ఆమెత నిర్విఘ్నముగా సాగిపోవాలని మాకు మరిన్ని విందులు మీరు అందించాలనీ ఆకాంక్షిస్తున్నాను. కుడుము దాతా సుఖీభవ.

ఇట్లు భవదీయుడు. అప్పాశేషశాస్త్రి, ఆదోని

ఇలా చాలామంది తమ విలువైన అభిప్రాయాలు ఈ పుస్తకంలోని కొన్ని పదాలకు వ్రాసారు. వారందరికి కృతజ్ఞతలు, ఈ పుస్తక రచనలో తోడ్పడిన గ్రంథ రచయితలకి, అన్నమయ్య ప్రేమికులకి అందరికీ పేరు పేరునా ధన్యవాదములు.

❖ ❖ ❖

నేనేమీ పండితుడిని కాను.

నడిచే అన్నమయ్య విజ్ఞాన సర్వస్వాన్ని కాను.

సంస్కృతిపై ,సంస్కృతంపై , తేనే లూరే తెలుగు పై ,అందులోనూ అన్నమయ్య భాషా నైపుణ్యాలపై – విపరీతమైన ఆదరాభిమానాలున్నవాడిని.

అంతర్జాలంలో పిచ్చి పట్టినట్టు అనేక సైట్లలో విడిగా కొనటానికి దొరకని –రకరకాల సాహిత్య గ్రంథాలు – చదివి– కళ్లకి 'సైటు' కూడా పెంచుకొన్నవాడిని.

'అన్నమయ్య పదం పరమార్థం' అనే ఈ పుస్తకం అన్నమయ్య సాహిత్యంలో అనేకమందితో పాటు వేసిన ఒక అడుగు . ఇంకా చేయవలసిన ప్రయాణం చాలా ఉంది.

ఈ పుస్తకంలో ఎక్కడన్నా నా పదం తొట్రిలబడితే సహేతుకంగా తెలియ చేయండి. వినయంతో సవరించుకొంటాను.

అన్నమయ్య కొత్తగా సృష్టించిన పదబంధాలు, కీర్తనల్లో వాటిని చొప్పించిన తీరు– వీటి మీద అనేకమంది పండితులు కలిసి చర్చించి తి.తి.దే మహా భారతంలా ప్రతి అన్నమయ్య కీర్తనకి విపులమైన వ్యాఖ్య వ్రాయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఆ అవసరం ఉందని స్వామికి తెలియదా?

ఏమో ! ఆ వ్యాఖ్యాన మంగళ తోరణాలు ఎప్పుడు దర్శిస్తామో !

అమరిన శ్రీవేంకటాద్రిమీది దేవునికి
తమితో బ్రదక్షిణాలు దండములు నివిగో (రేకు: 0133-03సం: 02-134)
దండము వెట్టుట నాది– తప్పు లోగొనుట నీది
నిండి నీవెప్పుడు దయానిధివి గాన(రేకు: 0186-02సం: 02-433)

స్వస్తి

– డా. తాడేపల్లి పతంజలి
9866691587
Patanjali1576@gmail.com

ముందుమాట

అన్నమయ్య పదకీర్తనలు తెలుగునాట ఇప్పుడిప్పుడే బాగా ప్రాచుర్యం పొందుతున్నవి. సాహిత్యపరంగాకన్నా, సంగీతపరంగా శ్రవణ సుభగంగా ఉన్నందున ఆ పదకవితలు బాగా ప్రాచుర్యం పొందుతున్నాయి. ఆ పదకవితలలోని సాహిత్యం 600 సం॥ల క్రితం నాటిది. భాషలలో మార్పు సహజం. 600సం॥ల కాలంనాటి తెలుగు భాష అనేకానేక మార్పులకు, ఇతరత్రా ప్రాంతీయ భాషల చేర్పులకు లోనై ప్రస్తుతము వాడుకలో ఉన్న తెలుగును మనం చూస్తున్నాము. ఈనాటి తెలుగు భాషకు అన్నమయ్య వాడిన తెలుగు భాషకు మధ్య ఎన్నో అర్థం కాని పదాలున్నాయి. ఒక కీర్తన ఆసాంతం ఆస్వాదించాలంటే కేవలం ఆ కీర్తనకు అద్దిన స్వరసందోహమే చాలదు. సాహిత్య విలువలు కూడా అవగతమైతే అన్నమయ్య పరమోద్దేశము మనకందినట్లు అవుతుంది. వారి కీర్తనలలో కేవలం శృంగార కీర్తనలే కాక సామాజిక స్పృహ ఉన్న కీర్తనలు ఎన్నో ఉన్నాయి. ప్రతి కీర్తనలో మనం అర్థం చేసుకోలేని తెలుగు పదాలు అసంఖ్యాకంగా ఉండి సంపూర్ణ అస్వాదానికి అవరోధంగా మిగిలిపోతున్నాయి. ఆనాటి సామాజిక పరిస్థితులకు, జీవన విధానానికి అనుగుణంగా సామెతలు, తెలుగు నుడికారాలు, పలుకుబడులు ఏర్పడినవి. నేటి తరం వాటిని అవగహన చేసుకోవాలంటే తప్పనిసరిగా భాషమీద మక్కువ, పట్టు ఉన్న తెలుగు భాషోద్యమకారులు, తెలుగు భాష కోవిదులు నడుంకట్టి ఈ అంతరాన్ని పూరించాలి. గతంలో డా॥ తాడేపల్లి పతంజలిగారు నా కోరికమేరకు **"అన్నమయ్య అన్నమాట"** అన్న పుస్తకం రచించారు. అందులో కొన్ని అన్నమయ్య కీర్తనలకు అర్థం, ప్రతిపదార్థ తాత్పర్యాలు తెలియబరిచి ఆ కీర్తనలు అస్వాదించడానికి వీలు కల్పించారు.

"అన్నమయ్య అన్నమాట" పుస్తకానికి కొనసాగింపుగా **"అన్నమయ్య పదం పరమార్థం"** అనే యీ పుస్తకాన్ని వ్రాయమని డా॥ పతంజలిగారిని అభ్యర్థించాను. దీని ద్వారా అన్నమయ్య పద కవితకు కేవలం అర్థం మాత్రమే కాకుండా అందులోని పరమార్థాన్ని ప్రయోజనాన్ని తెలియబరచడం జరుగుతుంది. ఇన్ని ప్రయత్నాలూ అన్నమయ్య కవితలలోని పారమార్థిక చింతనను, భక్తి ప్రపత్తులను తెలుగువారికి సంపూర్ణంగా ఆవిష్కరింపజేయడానికే. ఈ పుస్తకం ద్వారా మరో వంద పదకవితలకు వారు చేసిన ప్రతిపదార్థ వివరణ, వ్యాఖ్యలు అందరిని అలరిస్తాయన్న అశాభావంతో....

-వరప్రసాద్ రెడ్డి,
శాంతా వసంతా ట్రస్టు

ఆశీః

-డా. పప్పు వేణుగోపాల రావు

అన్నమయ్య పదాలకు ఆ పదాలలో ఆయన వాడిన పదాలకు అర్థం తెలుసుకోడం ఒక ఎత్తు .వాటి పరమార్థం తెలుసుకోడం మరో యెత్తు. తాడేపల్లి పతంజలి ప్రాయంలో చిన్నవాడైనా అభిప్రాయం లో ఉద్దండుడు.

అన్నమయ్య వాడిన భాష కొన్నిచోట్ల మాండలికం, కొన్నిచోట్ల జానపదం, కొన్నిచోట్ల గ్రామీణం, కొన్ని చోట్ల ఒక జాతీయం (ఒక జాతి వారే ప్రయోగించే భాష) ఇలా అనేక వాలకాలు వేస్తుంది. కొన్ని తలబద్దలు కొట్టుకున్నా అర్థం కాని పదాల అర్థాలను పతంజలి గారు అతి సులువుగా విడమరిచి వివరించేరు.

అన్నమయ్య సంకీర్తనములు 32వేలు, మనకు లభించినవి సుమారు 14 వేలు, అందులో ఆధ్యాత్మిక కీర్తనలు దాదాపు 2500, మిగిలినవి శృంగార సంకీర్తనలు. ఒక్కొక్క ఆధ్యాత్మిక కీర్తనకు 6 శృంగార కీర్తనలన్న మాట ! ఆ శృంగారం ఎటువంటిది? పతంజలి గారు వివరించిన 3 వ కీర్తన చూడండి . ఒళ్ళు గగుర్పొడిచే ఒక వినూత్నమైన వివరణ !

అద్దమ రాతిరి కాడ అలపు చూడక వచ్చె

ఇది పైకి శృంగారం గా కనిపించే భక్తి సాంద్రమైన ఆధ్యాత్మిక కీర్తన !

ఈ ఒక్క కీర్తన చాలు పతంజలి గారి వైదుష్యానికి, కాని అది వైదుష్యము మాత్రమే ఉన్నవాళ్ళకి అందని ఒక అలౌకిక విశ్లేషణా పటిమ.

అన్నమయ్య పదాలు అటువంటివి, తెలుసును అనుకుంటే తెలియనివి, తెలియదు అని మోకరిల్లితే విచ్చుకుని విప్పారి తమకు తాముగా మనముందు ప్రత్యక్షర ప్రత్యక్షం గా నిలిచేవి.

ఓం నమో నారాయణాయ అని ఒక పదం, ప్రారంభం లోనే పల్లవిలోనే భక్తి రంగరించినది. అలా మొదలైన పదంలో అన్నమయ్య ఒక్క ఉదుటున శృంగారం చూపిస్తాడు :

ధరణీ సతీస్తన ఘనశైల పరిరంభ పరిమళ శ్రమజల ప్రమదాయ

...

ఒక దీర్ఘ సమాసం !

ఆయనకు శృంగారమూ భక్తీ రెండూ ఒకటే , వాటి పరమార్థం ఒకటే

పతంజలి గారు 'అప్పడుండే కొండ 'అనే ఓ పదానికి చేసిన వివరణ, అందులో కాకి విషయం లో వాడుకలో ఉన్న సామెతలు, కొన్ని పొడుపు కథల విశ్లేషణ చదివి చదివి ఆనందించ వలసినవి, తెలుగు లోని మాధుర్యాన్ని తెలియజేసే పదాలు

అసలు అన్నమయ్య ఒక తెలుగు విజ్ఞాన సర్వస్వం , ఒక భక్తి భండారం , ఒక శృంగార మంజూషిక.

పతంజలి గారు ఈ ఒక్క పదానికి వ్రాసిన వివరణ ఒక అద్భుతమైన వరివస్యకు ప్రతీక.

'ఎవ్వడెరుగును మీ యేతులు 'అనే పదం శ్రీరంగం గోపాలరత్నం గారు పాడిన అజరామరమైన ఒక శృంగార కీర్తన

ఆ పదంలో ప్రతి పదం ఒక వయ్యారం . కొన్నేళ్ల క్రితం ఇది నేను అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో svbcలో వ్యాఖ్యానించి నపుడు యేతులు అంటే 'ఎత్తులు' అని చెప్పేను, మీ ఎత్తులు వాటికి పై ఎత్తులు ఎవరికీ తెలుసు అనే దృష్టితో.

కాని పతంజలి గారి ఈ వివరణ లో 'గొప్పలు, బడాయిలు' అన్నారు. చాలా రమ్యం గా ఉంది.

ఇలా ఎన్నెన్ని పదాలు, ఒక శతం. అన్నిటిలో అనన్యమైన ప్రతిభ !

పతంజలి ఒక అన్నమయ్య పద యజ్ఞం చేసేడు. ఆ యజ్ఞాన్ని అన్నగా ప్రక్కనే ఉండి నడిపించి, అమ్మగా లాలించి, అయ్యగా మార్గ దర్శనం చేసినందుకు అన్న + అమ్మ +అయ్య =అన్నమయ్య ను అన్నమయ్య అంటాను .

ఇలాంటి గ్రంథాలు మరిన్ని వ్రాసి పతంజలి అన్నమయ్యకు పెద్ద తిరుమలయ్యలా , చిన్నన్న లా సేవ చెయ్యాలని ఆశీఃపురస్సరంగా ఆశిస్తున్నాను

(సంగీత సామ్రాట్, నాట్యకళా సాగర, శాస్త్ర ఆచార్య శిరోమణి, వాచస్పతి, అవధాన శేఖర డా. పప్పు వేణుగోపాల రావు , డి.లిట్. కార్యదర్శి, మదరాసు మ్యూజిక్ అకాడమీ, చెన్నై).

విషయసూచిక

క్ర.సం.	పదం	కీర్తన
1.	అంగడికెత్తినట్టి	వలచి పైకొనగరాదు
2.	అంగవించు	మంగాంబుధి హనుమంత
3.	అద్దమరాతిరి	అద్దమరాతిరికడ
4.	అప్పడుండే కొండ	అప్పడుండే కొండలోన
5.	అప్పసము	కోడెకాడు వీడుగదె గోవిందరాజు
6.	అల్లో నేరేళ్లు	నెయ్యము లల్లోనేరేళ్ళో
7.	ఆకాశపాకాశ	ఆకాశపాకాశ మాయె
8.	ఆసోదము	కానీవయ్యా దానికేమి కలది
9.	ఆడుబారీ	ఓహోహో యనరో పారి
10.	ఆడికలు	కమలాసన సౌభాగ్యములు
11.	ఆముకొన్న	కోరినకోరికెలెల్లా కొమ్మయందే
12.	ఇట్టిదీముభోగములు	వెట్టి దెలిసి రోకలి వెస జుట్టుకొన్నట్టు
13.	ఈకడ నాకడ	నీకే శరణు నీకే శరణు
14.	ఉప్పరాలు	ఇద్దరము నిద్దరమే వోవోయి
15.	ఎలయింత	చూడచిన్నదాన వింతె సుద్దులు
16.	ఏతులు	ఎవ్వడెరుగును మీ యేతులు

క్ర.సం.	పదం	కీర్తన
17.	ఏటవెట్టి	తాప లేక మేడ లెక్కదలచేము
18.	ఏదోపోదో	నాకుజెప్పరె వలపు నలుపో తెలుపో
19.	ఒడగు	ఒకటి కొకటికిని వొడగాయ
20.	ఒడికము	అంత సిగ్గువడక నీవానతీవయ్యా
21.	ఒర తొమ్మిది చాచు	ఓపోఅదేమోయి ఓ బావా
22.	కడమ	నీవే రక్షింతువుగాక
23.	కలకలే	తతిగాని ఈ పాటు
24.	కంది కుడుము	కన్నచోటనే నీకు కంది కుడుము
25.	కనుగిరుపు	ఇంతగా జేసెగా యింతి కన్నుల నగవు
26.	కర్మమార్గములు గడవని	ఏకులజుడేమి
27.	కాళాంజి	దేవుడు దేవియు నదె తెర దియ్యరె
28.	కొద్దిమాలి	ఒక్కరీతి నుండదోయి వోవిటలా
29.	కొసరీని	మిక్కిలి నేర్పరి అలమేలుమంగ
30.	గరిడి	ఏవంక నేరిచితివో యింతేసి నీవు
31.	గబ్బి	విశ్వరూప నీ మూర్తి
32.	గాలిమూట	దేవుడొక్కడే మాకు దిక్కుగాని
33.	గిరిపితే	హరి నీ ప్రతాపమున కడ్డమేది లోకమున

క్ర.సం.	పదం	కీర్తన
34.	గుక్కిళ్లు	కోరి నీకు నీయందే గుక్కిళ్ళున్నవి
35.	గుగ్గిలిపదను	పలుమరు ఉట్ల పండుగను
36.	చంచుల	కోరికలు కొనసాగె గోవిందరాజా
37.	చెలపచెమట	శిరసువంచకుమిక
38.	చద్దికి వేడికి	రాకుంటే మానుగాక రంతులేటికే
39.	చలివాపీ	పొత్తుల మగువలకు బోవునా
40.	చిక్కపు బుత్తి	పసులు గాచేటి కోల పసపు జేల
41.	చెయ్యొగ్గు	నాకు నాకే సిగ్గయ్యాని నన్ను
42.	చెంగిపోయి	ఎంచి చూడవైతిగాక యింతి
43.	జమళి పాన్పు	అప్పటి నీ సుద్దులెల్ల అడుగ బుత్తెంచె
44.	జాజర	చాలు చాలు నీ జాజర నన్ను
45.	డిమికీలు	ఎటువలెబొగడినా నిన్నిటికి దగినది
46.	తడమారి	ఓయమ్మ నీబిడ్డ డోయమ్మ
47.	తమ్మా	నెట్టన నంతమాత్రాన
48.	తలపిడి కొలుపిడి	పులుగు చెప్పెడినిదె
49.	తిమ్మిరెడ్డి	తిమ్మిరెడ్డి మాకునిచ్చె
50.	తెంకి	ఈ విలాసంబులును

క్ర.సం.	పదం	కీర్తన
51.	తీదీపులు	వట్టిలంపటాల బడి
52.	త్రుప్పివ్వి	అబ్బురంపు శిశువు
53.	తొలిచేవు చేగలే	తొల్లిటివలెగావు తుమ్మెదా
54.	దావతి సుఖం	ఏమొకొనేమేమొకొ
55.	దివ్వెలెత్తు పొద్దు	వచ్చినవారమిదివో వాకిటనె వున్నారము
56.	దీము కోపము	కాయమనే వూరికి
57.	దైవారవమ్మ	మెరుగు జెక్కుల అలమేలుమంగా
58.	దోమటి పలుకులు	నెలత సొబగులివి
59.	నలిరేగిన	నవమూర్తులైనట్టి
60.	నాములాయ	మేలే నీనేరుపులు మెలత
61.	నిజదాసులు	నిత్యాత్ముడై ఉండి
62.	నెప్పుగా	నందగోపనందనుడే
63.	నీకొక్కసరి	ఇందరు నీకొక్కసరి
64.	పత్ర సాలము	హరి నీకేనే రుణ మత్తుగాక తగవైతే
65.	పదారువేల బంగారు	మొక్కేటి గోపాంగనల మోహనాకారము
66.	పలికెటి చదువులు	ఎన్నడు దీరవు యీ పనులు
67.	పాలకూడు	ఏమిటికి జింత యిదె నీకు

క్ర.సం.	పదం	కీర్తన
68.	పుక్కట	ఇద్దరి తమకము నిటువలెనే
69.	పురుషామ అగము	ఎక్కడ గడచేరీ నరులు
70.	పొద్దులేదు	గాలినేపోయగలకాలము
71.	పొలయలుకలు	వలపులధికము సేయు వైభవములు
72.	పైడికోర	చందమామ రావో జాబిల్లి రావో
73.	బడిబడి	వలవనిజోలింక వద్దనరే తన
74.	బాలగండవర గోపాల	లాలనుచు నూచేరు
75.	బూజగుండలు	ఇదె పెండ్లి లగ్న వేళ
76.	బెళకులు	భక్తి నీపైదొకటె
77.	బొడ్డు తామెర	బొడ్డు తామెరలోన గడ్డివయసు
78.	బొమ్మపెట్టు	పెట్టని కోటిందరికి బెండ్లికొడుకు
79.	మందుల కొండ	నేలమిన్ను నొక్కటైన నీబంటు వొక్క
80.	మన్నకాలము	ఇతరము లేదిక నెంచి చూచితే
81.	మవ్వపు కూరిమి	చిన్నదానజేసినట్టు సేయుమనవే
82.	మించుతీలూ	మేలెల్ల నొక్కటే మించుతీలూ నొకటే
83.	మెరిచి	మచ్చికతో నేలవయ్య
84.	మూసిన ముత్యము	వీడివో యిదె వింతదొంగ

క్ర.సం.	పదం	కీర్తన
85.	మేలు సుద్ది	మేలుసుద్ది చెప్పితేను మెచ్చవద్దా ఇకనైనా
86.	మొలకనవ్వు	చిత్తగించవయ్యా దీని చెలువములు
87.	రాయడి	ఉదయాద్రి తెలుపాయె
88.	రాయిడించే సొలపులు	బలిమి సేయకురే పట్టి పెనగకురే
89.	వట్టి మాకులిగిరించు	రంగ రంగ రంగపతి రంగనాథ
90.	వింటి పండుగాయ	నూతులు దవ్వగబోతే
91.	వీరిడితనము	అన్నిటా జాణడు అలమేలుమంగపతి
92.	వెన్నెలరేకులు	చిత్తగించుమిదె చెలియవిలాసము
93.	వెల్లివిరి	హరి నువ్వు నాకు లంచమేమిచ్చేవు
94.	సహజి	మహినుద్యోగి కావలె
95.	సమేళి	వలపులు వలపులు వయ్యాళి
96.	సింగిణి	ఇదివో మంచివేళ యికనెన్నడు
97.	సొగసి	చాలదా హరి నామ
98.	సేసపాలు	పెనగొన్నకాగిళ్ల
99.	సోబన	ఇదె పెండ్లి వేళ
100.	సోవల	గోవింద గోవిందయని కొలువరె

అన్నమయ్య పదం - పరమార్థం

01.అంగడి కెత్తినట్టిదివ్వెలు

అంగడిబెట్టడమంటే -ఏవిషయమైనా తనకు మాత్రమే మిగుల్చుకోకుండా నలుగురూ సంతోషిస్తారని బయటపెట్టడం- ఇలా చేయటం అన్నమయ్యకు చాలా సరదా !

ఒక కీర్తనలో **"అంగడిబెట్టేవు మమ్ము జొనోయి బావ !** "(16-305) అంటూ తాను మరదలిగా మారి , వేంకటేశుని బావగారిని చేసి ఆట పట్టిస్తాడు. ఇంకొక కీర్తనలో యవ్వనాన్ని **-అంగడిబెట్టే వయసు** (21-104)అంటాడు.ఈ అంగడితో దివ్వెలను కలిపి **'అంగడి కెత్తినట్టిదివ్వెలు'** అని ఒక కొత్త పదబంధాన్ని అన్నమయ్య సృష్టించాడు.ఆ పదబంధ పరమార్థం కీర్తనలో చూద్దాం.

పల్లవి: వలచి పైకొనగరాదు వలదని తొలగరాదు
కలికిమరుడు సేసినాజ్ఞ కడవగరాదురా

చ.1: అంగడి కెత్తినట్టిదివ్వె లంగనముఖాంబుజములు
ముంగిటి పసిడికుంభములును ముద్దులకుచయుగంబులు
యెంగిలిసేసినట్టితేనె లితవులైన మెరుగుమోవులు
లింగములేని దేహరములు లెక్కలేని ప్రియములు

చ.2: కంచములోని వేడికూరలు గరువంబులు బొలయలుకలు
యెంచగ నెండలోనీడలు యెడనెడకూటములు
తెంచగరాని వలెతాళ్ళు తెలివిపడనిలేతనవ్వులు
మంచితనములోని నొప్పులు మాటలలోనిమాటలు

చ.3: నిప్పులమీద జల్లిననూనెలు నిగిడితనివిలేనియాసలు
దప్పికి నేయిదాగినట్లు తమకములోనితాలిమి
చెప్పగరానిమేలు గనుట శ్రీవేంకటపతి గనుటలు
అప్పనికరుణగలిగి మనుట అబ్బురమైనసుఖములు

❖ ❖ ❖

అంగడి అంటే అనేక సరకులుంచుకొని అమ్మే చోటు. ఒక్కో ప్రాంతంలో అంగడికి ఒక్కొక్క విలక్షణార్థం కూడ ఉంది.

ఊళ్లో ఆదివారం నాడు అంగడి జరుగుతుంది.అంటే సంత జరుగుతుంది అని అర్థం.

పిల్లలు అంగడి చేశారు అంటే కరీంనగర్, మహబూబ్నగర్ ప్రాంతాల్లో అల్లరి చేసారని అర్థం.

తమ దగ్గర ఉన్న వస్తువులలో గొప్పదాన్ని బాగా పైకి పెట్టి వ్యాపారస్థుడు ప్రదర్శిస్తాడు.

సృష్టి కర్త కూడా తన సృష్టి అనే సంతలో బాగా ఉన్నవి ఇవి అని అందరికి తెలియచేయటానికి ఆ నాయిక ముఖాలనే పద్మాలను బయటికి ఎత్తాడు.

ఏ కవి అయినా ఆడవాళ్ల ముఖాలను పద్మాలని ఊరుకొంటాడు.

ఈయనగారు కేవలం పద్మాలనకుండా ఇంకొక అడుగు ముందుకు వేసి , **"అంగడి కెత్తినట్టిదివ్వె లంగనముఖాంబుజములు"** అంటూ అంగనల ముఖ పద్మాలు ఇతరులకు ఉపయోగపడే దీపాలు అన్నాడు.

వాళ్ల మొగాలు బాగా కాంతితో వెలిగిపోతున్నాయి అని ఒక అర్థం.

ఇంతేనా !ఇంకో విశేషముంది.

లక్ష్మీదేవి పద్మాలయ. పద్మములో ఉండే లక్ష్మీదేవి శోభ వాళ్ల ముఖాలలో ఉందని ఇంకో అర్థం.

కొందరి మొగాలను చూస్తే పుణ్యం. కొందరి ముఖాలను చూస్తే పాపం.

ఆ నాయికల ముఖాలను చూస్తే లక్ష్మీ సౌభాగ్యం కలుగుతుందని మరొక విశేషం.

సౌందర్యాన్వేషకుల మార్గంలో ప్రకాశించే దీపాలు వారి మోములు

దీపం అంటే వెలుగు, కాంతి, జ్ఞానం, ఆశ, ప్రాణం. దీపం అంటే ప్రాణం పోసేది.

దేవుడి ఊరేగింపులో ఆయనకు ముందుగా ఎత్తి పట్టుకొని నడిచే కాగడా దీపాలు (కొయ్య లేక గుడ్డతోనే యేర్పచిన చేతి దివ్వటీలు) తమ వెలుగులో ఊరేగుతున్న స్వామిని మనకు దర్శింపచేసి మనలో చైతన్యాన్ని నింపుతాయి.

దివ్వె ఎత్తటమంటే దీపముపెట్టటమే కాదు. కాపురము నిలబెట్టటం. అందుకే ఆ నాయికల ముఖాలనే పద్మాలు కూడా ఉత్సాహ దరిద్రులలో చైతన్యాన్ని నింపటానికి, అజ్ఞానాన్ని బయటకు పారద్రోలే, బయటకు ఎత్తిన లక్ష్మీ దీపాలు.

02. అంగవించు

అన్నమయ్య ప్రాచుర్యం లోకి తెచ్చిన క్రియలలో అంగవించు ఒకటి. అంగవించు అను క్రియకు సమీపించు, సంబంధము కలుగ జేసికొను ప్రయత్నము చేయు, సాహసించు, మించు, గెలుచు, ఉత్సహించు అను అర్థాలున్నాయి.ప్రసిద్ధమైన 'మంగాంబుధి' కీర్తనలో అంగవించుకు ఉత్సహించు, ప్రయత్నము చేయు అను అర్థములు సరిపోతున్నాయి.

పల్లవి: మంగాంబుధి హనుమంతుని శరణ
మంగవించితిమి హనుమంతా

చ. 1: బాలార్కబింబము ఫల మని పట్టిన
ఆలరి చేతల హనుమంతా
తూలని బ్రహ్మాదులచే వరములు
వోలిజేకొనిన వో హనుమంతా

చ. 2: జలధిదాట నీ సత్వము కపులకు
నలరి దెలిపితివి హనుమంతా
యిలయు నాకసము నేకముగా నటు
బలిమి బెరిగితివి భళీ హనుమంతా

చ. 3: పాతాళము లోపలి మైరావణు –
నాతలఉ జంపిన హనుమంతా
చేతులు మోడ్చుక శ్రీవేంకటపతి–
నీతల గొలిచే హిత హనుమంతా (రేకు: 0376-03సం: 04-444)

పల్లవి: మంగాంబుధి ఆలయంలో కొలువు దీరిన హనుమంతా ! నీ శరణాన్ని ఉత్సాహంగా కోరుకొంటున్నాం.

చ. 1: చిన్నప్పుడు ఎవరైనా అల్లరి పనులు చేస్తుంటారు. కాని నీ అల్లరి పనులు సామాన్యమా స్వామీ ! ఆ ఉదయిస్తున్న సూర్య బింబాన్ని పండనుకొని నోట్లో వేసుకొని గుట కాయ స్వాహా చేయ బోయావ్ ! ఆ బ్రహ్మ మొదలైన దేవతలు ఉన్నారే! వాళ్లు ఎవరి విషయంలోను తగ్గరు.(తూలని) ఇంద్రుని వజ్రాయుధపు దెబ్బ హనువులకు (దౌడలకు) తగిలి నువ్వు మూర్చపొయిన సమయంలో నీ

తండ్రి వాయువు కోపించి స్తంభించాడు. అప్పుడు బ్రహ్మ మొదలైన దేవతలందరూ కలిసివచ్చి నీకు వరాలిచ్చారు. ఆ వరాలను కానుకగా పొందిన హనుమంతా! నీకు శరణు.

చ.2: లంకకి వెళ్లే టప్పుడు ఆ సముద్రాన్ని దాటే సందర్భంలో నీ శక్తి ఎలాంటిదో, వానరులకు నీ విశ్వరూపం ద్వారా నిరూపించి సంతోషింపచేసావు. ఆ సమయంలో ఆకాశాన్ని భూమిని ఒకటిగా కలిపేటట్లుగా పెరిగావు. భళి. భళి. హనుమంతా ! నీకు శరణు.

చ.3: నీ లీలలు అర్థం చేసుకోవటం కష్టమయ్యా స్వామీ ! అవతల పాతాళంలో అంతటి మైరావణుని తుక్కుతుక్కుగా చంపావు. ఇవతల ఏమీ తెలియని వాడిలా- మా వేంకటేశ్వర స్వామి దగ్గర చేతులు కట్టుకొని నిలబడతావ్. హనుమంతా ! నీకు శరణు

పరమార్థం

మంగాంబుధి అనే పదానికి అర్థాన్ని అన్నమయ్య తానే వ్రాసిన ఇంకొక కీర్తనలో తెలిపాడు. 'ఆంజనేయ అనిలజ హనుమంత నీ/రంజకపు చేతలు సురలకెంచ వశమా! 'అను కీర్తన (సం:04-458) చివరి చరణంలో 'అల శ్రీవేంకటపతి యండనె మంగాంబుధి/నిలయపు హనుమంత నెగడితిగా' అని వ్రాసాడు."అంటే వేంకటేశ్వరుని దగ్గరగా మంగాంబుధి నిలయంలో హనుమంతుడు ఉన్నట్లుగా అన్నమయ్య వివరించాడు. కనుక అన్నమయ్య కాలంలో తిరుపతి సమీపంలో మంగాంబుధి హనుమంతుని ఆలయం ఉండవచ్చేమో అని పెద్దల భావన.

తనుఎవరిని మింగాలనుకొన్నాడో ఆ సకల శాస్త్ర పారంగతుడైన సూర్య భగవానుడి నుంచి హనుమ విద్యను అభ్యసించాడు. కాలంతోపాటు తిరిగే సూర్యునినుంచి విద్యను నేర్చుకోవడం కోసం తన శరీరాన్ని పెంచి ఉదయ పర్వతం పై ఒక కాలు, అస్తమయ పర్వతం పైమరొక కాలును ఉంచి సూర్యుడు ఎటు తిరిగితే అటు తన ముఖాన్ని తిప్పుతూ ఆయన వద్ద శాస్త్రాభ్యాసం చేసి సూత్రాలు, వ్యాఖ్యానాలు, సంగ్రహాదులతో కూడిన వ్యాకరణాన్ని సాధించి నవ వ్యాకరణవేత్తయై వేద వేదాంగాలను చదువుకొన్నాడు..ఇంతకీ హనుమంతుడు అల్లరి చేతలవాడే కాదు. హృదయాన్ని అల్లుకొనే చేతల వాడు కూడా!

ఈకీర్తనలో 'హనుమంత' అనే సంబోధన ప్రతి పాదం చివర ఉంటుంది. మళ్ళీమళ్ళీ దైవ నామాన్ని తలవటంలో భక్తునికి ఒక రకమైన ఆవేశం వస్తుంది. ఆ ఆవేశంలో ఆ దైవ రూపాన్ని తనలో ఆవహింపచేసుకొంటూ భక్తి పారవశ్యంలో మునిగిపోతారు. అందుకే ఆధ్యాత్మిక గీత రచయితలు దైవ నామాన్ని వీలైనంత ఎక్కువగా వాడుతుంటారు. అన్నమయ్య కూడా ఈ పద్ధతినే అనుసరించాడు.

03. అద్దమరాతిరి

అద్దమరాతిరి, అద్దమరేతిరి, అద్దమరేత్రి, అద్దమరేయి - అని అర్ధరాత్రికి అన్నమయ్య పేరు పెట్టాడు. ఆ అద్దమ రాతిరి పరమార్థం ఆయన కీర్తనలో చూద్దాం.

పల్లవి: అద్దమరాతిరికాడ అలపు చూడక వచ్చె
వొద్దికతోబీటపై గూచుండ బెట్టుకోవయ్యా

చ 1: సారె జారుదురుముతో సతి నీ ఇంటికి రాగా
జీరల చెమటగారీ జెక్కులవెంట
చేరి సురటి విసరి చెంగలువలు ముడిచి
గారవించి పరపుపై గాగిలించుకోవయ్యా

చ 2: పయ్యదకొం గెడలగ బరువున రాగాను
కయ్యమడిచీ జన్నులు కదలగను
చెయ్యి వురమున మోపి చెంగావిదుప్పటి గప్పి
వుయ్యాలమంచము మీద వొద్దికచూపవయ్యా

చ 3: గందపుబొట్టు కలసి నిన్నంటరాగా
చిందేటిమోవితేనెలు చిప్పిలీని
కందువ మోవి యాని కస్తూరి నుదుటబూసి
పొందుల శ్రీవేంకటేశ పొసగించుకోవయ్యా

(రేకు: 1370-6 సం: 23-420)

అన్నమయ్య దృష్టిలో జీవుడు ప్రియురాలు ;దేవుడు ప్రియుడు.

అందుకే "జీవుడిని ఆదరించవయ్యా!" అని వేంకటేశుని అన్నమయ్య శృంగార భక్తి నేపథ్యంలో ఈ కీర్తనలో వేడుకొంటున్నాడు.

పల్లవి: స్వామీ ! నీకోసం నీప్రియురాలు అర్ధరాత్రి పూట, శ్రమ అనుకోకుండా వచ్చిందయ్యా !

విలాసముతో, స్నేహముతో ఆమెని నీపక్కన పీటపై కూచోబెట్టుకో!

చ 1: స్వామీ ! ప్రియురాలు మాటి మాటికి జారే కొప్పుతో నీ ఇంటికి వచ్చింది ఆమె చెక్కిళ్ల బాటలో ప్రయాణము చేస్తూ చీరపై చెమటలు కారుతున్నాయి.

పాపం..అంత కష్టపడి వచ్చింది కదా! ఆమె దగ్గరికి వెళ్లి విసనకర్రతో విసరు.
అమె కొప్పులో ఎఱ్ఱకలువపూలు పెట్టి కొప్పు ముడువు.
ఆవిడ సౌందర్యానికి తగిన గౌరవమిస్తూ పరపుపైన కౌగిలించుకోవయ్యా !
చ 2: పైట కొంగు తొలగగా, బరువుతో ఆమె రాగా,
తగాదాను పోగొట్టి స్తనములు కదులుతుండగా
చేతిని రొమ్మున ఆనించి అందమైన ఎరుపు రంగు దుప్పటి కప్పి
ఉయ్యాల బల్ల మీద ప్రేమ చూపించవయ్యా!
చ 3: గంధపు బొట్టు కరిగిపోగా మొగము పైని చెమటతో అది
కలిసిపోగా, ఆమె నిన్ను అంటుకోవటానికి రాగా
తన పెదవిలో చిందుతున్న తేనెలు పైకి ఉబుకుతున్నాయి.
ప్రియమైన ఆ పెదవిని తాగి, కస్తురి సుగంధ ద్రవ్యమును నుదుటపై పూసి
పొందులలో శ్రీ వేంకటేశా ! ఆమెను స్వీకరించవయ్యా !

❖ ❖ ❖

పరమార్థం

పతంజలి – అన్నమయ్య వేంకటేశా ! నమస్సులు.

అన్నమయ్య – ఆశీస్సులు

పతంజలి – స్వామీ ! అద్దమరాత్రి ...అంటే?

అన్నమయ్య – అస్తి నాస్తి విచికిత్స అద్దమరాత్రి. ఆ స్థితిలో జ్ఞానోదయం పొంది దేవుడున్నాడని పరిపూర్ణంగా నమ్మి ఆయనను శరణుకోరిన ఒక జీవి ఊహా లోకంలో దైవ సాన్నిధ్యానికి బయలుదేరింది.ఆ జీవిని ప్రియురాలన్నాను. ఆమెను అనుగ్రహించమనే నా విన్నపమే ఈ పాటలోని పల్లవి.

పతంజలి – క్షమించాలి. చన్నులు, పెదవుల తేనెలు? ఇవి మీరనుకొన్న ఆధ్యాత్మిక వాతావరణంలో ఎలా నప్పుతాయి?

అన్నమయ్య – సాంకేతికతను ఆదరిస్తున్న మీ ఆధునిక యుగంలో ఈ సాంకేతిక– ప్రతీకాత్మక కవిత్వాన్ని ఎందుకు గ్రహించరు? సుఖదు:ఖములు, శీతోష్ణములు, పాప, పుణ్యములు– ఇవన్నీ ద్వంద్వములు.

భగవద్గీత పదిహేనవ అధ్యాయము అయిదవ శ్లోకంలో **"ద్వంద్వైర్విముక్తాః సుఖ దుఃఖ సంజ్ఞైః"** అన్నాడు భగవానుడు. ఆ ద్వంద్వాలకు ప్రతీక కీర్తనలోని

స్తనముల జంట.

చేతిని రొమ్మున ఆనించటమంటే ఆద్వంద్వవిముక్తిని జీవునికి కలిగించమని విన్నపము.

పెదవుల తేనెలు ఇంద్రియ మాధుర్యాలు. మనం ఇంద్రియ మాధుర్యానికి లోబడితే భ్రష్టులమవుతాం. అదే– స్వామి వారు మన ఇంద్రియ మాధుర్యాలను గ్రహిస్తే - అంటే వాటిపై వ్యామోహాన్ని పోగొడితే ఉన్నతిని పొందుతాం. అది చేయమని 'మోవి యాని' అని మూడవ చరణంలో చెప్పాను. స్వస్తి.

04. అప్పడుండే కొండ

అన్నమయ్య కీర్తనల్లో పొడుపు కథలు ఒక శాఖ. అందులో **'అప్పడుండే కొండ'** ఒక పొడుపు కథల కీర్తన. దాని పూర్వాపరాలు చూద్దాం.

14 పొడుపు కథలతో సాగే అన్నమయ్య కీర్తన ఇది:

1. అప్ప డుండే కొండలోన ఇప్పపూల ఏరబోతే
ఇప్పపూలు కప్పలాయెరా ఓ వేంకటేశ
అప్పులుగల వాని వలనే ఓ వేంకటేశ?

2. ఆకాశాన పొయ్యేకాకి మూకజూచి కేకవేశే
మూక మూడు విధము లాయరా – ఓ వేంకటేశ
దీని భావము నీకే తెలుసురా ఓ వేంకటేశ?

3. అహోబిలయ్య గుంటలోన వొల్వలు ఉదుక పోతే
వొల్వలెల్ల మల్లెలాయే – ఓ వేంకటేశా
దీనిభావము నీకే తెలుసురా ఓ వేంకటేశా?

4. అహోబిలాన చెట్టు బుట్టే భూమి యెల్ల తీగపారే
కంచిలోన కాయ కాచేరా ఓ వేంకటేశా
శ్రీరంగాన పండు పండేరా ఓ వేంకటేశా?

5. పుట్టామీద చెట్టు బుట్టే భూమియెల్ల తీగపారే
పర్వతాన పండు పండేరా ఓ వేంకటేశా
అందవచ్చు కోయరాదురా – ఓ వేంకటేశా?

6. చేయిలేనివాడుకోశే నెత్తిలేని వాడుమేశే
కాళ్ళులేని వాడు నడచే ఓ వేంకటేశా
పెదవిలేనివాడు చిలుక తినేరా ఓ వేంకటేశా?

7. గుంట యెండి పండు పండే – పండుకోశి కుప్పవేశే
కుప్పకాలి యప్పు తీరేరా – ఓ వేంకటేశా
దీని భావము నీకే తెలుసురా ఓ వేంకటేశా?

8. సందెకాడ తలవ్రాలు సంధిదీరి వేంకటరాయా!
తెల్లవారనాయనీడరా ఓ వేంకటేశ!
దీని భావము నీకే తెలుసురా ఓ వేంకటేశ!

9. ముత్యాల పందిటిలోన ముగ్గురు వేంచేసి రాగ
ముక్కంటి దేవుని జూచేరు ఓ వేంకటేశా!
దీని భావము నీకే తెలుసురా! ఓ వేంకటేశా!

10. ఏటిలోన వలవేశే తాటిమాను నీడలాయె
దూరపోతే చోటులేదురా ఓ వేంకటేశా
దీని భావము నీకే తెలుసురా ఓ వేంకటేశా?

11. ముందు కూతు రాలు ఆమె ముందు ఆలు కూతురాయె
పొందుగా పెండ్లాము తానాయె ఓ వేంకటేశ
దీని భావము నీకే తెలుసురా ఓ వేంకటేశా?

12. ఆకులేని అడవిలోన మూడుతోకల పెద్దపులిని
మేక యొకటి యెత్తి మింగేరా ఓ వేంకటేశా
దీని భావము నీకే తెలుసురా ఓ వేంకటేశా?

13. పున్నమ వెన్నెలలోన వన్నులాడితోను గూడి
కిన్నెర మీటుచు పొయ్యేవు ఓ వేంకటేశా
దీని భావము నీకే తెలుసురా ఓ వేంకటేశా?

14. అర్ధరాత్రివేళలోని రుద్రవీణ నెత్తుకొని
నిద్రించిన నిన్ను పాడగ – ఓ వేంకటేశా
దీని భావము నీకే తెలుసురా – ఓ వేంకటేశా?
అప్పడుండే కొండలోన ఇప్పపూల ఏరబోతే –
ఇప్పపూలు కప్పలాయెరా ఓ వేంకటేశ
అప్పులుగల వానివలనే ఓ వేంకటేశ

వివరణ

తండ్రిలాంటి వేంకటేశుడు ఉండే కొండ ఈ ప్రపంచం. దీనిపైన ఇప్పపూలవంటి మత్తు కలిగించే ఆకర్షణలకు లోను కాబోతుంటే , ఆ ఆకర్షణలు కప్పల్లాగా మారి , అందినట్లే అంది గెంతుతున్నాయి. ఇదంతా కుబేరుని దగ్గర అప్పులు తీసుకొన్నవాడి దయ. (వాడే సృష్టించి, నిలిపి, నాశనం చేస్తుంటాడు.)

పరమార్థం

1. శ్రీరామ ప్రసాదంగా బాగా ప్రసిద్ధి చెందింది ఇప్ప పువ్వు .
2. ప్రస్తుతం ఇప్ప పూలతో సారాయి కాచి , సంపాదిస్తుంటారు.
3. ఇప్ప మొదలయిన వృక్షాలను ఉపవాస పూర్వకముగా దానమివ్వాలి.అలా ఇప్ప వృక్షాన్ని దానమిస్తే తీయని మాటలు వస్తాయని మత్స్య మహా పురాణము చెబుతోంది. (106-32వ శ్లోకం)
4. బౌద్ధంలో కల్ప శబ్దాన్ని కప్ప శబ్దంతో చెబుతారు. సంవట్ట కప్ప (ప్రపంచం అంతం కావడం), వివట్ట కప్ప – (తిరిగి ప్రపంచం సృష్టి కావడం) –

కప్ప , ఇప్ప పూలకు సంబంధించిన కొన్ని సామెతలు

1. .....కు(ఒక కులం పేరు) వరస లేదు – కప్పకు తోక లేదు
2. కప్పకాటు – .....(ఒక కులం పేరు)పోటు లేవు
3. కప్పలు కూస్తే వర్షం పడుతుంది
4. కరవమంటే కప్పకు కోపం – విడవమంటే పాముకు కోపం
5. బతకలేక బావిలో పడితే కప్పలు కనుగుడ్లు పీకినాయంట
6. ఇగిరిపోయిన చెంపలకు ఇప్ప (విప్ప) నూనె పెడితే, సానిదాని ముఖం నవనవలాడిందట.

7. ఇప్ప పూలకు వాసన వెదకాలా

2. ఆకాశాన పొయ్యే కాకి

మూకజూచి కేకవేశే –

మూక మూడు విధములాయరా – ఓ వేంకటేశ

దీని భావము నీకే తెలుసురా ఓ వేంకటేశ

వివరణ:

ఇక్కడా అకాశమంటే విశాలమైన లౌకిక ప్రపంచం.

ఈ లౌకిక ప్రపంచంలో కా , కా (నన్ను రక్షించే వారెవరు? ఎవరు?) అని అరిచే ఒక భక్తుడు మతాచార్యుల మూకను(సమూహాన్ని) చూసి సమాధానం చెప్పండని కేక వేశాడు.

1. జీవుడు, దేవుడు ఒక్కటేననే సిద్ధాంతం (శ్రీ శంకరాచార్య మతం)చెబుతూ ఒకే కర్ర చేతిలో ధరించే అద్వైతపు మూకగా కొంతమంది మారారు.

2. జీవుడు, దేవుడు వేర్వేరు అని చెప్పే ద్వైత సిద్ధాంతపు మూకగా కొంతమంది మారారు. (రెండు కర్రలు ఒకటిగా కలిపి కట్టి) .

3. జీవాత్మ, పరమాత్మ, ప్రకృతి ఒకటే అని (మూడు రకాల కర్రలను కలిపి కట్టి ధరించే) బోధించే మూకగా కొంతమంది మారారు. ఈ విధముగా మూక మూడు విధాలయింది.

(మూక అనే శబ్దము అన్నమయ్య వాడాడు కనుక ఆ మతాచార్యులను వివరించేటప్పుడు అర్థ స్పష్టత కోసం నేను కూడా సమూహము అను అర్థము వచ్చే మూక శబ్దాన్ని వాడాను. మూక శబ్దానికి లోకంలో ఉన్న తేలిక భావం స్ఫురిస్తే నా పాపం శమించుగాక!)

పరమార్థం

1.ఒక కాకికి ఎంగిలి అన్నం మెతుకులు బగా తిని బలిసి బొంతకాకిగ అయింది. మిగిలిన కాకులు దానికి భయపడుతూ ఉండేవి.ఒకసారి హంస ఎగురుతూంటే ఈ బొంత కాకి దానితో పందెం వేసుకుంది. కొంత ఎత్తు ఎగిరింది. తరువాత , ఆయాసంతో దప్పికతో హంసతో పాటు ఎగరలేక నేలమీద పడింది. కర్ణుడు కాకి వంటివాడు. అర్జునుడు హంస వంటి వాడని భీష్ముడు మహాభారతంలో ఈ కథ చెప్పాడు.

2.రామాయణంలో కిష్కింధా కాండలో సంపాతి అకాశంలోని వివిధ ఎత్తులను

గురించి చెప్పాడు (58సర్గ –26,27శ్లోకాలు) – మొదటి ఎత్తులో పిచ్చుకలు, రెండో ఎత్తులో కాకులు, మూడో ఎత్తులో భాస పక్షులు, నాల్గో ఎత్తులో డేగలు, ఐదో ఎత్తులో గద్దలు, ఆరో ఎత్తులో హంసలు, ఏడో ఎత్తులో గరుడుడుఎగరగలడు.

3. చూట్టానికి అందరూ మిత్రుల్లానే ఉంటారు గాని వసంతకాలం వచ్చాక కాకీ కోకిలల భేదం తెలిసినట్టుగా మనకి ఎవరు నిజమైన మిత్రులో శత్రువులో తెలుస్తుందంటారు పెద్దలు. (వసంత కాలే సంప్రాప్తే)

3.కాకితో కూడిన కొన్ని పదబంధాలు

కాకి బంగారం =పసుపుపచ్చని అభ్రకం.

కాకిఎంగిలి= ఒకరేదైనా తినుబండారం తింటూ చిన్న పిల్లలు తమలోతాము ఇతరులకు పెట్టటానికి ఆ తినుబండారం చుట్టూ గుడ్డచుట్టి కొరికి ఇతరులకు పెట్టటం (ఎంగిలి లేదనటం)

కాకిగోల= 1.విపరీతమైన గోల. 2.కాకులసంగమము చూచినవానికి దోషము తగులుతుందని ఒక నమ్మకం. అది పోవటానికి , వాడు చచ్చాడని బంధువులకు చెప్పి ఏదిపిస్తారు. .ఇది నిజమే అను కొని బంధువులు చేసే గోల–కాకిగోల; ఆ తరువాత నిజముచెప్పి, ఓదార్చి దోషాన్ని పోగొడతారు.

కాకి అరిస్తే చుట్టాలు వస్తారు

కాకి అరిస్తే భయపడి పక్కింటాయన్ని కౌగలించుకున్నదట

కాకి గూటిలో కోయిల పిల్లలాగా

కాకిపిల్ల కాకికి ముద్దు

కాకి ముక్కుకు దొండపండు

కాకులను కొట్టి, గ్రద్దలకు వేసినట్లు

కాకుల మధ్య కోయిల లాగా

కాకై కలకాలం మన్నేకంటే – హంసై ఆరునెలలున్నా చాలు

కాకిలా కలకాలం ఉండటం కంటే హంసలా ఆర్నెలలు జీవిస్తే చాలు!

తెల్లారితే చాలు కాకిలా ఊరంతా తిరుగుతాడు.

కాకిపిల్ల కాకికి ముద్దు (అందంగా లేడని తెలిసినా తల్లి ఏవగించుకోదు. (ఈ సామెత కాకితో మాతృప్రేమని పోల్చింది.)

ఊరికే కాకిలా అరవకు.

వెధవ కాకిగోలా నువ్వాను – నోర్ముయ్యి.

కాకికేం? కారడవిలోనైనా జీవిస్తుంది.

వెధవ కాకిగూడంత ఇల్లు కట్టుకున్నాడు చచ్చీ చెడీ. (అంత అల్పంగాను, గాలొస్తే పడిపోయేలా, కాకిగుడ్డు పిల్ల కాగానే గూడుని కాకి పడగొట్టేస్తుంది కాబట్టి అతి తాత్కాలికంగా కట్టాడని భావం.)

కావు కావు (రక్షించు, తిండిపెట్టి రక్షించు) అని అరుస్తుందిట కాకి.

కాకికేం? సంస్కృత పక్షి అది (కాకః – కాకి. మిగిలిన పక్షులకి సంస్కృతంలో మరో పేరుండచ్చు గాని కాకికి అలా కాదు).

వాడు కాకి పళ్లు (కాక దంతాలు) లెక్కపెడతాడు. (కాకికి పళ్లుండవు. లేనిదాన్ని ఉన్నట్లుగా అనుమానపడే వ్యక్తిని గూర్చి...)

ఇన్ని రకాలుగా మన సాహిత్యంలో కలిసిపోయిన **కాకి**ని అన్నమయ్య ఈ పొడుపు కథలో మెరిపించాడు.

3. అహోబిలయ్య గుంటలోన
వొల్వలు ఉదక పోతే –
వొల్వలెల్ల మల్లెలాయే
ఓవేంకటేశ
దీనిభావము నీకే తెలుసురా ఓ వేంకటేశా

వివరణ:

ఎగువ అహోబిలం లో ప్రధానమయినది భవనాశిని నది.

ఆకాశ గంగ భూమిపైకి ఈ తీర్థంగా వచ్చిందని చెబుతారు.

భవనాశిని నదినే అన్నమయ్య ఈ చరణంలో గుంటగా పేర్కొంటున్నాడు.

అహోబిలపు అయ్య అంటే –స్వామి యైన నరసింహుని యొక్క భవనాశిని నదిలో –వలువలు ఉదికితే మల్లెలుగా మారుతాయని అన్నమయ్య హామీ.

వలువలు శరీరాలకు ప్రతీక. వాసాంసి జీర్ణాని ... శ్లోకంలో గీతాచార్యుడు శరీరాలను వస్త్రాలతో పోల్చాడు కదా! అందువల్ల ఈ అహోబిలాన ఉన్న భవనాశిని నదిలో స్నానం చేస్తే శరీరాలు, మనస్సు పరిశుద్ధమౌతాయని ఈ చరణపు భావం. . పరిశుద్ధతకు ప్రతీకగా తెలుపురంగులో ఉన్న మల్లెలను అన్నమయ్య ఈ పొడుపు కథలో పేర్కొన్నాడు.

పరమార్థం

1.గరుత్మంతుడు నరసింహ స్వామి కొలువు తీరిన గుహను చూసి అహో! బిలం అన్నాడట.అందుకని ఆ రోజునుంచి ఈ ప్రదేశానికి అహోబిలం అని పేరు వచ్చింది.

2.ఇంద్రుడు మొదలైన దేవతలు "అహోవీర్యం, అహోశౌర్యం, అహోబలం, నారసింహం పరందైవం అహోబిలం, అహో బలం అన్నారని(అహో ! ఏమి శక్తి.! అహో ! ఏమి పరాక్రమము ! అహో ! ఏమి బలం ! నరసింహుడే గొప్ప దేవుడు. అహో ! ఏమి బలమతనిది ! అతనుండే ఈ గుహ ఎంత గొప్పది !) అందువలన ఈ క్షేత్రం అహో బిలం అయిందని ఇంకొక కథ.

3.అయ్య అంటే పూజ్యుడని ఒక అర్థం.

"అద్దిరా అయ్యకు మన్మథాభ్యుదయము." అని కళాపూర్ణోదయ ప్రయోగము.

నాన్న, అయ్య, బాపు (కళింగ మాండలికం)అన్నాజీ, నాయ్న, బాపు, అయ్య, దాద, బప్ప, పప్ప, నాయన, బాబ (తెలంగాణ మాండలికం)

అప్ప, అయ్య, నాన్న (రాయలసీమ మాండలికం)– అయ్య శబ్దాన్ని అహోబిలానికి చేర్చి, కొత్త పదాన్ని సృష్టించిన అన్నమయ్య నిరంకుశుడు. దాసోహమయ్యా ! అనకుండా ఉండలేం.

4. నల్లమల పర్వతసానువుల్లో అహోబిలం పుణ్యక్షేత్రంలో భవనాశిని నది జన్మించింది. అక్కడి నుంచి అనేక మండలాల గుండా తూర్పు నుంచి పడమర కు ప్రవహిస్తూ.. ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల మీదుగా సప్తనదీ సంగమక్షేత్రంలో కలుస్తోంది.

4. అహోబిలాన చెట్టు బుట్టే భూమి యెల్ల తీగపారే – కంచిలోన కాయ కాచేరా ఓ వేంకటేశా

శ్రీరంగాన పండు పండేరా ఓ వేంకటేశా

వివరణ:

అహోబిలంలో విష్ణువు నరసింహస్వామి అనే కల్ప వృక్షంగా ఆవిర్భవించాడు. భూమండలమంతా ఆ నరసింహావతారము రక రకాల పేర్లతో విస్తరించింది. (తీగవలె) – కంచిలో వరద రాజ స్వామి పేరుతో , ఆవిష్ణువు శుభ ఫలితాలను ఇచ్చాడు. శ్రీరంగంలో విష్ణువు పడుకొని ఉన్న రూపంతో అవతరించి భక్తుల

కోర్కెలను పండిస్తున్నాడు.

పరమార్థం

అష్టముఖ నరసింహ, అఘోర నరసింహలాంటి 72 రకాల నరసింహుని రూపాలున్నాయి.

వైశాఖ శుక్ల చతుర్థశి స్వాతి నక్షత్రం ఉన్న సమయంలో నరసింహ స్వామి ఉ ఠవీంచాడు.

మన రాష్ట్రంలో నరసింహుని ఆలయాలు చాలా ఉన్నాయి. మృగరాజులకి గృహాలు గుహలేకనుక శ్రీనరసింహుని దేవాలయాలు కొండల మీదే ఉన్నాయి

ఉదా. యాదగిరి,సింహచలం,మంగళగిరి

కంచిలో వరదరాజస్వామి దేవాలయం ఉన్న ప్రదేశాన్ని విష్ణుకంచి అని పిలుస్తారు

వరద రాజ స్వామి ఆలయంలోనే వరదయ్యకు క్షేత్రయ్య (అనేక క్షేత్రాలు తిరిగేవాడు) అను పేరు వచ్చిందని చెబుతారు. పూజారులు ఈ పేరు వరదయ్యకు ప్రసాదించారట.

స్వామి శ్రీరంగంలో పడుకొని ఉన్న దృశ్యాన్ని రాయలవారు ఆముక్తమాల్యద కావ్యంలో చెప్పారు. స్వామి పడుకొని ఉంటే, వక్షస్థలంపై కౌస్తుభం మెరుస్తూ ఉంటుంది. (స్ఫటల మణుల్ గ్రాల)

5. పుట్టమీద చెట్టు బుట్టే భూమియెల్ల తీగపారే – పర్వతాన పండు పండేరా ఓ వేంకటేశా

అందవచ్చు కోయరాదురా – ఓ వేంకటేశా

పుట్టమీద చెట్టు బుట్టే

విష్ణు మూర్తి వేంకటేశునిగా మారి లక్ష్మీ దేవినివెతు క్కొంటూ ఏడుకొండలు చేరాడు. పుట్టలో నిలిచిన వేంకటేశ్వర స్వామికి ఆకలి తీర్చాలని బ్రహ్మ శివులు ఇద్దరు ఆవు దూడలుగా మారారు. పాలు పుట్టపాలు అవుతున్నాయని గొల్లవాడు వేంకటేశుడిని గాయపరిచాడు.వేంకటేశుడిని చెట్టుగా, కోరిన వరాలిచ్చే కల్ప వృక్షంగా అన్నమయ్య ఈ పాదంలో చెప్పాడు.

భూమియెల్ల తీగపారే

ఆ కల్ప వృక్షమైన స్వామి యొక్క మహిమ సకలలోకాలలో వ్యాపించింది.

పర్వతాన పండు పండేరా

తను చేసిన అపచారానికి హడలిపోయి ప్రాణాలు విడిచిన ఆ గొల్ల సంతతివాళ్లకు ఈ నాటికి తొలిదర్శన భాగ్యం ప్రసాదించాడు వేంకటేశుడు. ఇది ఆ గొల్ల వంశపు అదృష్టమే కదా ! వాళ్ల అదృష్ట ఫలము పర్వతము మీద– ఆ సప్తగిరుల మీద పండింది.

అందవచ్చు కోయరాదురా

తొండమానుడు ఆకాశరాజు సోదరుడు. వేంకటేశుని భక్తుడు. స్వామి ఆజ్ఞపై తిరుమలలో మందిర నిర్మాణము చేయించాడు. . . తొండమానుడు నిత్యము స్వామితో సంభాషించేవాడు.

ఒకరోజు ఆకాశవాణి తొండమానుడంతటి భక్తుడు లేడని చెప్పింది. . తొండమానుడు తనవంటి భక్తుడు ఇంకొకడు లేడనుకొన్నాడు . ఆ మాటే ఒకరోజు తొండమానుడు స్వామితో చెప్పాడు. స్వామి తొండమానునికి బుద్ధి చెప్పాలనుకొన్నాడు.

ఆ మరుసటి రోజు తొండమానుడు పూజించిన బంగారు కమలాలతో పాటు మట్టి అంటుకొని ఉన్న కమలాలు తులసీదళాలు కనబడ్డాయి. ఆ మట్టి అంటుకొన్న కమలాలగురించి స్వామిని తొండమానుడు ప్రశ్నించాడు.తనను

కట్ట బొమ్మగా మలచి భీముడు అనే కుమ్మరి భక్తుడు నిష్కల్మషంగా పూజిస్తున్నాడని స్వామి చెప్పాడు.!

తొండమానుడు భీముని దర్శించుకొన్నాడు. ఆ భీముని సన్నిధిలో లక్ష్మీ నారాయణులు ప్రత్యక్షమై వారికి మోక్షం ఇవ్వటం చూసాడు.

ఈ వేంకటేశుని మహిమా ఫలాన్ని నిష్కల్మషంగా అర్చించి అందరూ పొందవచ్చు. కాని తొండమాను చక్రవర్తిలా వేంకటేశ ఫలాన్ని అహంకారంతో అందుబాటులో ఉంచుకొందామంటే దక్కదు (భవిష్యోత్తర పురాణము)

6. చేయిలేనివాడుకోశే నెత్తిలేని వాడు మేశే – కాళ్ళు లేని వాడు నడచే ఓ వేంకటేశా

పెదవిలేని వాడు చిలుక తినేరా ఓ వేంకటేశా!

చేయిలేనివాడుకోశే

ఏదన్నా కోయాలంటే చేయి ఉండాలి. కాని చంద్రుడు చేయి లేకుండానే కోస్తాడు. కనుక ఇక్కడ చేయిలేనివాడు చంద్రుడు. ఎవరైతే విరహంలో ఉంటారో

వారి గుండెలను చంద్రుడు తన కిరణాలతో కోస్తాడు.

కాళ్ళు లేని వాడు నడచే ఓ వేంకటేశా

కాళ్లు లేనివాడు అంటే గాలి, మనస్సు ఇలా చాలా వస్తాయి కాని ఇక్కడ కాలమని చెప్పుకొంటే సముచితంగా ఉంటుందని స్వీయ భావన.

కాలమంటే సమయమని సామాన్యార్థం. పరమాత్మ, యముడు, మృత్యువు, మేఘుమనే తుష్టి, ఒకానొక ద్రవ్యం అనేవి ఇతర అర్థాలు.

కాలం నడుస్తుంటుందని లోకంలో చాల ప్రసిద్ధమైన వాక్యము.

శివపురాణం వాయవీయ సంహితలో ఏడో అధ్యాయంలో వాయుదేవుడు మునులకు కాలమాహాత్మ్యము చెప్పాడు.

ఆ పరమేశ్వరుడి శక్తి అంశంలోని ఒక అంశం నిప్పులను కక్కే ఇనుపముక్కలా ఆయన ఉండి బయటకు వచ్చి గొప్పదైన కాలపురుషరూపంగా సంక్రమించింది. జరగవలసిన దానిని నిర్ణయించేది కాలమేనని మనసులో గట్టిగా నమ్మిన వ్యక్తి తన జీవితంలో ఏ ఒడిదుడుకులు సంభవించినా అవి కాలప్రభావంగానే జరిగాయని భావించాలి . అప్పుడే బాధ పడకుండా శాంతిని పొందుతుంటాడు.

'కాలోహి జగద్భక్షకః' అని ఆదిశంకరులవారు చెప్పారు.

భగవద్గీతలో గీతాచార్యుడు 'కాలః కలయతామహం' అంటాడు. (నేను కాలస్వరూపంలో ఉండి లెక్కలు కట్టుకుంటూ ఉంటాను)

వ్యాసభగవానుడు దేవీ భాగవతంలో '**కాలోహి బలవాన్ కర్తా సతతం సుఖ దుఃఖయోः! నరాణాం పరతంత్రానాం పుణ్య పాపానుయోగతః!!** అన్నారు.

(చేసిన పాపాలు , పుణ్యాలు అనుభవము చేతనే పోతాయి. ఈ విషయంలో మానవులు స్వతంత్రులు కారు).

గురువుల చేత శిక్షింపబడిన బుద్ధి కలిగిన లక్ష్మణుడి చేత ఆరాధింపబడే సీతమ్మ, పెద్దలచే పొగడబడే సీతమ్మ, లక్ష్మణుడి గురువైన రాముడి యొక్క ఇల్లాలైన సీతమ్మ, ముందు రాముడు వెనుక లక్ష్మణుడు ఉండగా మధ్యలో నడవవలసిన సీతమ్మ, దశరథుడి పెద్ద కోడలైన సీతమ్మ, జనకుడి కూతురైన సీతమ్మ ఇవ్వాళ చుట్టూ రాక్షస స్త్రీలు ఉండగా, పది నెలల నుండి ఒకే వస్త్రాన్ని కట్టుకొని పడి ఉందంటే,ఈ కాలం అన్నది ఏదన్నా చెయ్యగలదు, ఈ కాలాన్ని ఎవరూ అతిక్రమించలేరు. **(యది సీతాపి దుఃఖార్తా కాలోహి దురతిక్రమః)** అని

హనుమంతునిచేత వాల్మీకి అనిపించారు.

నెత్తిలేని వాడు మేశే

నెత్తి అంటే తల.

నెత్తి లేనివాడు రామాయణంలో కబంధుడు అనే రాక్షసుడు.

శ్రీరాముడు, లక్ష్మణుడు సీతమ్మను వెతుక్కొంటూ ఉండగా విచిత్ర రూపంలో ఉన్న కబంధుడనే ఒక రాక్షసుడు వాళ్లను తినబోయాడు. అతని ముఖం పొట్టలో ఉంటుంది. (సర్గ 69-27 వ శ్లోకం)

కబంధ హస్తాలు అనే జాతీయం ఇతనివల్లనే ఏర్పడింది.

పెదవిలేనివాడు చిలుక తినెరా

పెదవిలేనివానిగా శుకుని ఇక్కడ ప్రతీకాత్మకంగా స్వీకరించవచ్చు. ఎందుకంటే అతని మోము చిలుక రూపంలో ఉంటుంది. చిలుకకు పెదవి అప్రసిద్ధం. కనుక ఇక్కడ శుక మహర్షిని స్వీకరించటం జరిగింది.

భాగవతం చిలుక. తినటమంటే ఇక్కడ సంపూర్ణంగా అవగాహన చేసుకోవటం.

పరీక్షిత్తుకు శుకుడు భాగవతాన్ని ఏడు రోజుల్లో బోధించిన విషయం ప్రసిద్ధం.

7. గుంటయెండి పండు పండే - పండుకోశి కుప్పవేశే - కుప్పకాలి యప్పు తీరేరా - ఓ వేంకటేశా/దీని భావము నీకే తెలుసురా ఓ వేంకటేశా

సరిగ్గా ఇటువంటిదే ఒక పొడుపు కథ మనకు కనిపిస్తుంది.

పల్లాన పండింది/మెరకన ఎండింది/వాడి కుప్ప కాలింది/వాడి అప్పు తీరింది

దీని జవాబు కుండఈ

అన్నమయ్య పొడుపు కథకు జవాబు కూడా అదే.

గుంట ఎండింది =కుండ తయారు చేసే గుంట ఎండింది.

పండు పండింది= కుండ తయారయింది

పండు కోసి కుప్ప వేసె= ఆ కుండను బయటికి తీసి మిగతా కుండలతో కలిపి కుమ్మరి వామిలో కాల్చటానికి కుప్పగా వేసాడు

కుప్పకాలి యప్పు తీరేరా= ఆ కుండలు కాచే వామి కాలి , ఆకుమ్మరి వాని అప్పు తీరిందని భావం.

పరమార్థం

1. పెండ్లి సమయములలో ఉపయోగించు పెద్దకుండలను రంగులతో

చిత్రిస్తారు. వీటి మూతిపైన శుభసమయంలో దీపారాధన చేస్తారు. వీటినే అరివేణి(అరివేడి) కుండలు అంటారు.

2. చనిపోయిన తర్వాత కూడ కుండల అవసరం చాలా ఉంటుంది.

3..ఆకాశము అన్ని చోట్లా ఉంటుంది. కాని ఏమలినము ఆకాశానికి అంటదు. అలాగే కుండ ఉన్నా పగిలినా అందులో ఆకాశం ఉంటుంది. కుండ ఉన్నంత కాలం దాన్ని ఘటాకాశం అంటారు. అజ్ఞానం ఎంత ఎక్కువగా ఉంటే, భ్రాంతి అంత ఎక్కువగా ఉంటుంది. ఈ భ్రాంతివలననే మరణం అంటే భయం. ఘటాకాశం (జీవుడు) మహాకాశంలో (దేవుడు) కలిసిపోతుంది. ఒక వ్యక్తికి దహన సంస్కారాలు చేసేటప్పుడు, ఈ జీవన సత్యాన్ని చెప్పటానికి కుండని పగలకొడతారు. అంటే భ్రాంతులు అశాశ్వతమని, దృష్టి దేవుని మీద నిలపాలని ఈ పొడుపు కథ ద్వారా అన్నమయ్య బోధ.

08.సందెకాడ తలవ్రాలు సంధిదీరి వేంకటరాయ – తెల్లవారనాయనీడరా ఓ వేంకటేశ

దీని భావము నీకే తెలుసురా ఓ వేంకటేశ

భావము

ఓ వేంకటేశా ! సాయంత్రం పూట అక్షరం మీద తలకట్టులా ఉండే చందమామ తెల్లవారిన తరువాత ఛాయలా మారి, ఎండలో కనబడకుండా పోతాడు.

పరమార్థం

చందమామ గురించి బసవరాజు అప్పారావుగారి ఈ గీతం చాలా మనోహరంగా ఉంటుంది.

తెల్లమబ్బు గుఱ్ఱము నెక్కి తేజరిల్లి
స్వారిజేయుచు బోవు నో చందమామ!
యేల నీ కంతగర్వము? ఎల్లకాల
మొక్కతీరుగ సంపద లుండునోయి?
పండువెన్నెల జగమెల్ల బర్వజేసి
అందరిమనంబులన్ గొని హాయి ముంచి,
ఎల్లలోకాలకును రాజు నేనె యంచు
కుల్కుచుందువుగా వెఱ్ఱిగొల్లవోలె

కష్టసుఖ మెరగని పసికందుబిడ్డ
చందమున గంతులేసెదు చందమామ!
కాలపరిపాకమున నీకు గల్గబోవు
గతి దలంపుము నిశ్చలమతిని సుంత!
అంధకార మలీమసం బౌచు జగతి
ప్రళయకాలమహాబ్ధి నిర్మగ్న యట్ల
చూడ దుర్భేధ్య మౌనప్పు డేడ బోవు
నీదు రాచకంబు వెన్నెలయు, చంద్ర!
కష్టభాగ్యుడనౌ నన్ను గాంచి మంద
హాసమున పరిహసించెద వౌర, చెలియ
చెంత లేదనియేన? నీవింత యొడలు
మరచి నన్నిట్లు మతిమాలి పరిహసింతు?
పలవ! పోపొమ్ము నీతోడ వాదులేల?
చలువ తిన్నియపై ముద్దు చెలియమోము
మోహపారవశ్యంబున ముద్దు గొంచు
బుద్ధి జెప్పింతు పొమ్ము నీ పొగరడంగ.

ఇందులో ఎల్లకాలము సంపదలు ఒక్కరకంగా ఉండవనే సందేశం ఉంది. అన్నమయ్య పై పొడుపు కథలో చెప్పిన సందేశం కూడా ఇదే.

2.సందెకాడ బుట్టినట్టి – చాయల పంట యెంత

చందమాయ చూడరమ్మ – చందమామ పంట అని ఇంకొక కీర్తనలో కూడా అన్నమయ్య చందమామని సంధ్యా సమయంలో పుట్టిన పంటగా చెప్పాడు.

9. ముత్యాల పందిటిలోన ముగ్గురు వేంచేసి రాగ – ముక్కంటి దేవుని జూచేరు ఓ వేంకటేశా

దీని భావము నీకే తెలుసురా! ఓ వేంకటేశా

ఈ పొడుపు కథకు విడుపు కొబ్బరికాయ

సంస్కృతంలో కొబ్బరికాయను నాళికేరము లేదా నారి కేళము అంటారు. నాళ్యా కముదకమీరయతీతి నాళి కేరః – రంధ్రములచేత నీటిని పీలుస్తుంది కనుక దీనికి నాళికేరమని పేరు వచ్చిందని అమర నిఘంటువు చెబుతుంది.

కొబ్బరికాయ లోని ఈ రంధ్రాలనే అన్నమయ్య 'ముత్యాల పందిరి' అన్నాడు. మూడు రంధ్రాలను(కళ్లను) 'ముగ్గురు వేంచేసి రాగా 'అని పేర్కొన్నాడు.కొన్ని ప్రాంతాల్లో కొబ్బరి కాయను ముక్కంటి అను పేరు మీద పిలవటం ఈనాటికి ఉంది. దానినే 'ముక్కంటి దేవుని జూచేరు' అని కవి పేర్కొన్నాడు.

పరమార్థం

1. ఇప్పుడంటే మానేసారు కాని ముత్యాలపందిరి పదబంధం ఇదివరకటి జానపద పాటల్లో చాలా ఎక్కువ వాడుకలో ఉంది.

ఉదా. ముత్యాల పందిరి కిందికి మన్మథుని ఆహ్వానిస్తూ ఈ పాట...

జొన్నగింజ ఎడారమాయె-జోగులు జొంపులు తడాకులాయె
మురుసు కుంట రావోయి కామన్న- నా ముత్యాల పందిరి కిందంగ
ముద్దుగ రావోయి కామన్న నా - ముత్యాల పందిరి కిందికి
సద్దగింజ ఎడారమాయె-సన్నజాజులు తడకులాయె
మురుసుకుంట రావోయి కామన్న- నా ముత్యాల పందిరి కిందంగ
ముద్దుగ రావోయి కామన్న- నా ముత్యాల పందిరి కిందికి..."

అన్నమయ్య సమాజంలో తిరిగి సమాజాన్ని తన కీర్తనల్లో ప్రతిబింబించినవాడు కనుక ప్రజల నోళ్లలో నానే ముత్యాల పందిరి పదబంధానికి తన గీతంలో చోటు కల్పించాడు.

2.'తిరువీధుల మెరసీ' కీర్తనలో కూడా "మురిపేన మూడోనాడు ముత్యాల పందిరి క్రింద"అని ముత్యాల పందిరిని స్మరించాడు.

3. కొబ్బరికాయ మూడు కన్నుల్లో కుడిభాగాన్ని సూర్యనాడిగా , ఎడమ భాగాన్ని చంద్రనాడిగా , రెండు కన్నులకు మధ్యలో ఉన్న పెద్ద కన్నును బ్రహ్మనాడిగా చెబుతారు. పీచు ఈ మూడు నాడులకు సమన్వయం కలిగిస్తుంది. పీచు తీసేస్తే అసలైన మోక్ష జ్ఞానం కలుగుతుంది. అందుకే స్వామికి నివేదించిన తర్వాతే కొబ్బరి పీచును తీసేయాలంటారు. స్వామిని అర్చించకుండా మోక్షం రాదు కదా !

4. భాషా శాస్త్రవేత్తలు టెంకాయ ముందు రూపము తెంకాయ అని చెబుతారు. తెన్ అంటే దక్షిణము, అక్కడ ఎక్కువగా దొరికే కాయ కనుక తెంకాయ అని

పేరు వచ్చిందట.

5. ఆజగామ యదాలక్ష్మీ ర్నారికేళ ఫలాంబువత్

నిర్జగామ యదాలక్ష్మీ ర్గజభుక్త కపిత్థవత్ అను సంస్కృత శ్లోకానికి "సిరి దావచ్చిన వచ్చును" అని సుమతీశతకకారుని అనువాదం ప్రసిద్ధం.

6.కొబ్బరికాయతో కొన్ని న్యాయాలు, సామెతలు ప్రసిద్ధాలు.

ఉదా. (అ).కొబ్బరిచెట్టు ఎందుకెక్కినావని ప్రశ్నిస్తే దూడ గడ్డికోసమని అన్నట్లు

(ఆ.) కొబ్బరికాయలోనికి నీరు ఏవిధంగా వచ్చిందో తెలియనట్లు- (బ్రహ్మమునుండి ఈ ప్రపంచం ఎలా వస్తుందో తెలియదు.)

ఈవిధంగా విశిష్టమైన కొబ్బరికాయను అక్షరాల ముత్యాల పందిరిలో అన్నమయ్య ప్రతిష్ఠించాడు.

10. ఏటిలోన వలవేశే తాటిమాను నీడలాయె - దూరపోతే చోటులేదురా ఓ వేంకటేశా

దీని భావము నీకే తెలుసురా ఓ వేంకటేశా

ఈ పొడుపు కథకు విడుపు చ్యవన మహర్షి ఇతివృత్తం.

మహాభారతంలోని ఆనుశాసనిక పర్వంలోని ద్వితీయా శ్వాసములో భీష్ముడు ధర్మరాజుకు ఈ కథ చెబుతాడు.

చ్యవన మహర్షి గంగా యమున కలిసిన చోట నీళ్లలో మునిగి తపస్సు చేస్తున్నాడు. జాలరులు చేపల కోసం ఆ నీటిలో వలలో వేసారు. (ఏటిలోన వల వేసె)

చేపలతో పాటు ఆ ముని కూడా వలలో పడ్డాడు. (తాటిమాను నీడలాయెా తాటి మాను నీడ అంటే అతి స్వల్పం. చ్యవన మహర్షి అతిస్వల్పమైన ప్రయత్నంతో వలలోకి వచ్చాడని భావం)

వలలో మహర్షిని చూసి భయంతో వణికి పోయిన జాలరులు తమ తప్పును క్షమించమని ఆయనను వేడుకొంటారు. వాళ్లను అమహర్షి నిందించలేదు. నిందలకు మహర్షుల జీవితంలో చోటు లేదు. (దూరపోతే చోటులేదురా)

దూరు అంటే నిందించు, చొచ్చు, ప్రవేశించు.ఇలా అర్థాలున్నాయి. ఇందులో మొదటి అర్థం ఇక్కడ స్వీకరించబడింది)

పరమార్థం

"ఇందువల్లనేమిగద్దు 'అను శృంగార కీర్తనలో (2-268) **తతి విరహపుకాక**

తాటిమాని నీడ అంటాడు అన్నమయ్య. ప్రేయసీ ప్రియుల మధ్య విరహపు వేడి తక్కువగా ఉందని చెప్పటానికి **తాటిమాని నీడ** అన్నాడు అన్నమయ్య.

11. ముందు కూతురాలు ఆమె ముందు అలుకూతురాయె – పొందుగా పెండ్లాము తానాయె ఓ వేంకటేశ

దీని భావము నీకే తెలుసురా ఓ వేంకటేశా

తాత్పర్యము

విష్ణువుకు ముందు అవతారంలో కూతురు భార్య అయింది.

తర్వాత అవతారంలో భార్య కూతురయింది.

ఇంకొక అవతారంలో చక్కగా భార్య అయింది

❖ ❖ ❖

భూదేవి వరాహవతారంలో విష్ణువు భార్య. భూదేవికి పుట్టిన కూతురు సీత (లక్ష్మీదేవి అవతారం) భార్య అయింది.

గంగ (లక్ష్మీదేవి అవతారం) వామనావతారంలో విష్ణువుకు కూతురయింది.

కృష్ణావతారంలో రుక్మిణి (లక్ష్మీదేవి అవతారం) అనే పేరుతో చక్కగా భార్య అయింది.

భూదేవి, సీత, గంగ– వీరందరూ లక్ష్మీ స్వరూపలు. ఒక్కొక్క అవతారంలో ఒక్కొక్క దేవ కార్య ప్రయోజనార్థం విష్ణువుకు ఒక్కొక్క రకంగా దగ్గరయ్యారు.

పరమార్థం

1.లక్ష్మీ దేవి, భూదేవి అని రెండు రూపాలలో మనం పూజిస్తున్నాం. నిజానికి అమ్మవారు ఒక్కరే. అమ్మవారు మూడు స్థానాల్లో లయార్చ, భోగార్చ మరియూ ఆధికారార్చ అనే రూపాల్లో దర్శనమిస్తుందని పెద్దలు చెబుతారు. లయార్చ అంటే భగవంతుని యొక్క వక్షస్థలంపై ఉన్న రూపం. భోగార్చ అంటే భగవంతునికి ప్రక్కగా ఉండే రూపం. ఒంటరిగా భగవంతుడు ప్రక్కన లేని రూపంలో దర్శనమిచ్చే రూపం అధికారార్చ.

మన మానవ సంబంధాలు దేవునికి అంటగడితే కొన్ని ప్రశ్నలకు జవాబులు తెగవు. ఉదాహరణకి శ్రీ వేంకటేశ్వర సుప్రభాతంలో వేంకటేశుడు భూదేవి పుత్రి సీతకు భర్తగా చెబుతారు. అదే సుప్రభాతంలో భూదేవి భర్తగా చెబుతారు. రెండింటికి సమన్వయం కష్టం. నారాయణుడు భూదేవికి భర్త. శ్రీ రాముడు సీతకు భర్త.

మన వావి వరుసలు సర్వము తానైన భగవంతునికి అంటకట్టకూడదు.

ఒకటికి రెండుసార్లు లేదా వేయిసార్లు దేవుని పొగడటం మనకు అలవాటు. లేకపోతే మనకు తృప్తి ఉండదు. అందుకే దేవుని ఇద్దరు భార్యలతో కలిపి పూజిస్తున్నాం. తత్వం ఒకటే అనే జ్ఞానం వచ్చేంతవరకు వేంకటేశుని ఇద్దరు భార్యలతో కలిసి పూజించే అలవాటు పెద్దలు చేసారు. అన్నమయ్య కూడా అందుకే 'పన్నిన లక్ష్మి భూమి పతి వి నీవు' అన్నాడు.(నీకే నే శరణు అను నాగీత వ్యాఖ్య)

2. విష్ణువును మామకు మామగా ఒక చాటు పద్యంలో కవి ఇలా వర్ణించాడు.

మామను సంహరించి యొక మామకు గర్వమడంచి యన్నిశా
మామను రాజుజేసి యొక మామ తనూజున కాత్మబంధువై
మామకు గన్నులిచ్చి సుతు మన్మథు పత్నికి దానె మామయై
మామకు మామయైన పరమాత్ముడు మాకు బ్రసన్నుడయ్యెడిన్.

తన కృష్ణావతారంలో మామ అయిన కంసుని సంహరించాడు.

రామావతారంలో వారధి కట్టడానికి ముందు తన మామ అయిన సముద్రుని గర్వాన్ని అణచాడు.

రాత్రికి మామ అయిన చంద్రునికి –రాజు– అనే పేరు ఇచ్చాడు.

తనకు మామ అయిన పాండురాజు కొడుకైన అర్జునునకు ఆత్మ బంధువుడయ్యాడు.

విశ్వరూప సందర్శన సందర్భంలో మామ అయినధృతరాష్ట్రునికి కన్నులిచ్చాడు.

తన కుమారుడైన మన్మథుని భార్య రతీదేవికి తాను మామ అయ్యాడు.

క్షీర సాగర మథన సందర్భంలో తనకు తన కూతురు లక్ష్మిని ఇచ్చి పెండ్లి చేసిన మామ సముద్రునికి , తన పాదములనుంచి పుట్టి తనకు కూతురైన గంగనిచ్చి మామకి మామ అయిన విష్ణుదేవుడు మనకు ప్రసన్నుడవుగాక!

ఇందులోని మామ శబ్దముతో కవి చమత్కారంగా ఆడుకొన్నాడు.

3. విష్ణువు భూదేవికి భర్త అని చెబుతూ వారి దాంపత్యాన్ని దేవీభాగవతం వర్ణించింది. (తొమ్మిదవ అధ్యాయము)

4.నీసతి పెక్కు కల్ములిడ నేర్పరి,లోకమకల్మషంబుగా
నీ సుత సేయుబావనము,నిర్మిత కార్యధురీణ దక్షుడై
నీ సుతుడిచ్చు నాయువును,నిన్ను భజించిన గల్గకుండునే
దాసుల కీప్సితార్థములు దాశరథీ!కరుణాపయోనిధీ!

దయాసముద్రుడవైన రామా !

(నీ భార్య లక్ష్మి అనేక సంపదలు ఇవ్వటంలో నేర్పుకలిగినది.

నీ కూతురు గంగ లోకాన్ని పాపం లేకుండా చేస్తుంది.

నీ కుమారుడు బ్రహ్మ ఆయువు ఇస్తాడు.

నిన్ను సేవించిన భక్తులకు కోరిన కోర్కెలు తప్పక నెరవేరుతాయి.)

ఈ ప్రసిద్ధమైన దాశరథి శతక పద్యంలో గంగను, లక్ష్మిని భార్యగా, గంగగా విడివిడిగా ప్రస్తుతించాడు.

5.శంకర భగవత్పాదులవారు గంగను మకరందంగా తన షట్పదీ స్తోత్రంలో చెప్పారు.

దివ్యధునీమకరందే పరిమలపరిభోగసచ్చిదానందే

శ్రీపతిపదారవిందే భవభయఖేదఛిదే వందే

శ్రీ మహా విష్ణువు పాదాలలో

1. దేవలోక నది మందాకిని అనే మకరందము ఉంటుంది.

2.ఎంత అనుభవించినా తృప్తి తీరని పరిమళము ఉంటుంది.

3. సంసార భయాన్ని , విచారాన్ని పోగొట్టే శక్తి ఉంటుంది.

అటువంటి విష్ణు పాదారవిందములకు వందనము. ఈ విధంగా పొడుపు కథ ద్వారా గంగాది నామాలను, విశేషాలను స్మరింప చేసిన అన్నమయ్యకు అభివందనం.

12. ఆకులేని అడవి లోన మూడుతోకల పెద్దపులిని – మేక యొకటి యెత్తి మింగేరా ఓ వేంకటేశా

దీని భావము నీకే తెలుసురా ఓ వేంకటేశా

ఈ పొడుపు కథను నేను ఇలా విభజించి రెండు పరిష్కారాలు చూపుతున్నాను.

మొదటి పరిష్కారం

ఆకులేనిఅడవిలోన/

మూడుతోకల పెద్దపులిని /

మేక యొకటి/

యెత్తి మింగేరా /

ఆకులేని అడవి అంటే జుట్టు.

ఆకులేని అడవిలో జీవం లేని జంతువు/జీవమున్న జంతువులను వేటాడుతుంది.

ఏమిటది? అనే ప్రసిద్ధమైన పొడుపు కథకు జవాబు : దువ్వెన.

భస్మాసురుని కథలో ప్రధానమైన పదం తల.తను ఎవరి తలమీద చేయి పెడితే , వాళ్లు భస్మం కావాలని అతని వరం. కథకు మూల కారణమైన ఆ తలనే అన్నమయ్య ఇక్కడ' ఆకులేని అడవి' అన్నాడు.

ముక్కంటిని అన్నమయ్య ఈ పొడుపు కథలో మూడు తోకల పెద్దపులిగా ప్రతీకాత్మకంగా చెప్పాడు. ఎవరి నెత్తి మీద చేయి పెడితే వాళ్లు భస్మం కావాలనే వరం సంపాదించుకొని, ఆవరాన్ని మేక వంటి భస్మాసురుడు శివుడనే పెద్దపులి తల మీదనే(ఆకులేని అడవిలోన) ప్రయోగించాలనుకొన్నాడు. అప్పుడు మోహినీ అవతారంలో విష్ణువు తన అంద చందాలను ప్రయోగించాడు. విలాసాలను ఎత్తి చూపాడు. అతడి సంహారానికి కారకుడయ్యాడు. అతనిని మింగాడు.

రెండవ పరిష్కారం

జగద్గురు బోధలలో(01 వ సంపుటి) భస్మాసుర వృత్తాంతంలో కంచి స్వామి ఇలా అన్నారు. 'ఒకే వస్తువు విష్ణువుగానూ ఈశ్వరుడుగానూ అంబికగానూ ఆవిర్భవించి ఉన్నది. ఈ రూపాలతో లోకాలను అనుగ్రహించడానికి ఆ పరమాత్మ వేరువేరు అవసరాలలో వెలిశారని ఈ గాథలు చెపుతున్నై. పెద్దలు రత్నత్రయం అని చెపుతారు. మనం పూజించే యీ మూడు రత్నాలూ వేదమధ్యంలో ఉన్నవి. అంబిక విష్ణువు, ఈశ్వరుడు అనే ఈ మూడు రత్నాలూ మనకు పూజనీయాలు.

ఈ రకంగా అయితే పారిపోతున్న శివుడు , మోహినీ రూపంలో అతని చితా భస్మానికి కారకుడయ్యాడని చెప్పుకోవచ్చు.

13.పున్నమ వెన్నెలలోన వన్నెలాడితోను గూడి

కిన్నెర మీటుచు పొయ్యేవు ఓ వేంకటేశా

దీని భావము నీకే తెలుసురా ఓ వేంకటేశా

పున్నమి వెన్నెలలో శ్రీ కృష్ణుడు కిన్నెర మీటుచూ వన్నెలాడితో కలిసి రాస కేళి ఆడుతూ 'చాలా దూరం'పోయాడని భావం.

పరమార్థం

1.పోతన పున్నమి వెన్నెలలో క ృష్ణుడు శరదాగమారంభసంపూర్ణ పూర్ణి మాచంద్రసాంద్రతపోజ్జ్వలితమగుచు' (3-118) గానం చేసాడని వ్రాసారు. మురళీ గానముతో పాటు కిన్నెర వీణా గానాన్ని అన్నమయ్య ఈ పొడుపు కథలో

దర్శించాడు. ఆ వన్నెలాడి గోపిక కావచ్చు. రాధ కావచ్చు. ఇది మనోసందర్శనా చిత్రం.

2..కిన్నెర అంటే ఒకరకమైన వీణ. వీణావిశేషము.

3. ఈ వీణ ని కృష్ణ?డు కలభాషిణికి నేర్పించినట్లు కళాపూరో?దయం కావ్యంలో మనకు కనబడుతుంది.

4.విశ్వనాథ సత్యనారాయణగారు అనుభూతి ప్రధానమైన 'శ్రీ కృష్ణ సంగీతము ' రచించారు. ఇందులో వినగలిగిన చెవులుంటే మురళీ గానలతో పాటు కిన్నెర వీణా నాదాలు వినబడతాయి.

5. శ్రీ కృష్ణుడు కిన్నెర లాంటి వాయిద్యాన్ని ధరించి పున్నమవెన్నెలలో నృత్యం చేస్తున్న వసంత రాగిణి చిత్రం ప్రసిద్ధమైనది.

5. స్త్రీ మోమును చంద్రబింబంతో, జుట్టును రాహువుతో పోల్చడం కవిసమయం.

పొలతి వదనమను పున్నమ చంద్రుడు
బలిమి నెగయునని భయమునను
మెలుత చికుర ధమ్మిల్లపు రాహువు
తల జెదరగ నిదె దైవమె సేసె (417)

అను కీర్తనలో ఈ చంద్ర రాహువులను అద్భుతంగా జతచేసాడు.

నాయిక ముఖమనే పూర్ణచంద్రుడు ఆకాశం పైకి రాహువు కొప్పు రూపం లో కబళించడానికి సిద్ధంగా ఉన్నాట్ట. (నాయిక మోముపై పడిన జుట్టు రాహువుతో ఉపమానం)

6. అన్నమయ్య ఒక వర్ణనలో తన శరీరాన్ని వీణగా ఇలా మార్చాడు.

పాడేము నేము పరమాత్మ నిన్నును
వేడుక ముప్పది రెండు వేళల రాగాలను
తనువే వొళవు తలయే దండెకాయ
ఘనమ్మెన వూర్పులు రెండు కట్టిన తాళ్ళు
మనసే నీ బద్దితాడు మరి గుణాలే జీవాళి
మొనసిన పుట్టుగే మూలకరడి

7. కిన్నెరను అన్నమయ్య తన కీర్తనల్లో రకరకాలుగా వర్ణించాడు. ఒక మధుర వర్ణన.

పలుకు తేనెల కొసరి పసిడి కిన్నెర మీటి
పలుచనెలుగున నిన్ను పాడి పాడి
కలికి కన్నీరు బంగారు పయ్యెద నొలుక
తలయూచి తనలోనె తలవంచు చెలియ

8. తన వేంకటేశ్వర శతకంలో అన్నమయ్య నాయిక కిన్నెర మీటిన సందరాన్నీ ఇలా అందంగా వర్ణించాడు.

కిన్నెర మీటి పులకించి తలంచి మనోజలీలదా
నున్న తెంగు నెచ్చెలుల కొయ్యనజెప్పగబూనుజెప్పరా
కన్నువ సిగ్గుతో నలరు నల్లన శ్రీయలమేలుమంగ నీ
వన్నెలసేత లెట్టివొ సువాళము లెట్టివో వేంకటేశ్వరా!

9. తేటి వేరు, తుమ్మెద వేరు.

తేటి అంటే తేనెటీగ. తుమ్మెద అంటే ఝుమ్మని ఎగిరే ఒక పురుగు. ఈ రెండు ఒకటి కాకపోయినా కవుల దృష్టిలో ఒకటే.

పువ్వుల మీద ఆడతేటి వాలుతుంది. మగతేటి కాదు.కాని కవులు తేటిని పురుషునితో పోలుస్తారు. పువ్వుని స్త్రీగా వర్ణిస్తారు.

నాట్యం చేసేది మగ నెమలి. (మయూరము) ఆడనెమలిని ఆకర్షించే ప్రయత్నము లో మగ నెమలి పించం విప్పి నాట్యం చేస్తుంది.కాని మనం బాగా నాట్యం చేసిన వారిని నాట్య మయూరి అంటాము. మయూరము అని చెప్పం.

చక్కగా కూసేది మగ కోయిల . ఆడు కోయిల కాదు. కాని ఆడవాళ్లని గాన కోకిల అంటాం.

ఇంతకీ ఎందుకు ఇదంతా చెబుతున్నానంటే కొన్ని అబద్ధాలు(కవి సమయాలు) సాహిత్యంలో నిజాలుగా చెలామణి అవుతుంటాయి.(అవి అబద్ధాలని చెప్పినా నమ్మలేనంతగా) అన్నమయ్యే కాదు– ఏ కవి వర్ణన అయినా భౌతిక నేత్రంతో కాదు. హృదయ నేత్రంతో చూడాలి. అప్పుడే ఆనంద పడగలం.

14. అర్ధరాత్రి వేళలోని రుద్రవీణ నెత్తుకొని – నిద్రించిన నిన్ను పాడగ – ఓ వేంకటేశా

దీని భావము నీకే తెలుసురా ఓ వేంకటేశా

రాయల వారి అముక్త మాల్యద లోని మాలదాసరి వృత్తాంతం ఈ పొడుపు

కథకు విడుపు.

మాలదాసరి –అర్ధరాత్రి సమయంలోనే తెల్లవారిందని భ్రమపడి – నిద్రించిన విషు? మూర్తి కి మేలు కొలుపు పాడాలని దారి తప్పి ఒక బ్రహ్మ రాక్షసుని చేతిలోకి చిక్కాడు.

పరమార్థం

1.గండా భోగముల న్ముదశ్రులహరుల్గల్ప న్నుతుల్పాడి యా
దండ న్రేగులు డించి భక్తిజనితోద్యత్తాండవం బాడు నా
చండాలేతర శీలుడుత్పులకియై చాండాలికన్మీటుచున్
గుండుల్నీరుగనెండ గాలి పసి తాకుం జూడ కాప్రాహ్ణమున్.(ఆరవ అశ్వాసము)

పై పద్యంలో రాయలవారు చాండలికను(వీణ) మాలదాసరి ధరించాడని వ్రాసారు.

2. నిజంగా ఆలోచిస్తే సుప్రభాతం దేవునికి కాదు. దేవుని పేరు మీద జీవునికి.

దేవుడు నిద్ర పోడు. నిద్రపోతున్న మన సుగుణాలను మేల్కొలుపటానికి సుప్రభాతం దేవుని పేరు మీద పాడుతాం.

రాక్షస , దైవీ సంపదల సమ్మేళనమయిన జీవునిలో రాక్షస గుణాలను తగ్గించి, దైవీ సంపదను పెంచేది సుప్రభాతం. తెల్లవారు జామున లేచి స్వామి సుప్రభాతం కొన్ని రోజులు పాడి చూడండి. అత్యద్భుతంగా మనలో ప్రశాంతత మొదలైన సుగుణాలు ఏర్పడుతాయి.

05. అప్పసము

అప్పసము అనేది ఒక అవ్యయము. దీనికి ఎల్లప్పుడు, మనుష్యులచేత ద్రవ్వబడిన చిన్న నీటికాలువ అను అర్థాలున్నాయి. అన్నమయ్య **కోడెకాడువీడుగదె గోవిందరాజు** కీర్తనలో అప్పసము అనేపదాన్ని ఎల్లప్పుడు అనే అర్థంలో వాడాడు.

పల్లవి: కోడెకాడు వీడుగదె గోవిందరాజు
జోడైన సకులు దాను చొక్కుచున్నాడు

చ .1: పరగగ మేలుకొని పవ్వళించివున్నవాడు
సొరిది దేవుళ్లకు చోటిచ్చినాడు
యిరవై మోవివిందుల కెదురుచూచున్నాడు
తరుణులరతులెల్లాదలపోయుచున్నాడు

చ .2: చెప్పరానిసిరులతో సింగారించుకున్నాఁడు
వుప్పతిల్లుఁ దమకాన నుబ్బుచున్నాఁడు
కుప్పెఁదుజవ్వాది మేనఁ గుప్పళించుకున్నవాఁడు
అప్పసము సరసములాడుచున్నాఁడు

చ .3: సారె సారె వలపులు చల్లుకొంటా నున్నవాడు
వూరడిం చందరిగలయుచునున్నాడు
యీరీతి శ్రీ వేంకటాద్రి నిరవై తిరుపతిలో
కూరిములు నెరపుచు కొలువున్నాడు

అన్నమయ్య తిరుపతిలో కొలువైన గోవిందరాజ స్వామికి తనదయిన మధుర భక్తి మాటల స్నానం ఈ కీర్తనలో చేస్తున్నాడు.ఇది లౌకిక శృంగారము కాదనే మాట ఒకటవ చరణములోని రెండవపాదము దగ్గర చెప్పకుండా చెప్పాడు.

ఏమే చూసావటే! పడుచువాడంటే మన గోవిందరాజే కదా !

చక్కగా తనతో జతకలిసిన స్త్రీలతో తనకు తానే వ్యవహారాలు నడుపుతూ పరవశిస్తున్నాడు. ఆ మొఖం చూడు.

మన గోవింద రాజు పడుకొని ఉన్నాడు కాని మేలుకొనే ఉన్నాడు.

ఎంతమంది దేవతలున్నారో అంతమంది దేవతలకు తనలో చోటు కల్పించిన

ఘనుడు మన గోవిందరాజు.

ఉన్నచోటినుంచి కదలకుండా ఉండి, పెదవుల విందులకోసం ఎదురుచూస్తున్నాడు.

మంచి వయస్సులో ఉన్న ఆడువారితో రకరకాల సంభోగ క్రియల గురించి ఆలోచిస్తున్నాడు.

అవ్వ ! చూసావుటే అయ్యగారిని.

చెప్పలేనన్ని ఆభరణాలు వేసుకొని అలంకారం చేసుకొన్నాడు.

శరీరంలో పుడుతున్నమోహంతోతహతహలాడుతున్నాడు

పెద్ద పిడికిలంత పునుగునుశరీరముపై చల్లు కొన్నాడు.

ఎప్పుడూ పరిహాసాలాడుతుంటాడు.

మన గోవిందరాజు మాటి మాటికి ప్రేమలు కురిపిస్తున్నాడు.

నన్ను మోసము చేసి, దానితో ఉన్నావని చెప్పిన వారిని ఓదార్చి ఈ స్త్రీలందరితో కలిసిపోతున్నాడు

స్నేహాలు వ్యాపింపచేస్తూ, తిరుమలలో శ్రీ వేంకటాద్రి పర్వతము మీద ఉండవలసిన కథా నాయకుడు ఇక్కడ తిరుపతిలో పరిపాలన చేస్తున్నాడు.

06.అల్లో నేరేళ్లు

ఈ "అల్లోనేరేళ్లు" పదాన్ని "అల్లునేరేళ్లు" గా(01-449) కూడా అన్నమయ్య ప్రయోగించాడు. జానపద భాషకు సింహాసము వేసిన పండిత భక్త కవులలో అన్నమయ్యది అగ్రస్థానం.

అల్లోనేరేడు అంటే 1. బాలికలు వెన్నెలలో ఆడుకొనే ఒకఅట 2. ఒక రకం పాట3. నమస్కారం . అని మూడు రకాల అర్థాలు చెబుతారు. వెన్నెలలో పిల్లలు ఆడుకొంటున్న ఒక మధురమైన దృశ్యం అన్నమయ్య మనో వీథిలో కనబడింది. ఆ ఆటని, వారి మాటను అన్నమయ్య అక్షర బద్ధం చేసాడు.

పల్లవి: నెయ్యము లల్లోనేరేళ్ళో
వొయ్యన వూరెడి వువ్విళ్ళో

చ.1: పలచని చెమటల బాహుమూలముల-
చెలమలలోనాఁ జెలుపములే
థళథళమను ముత్యపు జెఱగు సురటి
దులిపేటి నీళ్ళతుంపిళ్ళో

చ.2: తొటతొటఁ గన్నులఁ దొరిగేటి నీళ్ళ
చిటి పొటి యలుకల చిరునగవే
వటఫలంబు నీ వన్నెల మోవికి
గుటుకలలోనా గుక్కిళ్ళో

చ.3: గరగరికల వేంకటపతి కౌఁగిట
పరిమళములలో బచ్చనలు
మరునివింటి కమ్మనియంప విరుల-
గురితాఁకులినుపగుగ్గిళ్ళో (రేకు: 61-5సంపుటం: 5-179)

ఏమే చూసావా ! ఆ అలమేలుమంగ , వేంకటేశుల స్నేహాలు అని ఒక బాలిక మొదలుపెట్టి ఊత పదంగా "అల్లో నేరేళ్లో" (నమస్కారం)అంది.అలమేలుమంగ, వేంకటేశుని స్నేహాలకు నమస్కారం పెట్టింది.

ఇంకో బాలిక "అవి ఉట్టి స్నేహాలు కావే- మెల్లగా, మెత్తగా ఊరే తొందరలు"

అని పల్లవిలోని రెండవపంక్తిగా అంది.

ఇక – ఇదేమిటో చెప్పవే అని ఒక వర్గం వారు చరణములోని మొదటి రెండు పంక్తులలో కొంటెగా అడిగితే , ఇంకొక వర్గంవారు రెండు పంక్తులలో తగ్గట్టుగా జవాబు చెప్పారు.అల్లరిగా పాట పాడుకొన్నారు. అ మూడు చరణాల పరమార్థం ఇది.

01.చ. –ఆ అలమేలుమంగ బాహుమూలాలలో ఉన్నపలుచని చెమటలనే ఊటలలో ఆనీటి బిందువుల అందాలేమిటి?

అబ్బే !ఏంలేదే! తళతళమని మెరిసే ఆముత్యాల కొంగు అనే గుండ్రని విసనకర్రను దులపగా వచ్చిన తుంపరలు అవి.

(మీరు ఏదో అనుకొని ఆ చెమటలకి వేరే అర్థాలు ఊహించుకొంటున్నారు. అవి చెమట బిందువులు కావు. అలమేలుమంగ తన ముత్యాల పైట కొంగును ఒక సారి విసనకర్రలా దులిపింది.ఆకొంగున ఉన్న ముత్యాల తునుకలు ఆమె బాహు మూలాలకి అంటుకొని మీకు నీటి తుంపర్లలా కనిపిస్తున్నాయి అని జవాబు.)

02చ. తొటతొట(ధ్వన్యనుకరణ శబ్దం) అని చప్పుడు చేస్తూ అలమేలుమంగ కన్నులనుండి కిందికి జారుతున్న ఉత్తుత్తి కన్నీళ్ల చాటున –

చెలరేగుతున్న చిలిపితగాదాల అలకలలో ప్రకాశించే చిరునవ్వు సంగతేమిటి?

‘మర్రి పండువంటి నీ అందమైన పెదవి లోపల ఉన్న

మింగుళ్లలో నా గుటకలు ఉన్నాయి “అని వేంకటేశుడు అన్నదానికి జవాబు ఆ అలమేలుమంగ చిరునవ్వు.

(మర్రి పండువంటి నీ అందమైన పెదవి లోపల ఉన్నమింగుళ్లలో నా గుటకలు ఉన్నాయి మాత్రమే మా వేంకటేశుడు అన్నాడు. ఆ పాటి దానికి మీ అలమేలుమంగమ్మ అలుకతెచ్చుకొంది. నా పెదవిని మర్రి పండు అంటావా? నా మింగుళ్లు నీగుటకలా అని లేని పోని రోషం తెచ్చుకొని ఉత్తుత్తి కన్నీళ్లతో నానా హంగామా చేస్తోంది. కాని తాను చేసే అల్లరి నిజమైనది కాదనే విషయం వేంకటేశునికి తెలిసిపొయింది కనుక చిరునవ్వు చాటున అన్నింటిని కప్పిపుచ్చుతోంది)

03చ. జాగరూకతతో, చురుకుగా వేంకటేశ్వరుని కౌగిట్లో మా అలమేలుమంగమ్మ ఉన్నప్పుడు కమ్మగా వచ్చే సువాసనలలో కొన్ని కానుకలు లభిస్తున్నాయి. ఆ కానుకలేమిటి?

మన్మథుని ధనుస్సుకు ఉన్న కమ్మని బాణములనే పూలకి

గురిగా పెట్టుకొన్నప్పటికీ కొరుకుడు పడనివి ఆ కానుకలు

(మన్మథుని బాణాలకి ఏవైనా లొంగిపోవలసినదే. వాటికి కొరుకుడు పడనివి అంటూ ఏమీ ఉండవు. కాని వేంకటేశ్వరుని కౌగిట్లో అలమేలుమంగ ఉన్నప్పుడు – అ సువాసనలలో కొన్ని కానుకలు పుడుతున్నాయి. మన్మథుని బాణాలు వాటిని లొంగదీసుకోవాలని చూస్తున్నాయి. కాని అవి లొంగటంలేదు. ఇనుపగుగ్గిళ్లలా కొరుకుడు పడటంలేదు.మన్మథుని పూల బాణాల కంటె ఆ కానుకలు గొప్పవని భావం. ఇంతకీ ఆ కానుక లేమిటో అన్నమయ్య చెప్పడు.దంపతులకి అవేమిటో తెలుసు. చిన్నపిల్లలకి తెలియనక్కరలేదు.)

❖ ❖ ❖

“ విషయాన్ని కవిత్వం ఒక విలక్షణంగా చెబుతుంది.. కవిత్వంలో ఎప్పుడూ ఒక ముడి ఉంటుంది. ఆ ముడి విప్పదీస్తే కాని ఆనందం కలుగదు. లోకంలో ఏదైనా ఇంతే. మనసు చొప్పించి విచారణ చేసిన చోట అధిక సుఖం. మనసుతో ఆలోచించకపోతే సుఖమూ దుఃఖమూ రెండూ లేవు “ (ఈ మాటలు విశ్వనాథవి)

. అన్నమయ్య కవిత్వంలో మనసుతో విచారణ చేయవలసిన సందర్భాలు చాలా ఉంటాయి. ప్రసిద్ధమైన అన్నమయ్య కీర్తనలో “ఆ నాయిక కళ్ల చివర మరీ ఎర్రగా ఉందేమిటే?” అని ఒక చెలికత్తె ప్రశ్నిస్తుంది. “ప్రియుని శరీరంలో నాటుకొన్న నాయిక చూపులని ఎవరో బలవంతంగా లాగేసరికి ఆ చూపుల చివరలకి అంటుకొన్న రక్తపు రంగు కాదు కదా !” అని ఇంకొక నాయిక జవాబిస్తుంది.(ఏమొకోచిగురుటధరమున) ఇది భావ తీవ్రత. మనసుతో విచారణ చేయవలసిన సందర్భం. **‘నెయ్యములల్లో నేరెళ్లో’** కూడా అటువంటిదే.స్వస్తి.

07. ఆకాశపాకాశ

పల్లవి: ఆకాశపాకాశ మాయె గోమలినడుము
వైకుంఠపతిపొందు వడి c దెలుపుకొఅకు

చ.1: పరగ గెమ్మోవిపై పగలు చుక్కలు వొడిచె
పరివేషమ్ృగనాభి బరగె మోము
మరునిసమరమున గోమలి విభునితో జెనకు
సరసతల కిదియ సూచన చంద మాయె

చ.2: ఎలమి బొమ్మలజంకె లింద్రధనువులు వొడిచె
మొలచె గన్నులగావి మొయిలు ఘనమై
కొలది కగ్గలపుగుంకుమచెమట నెత్తురులు
పొలతిపై గురియుటకుబోటివలె నాయె

చ.3: అంగనకునెడమతొడ అదరి భూకంపంబు
సంగతి వహించె జంచలము లేక
ఇంగితంబుగ వేంకటేశు గూడినపొందు
కొంగుబంగారమై కోరికలు మీఱె (రేకు:0058-4 సంపుటం: 06-100)

పల్లవి: వేంకటేశుని పొందు యొక్క వేగము తెలుపుట కొరకు కోమలి నడుము ఆకాశపాకాశము (అల్లకల్లోలం) అయింది

చరణము1 : ఎర్రని పెదవిపై పగలు పూటే చుక్కలు మొలిచాయి. మొగము చుట్టూ గాలి గుడిలా కస్తూరి గుంద్రంగా అద్దుకొంది. ఇది రాబోయే మన్మథ సంగ్రామములో కోమలి భర్తతో చేసే గోటి నొక్కుల సరసాలకు సూచన.

చరణము 2 :కనుబొమ్మలలోని బెదిరింపులు ఇంద్రధనుస్సులను గెలిచాయి. కన్నులలో ఎర్రటి మేఘాలు గొప్పగా మొలిచాయి. అధికమయిన కుంకుమ చెమటల నెత్తురులు నాయికపై కురియటానికి వానకు మారుగా తయారయ్యాయి.

చరణము 3: నాయికకు ఎడమ తొడ అదిరింది.(శకున శాస్త్రం ప్రకారం శుభం) భూకంపపు జ్ఞానము చలించకుండా కలిగింది.వేంకటేశుని అభిప్రాయము ప్రకారము కలిగిన పొందు కొంగుబంగారమయింది (సులభ సాధ్యమైంది) .

అందుకే కోరికలు ఆమెకు మీరి పోయాయి.

పరమార్థం

అన్నమయ్య కీర్తనల్లో చాలా వరకు "వేంకటశైలవల్లభ రతిక్రీడా రహస్యంబులు" (సంకీర్తన లక్షణము 12 వ పద్యం)ఇంకోమాటలో చెప్పాలంటే స్వామి వారి శృంగార క్రీడలకు సంబంధించిన రహస్యాలను తెలియ చేసేవి. ఈ కీర్తన కూడా ఈ విభాగానికి చెందిందే.

"బ్రహ్మ దేవుడు సమస్త సౌందర్య కాంతి సమూహాన్ని(లావణ్య పుంజంబు) ఈ ద్రౌపదిగా నిర్మించాడేమో ! అందువల్లే ఈమె లాంటి కాంతి ఇతర స్త్రీలల్లో కనబడదు" అని గాంధారి దేవి కోడళ్లు -ద్రౌపది దేవిని చూసినప్పుడు అనుకొన్నారట. (నన్నయ సభా.ప. 02-160)

లావణ్యము అంటే అందమని అందరం అనుకొంటాం. లవణము యొక్క భావము లావణ్యము అన్నారు.విశ్వనాథ. రాతి ఉప్పు పగులగొడితే పలకలు పలకలుగా ఉంటుంది.సూర్య కిరణాలు దాని మీద పడినప్పుడు అది తళతళలాడుతుంది.కౌరవ స్త్రీల చూపులు ప్రసరించి ద్రౌపది శరీర కాంతి జిగేలుమని వెలిగిందని వారి వివరణ. విశ్వనాథ వివరణకు నోచుకొన్న లావణ్య శబ్దం అన్నమయ్య నాయికలకు కూడా వర్తిస్తుంది.

నాయిక కనుబొమ్మలలోని బెదిరింపులు ఇంద్రధనుస్సులను గెలిచాయి. వాటిని మించి పోయాయి అనే భావ చిత్రం లావణ్య సీమ అంటే తప్పేమి లేదు.బెదిరింపులు ఇంద్రధనుస్సులంత అందంగా ఉంటాయండీ ! అని ఎవరైనా ప్రశ్నిస్తే వాడి శృంగార రసవిహీన జీవితాన్ని చూసి జాలి పడవలసినదే. విశాలమైన కాటుక కళ్లతో నాయిక ఉత్తుత్తి బెదిరింపులు చేస్తుంటే , ఆ సమయంలో కదులుతున్న ఆమె కనుబొమలు అందమైన ఇంద్ర ధనుస్సులను మీరెంత అని తీసి పడేస్తాయి.

"నాయికకు భూకంపపు జ్ఞానము చలించకుండా కలిగింది" - చివరి చరణంలోని ఈ భావాన్ని ఎవరికి వారు ఆలోచనతో గ్రహించవలసినదే. ఆలోచనామృతానికి అందే భావాలు అన్నమయ్య చాలా చెబుతుంటాడు.

ఈ కీర్తనలోని పరమార్థం ఆనందం.స్వస్తి

08. ఆసోదము

అన్నమయ్య కీర్తనల్లో కొరుకుడు పడని పదాల్లో , "ఆసోదము" ఒకటి. ఆసోద కత్తె, ఆసోద కాడు, ఆసొదపు తనము, ఆసోదపుది– ఇలా రకరకాల ప్రయోగాలు ఆసోద పదం చుట్టూ రకరకాల కీర్తనల్లో కనబడతాయి.

ఆసోద శబ్దం ఆస్వాద పదమునుంచి పుట్టిందని కొందరు చెప్పారు. – కాదు– ఆచోద్య పదం నుంచి పుట్టిందని, అందుకని ఆసోదము అంటే రమణీయత అని మరికొందరు చెప్పారు. పెద్దలు వేటూరి ఆనంద మూర్తి గారు ఆసోద పదానికి వాంఛ, కోరిక అనే అర్థాలు చెప్పారు. రవ్వా శ్రీ హరిగారు కూడా ఈ అభిప్రాయంతో ఏకీ భవించారు.

మనం ఇప్పుడు ఆసోద ప్రయోగమున్న ఒక అన్నమయ్య కీర్తనని పలకరించి, పెద్దలు చెప్పిన ఆసోద పదార్థాన్ని దృఢ పరుచుకొందాం

పల్లవి:కానీవయ్యా దానికేమి కలది గలట్టయ్యా
ఆనుక నీకింకనెంత ఆసోదమో

చ.1: పొలతి నయమంటేను పూటలు నన్నడిగేవు
తెలిపిన రతియప్పు తిద్దగలనా
యెలమి నాకె వలపు యెరవు నాపైబెట్టేవు
చెలులకింకానెంతేసి సిగ్గువాట్లో

చ.2: వాడిక యింతికి గుదువగా నన్నుండు మనేవు
కూడి వావి విడిపించుకొనగవసమా
మాడలవలె సతుల మారిపిళ్ళాడేవు
తోడనిట్టేయందరిని దొడ్డిబెట్టేవో

చ.3: కొమ్మను గాగిట గూడి కొసరు నన్నడిగేవు
కమ్మర నేనూదగులు గావలెనా
దొమ్మి శ్రీ వెంకటేశుఉడ తోడబెండ్లాడేవు
మమ్మిద్దరి నిక్కడనే మండెమురాయడవై

(రేకు: 0177–3సంపుటం: 07–455)

అన్నమయ్య ఒక నాయికగా మారి వేంకటేశుడనే నాయకుని తన మాటలతో ఆడిస్తున్నాడు.

కానీవయ్యా ! నేను కూడా చూస్తాగా ! నా దగ్గర లేనిది, దాని దగ్గర మాత్రమే ఉన్నఅందాల గలగలలేమిటయ్యా !

తరువాత (ఆనుక) చూస్తా నీ వ్యవహారం. ఆ అమ్మడంటే నీకు ఎంత ప్రేమో! ఎంత కోరికో !(ఆసోదమో)

చ. 1: వేంకటేశా ! ఆ అమ్మడు లాభమేమిటి అంది కామోసు.

పూటలు నన్ను అడగటం ప్రారంభించావు. **(పూటలు=**ఆవిడగారు ఇవ్వవలసిన ప్రేమ అనే ద్రవ్యానికి పూచీకత్తు)

అయినా నువ్వు చెబితే మాత్రం ఆ రతి అప్పును నేను ఎలా తీరుస్తాను? మీ వ్యవహారం ఎలా దిద్దగలను? పూచీకత్తు ఎలా ఉంటాను?

నువ్వేమన్నా తక్కువ వాడివా స్వామీ ! నీకు తృప్తి కలిగేటట్లుగా నాకే వలపుని బాకీ పెడతావు. వలపు అప్పులు చేసేది నువ్వు. ఆ బాకీలు తీర్చే పని నా మీద పెడతావా? ఎంత గొప్పవాడివయ్యా స్వామీ !

ఎవరన్నా చెలికత్తెలు ఈ విషయాన్ని వింటే – తెలిస్తే ఎంత సిగ్గుచేటు!

చ. 2: పదిలపరచిపెట్టి అడిగినప్పుడు ఇమ్మని యేదేని యొక వస్తువును ఒకరివద్ద దాచుట “వాడిక” అంటారు . అవునా!? వేంకటేశా ! అవ్వా! నాదగ్గర నీకు నచ్చిన అమ్మడిని వాడిక పెట్టవలసింది పోయి, ఆమె దగ్గర నన్ను తాకట్టుగా ఉండమంటావా?

కలిసిపోయిన తర్వాత మా ఇద్దరి సంబంధాన్ని విడిపించుకోవటం నీ వల్లవుతుందా?

మాడల్లా (వరహాలో సగము, రెండు రూపాయలు)సతులను మార్చి బాధ పెడుతుంటావు(మారిపెళ్లాడేవు)

అందరి వెంట పడి ఇదే తరహాలో ఎందరిని దొడ్డిని తోలావో(పెరట్లోకి పంపించావో !ఎంతమందిని బయటికి పంపించావో అని భావం)

చ. 3: వేంకటేశా !ఇదెక్కడి గొడవయ్యా బాబూ ! ఆ అమ్మడిని కౌగిట్లో చేర్చావు. నీ ఇష్టం. కొసరు నన్ను అడుగుతావేమిటి?

(ఏదయినా ఒక వస్తువును తీసికొన్న తర్వాత దానికిచ్చెడు పెచ్చు కొసరు)

మళ్లీ నాతో కూడ సంబంధం కావాలా? అవ్వా !

అందరు కలియబడి చేసే యుద్ధాలలో సందడి చేసే వేంకటేశా !.ఆమెతో కలిసి నన్ను కూడా పెండ్లాడావు.

మహా ప్రభో !నువ్వు మండెము రాయడివి. మా ఇద్దరిని ఇక్కడనే పెండ్లి చేసుకొన్నావు.(కడప జిల్లా రాయ చోటి మండలంలోఉన్న చిన మండెం అనే ఊళ్ళో ఉన్న నరసింహ స్వామిని మండెము రాయడుఅంటారు)

❖ ❖ ❖

అన్నమయ్య పదాల్లో భక్తి అనే పాత్రలో శృంగారం అనే మధువు పొంగి పొర్లుతుంటుంది.

మురికి కాలువలోనూ నీరు ఉంటుంది.

గంగానదిలోనూ నీరు ఉంటుంది.

మొదటి దానిని తిరస్కరిస్తాం.

రెండవ దానిని పవిత్రంగా ఆస్వాదిస్తాం.

క్షుద్ర శృంగారానికి, అన్నమయ్య శృంగార కీర్తనలకి ఉన్న తేడా అది. స్వస్తి.

09. ఆడుబారీ

అన్నమయ్య లక్షణాలు పుణికి పుచ్చుకొన్న కుమారుడు పెద తిరుమలాచార్యులు.

కొత్త కొత్త పదాల సృష్టిలోను, నూతన పదాల ప్రయోగాలలోను అయ్యకు ఏమాత్రం తీసిపోడు.

ఒక కీర్తనలో "ఆడుబారీ "అని ప్రయోగించాడు

అన్నమయ్య వంశీకుల సాహిత్యంలో అర్థం కాని పదాలలో ఇది కూడా ఒకటి.

ఈ కీర్తనలో ప్రతి రెండు పంక్తులకొకసారి "పారి " అని పునరుక్తి చేసాడు పెదతిరుమలయ్య.

ఆ కీర్తన ఇది.

పల్లవి: ఓహోహో యనరో పారి
సాహసాన దిరుగరో జంటపారి

చ.1: కోనేటిరాయడు కోరి నిద్రించీ వాడే
ఆనకమై జాలీయరో ఆడు బారీ
పేనిపట్టి వాకిళ్ళ బీగముద్రలాయ నిడి
కానిమ్మని వాయించరో గంట పారి

చ.2: తిరుపణి మణగెను తిరుగరా దెవ్వరికి
మరల నెలుగియ్యరో మగపారి
పరగ దేవత లెల్ల బడకెళ మున్నారు
యిరవాయ సూర్యచంద్రు లెదురు పారి

చ.3: శ్రీ వేంకటేశ్వరుడు చిత్తగించీ లోననదె
కోవర మెన్నికెరో కోటిపారి
ఆవల బంగారుగుదియలు ఘుల్లు రనగా
తావుల హనుమంతునితలారి పారి (రేకు: 0021-02సం: 15-118)

పరమార్థం

తిరుమలలో స్వామి వారు నిద్రించే వేళ.

అందరిని కవి సంసిద్ధి పరుస్తున్నాడు.

ఆ రోజుల్లో తిరుమలలో రాత్రి పూట కాపలా కాసే వారు ఉండేవారు కాబోలు. రాత్రి పూట కాపలా కాసే వారిని ఉద్దేశించి పల్లవిని కవి మొదలుపెట్టాడు.

పల్లవి: తిరుమలలో రాత్రి పూట కాపలా తిరిగే ఘనులారా !

నిద్ర మత్తు వదలటానికి తడవ తడవకి ఓహోహోహో అనండి !

రెండు సార్లు ఓహోహోహో అంటూ – సాహసంతో ధైర్యంతో కాపలా కాస్తూ తిరగండి–

చ. 1: ఇప్పటి దాకా అందరికి దర్శన మిచ్చీ – అలసిపోయిన వేంకటేశ్వ రస్వామి కోరి నిద్రిస్తున్నాడు.

ముందు– ఈ కాపలా సమయంలో మీ శరీరాలకు అదే పనిగా తిరుగుతూ శ్రమ ఇవ్వండి. మీ విధి ముగిసిన తరువాత (ఆనక)విశ్రాంతి తీసుకొని మీ శరీరాలపై దయను కురిపించండి. (జాలీయరో) తడవతడవకు ఆటలతో (ఆడు బారీ) సంతోష పడండి. ప్రస్తుతం మాత్రం కోనేటి రాయని నిద్రకు భంగం రాకుండా కంటి మీద రెప్ప వాల్చకుండా కాపలా కాయండి.

స్వామి వారి దేవాలయానికి వాకిట వేసే ఆ కప్ప తాళాలు– అవేనయ్యా– ఆ పెద్ద తాళాలను ప్రయత్న పూర్వకంగా–(పూనిపట్టు) ఒకటికి రెండు సార్లు సరిగా చూచుకోండి.

అట్నుంచి ఇటు, ఇట్నుంచి అటు తిరిగే టప్పుడు తడవతడవకు తాళాలు చూసే పని –"కాని...కాని.."– అంటూ ఒకరికొకరు చెప్పుకొంటూ గంట వాయించండి.

చ. 2: భగవంతునికి జరిగే కైంకర్యం (తిరుపణి)పూర్తయింది. ఇక వేరే వాళ్లు ఎవరూ తిరగకూడదు.

అతనెవరో కొంచెం చిన్నగా పహరా కేక వేస్తున్నాడు. కొంచెం గట్టిగా – మగవాడన్నట్లుగా తడవతడవకి (మగపారి) పిలవమని చెప్పండి..

ఇదుగో ! కాపలా కాసేది మీరొక్కరే కాదు. అదృశ్య రూపంలో దేవతలందరూ కావలి ఉన్నారు. మరచిపోకండి

సూర్య చంద్రులు ఒకరి తర్వాత ఒకరిగా ఎదురెదురు దిక్కులలో ఉండి పగటి సమయంలోనూ, రాత్రి సమయంలోనూ కాపలా కాస్తున్నారు.

చ. 3: శ్రీ వేంకటేశ్వరుడు మనం చేసే ప్రతి అభ్యర్థనను సావధానముగా వింటాడు.

అధికమైన (కోవరము), ప్రసిద్ధమైన (ఎన్నికెరొ) పహారా పదాల చివరి అంచును ఒకరికొకరు బాగా వినబడేటట్లుగా

తడవతడవకి గట్టిగా అనండి.(కాపలా కాసేటప్పుడు ఒకరితో ఒకరు చెప్పుకొనే పదాల చివరి అక్షరాలను మింగేయకుండాగట్టిగా చెప్పండని భావం)

ఆవల బంగారుగుదియలు ఘల్లు రనగా (గుదియొనాలుగు మూరల నిడివిగల దండము)

మీరు పహారా తిరుగుతూ చెప్పే పదాలకు నేపథ్య సంగీతంలా – మీ చేతుల్లో ఉన్న – నాలుగు మూరల నిడివిగల బంగారు దండలు వంత పాడుతుంటాయి.

మీరొక సంగతి మరచిపోకండి. మీరు కాపలా కాస్తున్నఈ పవిత్ర దేవాలయ స్థలాలలో ఆంజనేయ స్వామి కూడా రాత్రులయందు దొంగతనముపోక కావలి కాచు దొరతనపు బంటు. మీకు తోడుగా ఆయన ఉన్నడని తడవతడవకి అనుకొంటూ కాపలా కాయండి.

ఏ ఒక్క చిన్న విషయాన్ని తమ తమ కీర్తనల్లో అన్నమయ్య వంశీకులు విడువలేదు. కాక పోతే వారు వాడిన కొన్ని పదాలు ఈ అధునిక కాలంలో అర్థం –పరమార్థం తెలియచేయక కొంత తికమక పెడుతుంటాయి

దీనికి ఒకటే పరిష్కారం

నిఘంటువులని తిరగవేయాలి.

పద సాహిత్యంపై అభిమానముండి, ప్రాచీన కావ్యాలు బాగా చదువుకొన్న పండితులను సంప్రదించాలి.

ఇలాంటి ప్రయోగం ఏ సందర్భంలో తాళ్ల పాక కవులు చేసారో–వారి మిగతా కీర్తనలలో ఒకటికి పది సార్లు ఓపికగా పోల్చి చూసి జాగ్రత్తగా పరిశీలించాలి.

అన్నింటి కంటె ముఖ్యం

తెలియని పదాల పరమార్థం తెలియటానికి వేంకటేశ్వర స్వామి వారి పాదాల కాంతిని మనస్సులో స్మరించుకోవాలి

తెలియని పదాల పై ఉన్న చీకట్లు తొలగిపోతాయి.పరమార్థం గోచరిస్తుంది.

నేను చేస్తున్నదదే. స్వస్తి.

10. ఆడికలు

పల్లవి : కమలాసన సౌభాగ్యము కలికితనంబులు సొబగులు
ప్రమదంబులునింతంతని పలుకంగ రాదు

చ1. మించిన చొక్కులు మీరిన యాసలు
పంచేంద్రియముల భాగ్యములు
యెంచిన తలపులు యెడపని వలపులు
పంచ బాణుని పరిణత(తు)లూ

చ2. కనుగవజలములు కమ్మని చెమటలు
అనయము జెలులకు నాడికలు
తనువున మరపులు తప్పని వెరపులు
వినుకలి కనుకలి వేడుకలు

చ3. మోవి మెరుంగులు ముద్దుల నగవులు
శ్రీ వేంకటపతి చిత్తములు
తావుల పూతలు దర్పకు వ్రాతలు
ఆ విభుగూడిన యలసములు (05-307)

పద్మంలో కూర్చుని ఉండే మా అమ్మ అలమేలు మంగమ్మ వైభవములు, ప్రౌఢతనములు ,చక్కదనములు,సంతోషాలు ఇంతింతని చెప్పటానికి వీలు కానివి. పరిమితి లేనివి.

1.మా తండ్రి వేంకటేశునితో ముద్దూ ముచ్చట్లు ఆడుతున్న సమయంలో ఆమె పరవశాలు హద్దుదాటి పోతాయి.ఎంత తీరిన ఇంకా ఏవేవో అపేక్షలు చెలరేగి పోతుంటాయి.తన పంచేంద్రియముల భాగ్యమే భాగ్యము. వాటికి ఎప్పుడూ తృప్తి పొందిన అవస్థలే. అనేకంగా ఇద్దరూ కలబోసుకొనే తలపుల్లో మరీ బాగున్న కొన్నింటిని ఎంచుకొంటూ, విడదీయని వలపులను పంచుకొంటూ, అయిదు బాణాలు కలిగిన మన్మథుడు ఇద్దరి మధ్యా అభివ ృద్ధిని పొందుతుంటే మా అమ్మ వైభవాలు ఎన్నని వర్ణించను !

2.మా అయ్య వేంకటేశుడు చేసిన చిలిపిచేష్టలను తలుచుకొని మా అమ్మ కళ్ల వెంట ఆనంద బాష్పాలు వస్తున్నాయి. అయ్య మళ్లీ రాబోతున్నాడనే తియ్యటి

భావన రావటంతోనే –ఏవేవో అనుభవాలు కలిగి –పద్మినీజాతి సౌగంధ్యం కలిగిన కలిగిన మా అమ్మ శరీరం నుండి కమ్మటి చెమటలు వస్తున్నాయి. వీటిని అర్థం చేసుకోలేని పెద్దలు–అలమేలు మంగమ్మని ఏదో అన్నారని– మా అమ్మ పక్కన ఉన్న చెలులకు ఎప్పుడూ నిందలు(ఆడికలు) వడ్డిస్తున్నారు. తన శరీరం నిండా పారవశ్యాలు. మా అయ్య వేంకటేశుడు రావటం కాసింత ఆలస్యమైతే చాలు– చిగురుటాకులా వణికిపోతూ తనకి లేనిపోని భయాలు.. ఒకరకంగా ఇవన్నీ చూడటానికి, వినటానికి ఆనందం కలిగించే విషయాలు.

3. మా అయ్య వేంకటేశుడు ఏ రస భరిత చేష్ట చేసాడో తెలియదు కాని– తన పెదవి నిండా తళతళా కాంతులు . ముద్దులు నింపుకొన్న నవ్వులు. 'చిత్తం వేంకటేశా! మీదయ ..అలాగే" అనే వినయాలు.

సుగంధ పరిమళాల పూతలు కొత్తగా మా అమ్మ ఒంటి మీదికి చేరాయి. ఆ మన్మథుడు నఖ క్షతాలతో ఏవేవో శృంగారపు రాతలు మా అమ్మ ఒంటి మీద వ్రాస్తున్నాడు. మా ప్రభువు వేంకటేశుని కలిసిన తర్వాత మా అమ్మకు తీరని అలసటలు.

పరమార్థము:

ఈ కీర్తన మూడు చరణాల్లో చివర వర్ణించిన క్రియా పదాల్లో మొదట పరిణతి ఉంది. తర్వాత వేడుక, ఆపిమ్మట అలసట ఉంది. ఆలోచించినకొద్దీ కవితాప్రియులకు ఇందులో ఆనందం కనబడుతుంది.

చాలామంది అన్నమయ్య ఆధ్యాత్మిక కీర్తనలను మనసారా పాడుకొని. ఆనందానుభూతిని పొందుతారు. శృంగార కీర్తనలను పాడటానికి, చదవటానికి, నలుగురిలో ప్రస్తావించటానికి ఇబ్బంది పడే జాతి ఒకటి ఈ మధ్య బయలుదేరింది. వారందరూ ఒక విషయాన్ని గుర్తించాలి. ఈ రకమైన శృంగార వర్ణనలు చేయటంలో అన్నమయ్య ఒకడే కాదు. వాల్మీకి, వ్యాసుడు కూడా ఉన్నారు. వారు ఎంత గొప్పగా భక్తిని రాసారో, అంత గొప్పగా శృంగారము,తదవయవ వర్ణన చేసారు.

ఉదాహరణకి పరమ పవిత్రమైన వాల్మీకి రామాయణంలో సీతమ్మతనను తాను ఇలా వర్ణించుకొంటోంది:

'నా నేత్రాలు, పాదాలు, చీలమండలు, ఊరువులు అన్నీ సమప్రమాణములో పుష్టిగా ఉన్నాయి.నా స్తనాలు సుందరాలు. చనుమొనలు గంభీరాలు. నా నాభి

లోతు.. (రామాయణము- యుద్ధ కాండ(09-12 శ్లోకాలు)

నెత్తి మీద రామాయణాన్ని మోసే మనమెవరమూ కూడా , ఇటువంటి వర్ణనలు ఉన్నాయని రామాయణాన్ని పక్కన పెట్టలేదు. నిత్యము పారాయణ గ్రంధంగా గౌరవిస్తున్నాము.

వ్యాస భగవానుడు దేవీభాగవతంలో రెండవ అధ్యాయంలో ఇలా వ్రాసాడు:

'కృష్ణుడు తన సంకల్ప మాత్రంతో రెండుగా మారాడు. ఎడమ భాగంలో స్త్రీ, దక్షిణ భాగంలో పురుషుడు ఉద్భవించాడు. అమె శరీరపు కాంతి విప్పారిన పద్మంలా ఉంది. ఆమె తొడలు చంద్ర బింబం కంటె అందంగా ఉన్నాయి. ఆమె పిరుదులు అరటి బోదెల్లా ఉన్నాయి. ఆమె స్తనాలు మారేడు పండ్లలా ఉన్నాయి.'

ఇలాంటి శృంగారపు వర్ణన ఉన్నంత మాత్రాన ఆ వర్ణనలు చదవటం మానేసి, మిగతా దేవీభాగవతాన్ని మాత్రమే భక్తులమైన మనము చదువుతున్నామా? కాదు. 'కృష్ణుడు తన సంకల్ప మాత్రంతో రెండుగా మారాడు 'అను వాక్యంలోని లోతును తెలుసుకొని మనం చదివేటప్పుడు వికారాలకు గురి కావటం లేదు. ఆధ్యాత్మిక ఫలితాలు పొందుతున్నాం.

ఉన్నది ఒకడే. అతడే పురుషుడు. మిగతావాళ్లంతా స్త్రీలు.. అని ఒక సిద్ధాంతం. ఈ సిద్ధాంతపు పునాది మీద లేచినవే అన్నమయ్య శృంగార కీర్తనలు. అన్నమయ్య శృంగార కీర్తన చదివిన ప్రతిసారి ఈ విషయాన్ని తలుచుకొంటుంటే ఇదమిత్థమని చెప్పలేని తీపితో కలిసిన భక్తి భావనకు గురవుతాం. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు వేంకటేశుడు. అతనికోసం అన్నమయ్య నాయిక అయ్యాడు. నాయికలుగా మారాడు. పోట్లాడాడు. అలిగాడు. పంతాలాడాడు. ఏది చేసినా ఒకటే లక్ష్యం. స్వామిలో లీనం కావటం. అదే మోక్షం. దానికి అన్నమయ్య శృంగారపు భావాల తొడుగు తొడిగాడు. .

దేవీ భాగవతాన్ని , రామాయణాన్ని ఎంత భక్తి ప్రపత్తులతో చదువుతామో, అన్నమయ్య భక్తి కీర్తనలతో పాటు ఆయన మధుర భక్తి కలిగిన శృంగార కీర్తనలు కూడా చదవాలి. అన్నమయ్య శృంగారపు స్థాయికి చేరకపోయినా సరే కాని- ఆయన స్థాయిని అవమానించటం- తిరుపతి వెంకన్న మూల విరాట్టు ముందు నిలబడి, నమస్కారం చేయకుండా పక్కకి వెళ్లినంత మహా పాపం. స్వస్తి.

11. ఆముకొన్న

పల్లవి: కోరినకోరికెలెల్లా కొమ్మయందే కలిగీని
చేరి కామయజ్ఞ మిట్టే సేయవయ్యా నీవు

చ 1: సుదతి మోవి తేనెలు సోమపానము నీకు
పొదుపైన తమ్ములము పురోడాశము
మదన పరిభాషలు మంచి వేదమంత్రములు
అదె కామయజ్ఞము సేయవయ్యా నీవు

చ 2: కలికి పయ్యద నీకు కప్పిన కృష్ణాజినము
నలువైన గుబ్బలు కనక పాత్రలు
కలసేటి సరసాలు కర్మ తంత్ర విభవాలు
చెలగి కామయజ్ఞము సేయవయ్యా నీవు

చ 3: కామిని కాగిలి నీకు ఘనమైన యాగశాల
ఆముకొన్న చెమటలే యవబృథము
యీమేరనే శ్రీవేంకటేశ నన్ను నేలితి
చేముంచి కామయజ్ఞము సేయవయ్యా నీవు

(రేకు: 1946-6సం: 29-216)

స్వామివారితో శృంగార కార్య క్రమానికి సిద్ధపడిన ఒక నాయికామణి,"స్వామీ! నీకు అలవాటైన ఈ కామయజ్ఞం నాతో చేయవయ్యా!" అంటూ ,శృంగార కార్య క్రమంలో జరిగే పరమార్థం నిజమ్మెన యజ్ఞంలోని వాటితో పోల్చిచెబుతోంది.

పల్లవి: స్వామీ! ఏదో సిద్ధించాలని,నెరవేరాలని ఆ యజ్ఞం చేస్తారు కదా! ఈ కామ యజ్ఞం చేయటం వలన నువ్వుకోరుకొనే కోరికలన్నీ ఈ కొమ్మలో నీకు కలుగుతాయి.

చరణం1: స్వామీ! ఆ యజ్ఞంలో సోమలతను(ఒక తీగ) పిండి రసాన్ని తాగే కార్యక్రమం సోమపానం అంటారు కదా!

సోమపానం చేసిన వాడే సోమయాజి.అవునా! మరి- మనఈ శృంగార యజ్ఞంలో అందమైన పలువరుస కలిగిన ఈసుదతి తీపి పెదవి సోమలత లాంటిది.పెదవి పిండి నువ్వుకూడా సోమయాజి కా!('పిండి' మాత్రం చేయకు

నాయనా!అన్యాయమైపోతాను)

ఆ యజ్ఞంలో వాడటానికి తయారు చేసిన హోమ ద్రవ్యం పురోడాశం. (నేయి ,అన్నము మొదల్కెనవి) అదియజ్ఞంలో హవిస్సుగా (అగ్నిలో వేసేది)వాడతారు కదా! మన ఇద్దరిలో కోరికలను పెంచే తాంబూలం మన శృంగారయజ్ఞంలో పురోడాశం.మంత్ర సహితంగా ఆ పురోడాశాన్ని అగ్నిలో వేస్తుంటారు.

మన శృంగార యజ్ఞంలో కూడాకాలిపోతున్న శరీరాల యజ్ఞ గుండాల్లో తాంబూలపు తుంపరలు అప్పుడప్పుడు కార్యక్రమం మధ్యలో ఇద్దరికీతగులుతూ – కోర్కెల సెగ రేపుతూ చురచుర మంటుంటాయి కదా! అందుకే తాంబూలం పురోడాశం వంటిది.

స్వామీ!ఆ యజ్ఞంలో పవిత్రమ్మెన వేద మంత్రాల ఘోష వినిపిస్తుంటుంది.

మన శృంగార యజ్ఞంలో ఆనందంలో పరస్పరం మన్మథ సహితంగా మాట్లాడుకొనే మాటలు,ధ్వనులు,అందంగా అనిపించే పరస్పర నిందావచనాలు– ఇవన్నీవేదమంత్రాల్లా వినిపిస్తుంటాయి.ఇక శృంగార యజ్ఞం మొదలుపెట్టు . నీదే ఆలస్యం.

చరణం2: ఆ యజ్ఞంలో యజ్ఞం చేసేవారు పవిత్రమైన నల్లజింక తోలును (కృష్ణాజినం) ధరిస్తారు. మన శృంగార యజ్ఞంలోనా పైట నీకు కృష్ణాజినం. ధరించటానికి ఇంకా ఆలస్యమేమిటి బాబూ!యాగ శాలలో పూర్ణ కుంభాలు ఉంచటం పరిపాటి కదా! మనశృంగార యాగ శాలలో కూడా నా స్తనాలనే పూర్ణ కుంభాలు నీ యాగానికి సిద్ధంగా ఉన్నాయి.

ఆ యజ్ఞంలో ఆ యజ్ఞకర్మను విస్తరించే వైభోగాలు చాలా ఉంటాయి కదా!మన శృంగార యజ్ఞంలో మన సరసాలు మన యాగాన్ని విస్తరించే వైభోగాలు. ఇక ప్రకాశిస్తూ శృంగార యజ్ఞం మొదలుపెట్టు .

చరణం3 : స్వామీ ! ఒక యాగ శాల ఏర్పాటు చేయాలంటే ముందుగా ఎన్నెన్నో, ఆహ్వానాలు, బంధనాలు,తోరణాలు – ఇలాంటివి ఎన్నెన్నో సిద్ధం చేస్తారు. నిన్ను కోరిన ఈ కామిని కౌగిలి నీకు యాగ శాల. ఈ యాగశాలలో కూడా ఆ యాగానికి ముందుగా చేసే ఏర్పాట్ల వంటివి చేయి.

అయ్యా! నీకు అవబృథమంటే తెలుసు కదా!1.యజ్ఞము చివరలో ఎక్కువ తక్కువ దోషాలు పోవుటకు చేయుపని2.యజ్ఞము చివరలో చేసే స్నానము

3.యజ్ఞము చివర్లో యజ్ఞము చేసేవాడు ,యజ్ఞంలో వాడిన పరికరాలు స్నానమువల్ల శుద్ధి పొందుట ఇవన్నీ అవబృథమే. మన శృంగార యజ్ఞం పూర్తయిన తర్వాత వ్యాపించిన (ఆముకొన్న) మన చెమట్లతో అవబృథం చేద్దాం

స్వామీ! మనకు మనమే సృష్టించుకున్న హద్దులలో ఇదివరకు భోగానుభవిస్తూ నన్ను ఎలా పరిపాలించావో– ఇప్పుడుకూడా అలాగే పరిపాలించు. ఇక వేరే ఆలోచన–ఇంకో పని వద్దు. పూర్తిగా ఈ శృంగార యజ్ఞంలో తలమున్కలయి,చక్కగా పని పూర్తి చేద్దాం .

విశేషాంశాలు

తాంబూల సేవనంలో ఎంగిలి సాన్నిహిత్యాన్ని పెంచుతుంది."ఎంత మీదు కట్టెనో .. "అనే కీర్తనలో **"సగమాకునీకియ్యక/చేరి వేరె తమ్ములము చేయదు చెలి"** అనే పంక్తిలో సగమాకు ఎంగిలి పెట్టించిన అన్నమయ్య ఇందులో తమ్ములాన్ని పురోడాశముతో పోల్చాడు.

తాంబూలము వేయని నోరును సుమతీశతకకర్త నిరసించాడు".తాంబూలంకామ గుణ వర్ధకం"అంటారు పెద్దలు. అందుకే తాంబూలాన్ని వివాహం కానివారికి నిషేధించారు. వివాహమైన దంపతులమధ్యతాంబూల సేవనం ఎన్నెన్నో బిడియాల నిషేధాలను తొలగిస్తుంది. అన్నమయ్య చెప్పినట్లు పురోగమనం కలిగించే పురోడాశం అది.

'నలువైన రుచులే నైవేద్యమట'అని ఇంకో కీర్తనలో చెప్పిన అన్నమయ్య ఆ 'నలువైన' పదాన్ని ఈ కీర్తనలోరుచులూరించే యవ్వన శిఖరాలకు విశేషణంగా వాడాడు.

చేముంచి అంటే" ప్రమాణము చేసి "అని అర్థం.ఈ కీర్తనలో 'కామ యజ్ఞాన్ని చేముంచిచేయవయ్యా! 'అనటంలో కవిగారి చమత్కారం, వ్యంగ్యం ఊహించుకొంటే పసందుగాఉంటుంది.

ఆముకొన్న కన్నె వెన్నెలలు అని ఘటికా చల మాహాత్మ్యములో తెనాలి రామకృష్ణుడు అంటే మన అన్నమయ్య ఆముకొన్న (వ్యాపించిన)చెమటలు అన్నాడు.బహుపరాక్!

"చిన్నప్పుడు ,రతికేళికనున్నప్పుడు" 'రా'అనే చనువు పదాలను పలికితే అవి నిందలు కావన్నాడు కవి చౌడప్ప

ఈ కామ యజ్ఞపు కీర్తనలోఅన్నమయ్య ఆమదన పరిభాషలను (నిందావచనములు) వేద మంత్రాలతో పోల్చాడు.

స్త్రీకి –కొమ్మ అనే పదాన్ని పర్యాయ పదంగా కల్పించిన తెలుగు వాడు ఖచ్చితంగా మనస్సును ఒక ఊపుఊపిన రసికుడు అయిఉంటాడు. సందేహం లేదు."దేవతల పాలి సురశాఖి పూవుకొమ్మ/ కోమలార్థేందుధరు కొమ్మ

గోగులమ్మ"అని శ్రీ నాథుడు భీమ ఖండంలో దేవతలకు కల్ప వృక్షపు పూలకొమ్మగా,శివుడికి భార్యగా పార్వతిని వర్ణించే సందర్భంలో కొమ్మ శబ్దాన్ని ప్రయోగించాడు." **వయసు కోతివంటిది. మనసు కొమ్మవంటిది. ఊపేసి పోతుందిమొదటిది.ఆ ఊపు మరవనంటుంది రెండవది"** అని ఆత్రేయ గారు అన్నారు.

స్త్రీ అనేఅర్థం వచ్చే పర్యాయపదాలు చాలాఉన్నాయి.ఈ కామ యజ్ఞపు కీర్తనలో అన్నమయ్య కావాలనే కొమ్మ అనే పదాన్ని– స్త్రీ అనే అర్థంలో–మన మనస్సులు ఊపటానికి ప్రయోగించి ఉంటాడు. అనుమానంలేదు.శుభం భూయాత్!

12. ఇట్టి దీముభోగములు

కాస్తో కూస్తో సంస్కృతం తెలిసిన వానికి "మృగ తృష్ణ" అంటే ఏమిటో తెలుసు. మృగాణాం తృష్ణా అస్యామితి మృగ తృష్ణా – మృగాలకు దేనియందు ఆశ ఉంటుందో దానిని మృగతృష్ణ అంటారు. తెలుగులో ఎండమావి అని ప్రసిద్ధి.

అన్నమయ్య మృగతృష్ణకి తెలుగులో "**ఇట్టి దీము**" అని పేరు పెట్టాడు.మృగానికి **ఇ ట్టి**అని పేరు ఉంది . కనుక మృగతృష్ణ ని కవి "**ఇట్టి దీము**" అన్నాడు. మనం అనుభవిస్తున్న భోగాలు "**ఇట్టి దీము**" భోగాలు అన్నాడు. ఆ కథా కమామిషు చూద్దాం.

పల్లవి: వెట్టి దెలిసి రోకలి వెస జుట్టుకొన్నట్టు
యిట్టి దీముభోగముల నెనసేము

చ.1: మురికిదేహము మోచి మూలల సిగ్గుపడక
పొరి బరిమళములు పూసేము
పరగ పునుకతల పావనము సేసేమంటా
నిరతితోడ దినము నీట ముంచేము

చ.2: పుక్కట పంచేంద్రియపు పుట్టు వుట్టి యందరిలో
మొక్కించుక దొరలమై మురిసేము
అక్కర నజ్ఞానమనే అంధకారమున నుండి
దిక్కుల నెదిరివారి దెలిపేము

చ.3: దినసంసారమే మాకు దేవుడని కొలుచుక
వెనుకొని ఘనము క్తి వెదకేము
యెనలేక శ్రీవేంకటేశ మమ్ముఉగావగాను
తనిసి తొల్లిటిపాటు దలచేము (రేకు: 0231-01సం:03-174)

ఒకతనికి **వెట్టి** (పిచ్చి) బాగా వచ్చింది.నాకు **వెట్టి** తగ్గి పోయిందని అతగాడు చెబుతూ – రోకలిని తలకు చుట్టమన్నాట్ట.

అంటే వాడి **వెట్టి** మాత్రం తగ్గలేదని అందరికి స్పష్టమవుతుంది. **వెట్టి** తగ్గితే రోకలిని తలకి చుట్టమనడు.

ఆ రకంగానే ఓ వేంకటేశా ! మేము కూడా ఈలోకంలో ఎండమావుల్లాంటి భోగాలకోసం తెగ తాపత్రయపడతాం.

ఎండమావుల్లో నీరు కనబడుతుంది.కాని భ్రాంతి. అలాగే మా భోగాల్లో సుఖ భ్రాంతి కనబడుతుంది.

ప్రతి భోగం ఈ శరీరానికి కొంతకాలానికి దుఃఖ కారకమే.

కనుసైగ చేస్తే చాలు పదులకొద్దీ సేవకులుండే భోగము.

కాని శరీరాన్ని కదల్చ కుండా అలానే కూర్చుని సేవలందుకొంటుంటే... ఊబకాయం, రక్తప్రసరణ సమస్యలు... ఇలా ఎన్నో..

ఈ రకంగా ప్రతి భోగం కూడా రాను రానూ దుఃఖాంతమే కాబట్టి భోగాన్ని ఎండమావితో అన్నమయ్య పోల్చాడు.

చ.1: వేంకటేశా ! ఈ మురికి శరీరాన్ని మోస్తూ,అసహ్యించుకోకుండా శరీరపు మూలలలో -

బాగా సువాసనలు, సుగంధ ద్రవ్యాలు దట్టిస్తాం.

ఈ తలపుఱ్ఱెను-(కపాలాన్ని)బాగా అలంకారం చేస్తాం.

ఎంతో ఆసక్తితో ప్రతిరోజూ నీటిలో ముంచుతుంటాము.

(ఠపీమని పేలిపోయే - ఈ కపాలానికి తలంటి పోసి, సుగంధపు నూనెల మర్దనలు చేసి చక్కగా అలంకారాలు చేస్తామని కవి భావం)

చ.2: కన్ను, ముక్కు, చెవి మొదలైన అయిదు ఇంద్రియాలశక్తిని వ్యర్థం చేసుకొంటున్న

జన్మ పొందాము.

ఇతరులచేత దండాలు పెట్టించుకొని మేము పెద్దదొరలమని మురిసిపోతుంటాం..

కోరికలతో అజ్ఞానమనే చీకటిలో ఉండి

దిక్కుల విషయాలలో- (ఏది మంచి, చెడు అనే విషయాలలో) శత్రువులకు పెద్ద తెలిసినవాళ్లలా చెబుతుంటాం..

1.కన్ను 2.ముక్కు 3.చెవి 4. నాలుక 5.చర్మము అను పంచేంద్రియాలకు వరుసగా 1.చూపు 2.వాసన 3.శబ్దము4.రుచి 5.స్పర్శ అను కనిపించని తన్మాత్రలు ఉన్నాయి. తన్మాత్రలు అంటే ఇంద్రియాలకు ఉండే శక్తులు. స్వామివారిని కళ్లతో చూసి ఆనందించాలి.చర్మానికి స్పర్శను ఇచ్చినందుకు కృతజ్ఞతగా చల్లటి

చందనాన్ని స్వామికి పూయాలి. చెవులతో లోకంలో ఎన్నో విని మురిసి పోతున్నాం. దీనికి కృతజ్ఞతగా స్వామివారికి పువ్వులతో సేవ చేయాలి.అయిదు ఇంద్రియాలలో నుంచి ఎన్నో సుఖాలు మనం పొందుతున్నాం. అయితే ఈ అయిదు ఇంద్రియాల ద్వారా వేంకటేశునిసేవిస్తేజన్మ చరితార్థమని కవిభావన. అలా చేయకుండా కేవలం భౌతిక సుఖాలకోసమే ఇంద్రియాలను వాడుకొంటున్నామని అన్నమయ్య ఆవేదన.

మనకే అంతా తెలుసుననే గర్వం.అజ్ఞానం. అందుకే మనకు నచ్చని విషయాలలో మన శత్రువులు ఇలా చేసారేమిటని విమర్శలు చేస్తుంటాం. ఈ విషయంలో ఇలా చేసి ఉంటే బాగుండేది కదా ! అని శత్రువులు చేసేవన్నీ తప్పులుగా లెక్కపెడతామని కవి భావన.

చ. 3: వేంకటేశ్వరా ! ప్రతిరోజూ చేసే సంసారములోనే నువ్వు దేవుడని కొలిచి ముక్తిని పొందకుండా గొప్ప ముక్తి ఎక్కడో ఉన్నదని వెతుకుతుంటాం.

వేంకటేశా ! సాటిలేని విధంగా నువ్వు మమ్మలిని రక్షిస్తుంటే
పూర్వ జన్మ పాపాలను తలుస్తుంటాం.

ముక్తి ఎక్కడో లేదు. భౌతిక ఆకర్షణలపై మోహము విడిచి(01-263) స్వామి వారి నామ స్మరణ మనసారా చేస్తే ముక్తి లభిస్తుందని, ముక్తి ఈ విషయం మరిచిపోయి ముక్తి కొరకు ప్రయత్నించటం వ్యర్థమని కవి ప్రబోధం. వేంకటేశుని రూపాన్ని భక్తితో చూస్తే ముక్తి లభిస్తుందని అన్నమయ్య కంఠోక్తి. (సం:01-075), ఏదన్నా కష్టం వస్తే – నా కర్మ అని –పూర్వ జన్మలో చేసుకొన్న పాపమని బాధ పడుతుంటాం. స్వామి అనేక విషయాలలో రక్షించిన విషయం మరిచి పోతాం. ఏ కష్టం వచ్చినా స్వామీ ! నీదే భారమని ఆయనకు శరణు పొందాలని భావం. స్వస్తి.

13. ఈకడ నాకడ

పల్లవి : నీకే నే శరణు నీవు నన్ను కరుణించు
యీకడ నా కడ దిక్కు ఎవ్వరున్నారికను

చ1. కన్నుల జంద్ర సూర్యులు గల వేలుపవునీవు
పన్నిన లక్ష్మి భూమి పతివి నీవు
అన్నిటా బ్రహ్మకు దండ్రి అయిన ఆదివేలుపవు
యెన్నగ నీకంటే ఘన మెవ్వరున్నారికను

చ2. దేవతలందరు నీ తిరుమేనయిన మూర్తి
ఆవల బాదాన లోకమణచితివి
నీవొక్కడవే నిలిచిన దేవుడవు
యే వేళ నీకంటే నెక్కుడెవ్వరున్నారికను

చ3. అరసి జీవులకెల్ల నంతరాత్మవైన హరి
సిరుల వరములిచ్చే శ్రీవేంకటేశ
పురుషోత్తముడవు భువన రక్షకుడవు
యిరవైన నీవే కాక ఎవ్వరున్నారికను (04-194)

తాత్పర్యము : వేంకటేశ్వరా! నీకే నా నమస్కారము. నువ్వు నన్ను దయతో చూడు. ఇక్కడా,(ఈ లోకంలో), అక్కడ (ఆలోకంలో)నువ్వు తప్పించి ఇంకొక దిక్కు నాకు లేదు.

01.చంద్రుడు, సూర్యుడు రెండు కన్నులుగా కలిగిన దేవుడవు నీవు. శరణన్నవారిని రక్షించుటకు సిద్ధమైన లక్ష్మీ నాథుడవు. భూ నాథుడవు. సమస్త దేవతలలోను బ్రహ్మకు తండ్రివైన మొదటి దేవతవు నీవు. దేవతలందరిలోను లెక్కించగ నీకంటే గొప్పవారెవరు లేరు.

02. నీ శుభమయిన శరీరములో దేవతలందరూ ఉన్నారు. నీ పాదముతో బలిని అణచావు. భక్తులకోసం నిలబడిన దేవుడవు నీవు ఒక్కడివే. ఏ యుగంలో అయినా, ఏ సమయంలో అయినా నీకంటే ఎవరు ఎక్కువ ఉన్నారు. ? (ఎవరూ లేరని భావం)

03. పరిశీలించగా ఈ జీవులందరి అంతరాత్మలలో ఉన్న దేవుడివి నువ్వే.(మనస్సు యుక్తా యుక్తాలను, ధర్మాధర్మాలను ఆలోచన చేసేటప్పుడు మనిషిని మంచి వైపు మరల్చే అంతరింద్రియం అంతరాత్మ) చక్కటి వరములిచ్చే వేంకటేశు డివి నువ్వే. విషు? మూర్తివి నువ్వే. ఈ లోకాలను రక్షించే వాడివి నువ్వే. స్థిరమైన వాడివి నువ్వే. ఇంక ఎవ్వరూ లేరు.

పరమార్థం

నీకే నే శరణు

"మర్తే మర్తే జగ్ మరా, మర్నా నజానేకొయి, ఐసా మర్నా కొయి నమరా జో ఫిర్ నామర్నా హొయ్"(ఈలోకంలో ప్రతిరోజూ ప్రజలు చనిపోతూనే ఉన్నారు. కాని చావురాకుండా ఉండేలా చనిపోయినవాళ్ళు ఎవరూ లేరు.) అన్నారు కబీర్. చావురాకుండా ఉండేలా చనిపోవటం అంటే జన్మమృత్యుచక్రం నుండి బయటకు వచ్చి, ఆ పరబ్రహ్మంలో కలవటం. ఈ మోక్షం కోసం శరణు కోరాలని అన్నమయ్య **"నీకే నేశరణు నీవు నన్ను కరుణించు యీకడ నా కడదిక్కు ఎవ్వరున్నారికను"** అన్నారు.

యీకడ నా కడ దిక్కు ఎవ్వరున్నారికను

'నువ్వు తప్పించి నాకు ఇంకొక దిక్కు లేదు' అని కాళ్ళావేళ్ళా పడడాన్ని 'అనన్య శరణాగతి 'అంటారు. దేవుని అలా ఆశ్రయించాలని వైష్ణవ మతం చెబుతోంది. అన్నమయ్య అందుకే "యీకడ నా కడ దిక్కు ఎవ్వరున్నారికను" అన్నారు.

ఆవల బాదాన లోకమణచితివి

ఒక పాదంతో భూమిని, రెండవ పాదంతో స్వర్గ లోకాన్ని వామనుడు ఆక్రమించాడు. దేవతలు బలిని బంధించారు. వామనుడు నవ్వి – 'బలీ! మూడవ అడుగు ఎక్కడ పెట్టమంటావు?' అని ప్రశ్నించాడు .

"జీవితంలో ఏనాడూ అబద్ధం చెప్పటం తెలియదు. నీ మూడవ పాదం నా తల మీద వుంచు. చుట్టాలు దొంగలు సుతులు ఋణస్థులు ఈ కాంతలు సంసార కారణములు ఈ ధనము లస్థిరములు" అని బలి చెప్పాడు. బలి చక్రవర్తి భార్య వింద్యావళి "పతి భిక్షాం మమదేహి" అనే వేడింది.

"నాదయ భక్తుని మీద ఉన్నదంటే ముందు వాడి సంపదలు పోతాయి. వాడి మనసు నా మీద ఏకాగ్రంగా ఉంటుంది.. ఈ బలిని అనుగ్రహిస్తున్నాను. సావర్మి

మనువు కాలంలో ఇతను ఇంద్రపదవిని అందుకుంటాడు.అప్పటివరకు ఆకలి దప్పులులేని పాతాళ లోకంలో నన్ను ధ్యానిస్తూ ఉంటా"డని వామనమూర్తి అన్నాడు.

పోతనగారి భాగవతంలో వామనుడు మూడవ అడుగు కోసం బలి తలమీద పాదం మోపినట్లు లేదు. బలిచక్రవర్తిని, ప్రహ్లాదుడు వెంటబెట్టుకొని సుతల లోకానికి తీసుకువెళ్లాడని మాత్రమే ఉంది. (భాగవతం 08-677వచనం)అయితే స్పష్టత కోసం, లోకంలో అనుకొనే మాటలను అన్నమయ్య తనపాదంలో 'పాదాన అణచితివి' పేర్కొన్నాడు.

ఈ వామనావతార పాద వృత్తాంతానికి సంబంధించి ఒక అందమైన కల్పన తిరుప్పావై (24 పాశురం)లో ఉంది.భూమిని, ఆకాశాన్ని కొలిచేటప్పుడు స్వామి పాదం ఎర్రగా కందిపోయిందట. అందుకని బాధపడుతూ ఆపాదానికి భక్తురాలు తిరుప్పావైలో శుభాలు పాడింది. అభిమానించేవారిపట్ల ఆందోళన సహజం. ఆప్రేమలో ఎంత కష్ట పడ్డారో అని బెంగ వస్తుంది. అదే ఈ తిరుప్పావై.

నీవొక్కడవే నిలిచిన దేవుడవు

పుండరీకుడు అనే భక్తుని కోరిక మేరకు శ్రీ కృష్ణుడు ఒక రాయి మీద కూర్చొనకుండా నిలబడ్డాడు. విత్ అంటే రాయి. రాతి మీద నిలబడటం వలన శ్రీ కృష్ణుడు విఠలుడు అయ్యాడు.అన్నమయ్య చెప్పిన నిలబడిన దేవుడు ఈ విఠలుడు కావచ్చు. ఎందుకంటే **'వసుధజూడ బిన్నవానివలె నున్నవాడువెస నన్నివిద్యలాను వెలసె విటలుడు'**(2-217)అనే కీర్తనలో **'గట్టిగా బుండరీకుడు కడువేడుకం బెట్టినయిట్టిక పీటపై నున్నాడీ విఠలుడు'** అని అన్నమయ్య వర్ణన. ఇంకా రెండు మూడు చోట్ల అన్నమయ్య విఠలునికి, వేంకటేశునికి అభేదం చెబుతూ పాడుకొన్నాడు. (04-468, 20-449) నిలబడిన దేవుడు వేంకటేశునితో పాటు విఠలుడు కూడా.

పన్నిన లక్ష్మి భూమి పతి వి నీవు

లక్ష్మీ దేవి , భూదేవి అని రెండు రూపాలలో మనం పూజిస్తున్నాం. నిజానికి అమ్మవారు ఒక్కరే. అమ్మవారు మూడు స్థానాల్లో లయార్చ, భోగార్చ మరియూ ఆధికారార్చ అనే రూపాల్లో దర్శనమిస్తుందని పెద్దలు చెబుతారు. లయార్చ అంటే భగవంతుని యొక్క వక్షస్థలంపై ఉన్న రూపం. భోగార్చ అంటే భగవంతునికి ప్రక్కగా ఉండే రూపం. ఒంటరిగా భగవంతుడు ప్రక్కన లేని రూపంలో దర్శనమిచ్చే

రూపం అధికారార్చ.

మన మానవ సంబంధాలు దేవునికి అంటగడితే కొన్ని ప్రశ్నలకు జవాబులు తెగవు. ఉదాహరణకి శ్రీ వేంకటేశ్వర సుప్రభాతంలో వేంకటేశుడు భూదేవి పుత్రి సీతకు భర్తగా చెబుతారు. అదే సుప్రభాతంలో భూదేవి భర్తగా చెబుతారు. రెండింటికి సమన్వయం కష్టం. నారాయణుడు భూదేవికి భర్త. శ్రీ రాముడు సీతకు భర్త. మన వావి వరుసలు సర్వము తానైన భగవంతునికి అంటకట్టకూడదు.

ఒకటికి రెండుసార్లు లేదా వేయిసార్లు దేవుని పొగడటం మనకు అలవాటు. లేకపోతే మనకు తృప్తి ఉండదు. అందుకే దేవుని ఇద్దరు భార్యలతో కలిపి పూజిస్తున్నాం. తత్వం ఒకటే అనే జ్ఞానం వచ్చేంతవరకు వేంకటేశుని ఇద్దరు భార్యలతో కలిసి పూజించే అలవాటు పెద్దలు చేసారు. అన్నమయ్య కూడా అందుకే 'పన్నిన లక్ష్మి భూమి పతి వి నీవు' అన్నాడు.

ఆర్తిగా ఈ గీతాన్ని అలపించినా, ఆర్ద్రంగా ఈ గీతాన్ని పాడిన వారి గాత్రాన్ని వింటున్నా తెలియని పశ్చాతాపం ఏదో కన్నీళ్లై ప్రవహిస్తుంది. స్వామి పాదాల దగ్గర ఈ గీతాన్ని పదే పదే పాడి మన పాపాలను ప్రక్షాళన చేసుకోవాలనిపిస్తుంది. ఇది ఎవరికి వారు అనుభవ పూర్వకంగా తెలుసుకోవలసిన సత్యం. అన్నమయ్య ప్రతి శరణాగతి గీతం హృదయాన్ని కరిగింపచేసే గంగ. స్వస్తి.

14. ఉప్పరాలు

అన్నమయ్య ప్రయోగించిన వ్యావహారిక పదాలలో "ఉప్పరాలు" ఒకటి.

"ఉప్పరాలెగయు"(07-250)అని ఒకచోట, "ఉప్పరాలు"అని (17-109) మరొకచోట అన్నమయ్య ప్రయోగాలున్నాయి.

ప్రస్తుతం "ఉప్పరాలెగసీ" పద పరమార్థం కథా కమామిషు కీర్తనలో తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

అన్నమయ్య ఒక చెలికత్తెగామారి స్వామి వారితో పారవశ్యంగా అంటున్నాడు.

పల్లవి: ఇద్దరము నిద్దరమే వోవోయి
వద్దుసుమ్మీ వట్టిపంతాలోవోయి

చ.1: యెఱగవా మాగుట్టు యేమోయి మమ్ము
ఉఱక గుట్టరసేవు వోవోయి
యెఱికెతనా నీకు యేమోయి - మాపై
వొరగుంటే నేమాయనో వోవోయి

చ.2: యెప్పటికెప్పటి సుద్దులేమోయి - నీపై
నుప్పరాలెగసీ జన్నులేమోయి
యిప్పలేర్లులాయ మోవి యేమోయి
వొప్పన గొనుమీ నేడు వోవోయి

చ.3: యెమ్మెలు మనలోనేల యేమోయి
వుమ్మగిలీ వలపులు వోవోయి
యిమ్ముల శ్రీవేంకటేశ యింతలోనె కూడితిమి
వొమ్మె గా జాణతనాలోవోయి (రేకు: 0143-2సంపుటం: 07-250)

అర్థం

పల్లవి: ఓయీ ! ఓయీ వేంకటేశా ! (ఒక్కసారి ఓయి అంటే సరిపోతుందిగా! రెండు సార్లు వోవోయి ఎందుకంటావా ! నిన్ను మళ్లీ మళ్లీ పిలవటంలో ఆనందముందోయి!)

ఇద్దరికి ఇద్దరం బాగా సరిపోయాం.

అనుకొన్నది జరిగి తీరవలసినదే అనటం పంతం.

కాని మనిద్దరికి మధ్య ఉన్నది ఉత్తుత్తి పంతాలు,

వద్దు సుమీ !

మనిద్దరి మధ్య ఈ ఉత్తుత్తి పంతాలు వద్దు లేవోయి !

చ. 1: అయినా స్వామీ ! మా గుట్టు(రహస్యం) ఏమిటో– నీకు తెలియదా!?ఏమోయి మాట్లాడవు?

ఊరికే – ఇప్పుడే మా గుట్టు – తెలుసుకొనేవాడిలా మాట్లాడుతున్నావేమిటోయి?

నీకు నేను ఏమన్నా రహస్యాలు చెప్పే సొదె చెప్పే స్త్రీ నా? ఏమోయి?

అసలు –మా దగ్గర ఏమన్నా లోపము (ఒగు) ఉంటే ఏమయిందట? ఆ రహస్యం నువ్విప్పుడు తెలుసుకోవాలా? ఓయి ! ఓయి!

చ. 2: ఏమోయి ! వేంకటేశా ! మన ఇద్దరి మధ్య ఉన్న విషయాల రహస్యాలు అప్పుడెప్పుడో జరిగినవి. నీకు తెలియదా!?

నిన్ను తలుచుకొన్న వెంటనే నీమీద ప్రేమతో నా స్తనములు –ఆకాశము పైపైకి అతిశయించి –ఎగిరి పోతున్నాయి. (ఉప్పరాలెగసీ)

ఏమోయి ! మద్యము తయారుచేయటానికి వాడే పూలు – అదేనయ్యా ! తియ్యగా ఉంటాయే – ఆ ఇప్పపూల నదులు నా పెదవిలో ప్రవహిస్తున్నాయి.

ఆ ఇప్పపూల నదులు నీకు కానుకగా(ఒప్పన) ఇవ్వాలనుకొంటున్నాను. మంచి తరుణము మించి పోవును. నేడే తీసుకోవోయి! ఓయి ! ఓయి!

చ. 3: మనలో మనకి అధిక ప్రసంగాలు, అక్కరకు రాని మాటలు (ఎమ్మెలు)ఎందుకోయి?

వలపులు నా లోలోపల ఆవిరిచే ఉడికిపోతున్నాయి. (ఉమ్మగిలీ) ఓ యి ! ఓయి!

శ్రీ వేంకటేశా! నా బాధని అర్థం చేసుకొని అనుకూలవంతుడయ్యావు. ఇంతకు ముందే ఇద్దరం కలిసాము.

అయినా నా రహస్యాలు ఏమి తెలియని వాడిలాగా –నేర్పుగల కపట ప్రవర్తన ఎందుకు? ! ఓయి ! ఓయి ! వేంకటేశా ! చెప్పు ! చెప్పు !

పరమార్థం

ఉప్పరమెగసి యజాండము

చిప్పలు రాలంగ మేరు శిఖరంబులపై

గుప్పించి దాటుకొందునొ

తప్పక నా మనసులోని తహతహ తీఱన్(కాశీ 01–112ప.)

(తప్పనిసరిగా , నామనస్సులోని తహతహ తీరిపోయేటట్లుగా – ఆకాశమునకు ఎగిరి – (ఉప్పరమెగసి)బ్రహ్మాండము పై కప్పులు రాలిపడేటట్లుగా – మేరు పర్వత శిఖరాలపై ఒక్కసారి కుప్పించనా?) అని శ్రీ నాథుడు కాశీఖండంలో వింధ్య పర్వతము నోటి వెంట **ఉప్పరమెగసి** పద ప్రయోగం చేయించాడు.

అన్నమయ్య **"ఉప్పరాలెగసీ జన్నులేమోయి"** అన్నాడు.

ఇద్దరూ ఆకాశానికి ఎగిరి పోయే (ఉప్పరమెగసి), హెచ్చు స్థాయికల ప్రతిభామూర్తులే.స్వస్తి.

15. ఎలయింత

క్రియనుంచి ఏర్పడే నామవాచకరూపాన్ని క్రియా విశేష్యమంటారు. ఎలయించు అను క్రియా పదమునుంచి "ఎలయింత" అను క్రియా విశేష్యాన్ని అన్నమయ్య సృష్టించాడు. ఎలయింపుకాడు(=ఆసక్తి కలిగించేవాడు) ఎలయింపులాడి (=ఆసక్తి కలిగించే స్త్రీ) ఎలయింపు(=కౌగిలింత) ఇలా విలక్షణమైన ప్రయోగాలు అన్నమయ్య సాహిత్యంలో ఉన్నాయి. ఎలయింత అంటే 1. తీసుకొనిపోవుట. 2. పురికొల్పుట. 3. వెంటతీసుకొనిపోవుట . అను అర్థాలున్నాయి. అన్నమయ్య కీర్తనలో ఈ "ఎలయింత" పద సౌరభాన్ని ఆస్వాదిద్దాం.

పల్లవి: చూడచిన్నదాన వింతె సుద్దులు కోటానగోటి
యేడేడ నేరుచుకొంటివే వో కలికి

చ 1: కిన్నెరమీటులలోని గిలిగింతలు ? నీ –
వన్నెల కనుచూపుల వలవంతలు
యెన్నరాని యిచ్చకపు టెలయింతలు
యెన్నఁడు నేరుచుకొంటివే నో కలికి

చ 2: సారెకు నెడవాయని సరసములు ? నీ–
తారుకాణ సన్నల తమకములు
గారవించి బుజ్జగించే గమకములు
యేరీతి నేరుచుకొంటివే వో కలికి

చ 3: కందువ శ్రీవేంకటేశు కలయికలు ? నీ –
యందమైన సమరతి యలయికలు
పొందుల మునిముంగిలి పొలయికలు
యెందెందు నేరుచుకొంటివే వో కలికి(రేకు: 1925–6సం: 29–090)

అర్థం

అన్నమయ్య మధుర భక్తిలో అలమేలు మంగ చెలికత్తెగా మారి ఆమెతో ముచ్చటలాడుతున్నాడు.

పల్లవి: ఏమమ్మా ! నువ్వు చూడ బోతే చిన్నదానివి. కాని నువ్వు చెప్పే కబుర్లు (సుద్దులు).. పెద్దవాళ్లలాగా అసంఖ్యాకాలు. లెక్కపెట్టలేము. (కోటానగోటి)

అమ్మడూ ! ఎక్కడెక్కడ ఈ కబుర్లు నేర్చుకొన్నావో కాస్త చెబుదూ !

చ 1: అలమేలు మంగా ! నువ్వు కిన్నెర అనే వీణను మీటేటప్పుడు చక్కిలిగింతలు అయ్యగారికి వస్తున్నాయి.

నీ అందమయిన (వన్నెల) కళ్ల చివరి చూపులతో స్వామివారికి మదన దుఃఖాలు (వలవంతలు) వస్తున్నాయి.

ఇక నీ పురికొల్పే ముఖ ప్రీతి మాటలు (ఇచ్చకపుటెలయింతలు)ఇన్ని అన్ని అని లెక్కపెట్టలేము.

ఎప్పుడు నేర్చుకొన్నావు తల్లీ ! ఇవన్నీ !?

చ 2: మాటిమాటికి స్వామి వారిని వదలనివి (ఎడవాయని) నీ సరసాలు.

నువ్వు నీ గొప్పతనానికి నిదర్శనముగా (తారుకాణ) చూపే సంజ్ఞలలో అయ్యగారిలో మోహాలు (తమకాలు) విజృంభిస్తున్నాయి.

స్వామిని గౌరవిస్తూ, బుజ్జగిస్తూ ప్రయత్నాలు (గమకములు) బ్రహ్మాండంగా చేస్తావు.

ఏవిధంగా ఇవన్నీ నేర్చుకొన్నావు తల్లీ !

చ 3: శ్రీ వేంకటేశుని కలయికలలో నేర్పు (కందువ) ప్రదర్శిస్తావు.

నీ అందమైన సమరతులలో ఎంతో అందమయిన ఆయాసాలు (అలయికలు) ఉన్నాయి. (సమరతి = రతిభేదము. coition in the usual manner in which there is no satiety on either side.)

మీ ఇద్దరి స్నేహాలలో మొట్టమొదటి ప్రధాన ద్వారపు (మునిముంగిలి) సంచారములు(పొలయికలు) ఉన్నాయి.

ఇవన్నీ ఎక్కడెక్కడ నేర్చుకొన్నావు తల్లీ !

పరమార్థం

అన్నమయ్య ప్రతి కీర్తన కూడా ఎలయింత . (1. తీసుకొనిపోవుట. 2. పురికొల్పుట. 3.వెంటతీసుకొనిపోవుట)

ఎక్కడికో, ఏ సుదూర ఊహా తీరాలకో ఆ కీర్తనలోని పదాలు తీసుకొనిపోతాయి.

ఉత్తమ సాహిత్యాభిరుచిని పురికొల్పుతాయి.

చెయ్యి పట్టుకొని ఉన్నతమైన సాహిత్య జగత్తులోకి వెంటతీసుకొని పోతాయి. స్వస్తి.

16. ఏతులు

పల్లవి : ఎవ్వడెరుగును మీ యేతులు
మువ్వంక మెఱసె మీ మురిపెమయ్య

చ1. సొలపుల నిన్నాపె చూచీనీ
నలుగడ నీవేల నవ్వేవు
తెలియవు మాకు మీ తెగులు
బలిమిని యెట్టయినా బతుకరయ్యా

చ2. విరులనాపె నిన్ను వేసీనీ
కెరలి బొమ్మల జంకించేవు
సరిగానము మీ చందములు
పరిపరి విధముల బ్రదుకరయ్యా

చ3. పెనగి ఆపె నిన్ను పిలిచీనీ
యెనసితివి శ్రీవేంకటేశ్వరుడా
నను నేలితివిటు నయమునను
పనివడి యిట్లానే బ్రదుకరయ్యా

❖ ❖

అవతారిక

ఒక్కరు కాదు– ఇద్దరు కాదు– ముగ్గురితో వేంకటేశుడు సరసాలాడుతున్నారు. అన్నమయ్య కూడా ఇంకో నాయికగా మారి –

ముగ్గురు నాయికలతో ఉన్న వేంకటేశుడిని మాటలతో ఆడుకొంటున్నాడు.

నాయికలతో స్వామి చూపిస్తున్నవి మురిపాలా? భక్త కవి పదాలు మురిపాలా? స్వామి వారు కూడా మన రెండో ప్రశ్నే సరియైనదంటారు.

❖ ❖

ఓ వేంకటేశా ! ముగ్గురు నాయికలతో సాగిస్తున్న మీ మురిపాలు మూడు దిక్కులలోను మెరిసిపోతున్నాయి.

ఇంతకీ అవి కేవలం మురిపాలేనా? !(మురిపెము=నడకయందలి కులుకు, శృంగార గర్వము, ముద్దు, ముద్దుతనము. ఉల్లాసము, లాలన, శృంగారము, సరసతబీ)

లేక నాట్యములో నిలబడే తీరుకు ఉద్దేశించిన మువ్వంకమురువులా! త్రిభంగిమలోని అందాలా? ముగ్గురితో నాట్య భంగిమలు అభ్యాసం చేస్తున్నావా స్వామీ! ఏమో ! ఏదైనా కావచ్చు. ఎవడికి తెలుసు మీ గొప్పలు. బడాయి మాటలు (=ఏతులు)

చ1. ఏ పారవశ్యమో నాకు తెలియదు కాని పారవశ్యంతో ఉన్న అమె (సొలపుల) నిన్ను చూసింది. అమె ఎవరంటూ తెలియనట్టు ఫోజు కొడతావేం!? ఆమెనయ్యా ! మీ మొదటి నాయిక.

నేను మిమ్మలిని చూస్తున్న విషయం తెలిసి కూడా నాలుగు పక్కలకు కలియ తిరిగి నవ్వుతావా !అమ్మా !

మేము మాములు అమాయకులము. మాకు మీలాంటి ఘరానా వాళ్లు చేసే మార్గాలు, పద్ధతులు తెలియవు.

మీ బోటివాళ్లు బలంతో – (అది నోటి బలం కావచ్చు కండ బలం కావచ్చు). ఎలాగయినా బతుకుతారు.

మాకే... ఎలా బతకాలో తెలియటంలేదు.

చ2. ఇక రెండో తల్లి పూలు నీమీద వేస్తుంటుంది.

నువ్వేమో ఉత్తుత్తిగా ఆమెను బెదిరిస్తున్నట్లుగా కోపంతో అటు ఇటు కదిలి (కెరలి) బొమ్మలతో ఆమెను బెదిరిస్తుంటావు.

వేయవు పెట్టవు కాని– నామీద పూలు వేసావో. నీమీద బొమ్మలు వేస్తానని ఆ రెండో ఆమెను బెదిరిస్తావు. నటన.

మీ ఇద్దరి పద్ధతులు ఎక్కడా చూడము .

ఇలా అనేక రకాలైన వేషాలు వేస్తూ బతకండి.

చ3. ఇక మూడో అమ్మడు. ఆవిడ గారు నీకౌగిట్లోనే నీతోనే యుద్ధము చేస్తూ– కలియబడుతూ –నిన్నే రక్షించమని పిలుస్తుంటుంది.

మొత్తానికి భలే ఆవిడ నీకు సరిపోయింది.

ఉన్నముగ్గురు చాలరన్నట్టు నా దగ్గరికి వచ్చావు. నునుపైన, అందమైన, మృదువైన చేష్టలు చేస్తూ(=నయమునను) నన్ను స్వీకరించావు.లోబరుచుకొన్నావు.

అయ్యా! కావలెనని, ప్రయత్నపూర్వకముగా(=పనివడి) ఇలాంటి పనులే చేస్తూ కలకాలం బతకండి.

17.ఏటవెట్టి

మానవులమైన మనం, ఆకాశానికి నిచ్చెనలు వేస్తుంటాం. దూరపు కొండలు నునుపంటాం. వీటన్నింటిని అన్నమయ్య రకరకాల కీర్తనలలో ఎండగట్టాడు.

మెట్లు లేని మేడలు ఎక్కాలని తాపత్రయపడతామని ఒక కీర్తన మొదలుపెడుతూ అందులో **"ఏటవెట్టు"** అని ఒక విచిత్ర పద ప్రయోగం చేసాడు అన్నమయ్య.

తెలుగు పదం అన్నమయ్యకు వినయంగా నమస్కరించింది. ఆయన ఏ రూపంలో కనబడమంటే అ రూపంలో కనబడింది.ఆ అర్థంలో ఒదిగిపోయింది. " ఏటవెట్టి" పదబంధం అలాంటిదే. ఈ "ఏట వెట్టు" అర్థ పరమార్థాలను, ఆ పదం ఉన్న కీర్తనతో పాటు తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

పల్లవి: తాప లేక మేడ లెక్కదలచేము
యేపులేని చిత్తముతో యీహీహీ నేము

చ.1: ఎరుకమాలినబుద్ధి యెవ్వరైనా బతులంటా
తెర గెరగక వీధి దిరిగేము
పర చైన జవరాలు పరులెల్లా మగలంటా
వొరపు నిలిపిన ట్లోహోహో నేము

చ.2: యిందరును హితులంటా యెందైనా సుఖమంటా
పొందలేనిబాధబొరలేము
మందమతివాడు యెండమావులు చెరువులంటా
అందునిందుదిరిగిన ట్లాహాహా నేము

చ.3: మేటివేంకటేశుబాసి మీదమీద జవులంటా
నాటకపు తెరువుల నడిచేము
గూటిలో దవ్వులవాడు కొండలెల్ల నునుపంటా
యేటవెట్టి యేగిన ట్లీహీహీ నేము (రేకు: 0015-06సం:01-094)

ఓ వేంకటేశా !

మేము – మెట్లు లేకుండానే మేడలు ఎక్కదలుచుకొనే తెలివి తక్కువవాళ్లం.

ఇహిహి(నవ్వుట యందలి అనుకరణ ధ్వని, నిందను సూచించును.)ముందు ఏమి జరుగుతుందోఅనే బాధ మనస్సులో కొంచెం కూడా లేకుండా ప్రవర్తిస్తుంటాం..

చ. 1: తెలివి కొంచెం కూడా లేకుండా, చిన్నా పెద్దా అని తేడాలేకుండా ఎవరికయినా బదులు (మాటకి మాట) చెబుతూ మార్గమేదో తెలియక వీధులలో తిరుగుతుంటాము.

ఓహెూహెూ(ఆశ్చర్య సంతాపములు తెలుపు పదము) ఇది ఎలాఉందంటే– ధూర్తురాలయిన, (కులట, వ్యభిచారిణి)పడుచుస్త్రీ – పరాయి మగవాళ్లను తన భర్తలుగా విలాసంతో నిలిపినట్లు–ఉంది. (ఆధూర్తురాలికి ఉచ్చనీచాలు ఎలా తెలియవో, మాకు కూడా ఎవరితో ఎలా మెలగాలో తెలియదని భావం)

చ. 2: వీరందరూ నా మేలుకోరేవారు అనుకొంటూ, ఎక్కడయినా సుఖము ఉందని భావిస్తూ కలుగకూడని –పొందకూడని బాధలలో పొర్లుతుంటాం.

అహాహా(ఆశ్చర్యార్థకం)!

తెలివితక్కువవాడు ఎండమావులను చూచి , చెరువులనుకొని భ్రాంతితో

అటు ఇటు తిరిగినట్లు మేము కూడా సుఖాల భ్రాంతిలో తిరుగుతుంటాం.

ఎండ మావులంటే 01.ఎండలో గుఱ్ఱములా చలించుచు కనబడు చాయలు 02.మట్టమధ్యాహ్నమున బయళ్లయందు నీటివలె దోచు సూర్యకిరణములు అని రెండు అర్థాలు . ఇవి క్షణములో కనబడకుండా పోతుంటాయి.భౌతిక సుఖాలన్నీ ఎండమావులని కవి భావం.

చ. 3: గొప్పవాడయిన వేంకటేశ్వరుని విడిచిపెట్టి – ఇంకా ఇంకా – రాను రాను ఏవో రుచులున్నాయని భావిస్తూ అసత్యపు మార్గాలలో నడుస్తుంటాం.

ఇహిహి(నవ్వుట యందలి అనుకరణ ధ్వని, నిందను సూచించే పదం)

దూరంగా ఉన్న– కొండలన్నీ నునుపని చెబుతూ

గూట్లో – ఉన్న దీపంలో వాటిని చూస్తూ మేము ఆనందిస్తుంటాం.

గూట్లో ఉన్న దీపంతో– దూరంగా ఉన్న కొండలను చూస్తే అవి చాలా నునుపుగా కనిపిస్తాయి.

అలాగే అసత్యపు మార్గాలు, అన్యాయాలు– ఇవన్నీ దూరపుకొండల నునుపుతనాన్ని కలిగి ఉంటాయి.

చాలా బాగునట్లనిపిస్తాయి.

ఆ అసత్యపు మార్గాలకు మన జీవితాలను బలి పెట్టి (=ఏటవెట్టి), ఆ మార్గాలలో మనం వెళ్లిపోతుంటాం. దగ్గరగా ఉన్న గొప్పవాడయిన వేంకటేశ్వరుని విడిచిపెట్టామని కవి ఆవేదన.

వేంకటేశ్వరుని నిరంతరం కొలుద్దామని కవి సందేశం. స్వస్తి.

18.ఏదోపోదో

పల్లవి: నాకుజెప్పరె వలపు నలుపో తెలుపో
నూకి పోవగరాదు నుయ్యో కొండో

చ1 : పొలతి మరునికి వెరవ పులియో యెలువో
వులుకుతుమ్మిదమోత వురుమో మెరుమో
తిలకింప చందనము తేలో పామో
యెలమి కోవిలకూత యేదోపోదో

చ2 :పొదలిన చలిగాలి పొగయో వగయో
వదలిన కన్నీరు వాగో వంతో
వుదరమున పన్నీరు వుడుకో మిడుకో
యెదుట తలవంచుకొనుట ఎగ్గో సిగ్గోల

చ3. అసమశరునిపై పరపుటదనో పదనో
పసగలవానిమోవి పంచదారో తేనో
అసమగతి వానిరాక ఆదోపాదో
రసికు వేంకటేశు పొందు రాజ్యమో లక్ష్మో (5-193 64వరేకు)

ఇదుగో వస్తున్నానని చెప్పిన వేంకటేశుడు చెప్పిన సమయానికి రాలేదు.
నాయిక విరహంతో రగిలిపోతోంది.
ఓదార్చటానికి చెలికత్తెలు చుట్టూ చేరారు.
వాళ్లతో తన "జంట" బాధలను నాయిక ఇలా పంచుకొంటోంది.
"నిజంగా నాకు చెప్పండి. అదుగో నవ్వకండి. వలపు రంగు తెలుపా? నలుపా?"
తెలుపు అయితే స్వచ్ఛంగా ఉండాలి. స్వచ్ఛత బాధ పెట్టదు.
నలుపు అయితే ఏది కనబడనీయదు. బాధిస్తుంది.
ఇప్పుడు చెప్పండి... వలపు నలుపా? తెలుపా?
సరే ! వలపు మీద ఒక్క చిన్న గెంతు గెంతి అవతలికి నూకి పారేద్దాం ..అంటే చిన్న గోతిలా నావల్ల కావటం లేదు.
చేదబావిలా-(నూయిలా) ఆ వలపును ఇంకా చేదుకొందామనే అనిపిస్తోంది.
వలపు నూతిలాంటిదా?

వలపును దూరంగా ఒక్క తోపు తోయటానికి వీలు కావటం లేదు.

వలపు కొండలా – చాల ఎత్తుగా పెరిగి, నా మార్గంలో అడ్డు వస్తోంది.

ఇంతకీ వలపు నూయా? కొండా? చెప్పండి

01 వాడెవడే ! వాడికేమీ పనీపాట లేనట్టుంది.ఆ మన్మథుడు నన్ను భయపెడుతున్నాడు. వాడు పులా? లేక ఎలుగు బంటా?

అసలే నా బాధల్లో నేను ఉంటే ఈ తుమ్మెద రొద ఏమిటే (ఝంకారమేమిటే?) ఆ తుమ్మెద మోత ఉరుమా?మెరుపా?

ఎందుకే నాకు హాయి కలిగించాలని ఒంటి మీద చందనము రాస్తారు!? మీరు నా ఒంటి మీద రాస్తున్నది తేలా? పామా?

దానికసలు బుద్ధి ఉందిటే ! ఎప్పుడు కూయాలో, ఎప్పుడు కూయకూడదో దానికి తెలుసా? తెలియదా? అది కోయిల కూతలా లేదు. అది ముండ్ల పంది కూతా? పోదు కూతా?

02. ఈ పెరుగుతున్న చలిగాలి నా విరహాగ్ని లోనుంచి బయటకు వస్తున్న పొగా?(యత్ర ధూమః తత్ర వహ్నిః) లేక ఆ వేంకటేశుని కోసం ఎదురు చూస్తున్న నా వగ (విచారము) అంతా ఇలా నా ఎదుట కనబడుతోందా? ఇది పొగా? వగా?

వాడికోసం ఎదురు చూసి, చూసి, నాకళ్లు బయటికి వదులుతున్న కన్నీటి ప్రవాహాన్ని చూసారటే? ఇది సెలయేరా? కాలువా?

ఏమిటే ! నా పొట్ట మీద నాకు చల్లగా ఉండాలని పన్నీరు పోస్తున్నారు? మీరు పోసున్న చల్లని నీరు– చల్లని నీరులా లేదు. మీరు నా మీద చల్లుతున్నది వేడి నీళ్లా? ఉష్ణ పరితాపమా?

ఈ పరిస్థితిలో వాడు ఇక్కడికి వచ్చాడనుకో! వాడి ఎదుట తల దించుకొంటానుకదా! తదేకంగా వాడిని చూడలేను కదా! ఇది వాడి ఎడల నా అనాదరమా? లేక నా సిగ్గా?

03.ఆ బేసి తూపుల వానిని – (మన్మథుని) నా పై ఆ వేంకటేశుడు ప్రయోగించుట లో ఉద్దేశ్యమేమిటే? ఇది తగిన సమయమా? సందర్భమా? మీరే చెప్పండి.

సారమున్న వాని పెదవి పంచదారా? తేనెయా?

దేనితో సమము కాని , సాటిలేని ఆ వేంకటేశుని రాక నాకు విచారాన్ని ప్రవహింపచేస్తుందా? నిలకడ ఇస్తుందా?

ఆ రసికుడైన వేంకటేశునితో నాతో కలయిక మన్మథ పరిపాలనమా? మన్మథ కాంతియా?

19. ఒడగు

నిఘంటువులు అర్థాలు చెప్పని అన్నమయ్య పదాల్లో "ఒడగు" ఒకటి. **"ఒకటి కొకటికిని వొడగాయ"** అని ఒక కీర్తన మొదలుపెట్టాడు కవి. ఆ **ఒడగు** పదమున్న కీర్తన పరమార్థాన్ని దర్శించి **ఒడగు** పదాన్ని అన్నమయ్య ఎంత అందమయిన అర్థంలో ప్రయోగించాడో తెలుసుకొని పరవశిద్దాం.

పల్లవి: ఒకటి కొకటికిని వొడగాయ
సకలంబునకును సమరసమాయ

చ 1: కలికినెమ్మోము కళల మెరుగులకు
లలి దురుము మొగులు లావాయ
తొలి తొలి వలపుల తొలుకరికాలము
వలనుగ నిదిగో వచ్చెను నేడు

చ 2: రమణి కంకణపురవళి వురుములకు
చెమటల సోనలు చెలరేగె
తమకపు టాసల తగువెదకాలము
తమలపు ముదమునదలకొనె నేడు

చ 3: పడతి బొమల సురపతి చాపములకు
సడులని ప్రియముల జడి వట్టె
బడి శ్రీవేంకటపతిరతికాలము
తొడరి యింతట నెదురుకొనె నేడు (రేకు: 1883-1 సం: 28-485)

పల్లవి:ఒక దానితో ఒకటి బాగా కలిసి పోయింది.పోలిక బాగా కుదిరింది. సమస్తానికి అభేదం కలిగింది.
చ 1: అలమేలుమంగమ్మ చక్కని మోములోని కళల మెరుపులకి
ప్రేమగా కొప్పు అనే మేఘము అతిశయించింది.
మొదటగా పుట్టిన ప్రేమలు అనే వర్ష కాలం
యుక్తమైన రీతిలో ఇదిగో ! ఈ రోజు వచ్చింది.
చ 2: అలమేలు మంగమ్మ కంకణాల యొక్క (చేతినగలయొక్క)
చప్పుళ్ల నే ఉరుములకి
చెమటలనే సన్నని వానలు బాగా విజృంభించాయి.

త్వరపడే మోహాల నే దప్పికల బాధల కాలము(వెద కాలము)
అమ్మ వేసుకొనే తములపాకుల సంతోషములో ప్రకాశించింది.
చ 3: అలమేలు మంగమ్మ కనుబొమలనే ఇంద్రధనుస్సులకు
జారని ప్రియములనే ముసురు పట్టింది.
వెంబడిగా, క్రమముగా వచ్చు శ్రీ వేంకటేశ దేవుని రతి కాలము
ఇంతలోనే తొట్రుపడుతూ నేడు ఎదురుగా వచ్చింది.

పరమార్థం

రూపకము మీద రూపకము ప్రయోగించి కీర్తనకి ప్రాణం పోయటం అన్నమయ్య కవితా లక్షణం

ప్రేమ అనేదానిని వర్ష కాలం తో పోల్చదల్చుకొన్నాడు. అలమేలుమంగమ్మ కొప్పు మేఘమయింది. ఆమె మోములోని కళలు మెరుపులయ్యాయి.ప్రేములు అనే వర్ష కాలం ఇదిగో ! ఈ రోజు వచ్చింది.అని కవి భావన. ఈ భావనకు పరవశించని భావుకుడుండడు.

అలమేలు మంగమ్మ కంకణాల చప్పుళ్ళు ఉరుములు. ఈ ఉరుములకి చెమటలనే సన్నని వానలు బాగా విజృంభించాయి. ఎవరికి చెమటలు ? కవి చెప్పడు. నాయకుడయిన వేంకటేశునికి అని మనమే ఊహించుకోవాలి.

మోహాల దప్పికలనే బాధల కాలము – అమ్మ వేసుకొనే తములపాకుల సంతోషములో ప్రకాశించిందని ఒక భావన.శుభ్రంగా భోజన కార్యక్రమం పూర్తయిన తర్వాత హాయిగా. తాంబూలం సేవిస్తారు. నాయిక తాంబూల సేవనంలో మోహాల బాధలు తొలగిపోయి సంతోషము ప్రకాశించిందంటే – కవి చెప్పదలుచుకొన్న“ సుఖాల ధ్వని” ఏమిటో– అర్థమయి– ఔరా అన్నమయ్యా! అనిఅనకుండాఉండలేం.

వర్ష సమయములో మేఘాలపై చిత్రవర్ణాలతో ధనుస్సు ఆకారములో కనబడు సూర్యకిరణ సముదాయాన్ని ఇంద్రధనుస్సు అంటారు. అలమేలు మంగమ్మ కనుబొమలు ఇంద్రధనుస్సుల లాంటివి.కొప్పు మేఘము. మోము లోని కాంతులు మెరుపులు. బ్రహ్మాండమైన ప్రేమ అనే ముసురు పట్టింది. ఇలా ఉన్నప్పుడు నిజానికి ఆ కాలంలో వచ్చే కాలం వర్ష కాలం. కాని వర్ష కాలం వచ్చింది అనలేదు కవి. శ్రీ వేంకటేశ దేవుని “రతి కాలం” అన్నాడు. “ఒక దానితో ఒకటి ఒడగు(పోలిక) బాగా కుదిరింది”. అను కవి మాటలని మనం కూడా చెప్పుకొని ఆయనని అభినందించాలి. స్వస్తి.

20. ఒడికము

అన్నమయ్య విశిష్ట రచనా పద్ధతులలో నూతన పద సృష్టి ఒకటి కాగా, పూర్వకవులు వాడిన పదాలను తన విశిష్టమయిన మార్గంలో ప్రయోగించటం ఇంకొక పద్ధతి. ఉదాహరణకి ఒడికము అనే పదముంది. ఈ పదానికి ఉపాయము, మనోజ్ఞము, యుక్తము. శపథము, పంతము. అనువు, యుక్తి. వాత్సల్యము. తగినది,నేర్పు, తృప్తికరంగా. మర్యాద, ఔచిత్యం – ఇన్ని అర్థాలున్నాయి.

ఈ అర్థాల్లో ఏ అర్థంలో "ఒడికము" అనే పదాన్ని అన్నమయ్య ప్రయోగించాడని పెద్దలను ప్రశ్నిస్తే , కీర్తన బుద్ధిగా ఒకటికి పదిసార్లు చదువుకోవాలని జవాబు వస్తుంది. ఆ సూచనను పాటించి కీర్తనను చదువుకొందాం.

పల్లవి: అంత సిగ్గువడక నీవానతీవయ్యా నీ–
యంతరంగమేల దాచ నానతీవయ్యా

చ 1: కడుసరుసుడవట ఘనుడ నీమోమందు–
నడరిన కళలెల్ల నానతీవయ్యా
వొడికమై నీమోవినున్న కెంపు లివి యెన్ని
అడియాలముగ నాకు నానతీవయ్యా

చ 2: మిక్కిలిజాణడవట మేనిమీదిచెమటలు
అక్కట యెందుండి వచ్చె నానతీవయ్యా
గుక్క కిట్టె యేయింతిగుబ్బలపైకుంకుమో నీ–
యక్కుమీద నంటినది యానతీవయ్యా

చ 3: యెసగి శ్రీవేంకటేశ యిట్టె కాగిటిలోన
నసురుసురేల వచ్చె నానతీవయ్యా
ముసిముసినగవుతో మునిగి నాకొనగోరి–
కసమిచ్చి యేల లోగే వానతీవయ్యా (రేకు: 1408–4సం: 24–046)

అర్థం

పల్లవి: వేంకటేశుని విలాస పురుషునిగా భావించి అన్నమయ్య ఒక నాయికగా మారి ఈ కీర్తనలో ఆయనను ప్రశ్నిస్తున్నాడు. ఎత్తి పొడుస్తున్నాడు.

అరే! నన్ను చూసి, నా మాట విని అంత సిగ్గు పడతావు ఏమిటి తండ్రీ ! నీ

హృదయములో ఉన్నది ఏమిటి? ప్రధానమయిన విషయమేమిటి? దానిని ఎందుకయ్యా దాచిపెడతావ్? కాస్త సెలవియ్యి తండ్రీ !

చ 1: అవునూ ! నువ్వు బాగా రసికుడివట. గొప్పవాడివట. నీ ముఖం మీద ఇప్పటికీ పచ్చి పచ్చిగా చంద్రకళలలాంటి గోటి గుర్తులు కనబడుతున్నాయి. అవి ఎందుకొచ్చాయి? ఎవరు పెట్టారు? ఈ సంగతులు కొంచెం సెలవియ్యి. నీ పెదవి మీద ఎర్రని పద్మ రాగ మణులు గురుతులుగా ఎవరో అందంగా అతికించారు. వాటి సంగతి కూడా అలవోకగా, సులభంగా (అడియాలము) నాకు చెప్పు.

చ 2: నువ్వు మంచి విలాస పురుషుడవట. అయ్యో ! నీ శరీరం మీద ఆ చెమటలు ఎక్కడినుంచి వచ్చాయో, ఎందువల్ల వచ్చాయో కొంచెం చెప్పు నాయనా!అదుగో ! మాటలు మింగుతావెందుకు? ! మాటలు మింగకుండా (గుక్క కిట్టె) ఏ స్త్రీ స్తనాలపై ఉన్న కుంకుమ నీ రొమ్మును(రొమ్ము) అంటిందో కాస్త సెలవియ్యి మహా ప్రభూ !

చ 3: వేంకటేశా !ఇప్పుడే కదా సమ్మతించి నా కౌగిట్లోకి వచ్చావ్! అంతలోనే ఎంతో శ్రమపడిన వాడిలా కిందా మీదా అయిపోయావేమిటి?(అసురుసురు)అరే! నేను మాట్లాడుతుంటే ముసిముసినవ్వులలో మునిగిపోతావ్ ! అమ్మా !

ఇదుగో ! ఇలా చెస్తే నాకు తిక్కరేగుతుంది. నీ ఇష్టం. నా గోటి చివరలకు దర్పాన్ని(అసము) పెంచి ఎందుకయ్యా ! లోకువఅవుతావ్? (లోగేవు) (నువ్వు జవాబు చెప్పకపోతే నా కొనగోటి గిచ్చుళ్ల బాధ నీకు తప్పదని భావం)ఇంత శ్రమ నీకు దేనికి కలిగిందో నాకు సెలవియ్యి.

పరమార్థం

వాసన కలిగిన పువ్వు ఆకర్షిస్తుంది. వాసనలేని పువ్వు ఎంత బాగున్నా అంత తొందరగా మనస్సును పట్టదు. శృంగారంతో కూడిన భక్తి వాసన కలిగిన పువ్వు. మన బోటి సామాన్యులకు ఇంద్రియ ప్రీతిని కలిగించే శృంగారమే మొదటగా ఆకర్షిస్తుంది. అందుకే జానపద పాటల్లో కాని, సాహిత్య గ్రంథాలలో కాని శృంగారానికే పెద్ద పీట.

మనస్సును తన వశం చేసుకొనే లక్షణం శృంగార రసంలో బాగా ఉంది. అందుకే జీవులను ఉద్ధరించటానికి భక్తితో శృంగారాన్ని కలిపి మధుర భక్తి

అన్నారు. ఆ మధుర భక్తి మార్గంలో వ్రాయబడిన కీర్తన ఇది.

ఇష్టమయిన శృంగారం నాయికానాయకులను ఒకటిగా చేస్తుంది.

మధుర భక్తి శృంగారం కూడా జీవాత్మ పరమాత్మలను ఒకటిగా చేస్తుంది.

"నన్ను నీలో కలుపుకో తండ్రీ ! ఆలస్యం చేస్తున్నావేమిటి? ఎక్కడెక్కడ తిరుగుతున్నావు నా మనస్సులోకి రాకుండా"ఇవన్నీ భక్తుడు భగవంతునితో చనువుగా అనే మాటలు. ఈ ఉదాత్తమైన భక్తి భావాలకు గోటి గిచ్చుళ్ల లాంటి శృంగారపు మాటలు కలిపాడు కవి.

ఆంతర్యం మధుర భక్తి.

పై వేషం శృంగారం.

లక్ష్యం స్వామిలో లీనం కావటం. (మోక్షం)

ఇంతకీ "ఒడికమై "అంటే– అందంతో– ఈ అర్థమే నప్పుతోంది. కదా!? స్వస్తి.

21.ఒర తొమ్మిది చాలు

యవ్వనానికి "మబ్బు వయస్సు" అని పేరు పెట్టిన ప్రతిభావంతుడు అన్నమయ్య. (27-457) .సూర్య ప్రకాశము ఉంటుంది. కాని దానిని ఆపాలని మబ్బు ప్రయత్నిస్తుంటుంది. తెలివి అనే ప్రకాశము ఉంటుంది. కాని కోరిక అనే మబ్బు ఆ తెలివిని కప్పేస్తుంటుంది. ఈ మబ్బు వయస్సులో బావా మరదళ్ల మధ్య పూర్వపు తెలుగు లోగిళ్లలో ఉండే సరస సల్లాపాలను - వేంకటేశునికి , తనకు మధ్య ఆపాదించుకొని అనేక బావా మరదళ్ల కీర్తనలు అన్నమయ్య రచించాడు. ఈ కీర్తనల్లో వేంకటేశుడు బావ. అన్నమయ్య మరదలు.ఈ కీర్తనలో " ఒర తొమ్మిది చాలు "అని ఒక విచిత్ర పద ప్రయోగము చేసాడు కవి. ఈ పదము యొక్క పరమార్థం తెలియటానికి మొత్తం కీర్తనని ఒకసారి తలచుకొని పరవశిద్దాం.

పల్లవి: ఓపో అదేమోయి వో బావ యింక
వోపనంటేబోవునటె వో వో మరదలా

చ.1: వొరసే వదేమోయి వో బావ నిన్ను
వొరసీ బో నీకుచాలె వో మరదల
వొరకు నెత్తుకు సరి వో బావ నీవె
వొర తొమ్మిది చాచేవో వో మరదలా

చ.2: వొగరులాడే వోయి వో బావ నీకు
వొగరు మోవిచిగురు వో మరదల
వొగరుజిగురె చేగ వో బావ అదె
వొగిబిసికితే బసురో వో మరదలా

చ.3: వొంటి దగ్గరే వోయి వో బావ నాకు
నొంటి గాదు నీ వుండగ నో మరదల
గొంటవై శ్రీ వెంకటాద్రి గూడితి బావ మన
కొంటి నేల ఆమాటలో వో మరదలా (రేకు: 0259-3సం:09-051)

అర్థం

పల్లవి: ఓ బావా ! ఓర్చుకో ! ఓర్చుకో ! అంటావు? ఎంతని అది ఓర్చుకోమంటావు? నేను ఓర్వలేను.

ఓ ఓ మరదలా ! ఓర్చుకోనంటే పోతుందా ! ఆగు ఆగు.

చ. 1: ఒత్తిడి కలిగిస్తూ. దగ్గకు చేరతావేమిటి బావా?

దగ్గరకు చేరినంత మాత్రాన నీకు సరిపోతుందా మరదలా?

నేను వేసుకొన్న ముసుగు గుడ్డను ఎత్తుతున్నావేమిటి? ఇదేమన్నా సరిగా ఉందా?

నువ్వు తక్కువ దానివా? నువ్వు ఆ ముసుగుగుడ్డలోనుంచి తొమ్మిది సైగతో– తొమ్మిది ఘడియలకు నన్ను రమ్మని సైగ చేస్తున్నావు కదా!

చ. 2: బావా !నువ్వేమిటి అలా కటువుగా మాటలాడుతున్నావు. ఆశిస్తున్నావు?!

మరదలా! నా మాటలు కటువు కాదు. నీ పెదవి అనే చిగురు ఒగరు.

ఈ కటువు చిగురు యొక్క చేవ–బలము – తక్కువది కాదు బావా !

అలాగా ! పిసికితే ఆ మోవి చిగురులోని పైత్యరసం పోతుంది. కటువు, గిటువు అన్నీ పోతాయి.

చ. 3: ఒంటరిగా , దగ్గరలో ఉన్నావు కదా బావా ! నువ్వు.

నువ్వుండగా నేను ఏకాకిని ఎలా అవుతాను మరదలా?

నేర్పరివై, వంచకుడివై శ్రీ వేంకట పర్వతము మీద నన్ను కలిసావు కదా బావా!

ఆ మాటలు మనస్సులో నాటుకొన్నాయి.. ఎందుకు అలాంటి మాటలు మరదలా?

❖ ❖

పరమార్థం

జానపదులు కష్ట జీవులు.

పని చేస్తూ ఆ కష్టాన్ని మార్చిపోవటానికి శృంగారం వాళ్ల మాటల మధ్య వరదలై, పాటలై ప్రవహిస్తుంటుంది.

ప్రజలలో కలిసి తిరిగిన అన్నమయ్య ఆ వ్యవహారిక శైలిని తన కీర్తనల్లో పొందుపరిచాడు.

ఎవరో జానపద నాయిక ముసుగులోనుంచి చేయి ఒకటి చాచి నాయకునితో తొమ్మిది అను సైగను వేళ్లతో చూపించి ఉంటుంది. అది కవి కంటపడింది. దానికి ప్రాణ ప్రతిష్ఠ చేసాడు ఈ కీర్తనలో.

" నువ్వు తక్కువ దానివా? నువ్వు ఆ ముసుగుగుడ్డలోనుంచి తొమ్మిది సైగతో – తొమ్మిది ఘడియలకు నన్ను రమ్మని సైగ చేస్తున్నావు కదా!" అన్నాడు. అన్నమయ్య మధుర భక్తిలో నవవిధ భక్తులు తొమ్మిది సైగతో మారాయి.స్వస్తి.

22. కడమ

అన్నమయ్య ఈ కీర్తనలో సమకాలీన వృత్తులను ప్రస్తావిస్తూ, ఆవృత్తి నైపుణ్యాలన్నీ శ్రీవేంకటేశుని అనుగ్రహాలంటున్నాడు.

పల్లవి: నీవే రక్షింతువుగాక నిన్ను నమ్మితిమి నేము
దైవమవై నీ వుండగ తగ మాదే బ్రదుకు

చ.1: కోరి వొకరాతివీరు గొల్చి బతికీ నొకడు
పైరు వొక్కచెట్టువెట్టి బతికేననీ నొకడు
కూరిమి బాము చేబట్టుకొని బతికీ నొకడు
శ్రీరమణుని దాసుల చేతిదేపో భాగ్యము

చ.2: ఇసుమంత మన్ను వట్టి యేచి బతికీ నొకడు
పసురము నింట గట్టి బతికేననీ నొకడు
పసగా వేలె డినుము పట్టి బతికీ నొకడు
వసుధేశ నీవు గలవారి కేమి గడమ

చ.3: ఆకునలము గసవునంటి బతికీ నొకడు
లోకులు పెక్కుపాయాల లోలులై బతికే రదే
యీకడ శ్రీవేంకటేశ ఇవెల్లా నీమహిమలే
చేకొని నీమరగు చొచ్చినవారే ఘనులు

(రేకు: 0197-05 దేసాళం సం: 02-500)

అర్థ పరమార్థం

పల్లవి: శ్రీవేంకటేశా! మేము(=నేము) నిన్నే నమ్ముకొని ఉన్నాము.

నువ్వు మాకు దైవంగా ఉండగా , వివిధ వృత్తులలో ఉండే మా భక్తులమందరము మా అభిరుచికి తగినట్లుగా(=తగ) బతుకుతున్నాము. నీ అనుగ్రహం కలిగిన బ్రతుకు మాదే.

(నువ్వు దై వంగా రక్షిస్తుండగా , నీ భక్తులు తమ తమ ఇష్టాలకు తగినట్లుగా వేరు వేరు బతుకులు గడుపుతున్నారని భావం . ఆ వృత్తులేమిటో కవి చరణాలలో వివరిస్తున్నాడు.)

చ. 1: ఇష్టపడి –ఒకడు దేవాలయంలో దైవ రూపంలో ఉన్నవీరుని విగ్రహాన్ని(=రాతివీరు) పూజించి (=కొలిచి) బతుకుతున్నాడు.(పూజారి)

రైతు వేసిన పంట మధ్యలో చెట్టు పెట్టి దాని మీద వచ్చే ఆదాయంతో ఒకడు బతుకుతున్నాడు.(వ్యాపారి లేదా రైతు)

ప్రేమతో పామును చేతిలో పట్టుకొని ఆడిస్తూ ఒకడు బతుకుతున్నాడు. (పాములవాడులేదా గారడీవాడు)

శ్రీకి ఇష్టమైన వేంకటేశుని దాసులుగా ఉంటే చాలు– వాళ్లు ఏ వృత్తిలో ఉన్నా అదృష్టము

అంతా వారిదే. అదృష్టము వాళ్లచేతిలోని ఉసిరికాయ. (కరతలామలకము అరచేతిలోని ఉసిరికాయ, సులువుగ అధీనమగునది)

చ. 2: ఒకడు చాలా కొంచెం మట్టిని పట్టుకొని బాధించి ,(=ఏచి) పిసికి బతుకుతున్నాడు. (కుమ్మరి)

పశువులను ఇంట్లో కట్టుకొని –(అంటే వాటిని మేపుతూ–పాలు మొదలైనవి తీస్తూ) ఒకడు బతుకుతున్నాడు.(గొల్ల)

చాతుర్యముతో ఒకడు చిన్నపాటి ఇనుమును పట్టుకొని, ఆయుధాలు, పనిముట్లు తయారు చేసి బతుకుతున్నాడు.(కమ్మరి)

ఓ భూపతీ ! నీ దయ ఉన్నవారికి ఏది కొరత?(కడమ)

చ. 3: ఒకడు గడ్డి గాదము అంటుకొని, (అంటే వాటిని పీకుతూ, అమ్ముతూ) బతుకుతున్నాడు. (రైతుకూలీ)

లోకులు ఇలా అనేక వృత్తులకు సంబంధించిన ఉపాయాలలో ఆసక్తులు కలిగినవారై బతుకుతున్నారు.

ఈ ప్రపంచములో ఇవన్నీ – వృత్తులకు సంబంధించిన నైపుణ్యాలన్నీ– నీ మహిమలు.

ఆదరముతో, భక్తితో నీ శరణు చొచ్చిన వారే– నీకు శరణన్నవారే ఈలోకంలో ఘనులు

23. కలకలే

నొప్పి కలగడంలో అయ్యే ధ్వనిని అన్నమయ్య **"తతిగాని యీపాటు దైవమా విచారించవే"** అను కీర్తనలో కలకలే అన్నాడు.

పల్లవి:తతిగాని యీపాటు దైవమా విచారించవే
కతలాయ జెప్ప నేడు కలికాలమహిమ

చ.1: తుటుములై భూసురుల తుండెములు మొండెములు
యిటువలె భూతములు యెట్టు మోచెనో
అటు బాలుల రొదలు ఆకాశమె ట్టోరిచెనో
కట కటా యిట్లాయ గలి కాల మహిమ

చ.2: అంగలాచే కామినుల యంగ భంగపు దోపు
లింగితాన మింట సూర్య డెట్టుచూచెనో
పొంగు నానాజాతిచేత భువనమెట్లానెనో
కంగి లోకమిట్లాయ కలికాలమహిమ

చ.3: అరుదు గోహత్యలు సేయగ దూడ లంగలావ
సరి ధర్మదేవతెట్టు సమ్మతించెనో
పరధన చూరకెట్టు పట్టాయనో లక్ష్మి
కరుణ యెందణగెనో కలికాలమహిమ

చ.4: దేవాలయాలు నానాదేశములెల్లా జొచ్చి
దేవగా నెట్లుండిరో దేవతలు
తావులేలే రాజులకు దయ గొంత వుట్టదాయ
కావరమే ఘనమాయ గలి కాలమహిమ

చ.5: నిరపరాధుల జంపి నెత్తురు వారించగాను
తెరల కెట్టుండిరో దిక్పాలులు
విరసవర్తనలుండే విపరీతకాలమున
గరువాలు గపటాలే కలికాలమహిమ

చ.6: వుపమించి దంపతులు వొకరొకరిని జూడ
చపల దుఃఖములతో సమయగాను
తపములు జపములు ధర్మము లెందణగెనో
కపురుబాపాలు నిండె గలికాలమహిమ

చ.7: తలలు వట్టీడువగా తల్లులు బిడ్డలవేయ
తలపెట్టుండెనో యంతర్యామికి
మలసి ముక్కులుగోయ మరుడెట్టు వోరిచెనో
కలకలే ఘనమాయగలికాలమహిమ

చ.8: దీనత లోబడి గుండెదిగు లసురుసురులు
వానినెట్లు లోగొనో వాయుదేవుడు
గూను వంచి తల్లి చూడ గొడుకు గుత్తిక గోయ
గానబడె నింతేసి కలికాలమహిమ

చ.9: పలుమారు నమ్మించి ప్రాణములు గొనగాను
యిలదమలో బ్రాణాలెట్లుండెనో
నెలవై శ్రీ వేంకటేశ నీవే యెరుగుదువు
కలుషమే ఘనమాయ గలికాలమహిమ

(రేకు: 0373-01సం: 04-428)

శిశువు పుట్టేటప్పుడు మూత్రపురీష రక్తశుక్లములు ముఖాన కమ్ముకొని ఉంటాయి. తల్లుల యోనుల లోపల ఉండే బలమైన ప్రసూతి వాయువులు బిడ్డల తలలను యోనుల బయటికి ఈడుస్తాయి.. అధోముఖులై తల్లుల జఠరాల లోపలినుంచి జీవులు ఈ నేల మీద పడతారు. శిశువు గర్భంలో ఉన్నప్పుడు వెన్నుముకకి దగ్గర మూలాధార చక్రం వద్ద ఒక ద్వారం ఉంటుంది. పుట్టే ముందు ఆ శిశువుకి తన పూర్వ దశ అన్నీ తెలుస్తాయి. తల్లి గర్భం నుండి ప్రకృతిలోకి వచ్చేప్పుడు శఠ అనే వాయువు ఈ ద్వారాన్ని కప్పివేస్తుంది. అందుకే మందమతులు లేక శఠులు అవుతారు. ఆతురులై మహామూర్ఛ చేత బాహ్య వాయువులు తాకడం వల్ల అంతవరకు ఉన్న పూర్వస్మృతులు జీవులు కోల్పోతారు. పుట్టాకకూడ క్రిమివలె ప్రవర్తిల్లక తప్పని స్థితి జీవులది.. దురదపుడితే గోక్కోలేని

బాధ. ఇతరుల కోరిక ప్రకారం నడిచే పరాధీన పరిస్థితి. ఆ సమయంలో ఆ జీవుల లోపల ఉండే అంతర్యామి ఆలోచన ఎలా ఉంటుందో అని అన్నమయ్య ఊహ

ఈ జీవుడు ఎన్నెన్నో జన్మలు ఎత్తి కర్మఫలానుసారంగా బాధలమయమైన ఈ జన్మ ఎత్తుతున్నాడు. ఈ జన్మలో అయినా ఈ జీవుడు నా గురించి తలచుకొంటాడా! ఉద్ధరింపబడతాడా!? భౌతికానందాలలో మునిగిపోతాడా ! అని దయామయుడైన అంతర్యామి జీవులగురించి ఆలోచిస్తుంటాడని అన్నమయ్య ఊహ.పాపాల పుట్టయైన ఈ కలియుగంలో హరి నామస్మరణ చేయండని, ఉద్ధరించుకోండనే కవి ప్రబోధము ఈ రెండు పంక్తుల్లో వ్యంగ్యంగా ఉంది.

జన్మించేటప్పుడు బయటికి రావటానికి పెనగులాడుతూ (=మలసి)కామకళా కేంద్రమైన యోని ద్వారాన్ని జీవుడు చీలికలు చేస్తుంటే –ముక్కలు చేస్తుంటే , కామానికి మూల కారకుడైన మన్మథుడు బాధ ఎలా ఓర్చుకొంటాడో

తల్లి కడుపులో ఉన్న శిశువుకి కావలసిన పోషకాహారాలు తల్లి గర్భాశయానికి అతుక్కుని ఉన్న ప్లాసెంటా నుంచి అందుతాయి. గర్భస్థ శిశువు పెరగటంలో బొడ్డు తాడు ప్రధాన పాత్ర పోషిస్తుంది. శిశువు జన్మించిన తరువాత బొడ్డు తాడు కోసేస్తారు. ఈ బొడ్డుతాడు కోసే సమయంలోనూ, శిశువు జన్మించేటప్పుడు యోని చీలికలు పడే సమయంలోనూ దాంపత్య జీవితంలో కామ సుఖానికి ప్రధాన పాత్ర వహించే మన్మథుడు ఎలా ఓర్చుకొంటున్నాడో అని కవి ఊహ.

కలకల అను ధ్వన్యనుకరణపదాన్ని 1.నవ్వేటప్పుడు 2. పక్షులు కూసేటప్పుడు, పలకటంలో 3. నొప్పి కలగడంలో అయ్యే ధ్వనికి వాడతారు. కలకలే అంటే ఇక్కడ అన్నమయ్య పంక్తుల్లో నొప్పి కలగడంలో అయ్యే ధ్వని అని అర్థం తీసుకోవాలి. నొప్పి కలగడంలో అయ్యే ధ్వనులు ఎక్కువయ్యాయి. అంతా కలికాల మహిమ అని పుట్టుకల మీద, మన్మథ సుఖాల మీద కవి వ్యంగాస్త్రం వేసాడు.

24.కంది కుడుము

"ఓ మహానుభావా ! వేంకటేశ్వరా ! నువ్వు ఎక్కడ చూస్తావో, నీ చూపు ఎక్కడ పడుతుందో అక్కడ కందికుడుము జరుగుతుంది!".అని ఒక నాయిక రూపంలో అన్నమయ్య స్వాగతం పలికాడు.

కుడుము చేతికిస్తే పండుగనే వాడు. (అల్పసంతోషి),కుడుము మింగేవానికి అప్పడాలొక లెక్కా?,. కుడుములు వండని ఆడుదీ, కూనిరాగం తీయని మగవాడూ ఉండరు. – ఇలాంటి తెలుగు సామెతలు కుడుముకు సంబంధించి ఉన్నాయి.

కుడుముకి రెండు రకాల అర్థాలున్నాయి. తీపిపూర్ణం లోపల ఉంచిచేసిన భక్ష్యం (రాయలసీమ; తెలంగాణం) పూర్ణములేనిది ఉండ్రాయి(నెల్లూరు) ఇందులో మొదటి అర్థమే అన్నమయ్య కందికుడుములోని కుడుముకి స్వీకరించాలి.

కంది అంటే ధాన్య విశేషం.కొండకందులు, పొట్టికందులు అని కందిలో భేధాలు.

ఇప్పుడు శృంగార పరంగా కంది కుడుము పదాలను కలిపాడు అన్నమయ్య. నాయకునికి ఈ కందికుడుము పెట్టాడు.

మొత్తం మీద కందికుడుము అంటే అందమైన, శృంగార పరమైన ,శుభకరమైన విందు అని అర్థం.

ఈ కంది కుడుము ప్రస్తావన ఉన్న కీర్తనలో ఉన్న మూడవ చరణంలో "పెరిగి పూవలెల్లానుఉ బిందెలాయను/యిరవైన చుట్టరిక మిల్లు నిండెను"అని భావాన్ని పండించాడు. లేత చిగుళ్లు పెరిగి పిందెలయ్యాయి. స్థిరమైన చుట్టరికము ఇల్లంతా నిండి పోయింది. కందికుడుము ఆరగిద్దువుగాని....రావయ్యా ! అని ఆహ్వానము. మనకుకూడా ఆ కందికుడుము గుబాళింపు మనసంతా నిండి పోతుంది.

కీర్తన పూర్తి పాఠమిది

పల్లవి: కన్నచోటనే నీకు కందికుడుము
విన్నప మిదె యింటికి విచ్చేయవయ్యా

చ 1: పున్నమ వెన్నెల లవె పోగులాయను
సన్నజాజినలు జాజుకొనెను
చెన్నుమీరె వింతటాను చిరుముత్యాలు
పన్నినసంసారము ఫలమందెను

చ 2: పదారువన్నెలపైడి పరిమళించె
సదరాన తరితీపు జాలువారెను
పొదలె మరురాజ్యము పొద్దువొద్దుకు
ముదిరి పువ్వులవాన ముంచుకొనెను

చ 3: పెరిగి పూవలెల్లాను బిందెలాయను
యిరవైన చుట్టరిక మిల్లు నిండెను
అరిది శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
సరుస నీ వెనయగా సరిబేసులాయను

25. కనుగిరుపు

ప్రేమలోకంలో కంటి భాషలు ప్రేమికులు చదువుకొంటారు.అన్నమయ్య వేలాది శృంగార కీర్తనలలో ఈ కంటి బాసలు, కను కూరిములు(కళ్లకు పండుగలు),కన్నుల కెంపులు(కోపాలు)కన్నుల నవ్వులు, కన్నుల మొక్కులు –కన్నువేయుటలు (గాఢంగా చూచుట) ఇలా చాలా ఉన్నాయి.వీటితో పాటు అన్నమయ్య – కను సైగ అను అర్థంలో **కనుగిరుపు** అని ఒక కొత్త పదాన్ని ప్రచారంలోకి తీసుకువచ్చాడు. వేంకటేశుని కనుసైగ అందాలు కీర్తనలొ తెలుసుకొందాం

పల్లవి: ఇంతగా జేసెగా యింతి కన్నుల నగవు
సంతరించగరాని చనుదోయి బిగువు

చ.1: తనివి మాలిన తలపు తడవోరువని బులుపు
అనువెంగని కెలపు అడియాసమెలపు
కనుగలువలో సొలపు కాకదీరని యలపు
వనిత చిత్తములోని వడిగొన్న వలపు

చ.2: ఒడలెంగని నెగులు నుల్లంబులోదగులు
వడియుగన్నీటిలో వగలు
పొడలువె ట్టెడి పొగులు పొందు వాసిన దిగులు
పడతికి నిది యెల్ల బరికించ బగులు

చ.3: వెరవెంగని పురపు వింతలాగులయొరపు
మిరుమిట్లు గొనుమేనిమెరుపు
తిరువేంకటాచలాధీశ్వరుని కనుగిరుపు
తరుణి కిటువంటి మెత్తని పూవుబరపు
(రేకు: 0045-2 సంపుటం: 06-020)

అన్నమయ్య స్వామి వారి ఇద్దరు చెలికత్తెలుగా మారాడు. ఒక చెలికత్తె , ఇంకొక చెలికత్తెతో అంటోంది.

పల్లవి: నాయిక కన్నుల్లోని నవ్వు, ఆదరించగా రాని చనుదోయి బిగువు ఎంత పని చేసిందో చూసావా?

చ.1: స్త్రీ చిత్తములోని వేగముగా ఉండే వలపు ఎటువంటిదో తెలుసా!?

అది తృప్తి లేని ఆలోచనలతో ఉంటుంది; ఆలస్యము భరింపలేని వాంఛలతో కూడి ఉంటుంది.

ఉచితము తెలియని అభిప్రాయములతో కలిసి ఉంటుంది; వ్యర్థమైన ఆశల నేర్పుసంపాదిస్తుంది/

కనులు అనెడి కలువలో పారవశ్యమును ప్రకటిస్తుంది. అనుభవము గడించని శ్రమముకలిగి ఉంటుంది

స్త్రీ చిత్తములోని వేగముగా ఉండే వలపు ఇన్ని రకాలుగా ఉంటుంది.

చ. 2: నాయికకు ఏఏ భావాలు శత్రువులో తెలుసా?
ఒళ్లు తెలియని బాధ; మనస్సులో ఆసక్తి
ప్రవించుకన్నీటిలో నటనలు
ప్రయాస పడెడి దుఃఖము; పొందు విడిచిన దిగులు
పడతికి ఇవి అన్నీ శత్రుత్వ కారకాలు

చ. 3: శ్రీ వేంకటాచలాధీశుని కనుసైగ ఎటువంటిదో తెలుసా?

వశము తెలియని అనుభవము ఇస్తుంది. వింతయిన పద్ధతుల సౌందర్యముతో ఉంటుంది

శరీరంలో మిరుమిట్లు గొలిపించే మెరుపులను పుట్టిస్తుంది
శ్రీ వేంకటాచలాధీశుని కనుసైగ
తరుణి విషయములో ఇటువంటి మెత్తని పూల పాన్పు వంటిది.

(ఎటువంటిది అంటే అనుభవ ప్రపూర్ణమయినది,మెరుపులు కలది, వింతయిన పద్ధతుల సౌందర్యము కలది- వీటితో కూడిన మెత్తని పూల పానుపు శ్రీ వేంకటాచలాధీశుని కనుసైగట. జయహో అన్నమయ్యా !)

పరమార్థం

స్వామి వారి కను సైగలు చేసే చేతలను ఇంకో కీర్తనలో కూడా రాసి అన్నమయ్య పరవశించాడు. (సం: 27-125)

అన్నమయ్య కీర్తనలో ప్రాస పదాలు కనుసైగంత అందంగా ఈ కీర్తనలో చేరాయి.(ఒరపు- మెరపు- గిరుపు-పరపు)

ఈ కీర్తనలోని చివరి చరణంలో స్వామి వారి కనుసైగ- పూల పానుపు అనటం- ఒక గొప్ప పోలిక అయితే - ఆ పూల పానుపుని ఇంకా మెరిపించటం అన్నమయ్యకే సాధ్యమయింది. స్వస్తి.

26. కర్మమార్గములు గడవని

పల్లవి: ఏ కులజుడేమి యెవ్వడైననేమి
ఆకడ నాతడె హరి నెఱిగిన వాడు

చ. 1: పరగినసత్యసంపన్నుడైనవాడే
పరనిందసేయ దత్పరుడుగాని వాడు
అరుదైన భూతదయానిధియగువాడే
పరులుదానేయని భావించు వాడు

చ. 2: నిర్మలుడై యాత్మనియతి గలుగువాడే
ధర్మతత్పరబుద్ధి దగిలిన వాడు
కర్మమార్గములు గడవనివాడే
మర్మమై హరిభక్తి మఱవని వాడు

చ. 3: జగతిపై హితముగా జరియించు వాడే
పగలేక మతిలోన బ్రతికిన వాడు
తెగి సకలము నాత్మ దెలిసివాడే
తగిలి వేంకటేశుదాసుఁడయిన వాడు (రేకు: 0047-07సం:01-292)

అంతరాత్మలో హరిని సంపూర్ణముగా తెలుసుకొన్నవాడు ఏ కులములో పుడితే ఏమి? ఎవరైతే ఏమి? (కులమతాలకు అతీతుడని భావం)

01చ. సత్య సంపద కలిగి అందరి హృదయాలలో వ్యాపించిన వాడు, ఇతరులను నిందించుటకు ఆశ లేనివాడు(ఇష్టం లేనివాడు), అపురూపముగా అన్ని జీవులయందు దయ చూపించువాడు, ఇతరులు కూడా తనలాంటి వారని భావించేవాడు ఏ కులములో పుడితే ఏమి? ఎవరైతే ఏమి?

02చ. పవిత్రుడై తపము, సంతోషము,ఆస్తికత్వము, దానము,భగవదర్చన, వేదాంతశ్రవణము, లజ్జ, మతి, జపము,వ్రతముమొదలైననియమములతో మనస్సును తనఅధీనములో ఉంచుకొనువాడు, ధర్మము పాటించు వాడు , కర్మ మార్గములు వదలని వాడు ,జీవ స్థానమైన హరి భక్తిని ఎప్పుడూ మరిచిపోని వాడు. ఏ కులములో పుడితే ఏమి? ఎవరైతే ఏమి?

03చ. ఈ ప్రపంచములో ఇతరులకు మేలు చేస్తూ తిరిగేవాడు , ఆలోచనలో కూడా ఇతరుల మీద పగ లేక బతికేవాడు, తామరాకు మీద నీటి బొట్టులా, అన్నింటితో కలిసి ఉంటూ కూడా అన్నింటితో కలవనివాడు, ప్రతి విషయము ఆత్మకు సంబంధించినదని తెలిసినవాడు,వేంకటేశ్వరస్వామికి ఆసక్తితో దాసుడైనవాడు ఏ కులములో పుడితే ఏమి? ఎవరైతే ఏమి?

పరమార్థం

ఏ కులజుడేమి యెవ్వడైననేమి

శ్రీ హరిని అంతరాత్మలో సంపూర్ణముగా తెలుసుకొన్నవానికి కులమతాలతో సంబంధము లేదు. అతడు ఏకులములో పుట్టినా పూజనీయుడు. శ్రీ హరిని రామునిగా భావించి అతనిని గురించి సంపూర్ణముగా తెలుసుకొని రామాయణము రచించిన వాల్మీకిది బోయ కులము . అద్భుతమైన పద్యాలు రచించి చిరస్థాయిగా రామాయణాన్ని రచించిన మొల్లది కుమ్మరి కులము. హరి భక్తి ఉన్నవారు కులమతాలతో సంబంధము లేకుండా పూజనీయులు.

"రామనామపఠన మహిమచే వాల్మీకి

పరగ బోయ యయ్యు బాపడయ్యె

కులము ఘనము గాదు గుణము ఘనంబురా

విశ్వదాభిరామ వినర వేమ!" అని వేమన్న అన్నాడు . ఆగుణమే భక్తి అని అన్నమయ్య తీర్పు. భక్తి కులము కంటే గొప్పది.

పరగిన సత్యసంపన్నుడైన వాడే

సత్యము,అమృతము భారతానికి శరీరంగా చెబుతారు.సత్యము, ఋతము అని రెండు మాటలున్నాయి. సత్యము కంటే ఋతము కొంచెం పెద్ద మాట. ఋతము అంటే పరమ సత్యమును తెలియజేయు విజ్ఞానం. పరమసత్యము శ్రీ హరి. ఆ శ్రీ హరి భక్తి సంపదలలో కెల్లా గొప్ప సంపద. ఆ సంపద కలిగి ఉండటమే అన్నమయ్య పంక్తిలోని సత్య సంపన్నత.

పరనిందసేయ తత్పరుడు కాని వాడు

నడిచే దేవుడు, జగద్గురువులు, చంద్ర శేఖర సరస్వతీ స్వామివారు గ్రంథరచన గురించి ఒకసారి ప్రస్తావిస్తూ "1. గ్రంథ రచన అహంకారాన్ని పెంచకూడదు. 2. పరనింద చేయ కూడదు. 3. గ్రంథ రచనతో ధనార్జన చేయకూడదు" అని

మూడు నియమాలు చెప్పారు. (మా స్వామి– 10వ అధ్యాయము).దేవతలలో కూడా ఈ పరనింద జాడ్యం ఉందని కేనోపనిషత్ చెబుతోంది. ఆ జాడ్యాన్ని దుర్గమ్మ తొలగించిందట.

శరీరంలోని ఒక అవయవం ఇంకొక అవయవాన్ని అవయవాన్ని బాధించడం అసహజమైన చర్య. ఆ విధంగానే ఈ ప్రపంచంలో ప్రతి ప్రాణి భగవంతుని అవయవాలు. ఒకరిని నిందించి బాధపెడితే తన శరీరంలోని ఒక అవయవం ఇంకో అవయవాన్ని బాధపెట్టినట్లే. కనుకనే అన్నమయ్య ఎట్టి పరిస్థితులలోనూ పరనింద చేయకూడదంటున్నాడు. హరి భక్తుని లక్షణాలలో పరనింద చేయకపోవటం కూడా ఒకటి.

పరులు తానేయని భావించువాడు

ఇది "ఆత్మవత్ సర్వ భూతాని, సర్వత్ర సమదర్శినః" అను గీతా వాక్యాలకు దగ్గరగా ఉన్న అన్నమయ్య అనువాదం. సమదృష్టితో అందరిని చూడటమనే వాక్యానికి రెండు విభిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇతరులు ఏవి చేస్తే నీ మనస్సుకు కష్టం కలుగుతుందో, అది ఇతరులకు నువ్వు చేయకు .ఎందుకంటే నీకు బాధ కలిగినట్లే పరులకు బాధ కలుగుతుంది కాబట్టి. కనుక పరనింద, హింస లాంటి చెడ్డ పనులు మానుకొని నీవలె ఇతరులను చూసుకొమ్మని ఇదే సమదర్శిత్వమని ఒక వాదన.

ఇక రెండో వాదన.సమదర్శి అంటే తనలో దేవుడిని , దేవుడిలో తనని, అన్ని జీవులలో దేవుడిని చూసేవాడని అర్థం.సమదర్శనుడంటే సమ వర్తనుడు కాదు. భార్య, తల్లి, కూతురు ముగ్గురూ స్త్రీలే. కాని ముగ్గురితో సమానంగా ఉండటం కష్టం. కంచిస్వామి భావాద్వైతం ఉండవచ్చు కాని, క్రియా ద్వైతం ఉండకూడదని హెచ్చరించారు.

కనుక మానవుడు సమదర్శి కావచ్చు. అన్ని భూతాలలో దేవుడున్నాడని భావించు. కాని అన్ని భూతాలయందు సమానంగా వర్తించకూడదు. అందుకే అన్నమయ్య చాలా జాగ్రత్తగా అన్నింటిలోను శ్రీహరి ఉన్నాడు కనుక పరులు తానే అని భావించమన్నాడు.

మర్మమై హరిభక్తి మరవని వాడు

వనే చరామో వసు చాహరామో

నదీ స్తరామో న భయం స్మరామ:
ఇతీరయన్తో విపినే కిరాతా
ముక్తిం గతా రామపదానుషంగాత్

అని ఒక ప్రసిద్ధమైన శ్లోకం ఉంది. దీని అర్థం ఇది.

వనే చరామఃⴂ మేము వనాలలో తిరుగుతాం.;వసు చాహరామ:ⴂ ధనాన్ని అపహరిస్తాం.నదీ స్తరామ:ⴂ నదులను దాటుతాం: న భయం స్మరామ: ⴂ మాకు భయమంటూ ఏమీ లేదు అని అడవులలో ఉండే ఆటవికులు ఆన్నారు. ఆ శ్లోకంలో ప్రతి పాదంలో "రామ" అనే పదం ఉంది. . నాలుగు సార్లు రామ నామాన్ని తెలియకుండానే పలికినందుకు ఆ ఆటవికులకు ముక్తి లభించిందట. దేవుని నామాన్ని పలకటం వలన ఆ శక్తి లభిస్తుంది. తెలియక హరి నామము చేసిన ఆటవికులు తరించారు. తెలిసి హరి భక్తిని, హరి నామస్మరణను కాదనకూడదని అన్నమయ్య హితబోధ.

ఏకులములో పుట్టినా హరి భక్తి ఉన్నవాడు అందరి కంటే శ్రేష్ఠుడు అనే ఈ కీర్తన భావం శిరోధార్యం. స్వస్తి.

27.కాళాంజి

పల్లవి: దేవుఁడు దేవియు నదె తెరదియ్యరె
పూవులదండలు దీసి పువ్వులియ్యవే

చ.1: కన్నుల నిద్దురదేర గక్కన మేలుకొని
వున్నతి మొకాలు చూచే రొకరొకరు
పన్నీ రందియ్యరె పావడలు నందియ్యరె
గన్నన గాళాంజి దగ్గర బట్టరే

చ.2: నగవులు నగుకొంటా నంటున లేచి కూచిండి
వొగి గురులు దిద్దే రొకరొకరు
తగ నద్దాలు చూపరె తతితో బూగాలియ్యరె
వొగరుదేర గస్తూరి వుండ లియ్యరే

చ.3: బిగ్గె గాగిలించుకొంటా ప్రియములె ఆడుకొంటా
వొగ్గిరి రతులకును వొకరొకరు
అగ్గమై శ్రీవెంకటేశు డలమేలుమంగాగూడి
వెగ్గళించే రలపార విసరరే యిపుడు
(రేకు: 0241-2 సంపుటం: 08-242)

అన్నమయ్య- చెలికత్తెలతో కలిసి అమ్మవారికి, అయ్యవారికి ఈ కీర్తన మొదట్లో మేలుకొలుపు పాడి, కీర్తన చివరలో ఏకాంత సేవ చేసాడు.

పల్లవి : అదుగో వెంకన్న స్వామి!
ఇదుగో అలమేలు మంగమ్మ.
వారిద్దరికి మధ్య ఇంకా తెర ఎందుకే ! తియ్యండి.
వాళ్ల మెడలలో పూలదండలు తీసేయ్యండి
పూలు ఇవ్వండి. చాలు

చ1.చూసావుటే ! వాళ్ల కళ్లు నిద్దురతో ప్రసన్నమయ్యాయి . నిర్మలంగా ఉన్నాయి.ఎవరో లేపినట్లుగా వెంటనే(గక్కన) మేల్కొన్నారు.

పరిపూర్ణమయిన (వున్నతి) తమతమ మొగాలను ఒకరినొకరు చూసుకొంటున్నారు.

చల్లని నీరు- అదేనే- పన్నీరు అందివ్వండి. కానుకలు, వస్త్రాలు (పావడలు) అందివ్వండి.

రాత్రి చర్వణము చేసిన తాంబూలపు తునుకలు అలానే నోట్లో ఉన్నట్టున్నాయి. వెంటనే ఉమ్మి వేసే పాత్రలు(కాళాంజి) దగ్గర పెట్టండి.

చ2. ఎలా లేస్తున్నారో చూసారా ! నవ్వులు నవ్వుకొంటూ , ఒకరినొకరు తాక్కుంటూ(అంటున) లేచి కూర్చున్నారు.

చక్కగా (ఒగి)తమ చెదిరిపోయిన వెంట్రుకలను ఒకరికొకరు దిద్దుకొంటున్నారు.

ఎంత బాగుందో కదా !మనం బాగుందంటే సరిపోతుందా? వాళ్లని కూడా వాళ్ల మొగాల అందాలు చూసుకోనివ్వండి.

తగిన అద్దాలు తీసుకు వచ్చి చూపించండి. ఒకటి రెండు కాదు సమూహాలతో వక్కపొలుకులు(బాగాలు) ఇవ్వండి.

నోట్లోని వగరు రుచి తేరుకొనేటట్లుగా కాసిని కస్తూరి ఉండలు ఇవ్వండి.. ఇదివరకు ఒక కీర్తనలో చెప్పాను కదటే.

"చిగురుటధరమున ఎడనెడ కస్తూరి నిండెను."ఇప్పుడు ఆ అందం కళ్లారా చూద్దురు గాని !

చ3. అదుగో ! బిగ్గరగా ఇద్దరూ కౌగిలించుకొంటూ , ఇష్టమయిన ఆటలు ఆడుకొంటూ

ఒకరితో ఒకరు 1. శుద్ధరతి, 2. ఛాయారతి, 3. ప్రతిబింబితరతి, 4. జడరతి, 5. కపటరతి అను రతి సుఖాలకు సిద్ధమయ్యారు(ఒగ్గిరి)

ఒకరికొకరు అధీనమై,(అగ్గమై) శ్రీ వేంకటేశుడు అలమేలు మంగతో కలిసి సుఖాల అంచులలో అతిశయించారు.(వెగ్గళించేరు)

వాళ్ల శ్రమ తీరేటట్లుగా ఇప్పుడు విసరండి.

❖ ❖

పరమార్థం

"అన్నమయ్య వేంకటేశా !నమస్సులు"

"ఆశిషములు."

పల్లవిలో "వాళ్ల మెడలలో పూలదండలు తీసేయ్యండి.పూలు ఇవ్వండి"అన్నారు. కొంచెం వివరణ ఇవ్వరా?

"ఇద్దరికి మేలుకొలుపు చేస్తున్నాను. రాత్రి దాంపత్య మధురిమలో వాళ్ల శరీరాల మీద ఉన్న పూలదండలు నలిగి పోయినట్లు కనిపించింది. వాటిని తీసి వేసి,తాజాగా పూలు ఇవ్వమంటున్నాను.అదే పల్లవిలో రాసాను.

"వేడుకైతే యీయిండ్లకు విచ్చేయవయ్యా (రేకు: 1304-4సం: 23-022) కీర్తనలో నాయికా నాయకుల సుద్దుల (=ముచ్చట్లు) గురించి వర్ణన చేస్తూ"పూవక పూచేపూవులు పూవనవ్వులు" అన్నారు.ఎక్కడయినా పూసిన తర్వాతే పూలు అంటారు. చిగురు, మొగ్గ, పూవు - ఇలా దశలు లేకుండా- ఒకేసారి పూవు పూయదు.కాని వాళ్ల ముచ్చట్లనే పూలు దశలు లేకుండానే పూస్తున్నాయి. పూయటమంటే కమ్మతనం. ఆ కమ్మతనంతో వాళ్ల ముచ్చట్లు ఉన్నాయని భావం. ఈ కీర్తనలో కూడా పూలు అందివ్వమంటే అప్పుడే నిద్ర లేస్తున్న నాయికా నాయకులతో కమ్మగా మాట్లాడండి అని అని అంతరార్థం. అవునాండీ !"

"బాగా చెప్పావు నాయనా !పూవుల వాసనవలె అంతర్లీనంగా ఉండే భావాన్ని పట్టుకొన్నావు. "పూవు బోణుల కొలువే పుష్ప యాగము. పూవక పూచె నీకిట్టె పుష్ప యాగము "(7-60)

28. కొద్దిమాలి

అన్నమయ్య నాయికగా మారి పండరిపురంలో విట'లుని రూపములో ఉన్న వేంకటేశునితో ఈ గీతంలో గద్దించాడు. సరసాలాడాడు.

భక్తుడు దేవునిలో లీనం కావాలని తాపత్రయ పడుతుంటాడు.

ఆ తాపత్రయ భావము ఈ గీతంలో మధుర శృంగారపు దుస్తులు తొడుక్కొంది.

పల్లవి: ఒక్కరీతి నుండదోయి వోవిట్ఠలా
వుక్కువంటి నీచిత్తము వోవిట్ఠలా

చ.1: పొద్దువోయి వచ్చేవు పూచి బాసలు సేసేవు
వొద్దన్నా మానవేల వో విట్ఠలా
కొద్దిమాలి తిరిగేవు కొంగువట్టేవు మమ్ము
వుద్దండా లేలోయి వో విట్ఠలా

చ.2: వెడనవ్వు నవ్వేవు వీదులెల్లా నేగేవు
వొడబాటు లింకానా వో విట్ఠలా
కడుబరాకయ్యేవు కదిసేవు కమ్మరాను
వొడలు మోపకు వోయి వో విట్ఠలా

చ.3: కప్పురాలు చల్లేవు కాగిటిలో భ్రమసేవు
వొప్పితి నీసుద్దులకే వో విట్ఠలా
యిప్పుడె శ్రీవేంకటాద్రి నిరవై కూడితి విదె
వుప్పటించజాల నిక నో విట్ఠలా

(రేకు: 1012-2 సామంతం సంపుటం: 20-068)

అర్థ పరమార్థం

పండరిపురంలో కొలువైన విష్ణుదేవా ! (ఓ విట్ఠలా !) అందరూ నీ మనస్సు ఉక్కువంటిదని, గట్టిగా ఉంటుందని, ప్రతిచోటా చలించదని అంటుంటారు.

ఆమాట తప్పు.

నీ మనస్సు ఎప్పుడూ ఒకేరకంగా, ఒకేచోటా ఉండదు.

చ.1: ఎన్ని వేషాలు వేస్తావు మహానుభావా ! తొందరగా వస్తానన్నవాడివి బాగా ఆలస్యంగా కాని- పొద్దు పోయినతర్వాత కాని రావు.(= పొద్దువోయి)

అప్పుడు పువ్వులా మొగాన్ని వికసింపచేస్తావు. పూయిస్తావు. బాధ్యతంతా నాదే అని ఎన్నో ప్రమాణాలు (=పూచి)చేస్తావు.

నీ మాటలు . నీ ప్రమాణాలు నాకు అక్కర్లేదు అని చెప్పినా మానవేమిటి?

ఇన్ని మాటలు అంటున్నా సిగ్గు లేకుండా(కొద్ది మాలి) నా వెనకాలే తిరుగుతుంటావు. బలవంతం చేస్తుంటావు(ొకొంగుపట్టు)

ఓ గొప్పవాడా ! పొడవైన వాడా (ఉద్దండ) ! చెబితే వినవేమిటి? కాళ్లమీద పడతావు. లే. లే. లేవోయి(లేలోయి)

చ.2: నేను ఇలాఅంటుంటే – ఇది ఇలాగే అంటుందిలే– అనే లెక్కతో – తల కొంచెం పక్కకు తిప్పుకొని కనీ కనబడకుండా కొంచెం నవ్వు

(వెడనవ్వు) నవ్వుతావా ! ఒక్క వీథా తమకు. ! అన్ని వీథులు తమరివే కదా! అన్ని చోట్లా తిరుగుతుంటారు.

ఓ విట్ఠలా ! అన్ని వీథులు తిరిగే నీకు– నాకు మధ్య ఒడంబడికలు– అంగీకారాలు(ఒడబాటులు) ఇంకానా ! ఇంక చాల్లే !

నీ పరధ్యానము (=పరాకు) చాలా గొప్పది. మాములు పరాకు కాదు.అరే ! ఇన్ని చెప్పినా దగ్గరికి వస్తావు.(కదిసేవు) నిన్ను ఆచ్ఛా దించటానికి , నీ కౌగిలిలో వ్యాపించటానికి నేను రాను. (కమ్మరాను)

అరే ! నేను రానని చెబుతున్నా వినిపించుకోవేమిటి? నా శరీరం మీద నీ శరీరం మోపుతావేమిటి? తియ్యి ! పక్కకు తియ్యి!

చ.3: నన్ను ప్రసన్నం చేసుకోవటానికి నా మీద సుగంధ ద్రవ్యాలు(కప్పురాలు) చల్లుతున్నావు. నా కౌగిలిలో వద్దంటున్నా చొరబడి తిరుగుతున్నావు(భ్రమసేవు)

ఓ విట'లా ! ఏమిటో తెలియదు కాని ఎంత అవతల పెడదామనుకొన్నా– నీ మంచి మాటలకు (సుద్దులకు) నిన్ను క్షమించిఒప్పుకొన్నానులే !

అరే ! అలా అన్నానో లేదో ! వేంకట పర్వత స్థానము మీద (=ఇరవు) నన్ను కలిసే కార్యక్రమం ఇప్పుడే (ఇదె) మొదలుపెట్టి పూర్తి చేసావు(కూడితివి)

ఓ విట'లా!నీ దృష్టి తాకేటట్లు నేనేమీ పొగడలేను. ఓర్వలేనితనం చేత ఆడిపోసుకోలేను. (ఉప్పటించజాల). రెండూ చేయలేను. నీకో దండం!

29.కొసరీని

పల్లవి: మిక్కిలి నేర్పరి యలమేలుమంగ
అక్కర దీరిచి పతినల మేలుమంగ

చ.1: కన్నులనె నవ్వునవ్వి కాంతునిదప్పక చూచి
మిన్నక మాటాడీనలమేలుమంగ
సన్నలనె యాస రేచి జంకెన బొమ్మలు వంచి
అన్నువతోఁ గొసరీని యలమేలుమంగ

చ.2: సారెకుఁ జెక్కులు నొక్కి సరుసనె కూచుండి
మేరలు మీరీ నలమేలుమంగ
గారవించి విభునికిగప్పురవిడెమిచ్చి
యారతులెత్తీనదె యలమేలుమంగ

చ.3: ఇచ్చకాలు సేసి సేసి యిక్కువలంటి యంటి
మెచ్చీనతని నలమేలుమంగ
చెచ్చెర కౌగిట గూడి శ్రీ వేంకటేశ్వరుని
అచ్చముగానురమెక్కీ నలమేలుమంగ
(రేకు: 0104-3 సంపుటం: 07-021)

పల్లవి: మా అలమేలుమంగ భర్తగారి అవసరాన్ని, లోటును కనుక్కొని చక్కగా దాన్ని

నెరవేర్చింది.ఆమె మహా జాణ!

1వ చరణం : మా అలమేలు మంగ స్వామివారిని అదేపనిగా చూస్తూ కళ్ళతో నవ్వింది; కొద్దిసేపు మాట్లాడలేదు. తర్వాత ఏది మాట్లాడాలో అది మాట్లాడింది. చేతులతోతదితర అవయవాలతో కొన్ని సంజ్ఞలు చేసింది.అయ్యవారికి ఆశలు రేపింది. దగ్గరగా ఉన్న ,కదిలే బొమ్మలను ఎలా వంచాలో అలా వంచింది; అంతటితో ఊరుకొందా!

కోకిలమ్మలా కొన్ని ప్రత్యేకమైన కూతలు చేసి కొన్ని కోరుకొంది;

2వ చరణం : అయ్యవారి దగ్గరకు చేరి తన చెక్కిలికి, వారి చెక్కిలి నొక్కింది.

దగ్గరగా కూర్చుంది; ఇంకా ఆతర్వాత చెప్పవలసిన పనేముంది.కాసింత హద్దు దాటింది.

స్వామివారికి కర్పూరపు తాంబూలము ఇచ్చింది.ఆ తర్వాత వారు చేసిన ఆనంద కార్యక్రమానికి హారతులిచ్చింది.

3వ చరణం : ఎప్పుడూ చేతలేనా,కాసిన్ని ప్రియమైన మాటలు చెప్పుకొందామని, ముందుగా తాను ప్రియంగా మాట్లాడింది.తదుపరి శరీరంలోని కళాస్థానాల పరస్పర తాకిడితో మై మరచిపోయింది.స్వామివారి చేతలను మనసారా మెచ్చుకొంది.ఇక ఆగలేక–ఎక్కువ బెట్టు చేయకుండానే సులువుగా వేంకటేశ్వరస్వామి వారి కౌగిట్లోకి చేరింది.పాపం ఆయన అలసిపోయిన సందర్భంలో,ప్రసన్నంగా తానే అతని వక్షస్థలం మీదికి చేరింది.

పరమార్థం

అలమేలుమంగ(లక్ష్మి) స్వామివారి వక్షస్థలం మీదే ఉంటుంది.ఈ కీర్తనలో ఉంది. దానిని అన్నమయ్య సుఖభోగంలో స్వామి వక్షస్థలం ఎక్కిందని చమత్కారంగా అన్నాడు.

సొగసుగాడెద గదియించి, జుంటి మోవి గంటి యొనరించి యిక్కువలంటి తుంట వింటి బలుదంట పనులు గావించునపుడు(నీలాసుందరీ పరిణయము)అని –కూచిమంచి తిమ్మకవి ఇక్కువలు అను పదాన్ని ఎంత సొగసుగా ప్రయోగించాడో, అన్నమయ్య కూడా అలానే మధురంగా ప్రయోగించాడు.

శృంగారానికి పరమార్థం ఒకరిలో ఒకరు లీనం కావటం;మోక్షానికి కూడా పరమార్థం జీవాత్మ పరమాత్మలో లీనం కావటం;తన్ను తాను మరచిపోయిన సాన్నిహిత్యం ఉంటేనే స్వామి అనుగ్రహం మనకు లభించగలదనే అన్నమయ్య సందేశం ఈ కీర్తనలో ఉంది.

30. గరిడి

వ్యాయామము చేసే చోటును , లేదా వ్యాయామము నేర్చుకొనే స్థానమును సాము గరిడీలు అంటారు. అన్నమయ్య కీర్తనల్లో గరిడి, గరిడీ - పదాలను ఈ అర్థంలో నే ప్రయోగించాడు.

వలరాయని గరిడి వంటిదివో వలపు(07-212)నగుతా శ్రీవెంకటేశ నంటున నీవు గూడితి/అగపడి నీగరిడినన్నిటా మించీని (08-149)గరిడి సాములు నీవు గనముగ జేయగానో/కురులు చెదరి కడుగొప్పు వీడెను(12-414) మొదలయిన చోట్ల గరిడి అని ప్రయోగించాడు.

కరగించకు మనసు కడపరాయ నాకు గరిడీ నీ కాగిలి కడపరాయ(18-403) మొదలయిన చోట్ల గరిడీ అని దీర్ఘ ప్రయోగముంది.

గరిడా అనికూడా మరో ప్రయోగముంది.ఆ "గరిడా" ప్రయోగమున్న కీర్తనను గమనిద్దాం

పల్లవి: ఏవంక నేరిచితివో యింతేసి నీవు
దేవులచెరువుయేలేతిరువేంకటేశా

చ 1: సారెసారెకు నెత్తేవు సంగడాలా నాచన్నులు
బోరనబట్టేవు చేయిబొందేకోలా
సారె జారె ననెంటేవుచక్రాలా నాపిఱుదులు
నేరుతువోయి సాములు నెలతలతోడనె

చ 2: కామించి పెనగేవిట్టె కంబమా నాకంబుకంఠము
గోమున గాగిలించేవు గోతమా మేను
ఆముకొని వొడ్డుకొనే వమ్ములా నాచూపులు
సాము నీకు జెల్లునయ్య సకియలతోడనె

చ 3: కమ్మటి బుసకొట్టేవు గరిడా నాజవ్వనము
దొమ్మి బట్టితీసేవు ద్రోణమా జడ
ఇమ్ముల శ్రీవేంకటాద్రి నిట్టె నన్ను గూడితివి
కమ్మి సామమరెనోయి కాంతలతోడనె (రేకు: 1337-1సం: 23-217)

అన్నమయ్య మధుర భక్తిలో తనను ఒక నాయికగా భావించుకొని , వేంకటేశ్వరునితో మాట్లాడుతున్నాడు.

అర్థం

పల్లవి: స్వామి పుష్కరిణిని (దేవుల చెరువు) పరిపాలించే శ్రీ ప్రదుడైన , ఓ వేంకటేశా !

ఏ వంక పెట్టుకొని ఇటువంటి (ఇంతేసి) విషయాలు నేర్చావయ్యా ! మాట్లాడుతున్నావయ్యా !

చ 1: మాటి మాటికి నా చన్నులను ఎత్తుతావేమిటి? అవేమన్నా వ్యాయామ సాధనకు ఉపయోగ పడే ఇనుపగుండ్లా(సంగడాలా)

వెంటనే (బోరన) చేతిని పట్టుకొంటావు.అదేమన్నా మల్లులు ధరించే సాధనమా? (బొందెకోలా)

మాటి మాటికి జారిపోతున్నాయని అంటావు.(జారె ననెంటేవు) నా నితంబాలు ఏమన్నా చక్రాలా?

ఆడవాళ్ల తో నీ వ్యాయామాలు(సాములు) నేర్చుకొంటున్నావు.. భలే ఉన్నావు స్వామీ !

చ 2: మోహించి చుట్టుకొంటున్నావు. నా శంఖములాంటి కంఠము ఏమన్నా స్తంభమా? (కంబుకంఠము = conch shaped neck, i.e., a neck marked with three lines like a shell, considered to be a sign of great fortune.) మృదువుగా (గోమున) కౌగిలించుకొంటున్నావు. నా శరీరమేమన్నా గోతమా? (గోతము= మల్లులు సాధనకొఱకు ఱాళ్లు నింపి ఉంచుకొనెడు గోనె.)

అతిశయించి (ఆముకొని) ఏదో దెబ్బ తగలబోతోంది అన్నట్లుగా తప్పుకొంటూ, నటిస్తున్నావు.(ఒడ్డుకొను) నా చూపులు ఏమన్నా బాణాలా(అమ్ములా)

ఆడవాళ్ల తో నీ వ్యాయామాలు(సాములు) సాధ్యమా ! ఊరుకోవయ్యా స్వామీ!

చ 3: ఇదేందయ్యా స్వామీ ! కమ్మటి బుసలు కొడుతున్నావు. నా యౌవనమే మన్నా వ్యాయామము నేర్చుకొనే చోటా?(గరిడా!)

దౌర్జన్యంతో నాతో పెనగి ఆ జడ లాగుతున్నావేమిటి? ఆ జడ ఏమన్నా వ్యాయామంలో తిప్పే ఉక్కు కడ్డీ (ద్రోణము)అనుకొంటున్నావా? (ద్రోణము= A Steel bow used in gymnastics. బ్రౌణ్య తెలుగు-ఇంగ్లీష్ నిఘంటువు 1903)

శ్రీ వేంకటేశా ! సౌకర్యంగా (ఇమ్ముల) ఇలా వెంటనే (ఇట్టె) నాతో కలిసావు.

బండిచక్రానికి తొడిగే ఇనుప కమ్మీల సాములు ఆడవాళ్ల తో – నీకు బాగా కుదిరిందయ్యా!

పరమార్థం

గరిడి అను పదానికి గరుడుడు(గరుత్మంతుడు) అను అర్థాన్ని ఇచ్చి, ఈ కీర్తననే పెద్దలు ఆచార్య రవ్వా శ్రీ హరిగారు తమ అన్నమయ్య పదకోశములో ఉదాహరించారు. (పుట. 625). **గరిడా** అంటే గరుత్మంతుడు అనే అర్థము ఈ పంక్తులలో సరిపోవటం లేదని నేను భావించి వ్యాయామము నేర్చుకొనే చోటా? అని నేను గరిడాకు అర్థమిచ్చాను. దోషమయితే క్షంతవ్యుణ్ణి.స్వస్తి.

31. గబ్బి

పల్లవి: విశ్వరూప నీ మూర్తి వివేకించలేను నేను
శాశ్వతుడ నీవున్నచందమేమీ నెఱిగ

చ.1: నిబ్బరమై లోకమెల్లా నిండుక వుండుదువట
దొబ్బుకొంటా దిరిగేము తోవల నిన్ను
వుబ్బి సముద్రమువలెనున్న నీ ప్రకృతియందు
గబ్బినై యీదుచున్నాడ గలగకుమీ

చ.2: కడయు మొదలులేని కాలము నీతనువట
నడుమ నందుతోనే పెనగుచున్నాడ
అడరి నీ సొమ్ములైన ఆత్మలలో నొకడనై
చిడుముడినున్నవాడ చిక్కువఱచకుమీ

చ.3: పరమున నిహమున బ్రబలియున్నాడవట
గరిమ సోదించేము కమ్మటి నిన్ను
ఇరవై శ్రీవేంకటేశ నిన్నిటా నిన్ను నేము
శరణు చొచ్చితిమిక చనవిచ్చి కావుమీ (రేకు:0240-05సం:03-231)

అర్థపరమార్థం

శ్రీ వేంకటేశా ! అన్ని రూపాలలో ఉండేవాడా ! (విశ్వరూపా) నీ ఆకారము ఇది అని నేను ఊహించలేను (=వివేకించలేను)

ఓ శాశ్వతంగా ఉండేవాడా ! తాత్కాలికంగా ఈ భూమి మీద ఉండే వాడిని నేను, నీ విధానమేమిటో (చందము) నాకు తెలియదు. తెలుసుకోలేను.

చ.1: నువ్వు లోకమంతా నిండి పోయి ధైర్యముగ స్తిమితముగ (నిబ్బరమై) ఉంటావట.

నిన్ను వెతికే దారుల్లో కంగారుగా నెట్టుకుంటూ (దొబ్బుకొంటా)మేము తిరుగుతుంటాము.

(దారులు అంటే ద్వైతము మొదలైన సిద్ధాంతాలు)

నీ స్వభావము పొంగుతున్న(ఉబ్బి) సముద్రములాంటిది. దాంట్లో కుక్కనై, గర్వము కలిగినవాడినయి (=గబ్బి) నేను తీరమెక్కడో తెలియక ఈతకొడుతున్నాను.

చెదిరిపోకు (=కలగకుమీ)(అంటే మా మీద కోపం చూపించకు అని భావం)

చ. 2:

చివర మొదలు లేని కాలమనే శరీరము నీదట.

ఆ కాలము మధ్యలోనే దిక్కులేక పోరాటము చేస్తున్నాను.

ఈ జీవాత్మలు అన్నీ వ్యాపించిన (=అడరి) నీ సొమ్ములు. వాటిలో ఒక జీవాత్మను నేను

చీకాకు, కోపం, ఈర్ష్య, సంభ్రమం, తొందర– ఇలాంటి లక్షణాలతో ఉన్నవాడిని నేను. (చిడుముడినున్నవాడ). చిక్కులు పెట్టకు.

చ. 3: పరలోకములోను. ఈ లోకములోను నువ్వు వ్యాపించి వర్థిల్లుతున్నావట (ప్రబలియున్నాడవట)

కమ్మతనము కలిగిన నిన్ను లేనిపోని గొప్పతనము (గరిమ) తెచ్చుకొని వెతుకుతుంటాము.

(కమ్మతనము కలిగిన వాయువువంటి వాడు స్వామి. ఆయన ఉనికి వాయువులా తెలుస్తుంటుంది. కాని ఆయనను చూడాలనుకోవటం కమ్మని గాలిని చూడాలనుకోవటమని – కవి భావన. కాని – ఆయనను చూడగలమనే – లేనిపోని గొప్పతనం తెచ్చుకొని భక్తులు ప్రయత్నిస్తుంటారని కవి వాక్కు)

ఓ వేంకటేశా ! నువ్వు స్థిరంగా , ఈ వేంకటాద్రిలో ఇక్కడ స్థానం కలిగిఉన్నావు.(ఇరవై)

మేము (నేము) నిన్ను శరణు కోరుతున్నాము. ప్రేమను(చనవు) మాకు ఇచ్చి మమ్మలిని రక్షించుఈ

32. గాలిమూట

శరీరానికి గాలిమూట అని అందమైన పేరు పెట్టాడు అన్నమయ్య. పోతన భాగవతంలో "కంజాక్షునకు గాని కాయంబు కాయమే పవన గుంభిత చర్మ భస్త్రి గాక" అని,రంగనాథరామాయణములో "పతి కౌగలింపని పడతి కాయంబు పవన గుంభిత చర్మ భస్త్రిగాకేమి" అనీ ప్రయోగాలు ఉన్నాయి. ఇవి గాలి మూట కున్నంత స్నిగ్ధత పవన గుంభిత చర్మ భస్త్రి కి లేదేమో !

శరీరంలో ఉండే వాయువులు(గాలులు) మొత్తం పది. ఇందులో ఐదు మహా వాయువులు. మిగిలినవి ఉప వాయువులు.

మహా వాయువులను పంచ ప్రాణాలంటారు. అవి 1. ప్రాణవాయువు, 2. అపానవాయువు, 3. వ్యానవాయువు, 4. ఉదానవాయువు, 5. సమానవాయువు. ఉప వాయువులు అయిదు 6. నాగము, 7. కూర్మము, 8. కృకరము, 9. దేవదత్తము, 10. ధనంజయము

ఈ పదివాయువులలో ప్రాణము మొదటిది ప్రధానమైనది. ప్రాణవాయువు హృదయ స్థానములో ఉంటుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసములతో జీవనానికి ఆధారమై ప్రాణాన్ని నిలబెడుతోంది . జీవిని లోకములో ప్రయాణము చేయిస్తోంది కాబట్టి దీనిని ప్రాణమంటారు.

ఆహారాన్ని జీర్ణము చేసి మలమూత్ర శుక్ర రూపములో క్రిందికి త్రోసేది అపానవాయువు.

శరీరమును ఎటూ కావలిస్తే అటు వంగునట్లు కదలునట్లుచేస్తూ, కంఠముదాక వ్యాపించియుండి, ఆహార విహారాదులలో ఏమాత్రం తేడా వచ్చినా వ్యాధులు కలిగించేది వ్యానవాయువు.

ముఖాన్ని , పెదవులను, కన్నులకు అదురునట్లు చేస్తూ కామక్రోధాలను ఉత్తేజ పరిచేది ఉదానవాయువు.

రక్తముగా, పిత్తముగా, శ్లేషముగా, త్రాగిన వానిని, తిన్నవానిని మార్చి, శరీరానికి సమానముగా అందజేసేది సమానవాయువు...

వాంతి కలిగించేది నాగవాయువు.

కన్నులు తెరచునట్లు చేసేది కూర్మవాయువు.

ఝింగుటలో సహాయపడేది కృకరవాయువు.

ఇంద్రియాలను విజృంభించునట్లు చేసేది దేవదత్తవాయువు.

ప్రాణము పోయినప్పటికీ, శరీరాన్ని దహనమయ్యేవరకు అంటిపెట్టుకొని ఉండేది ధనంజయవాయువు.

ఈ పది వాయువులతో నిండియున్న ఈ శరీరానికి గాలిమూట అని పేరు పెట్టి కీర్తనలో ఎంత చక్కగా వర్ణించాడో తెలుసుకొందాం.

పల్లవి: దేవు డొక్కడే మాకు దిక్కుగాని
కావ నెవ్వరును లేరు కతలించే కాని

చ.1: పచ్చివొళ్లు మోచితిమి పాపమెల్లా జేసితిమి
హెచ్చిన మీదటి సుద్దు లేటివో కాని
రచ్చలబడె మా గుట్టు రమణుల చేత బెట్టు
అచ్చమై యిందుకుబరిహరమేదో కాని

చ.2: గాలిమూట జిక్కితిమి కన్నచోటే తొక్కితిమి
ఆలించి యేమిటివారమయ్యేమో కాని
మైల గొంత మనసూ మణుగు గొంతానాయ
తాలిమి నా విధి యేమి దలచీనో కాని

చ.3: మాయల బొరలితిమి మరచితి మింతలోనే
చాయల శ్రీవేంకటేశు శరణంటిమి
రోయజొచ్చె జగమెల్లా రుచియాయ వైరాగ్య-
మాయము నాలోపలి అంతరాత్మేకాని (రేకు: 0292-03 సం: 03-532)

అర్థం

పల్లవి: వాడున్నాడని, వీడున్నాడని చెప్పే మాటలన్నీ అబద్ధాలు. దేవుడు తప్పించి దిక్కు ఎవ్వరు లేరు. అలా ఉన్నారని చెబితే అవి కథలు

చ.1: రక్తము మొదలయిన వాటిచే ఆర్ద్రమైన, చీమునెత్తురులతో కూడిన శరీరాన్ని (పచ్చివొళ్లు) మోసాము. ఎన్ని పాపాలు చేయాలో అన్ని పాపాలు చేసాము.

దీనికి మాకు ముందు ముందు ఏ విషయాలు మేము అనుభవించాలో తెలియదు.

అందమైన ఆడవాళ్లచేత మా ధైర్యం, గుట్టు అన్నీ వీధులలో పడ్డాయి. (రచ్చలబడె)

స్పష్టంగా దీనికి పరిహారం ఏముందో తెలియదు.

చ. 2: ప్రాణ వాయువులతో నిండిన ఈ శరీరములో చిక్కుకున్నాం.

ఏ ప్రదేశంలో మా తల్లులు మమ్మలిని కన్నారో, ఆ కన్న చోటునే మా సుఖాలకు నిలయం చేసుకొన్నాం.(కన్నచోటే తొక్కితిమి)

శ్రద్ధగా ఆలోచిస్తే ఏమవుతామో తెలియదు

అసలే మాలిన్యం శరీరంలో కొంత ఉంది. ఇంకొంత ఈ మనస్సు కోరికల రెట్టింపు బరువు ఓర్పుతో నా విధి- నా గురించి ఏమి ఆలోచించిందో, ఏమి చేయాలనుకుందో తెలియదు.

చ. 3: ఎన్నో మాయలలో , ఎన్ని జన్మలలో ఈ శరీరాలతో పొర్లామో తెలియదు. ఇంతలోనే అన్ని మరచిపోతుంటాము.

(మా' అంటే లేదు, కాదు. -'యా'అంటే 'ఏది. ఏది లేదో, ఏది కాదో అది మాయ. శంకరాచార్యుల వారు 'మాయ'ను అచింత్యం అన్నారు. అసత్తూ కాదు, సత్తూ కాదు అని భావం.)

వేంకటేశా ! నీ సమీపంలో (చాయల) నిలబడి నీకు శరణు అని వేడుకొంటున్నాం

ఈ ప్రపంచము మొత్తం మీద రోత కలుగుతోంది.వైరాగ్యములో (లౌకిక సుఖములలో ఇష్టం లేక పోవటం) ఇష్టం ఏర్పడుతోంది.

అయిన నాలోపలి అంతరాత్మ యే అసలయిన రహస్య స్థానము.(ఆయము)

(కీలకమయిన అంతరాత్మని వైరాగ్యము మీద స్థిరంగా ఉంచమని స్వామికి విన్నపము)

పరమార్థం

గాలి శబ్దంతో అన్నమయ్య చాలా పదాలు సృష్టించాడు.

గాలికూటివానిపై (కాళియుడు)ఆడి, గాలి రాకాసుని (తృణావర్తుడు) చంపి,గాలిబిడ్డ తమ్ముునితో(అర్జునునితో) స్నేహము చేసినవాడు కృష్ణుడని ఒక కీర్తనలో అన్నమయ్య పొగిడాడు. (07-087)

వేంకటేశుని **"గాలికూటి పేరిగట్టు మీదటి వాడు"(10-117)** అన్నాడు అన్నమయ్య. గాలికూడు అంటే పాము. ఆదిశేషుడు. ఆయన పేరుతో ప్రసిద్ధమైన కొండ శేషాద్రి. ఆ శేషాద్రి మీద ఉండే వాడు వేంకటేశుడు.

ఆ గాలికూటి పేరిగట్టు మీదటి వాడు - గాలి మూటలు (శరీరాలు) ధరించిన మనలిని కాపాడుగాత! స్వస్తి.

33. గిరిపితే

పల్లవి: హరి నీ ప్రతాపమున కడ్డమేది లోకమున
సరివేరీ నీకు సర్వేశ్వరా

చ1. నీవు నీళ్ళు నమిలితే నిండెను వేదములు
యీవల దలెత్తితేనే యింద్ర పదవులు మించె
మోవ మూతి గిరిపితే మూడు లోకాలు నిలిచె
మోవి బార నవ్వితేనే ముగిసిరసురలు

చ2 :గోరై గీరితే నీరై కొండలెల్ల దెగ బారె
మారుకొంటే బయిటనే మడుగులై నిలిచె
చేరి యడుగువెట్టితే శిలకు బ్రాణము వచ్చె
కూరిమి గావలెనంటే కొండ గొడగాయను

చ3 : కొంగు జారినంతలోనే కూలెను త్రిపురములు
కంగి గమనించితేనే కలిదోషములు మానె
రంగుగ నీ శరణంటే రక్షించితి దాసులను
ముంగిట శ్రీ వేంకటేశ మూలమవు నీవే (2-156)

తాత్పర్యము:

అన్నమయ్య దశావతారాలను ఈ కీర్తనలో ప్రశంసిస్తున్నాడు.

ఓ హరీ ! నీ పరాక్రమానికి ఈ లోకంలో అడ్డులేదు. సర్వ ప్రపంచానికి ప్రభువా! నీకు సమానమైన వారు ఈ లోకంలో ఎవరూలేరు.

చ1. స్వామీ ! నువ్వు మత్స్యావతారంలో నీళ్ళు నమిలావు. కాదయ్యా ! ఆ రాక్షసుడితో నీళ్ళు నమిలించావు. వేదాలు ఉన్నతిని పొందాయి. కూర్మావతారంలో మందరపర్వతం కింద ఉండి దానినికొంచెం ఎత్తావు. కాదయ్యా! మా దేవతల తలలను గౌరవంతో ఎత్తించావు. ఇంద్రాదులకు వాళ్ల పదవులు వాళ్లకు దక్కి మించిపోయారు. వరాహావతారంలో మూతిని కొంచెం తిప్పావు. కాదయ్యా ! అసూయతో రాక్షసులు మూతి తిప్పుకొనేటట్లు చేసావు. వాళ్ళకు మూడింది. మూడు లోకాలు నిలిచాయి. నరసింహావతారంలో గర్జిస్తూ పెదవుల మీద ప్రవహించేటట్లు ఒక నవ్వు నవ్వావు. కాదయ్యా! ప్రశ్నించిన హిరణ్య కశిపుడనే

రాక్షసుని నవ్వుల పాలు చేసావు. ఆ రాక్షసుల కథ ముగిసింది.

చ2. వామనావతారంలో విజృంభిస్తూ గోటితో గీరావు. గంగమ్మ కొండలను చీల్చుకొంటూ ప్రవహించింది. పరశురామావతారంలో క్షత్రియులను సంహరించి వారి రక్తాలను మడుగులుగా ప్రవహింపచేసావు. రామావతారంలో రాయి మీద అడుగు పెట్టావు. ఆ శిలకు ప్రాణము వచ్చింది. క ృష్ణావతారంలో గోవర్ధన పర్వతాన్ని గొడుగుగా చేసి ప్రేమతో గో గోపాలకులను రక్షించావు.

చ3. బుద్ధావతారంలో కొంగు జారింది. రాక్షస సంహారం జరిగి త్రిపురాలు జారిపోయాయి. రాబోయే కల్క్యావతారంలో నువ్వు ఒక్కసారి గమనిస్తే చాలు కలియుగ దోషాలన్నీ పోతాయి. చక్కగా నీ శరణంటే చాలు. దాసులందరిని రక్షిస్తావు. వేంకటేశ్వరా ! ఈ ప్రపంచానికి మూలమైన వాడివి నీవే.

పరమార్థం

నీవు నీళ్ళు నమిలితే నిండెను వేదములు

నైమితిక ప్రళయంలో భూమి మొదలయిన లోకాలన్నీ నీళ్లతో మునిగిపోయాయి. ఆ సమయంలో బ్రహ్మకి నిద్రవచ్చింది.. ఆయన నోటి నుంచి వేదాలు జారిపడ్డాయి. హయగ్రీవుడనే రాక్షసుడు వీటిని దొంగిలించాడు. అప్పుడు శ్రీహరి మత్స్యావతారాన్ని ధరించి హయగ్రీవుని దగ్గరనుంచి వేదాలను గ్రహించి బ్రహ్మదేవునికి తిరిగి ఇచ్చాడు. నీళ్లు నమలటమంటే ఇక్కడ చేప నీళ్ళలోనికి చొచ్చుకొని పోవటమని అర్థం.నిండు అంటే పూర్ణత్వము. వేదాలు చేరవలసిన చోటికి చేరాయి కాబట్టి వాటికి నిండుతనము వచ్చిందని చెప్పటానికి **నిండెను వేదములు** అని అన్నమయ్య అన్నాడు.

యీవల దలెత్తితేనే యింద్ర పదవులు మించె

దేవాసురులు మందరగిరిని కవ్వముగా జేసి, పాల సముద్రాన్ని చిలికినపుడు పర్వతం కుంగి పోయింది, అప్పుడు కూర్మ రూపమెత్తి మందర గిరిని ఎత్తి విష్ణువు దేవతలను రక్షించాడు. ఇక్కడ పర్వతపు కొన ఎత్తటమే తల ఎత్తటం.

మోవ మూతి గిరిపితే మూడు లోకాలు నిలిచె

వంగి ఉన్న రూపం గలవాడే తనను వధించాలని హిరణ్యాక్షుడు కోరుకొన్నాడు. అందుకే వరాహావతారం వచ్చింది. 'వర' అంటే శ్రేష'మైన, ' అహం ' అంటే నేను లేదా ఆత్మ అని అర్థాలు. గొప్పదయిన ఆత్మ వరాహము. పాతాళంలో కనిపించిన

భూమిని వరాహమూర్తి తన కోరలతో పైకి తీసుకువస్తున్నప్పుడు హిరణ్యాక్షుడు అడ్డుపడ్డాడు. అతడిని వరాహమూర్తి సముద్రంలోనే చంపి , భూమిని నీటిపైకి తెచ్చాడు . ఈ పాదంలో అన్నమయ్య కవితాచమత్కారం ఉంది. ఆది వరాహంగా మూతిని తిప్పాడు. అంటే చలనం. కాని మూడు లోకాలు నిలిచాయి. అంటే స్థిరత్వం. చలనం స్థిరత్వానికి కారణమయిందని చమక్కు.

మోవి బార నవ్వితేనే ముగిసిరసురలు

నరసింహుడు హిరణ్యకశిపుడిని చేతులతో పట్టి పైకి ఎత్తాడు. లోపలా బయటా కాకుండా గుమ్మం మీద కూర్చున్నాడు. భూమి మీద ఆకాశంలో కాకుండా తొడలమీద పరుండబెట్టాడు. గోళ్లనే ఆయుధములుగా చేసుకున్నాడు . వాడి పొట్ట చీల్చాడు. అందరిని ఆనందింపచేసాడు. ఇక్కడ సింహ గర్జనను నవ్వుతో పోలుస్తున్నాడు కవి. అంటే అదెలాంటి నవ్వో ఊహించుకొంటేనే గుండె లదురుతాయి.

34. గుక్కిళ్లు

గుటకలు అను పదానికి అన్నమయ్య గుక్కిళ్లు అను ఇంకో పదాన్ని సృష్టించాడు. తినటానికి ఇష్టపడిన వెంటనే నోట రసమూరి మ్రింగుటను "గుటకలు మ్రింగుట" అంటారు. ఉవ్విళ్లూరుటను "గుటకలువేయుట" అంటారు. మ్రింగి వేయుటను "గుటకాయస్వాహాచేయుట" అంటారు. అన్నమయ్య సృష్టించిన. ఒక కీర్తనలోని మూడు పాదాలలో ఈ అర్థాలున్నాయి.ఆ గుక్కిళ్ల అందాల కీర్తన చూద్దాం.

పల్లవి: కోరి నీకు నీయందే గుక్కిళ్ళున్నవి
యేరీతైనా జేయవచ్చునేమి గొరతయ్యా

చ.1: పయ్యదలో నీచెలికి పసిడిబిందెలున్నవి
తియ్యని మోవిలోన తేనెలున్నవి
అయ్యెడ మాటల బెల్లాలప్పటి గొన్ని వున్నవి
యెయ్యెడ జూచిన నీకు యేమి గొరతయ్యా

చ.2: చెంది యాపెమోములోనే చెక్కుటద్దములున్నవి
కందువచూపు ముత్యాల గనులున్నవి
మందలించిన కాగిట మర్మములెల్లానున్నవి
యెందునైనా నీసిరులే యేమిగొరతయ్యా

చ.3: అవిగో కమ్మని వూర్పులాలవట్టములున్నవి
తవిలిన రతుల నిధానమున్నది
కవగూడితిరి శ్రీ వెంకటరాయ మీరిద్దరు
యివల జూచిన మరియేమి గొరతయ్యా

(రేకు: 0206-4 సంపుటం: 08-034)

అర్థం

పల్లవి: వేంకటేశ్వరా ! నీకు నీయందే గుటకలు ఉన్నాయి.

ఏ రకంగానయినా నువ్వు చేయవచ్చు. తక్కువ ఏమి ఉంది? (నీకు కావలిసినవన్నీ నీ నాయిక అందాలను చూసి నువ్వు వేసే నీ గుటకలలోనే ఉన్నాయి. నువ్వు ఏమైనా చేయవచ్చు. నీకు తక్కువేమిటని భావం.)

చ. 1: నీచెలికి పయ్యదలో బంగారు బిందెలున్నాయి
ఆమె తియ్యని పెదవిలో తేనెలున్నాయి.

అక్కడ(అయ్యెడ) – అదేనయ్యా – ఆ పెదవులలో – మరల మరలా ఊరే (అప్పటి) తీయని మాటలు(మాటల బెల్లాలు) కొన్ని ఉన్నాయి.

ఎక్కడ చూసినా – ఎప్పుడు చూసినా (ఎయ్యెడ) గుటకలు మింగటానికి నీకు ఏమి తక్కువ ఉంది చెప్పు.

చ. 2: అమె ముఖానికి మాత్రమే చెంది– (ఇక వేరే వాళ్లకు లేవు సుమా) చెక్కిళ్లు అనే అద్దాలున్నాయి.

ఆమె చమత్కారాల చూపుల్లో (కందువ చూపు) ముత్యాల గనులున్నాయి.

నువ్వు కొంచెం చొరవ చూపించబోతుంటే మందలించిన ఆమె కౌగిలిలో రహస్యాలన్నీ ఉన్నాయి.

ఎక్కడున్నా – ఆసిరులు సంపదలు నీవే కదయ్యా ! ఇక నీకు గుటకలు వేయటానికి ఏమి కొరత?

చ. 3: అవిగో –ఆమె కమ్మని శ్వాసలలో వస్త్రముతో గుండ్రముగాజేసిన విసనకఱ్ఱలు (ఆలవట్టములు)ఉన్నాయి.

ఆసక్తికలిగిన (తవిలిన) మీ సుఖాలలో (రతుల) నిధి నిక్షేపాలున్నాయి (నిధానమున్నది)

శ్రీ వెంకటేశా ! మీరిద్దరు జతకట్టారు. (కవగూడితిరి)

ఈ వైపు చూస్తే – అదేనయ్యా– నీగుటకాయ స్వాహా వైపు చూస్తే– – నీకు ఏమి తక్కువుంది ? అని మాకు అనిపిస్తుంది.

పరమార్థం

ఎక్కడున్నా – ఆసిరులు సంపదలు నీవే కదయ్యా ! అనే వాక్యంలో అయ్యవారికి, అమ్మవారికి మధ్య తేడా లేదని, అన్నమయ్య సూచించాడు.ఒకటి రెండుగా మారిందన్న విషయాన్ని సూచిస్తూ, రెండు – ఒకటి కావటానికి లోకంలో పడే అందమైన గుటకలను కవి ఈ కీర్తనలో వేంకటేశుని ముఖంగా సూచించాడు.

గుక్కిళ్లు చవిగొన్నయందాక (01–249)ఆకటికి గుక్కిళ్లు ఆసయినట్టు(02–096) వొక్కటే పదార్థము వూరివారెల్లా జూచితే/గుక్కిళ్లు మింగించి యాసకొలుపు చుండు (02–353) కోరి మోవితేనెలంటే గుక్కిళ్లు మింగ నేల:(09–104)– ఇలా చాలా చోట్ల అన్నమయ్య భావనలు గుటకలు వేయిస్తాయి. స్వస్తి.

35. గుగ్గిలిపదను

పల్లవి : పలుమరు వుట్ల పండుగను
చిలుకు చిడుక్కని చిందగను

చ1. ఊళ్ళవీధుల వుట్లు కృష్ణుడు
తాళ్ళు దెగిపడ దన్నుచును
పెళ్ళు కఠిల్లు పెఠిల్లు చిఠిల్లని
పెళ్ళుగ మ్రోసె పెనురవము

చ2. బంగారు బిందెల బాలు బెరుగులు
ముంగిట నెగయుచు మోదగను
కంగు కళింగు కఠింగు ఖణింగని
రంగు మీరు పెను రవములై

చ3. నిగ్గుగ వేంకట నిలయుడుట్టిపా
లగ్గలిక బగుల నడువగను
భగ్గు భగిల్లని పరమామృతములు
గుగ్గిలి పదనుగ గురియగను(05-057)

కృష్ణాష్టమిని జానపదులు ఉట్ల పండుగ అంటారు. రేపల్లెలో జరుగుతున్న ఉట్ల పండుగలో వెన్న , పాలతో కూడిన ఉట్టిని వేలాడదీస్తూ పైకి కిందికి లాగుతూ ఉండగా ఆ ఉట్ల కుండనుండి జారుతున్న పాలు వెన్న చప్పుళ్లు కింద పడుతూ చిడుక్కని మోగుతున్నాయి. (చిడుక్కు= అల్ప ధ్వనికి అనుకరణ శబ్దం)

చ1. ఆ రేపల్లె ఊరులో వీథులలో శ్రీ కృష్ణుడుపైకి ఎగిరి ఉట్లకు కట్టిన తాళ్ళు తెగిపడేటట్టు తంతూ ఉట్లను పగుల గొట్టినప్పుడు, కేకలతో, ఆనంద కోలాహలాలతో పెద్దగా కఠిల్లుపెఠిల్లు చిఠిల్లని చప్పుళ్లు వచ్చాయి. చెవులు గింగిరాలు తిరిగేటట్టు పెద్ద శబ్దము పెళ్లున మోగింది.

చ2. పాలు పెరుగులతో బంగారు బిందెలు నిండుగా ఉన్నాయి. ఉట్టిలో ఉన్న వాటిని కొట్టాలని పిల్లలతో కృష్ణుడు వాటి ముందు ఎగురుచూ కొట్టుచుండగా కంగుమని, కళింగుమని, కఠింగుమని, ఖణింగని (లోహమును కొట్టునప్పుడు కలుగు ధ్వని) పెద్ద చప్పుళ్లు వాతావర ణములోమోజును పెంచుతూ వినబడుతున్నాయి.

చ3. చక్కటి కాంతితో వేంకటేశ్వరుని అవతారమైన కృష్ణుడు పాలతో నిండిన ఉట్లను చుట్టూ ఉన్న అందరికంటే ఆధిక్యముతో ఎక్కువగా పగులగొట్టగా, పైన ఉన్న ఆ ఉట్ల నుండి ఆ పంచామృతాలలో ఒకటైన పాలు ఒక్కసారిగా భళ్లున, ధారగా కురుస్తున్నాయి.

పరమార్థం

పాత్రలుంచుకొనుటకై ఇళ్లల్లో తాళ్లతో వేలాడదీసిన ఒక అల్లికను ఉట్టి అంటారు.

ఉట్టి పదం ఇప్పటికీ తెలుగు వారి వ్యవహారంలో జీవించి ఉన్న పదం. "ఉట్టిగా (ఊరికే) మాట్లాడాను" ; "ఉట్టిగట్టుకొని వేలాడటం" (– అంటే చావకుండా స్థిరంగా ఉండటం.) ఇలా ఉట్టి మాటలు దొర్లుతుంటాయి.

'ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికివెళుతుందట' అని ప్రసిద్ధమైన సామెత. కొంచెం ఎత్తులో ఉన్న ఉట్టిని ఎక్కటం చేతకానివాడు, చాల ఎత్తులో ఉన్న స్వర్గాన్ని ఎలా చేరుకొంటాడు? చిన్నపాటి పనులు చేయలేనివాడు పెద్ద పనులు ఏమి చేస్తాడు ? అని ఈ సామెతకు అర్థం. ఎగతాళి చేసే సందర్భంలో ఈ సామెత వాడుతున్నారు. అయితే 'ఉట్టికెక్కట'మనే పదబంధాన్ని 'మూలబడు' అనే అర్థంలో అన్నమయ్య వాడాడు.("ఉట్టికెక్కు నీ సిగ్గులు నో బావ." 3వ సంపు–172)

ఉట్టి కొట్టే పండుగ కొంత మార్పు తో ఈ రోజు జరుగుతోంది. నునుపైన స్తంబం కొసలో డబ్బులసంచి పెడతారు. స్తంబం ఎక్కి తీసి కొనగలిగిన వ్యక్తిదే ఆ సొమ్ము. కాని అతడు పైకెక్కటాన్ని చాలామంది నీళ్లు చల్లి ఆపుతుంటారు. దీనినే కొన్ని ప్రాంతాల్లో 'ఉట్టి తిరునాళ్ల 'అంటారు.ఉట్ల తాళ్లను తెలంగాణా ప్రాంతంలో 'ఉట్టి శేర్లు' అంటారు.

మహారాష్ట్ర వంటి ప్రాంతాల్లో ఒక చిన్న కుండ లేదా బుడ్డీలో పెరుగు పోసి ఎంతో ఎత్తున కడుతున్నారు. ఉట్టిని ఇక్కడ 'దహీహండీ' అంటారు. ఆ ఉట్టిని పగులకొట్టడానికి యువకులు పోటీ పడుతుంటారు. ఎవరు పగులకొడితే వారిని విజేతలుగా ప్రకటిస్తారు. విజేతలకు లక్షల కొద్దీ బహుమతులూ ఉంటాయి. ఇది ఉట్టి పదం చుట్టూ ఉన్న కొంత చరిత్ర.

పంచామృతములు నీళ్లు, పాలు, పెరుగు, నెయ్యి, తేనెబీ వీటిలో పాలను పరమామృతంగా చెబుతూ , ఉట్లనుండి పాలు భళ్లున కారుతున్నాయని అన్నమయ్య చివరి చరణంలో పేర్కొన్నాడు.

సాధారణంగా 'వు, వూ' అనే అక్షరాలతో మొదలయ్యే తెలుగు పదాలుండవు. కాని అన్నమయ్య నిరంకుశుడు. 'ఉట్టి' అనాలి. కాని అన్నమయ్య 'వుట్టి' అంటాడు. ఆయన మన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలిచ్చే వేంకటేశుని ఆస్థాన గురువు. అందుకే భాషా విషయికంగా ఆయన్ని ప్రశ్నించే అధికారం ఎవరికీలేదు.

అన్నమయ్య ఈ గీతంలో వాడిన 'పెళ్ళు కఠిల్లు పెఠిల్లు చిఠిల్లు' శబ్దాలలో పెళ్లున అనే పదం మాత్రమే ఇప్పుడు వాడుకలో ఉంది. భేరీమృదంగములు పెళ్లున మోగాయి. అంటే పెద్దగా మోగాయని అర్థం. చెట్టు పెళ్లున విరిగింది. అంటే పెద్ద చప్పుడు చేస్తూ విరిగిందని అర్థం. అలాగే కృష్ణుడు కొట్టిన ఉట్టి చప్పుడు చేస్తూ పగిలిందని చెప్పటానికి పెళ్లు శబ్దంతో పాటు 'కఠిల్లు పెఠిల్లు చిఠిల్లు శబ్దా'లను అన్నమయ్య కలిపాడు. ఈ నాలుగు ధ్వన్యనుకరణ శబ్దాలు వరుసగా ప్రయోగింపబడటం వల్ల గీతంలో అందమైన తూగు వచ్చింది. ఉట్టి కుండలు అనేకం ఒకేసారి పగిలిపోతున్న అనుభూతి ఈ అనుకరణ శబ్దాల సమాహారంతో కవి కలిగించాడు.

వెన్నా పాలూ చేతికి అందకపోతే కృష్ణుడు ఆ పాలకుండని పగులకొట్టేవాడని భాగవతంలో ఉంది. (సంస్కృత భాగవతం –దశమస్కంధం– ఎనిమిదవ అధ్యాయం) బహుశా ఇదే ఉట్టి కొట్టే ఆచారంగా మారి ఉంటుంది. పాల కుండ పగులకొట్టడంలో అర్థమిది: ఈ శరీరానికే కుండ అని పేరు. పరమాత్మ సేవ చేయకుండా స్వార్థముగా ఉంటే ఆ కుండని (శరీరాన్ని) పగలగొట్టి పరమాత్మ వేరే శరీరాన్నిస్తాడు.

గోపికలందరూ ఇంటి పనులలో మునిగి ఉంటే కృష్ణుడు చీకటి గదిలోకి వచ్చేవాడు. తన చేతికి ఉన్న కంకణాలూ మణులూ రత్నాల కాంతితో కనపడే పాలూ పెరుగూ వెన్న కుండలను పగులకొట్టేవాడు. (సంస్కృత భాగవతం– దశమ స్కంధం – ఎనిమిదవ అధ్యాయం)

మనం సంసారములో పడి, దేవుని మరచిపోయి, అజ్ఞానమనే చీకటి గదిలోఉంటాం. పరమాత్మ యొక్క దివ్యమైన ఆభరణాల వెలుగులు అన్నమయ్య లాంటి గురువులు. ఆగురువులు చెప్పినది విని, ఆ కాంతిలో అసలు వస్తువును కనుక్కొనే ప్రయత్నం చేస్తే , స్వామి ఈ కుండని (శరీరాన్ని) ఖాళీ చేసి మోక్షం కలిగిస్తాడు. ఇదే కుండ పగులకొట్టడం. ఉట్టి పగులకొట్టడం. స్వస్తి.

36.చంచుల

పల్లవి: కోరికలు కొనసాగె గోవిందరాజా
మేరమీరి ఇట్లానే మెరసితివా

చ1. బాలుడవై రేపల్లెలో బాలుదాగేవేళ
యీలీలనే పవళించి యిరవైతివా
గోలవై తొట్టెలలోన గొల్లత లూచిపాడగా
ఆలకించి విని పాట లవధరించితివా

చ2. కొంచక మధురలోన గుబ్జయింట నీలాగుల
మంచాలపై బవళించి మరిగితివా
చంచుల ద్వారకలోన సత్యభామ తొడమీద
ముంచి యీరీతి నొరగి ముచ్చటలాడితివా

చ3. పదియారువేల ఇంతుల పాలిండ్లు తలగడలై
పొదల నిటువలెనే భోగించితివా
యెదుట శ్రీ వేంకటేశ ఇట్టె తిరుపతిలోన
నిదిరించక శ్రీభూమి నీళల గూడితివా

(దిగువతిరుపతిలో నెలకొన్న వేంకటేశ్వరస్వామిని గోవిందరాజ స్వామి అంటారు. ఆ స్వామిపై అన్నమయ్య రచించిన కీర్తన ఇది.

ఒక చెలికత్తె గోవిందరాజ స్వామిని ప్రశ్నల రూపములో ఈ కీర్తనలో ఆట పట్టిస్తోంది.

ఓ గోవిందరాజా! నీ కోరికలు ఆగకుండా నెరవేరుతున్నాయి.

నియమాలను అతిక్రమించి ఇలాగే ఆ కోరికలు తీర్చుకొనే సమయములో ప్రకాశించావా !

ఆనాడు రేపల్లెలో కృష్ణావతారములో పాలను తాగే సమయములో

ఇలాగే , ఈ పద్ధతిలోనే పడుకొని ఉన్నావా? (=ఇరవైతివా)

అందమైనవాడివై(=గోలవై) గోపికలు ఉయ్యాల ఊచి జోలపాటలు పాడుతుండగా

శ్రద్ధతో విని (=ఆలకించి విని) ఆ పాటలను మళ్లీ మళ్లీ తలుచుకొన్నావా ! (=అవధరించు)

ఆనాడు మధురా నగరములో కుబ్జ ఇంట్లో సందేహించక(= కొంచక) ఈ రకంగానేమంచాలమీద పడుకొని సుఖాన్ని మరిగావా!

సుప్రసిద్ధమైన(=చంచుల)ద్వారకా నగరములో సత్యభామ తొడ మీద
హద్దులు అతిక్రమించి(=ముంచి) ఈ విధముగానే సంభాషించావా!
పదహారు వేలమంది స్త్రీల స్తనాలు తలగడలు అవుతుండగా
విజృంభించి(=పొదల) ఈ రకముగానే భోగించావా!

ఎదురుగా శ్రీ వేంకటేశ్వరుని రూపములో ఉన్నవాడా! క్షణం పాటు (=ఇట్టె)తిరుపతిలోనిదుర పోకుండా, ఆ లక్ష్మీ, భూదేవి, నీళలతో సుఖాలలో తేలుతున్నావా!

పరమార్థం

గోవిందరాజా

గోవిందరాజస్వామిని శ్రీవేంకటేశ్వరునికి అన్న అని కొంతమంది అంటారు. తమ్ముడు వేంకటేశ్వర స్వామి పెళ్లికి కుబేరుడు అప్పుగా ఇచ్చిన ధనాన్ని ఈయనే కొలిచాడట. అన్నమయ్య దృష్టిలో ఇద్దరూ ఒకటే.

మంచాలపై బవళించి మరిగితివా

వేంకటేశునితో అన్నమయ్యకు ఉన్న చనువుకు నిదర్శనం ఈ కీర్తన. మంచాలపై మరగటం లాంటి ఆంతరంగిక (పర్సనల్) విషయాలను అత్యంత సన్నిహితులు మాత్రమే ప్రస్తావించగలరు.అన్నమయ్యకు స్వామితో ఉన్న తీవ్రమైన ఆత్మీయత ఈ కీర్తనలోని ప్రతి పాదంలో కనబడుతుంది. దేవుని కడప రథోత్సవం గురించి వ్రాస్తూ "కన్నుల పండుగ లాయే కడప రాయని తేరు/మిన్ను నేల శృంగారము మితిమీరినట్లు" అన్నాడు అన్నమయ్య.(03-93) అయితే ఇక్కడ మనమొక విషయము గమనించాలి. అన్నమయ్య శృంగారము భౌతిక శృంగారము కాదు. అన్నమయ్య శృంగార వర్ణన ' మధుర భక్తి సంప్రదాయము' అనే పాదులోనుంచి లేచిన ఆకర్షించే పారిజాతపు చెట్టు. "మధురభక్తి" సంప్రదాయంలో జీవాత్మ స్త్రీ. పరమాత్మ పురుషుడు. "అసంప్రదాయవిత్ సర్వశాస్త్రవిదపి మూర్ఖవదుపేక్షణీయ:" .(అన్నీ తెలిసినప్పటికీ సంప్రదాయము తెలియనివానిని మూర్ఖునిలా వదిలేయాలి)అన్నారు శంకర భగవత్పాదులు గీతా భాష్యంలో. కనుక మధుర భక్తి సంప్రదాయము

తెలుసుకొని, ప్రతి అన్నమయ్య శృంగార వర్ణనలో జీవాత్మ , పరమాత్మ - నాయికా నాయకులుగా చిత్రింపబడుతుంటారని గ్రహించాలి. (పలుకుతేనెల తల్లి కీర్తనకు ఈ వ్యాఖ్యాత చేసిన వ్యాఖ్యానమునుండి)

ఇట్లానే

ఈ కీర్తనలో ఇట్లానే,, ఈలీలనే, ఈలాగుల, ఇటువలెనే మొదలైన పదాలు ఎదుట ఉన్న స్వామిని చెలికత్తె చూపిస్తున్నట్లు అర్థానిస్తున్నాయి.స్వామిని ప్రత్యక్షము చేసుకొన్న యోగాను భూతిలోనే ఇటువంటి పదాలు దొర్లుతాయి.

పదియారువేల ఇంతుల

రాసక్రీడ జరిపేనాటికి శ్రీ కృష్ణుని వయస్సు కేవలం ఎనిమిది సంవత్సరాలు. ఈ వయస్సులోనే అతడు గోవర్ధన పర్వతాన్ని తన వ్రేలుతో ఎత్తాడు.

అమునా అని సంస్కృతములో ఒక మాట. అమునా అంటే అతనినుండి అని అర్థము. అమునా యమునా గామారింది.

స్నానము చేసేటప్పుడు మన శరీరములో కుడివైపుగా గంగను, , ఎడమవైపుగా యమునను, హృదయంలో సింధునదిని భావించాలని ఒక సంప్రదాయము. యమున ఉన్న ఎడమవైపు హృదయముంది. యమునా తీరమంటే ఈ హృదయ భాగమే. **స్త్రీ ప్రాయమితరం జగత్.** అంటే లోకములో భగవంతుడొక్కడే పురుషుడు. తక్కిన జీవులందరూ స్త్రీలే. అని ఒక సిద్ధాంతము. కనుక హృదయములో భక్తులు స్త్రీ భావన చేసి, పురుష స్వభావుడైన పరమాత్మతో చేసే అనంద భావనా క్రీడ రాసక్రీడ.

మరి అన్నమయ్య స్తనాలు మొదలైన అవయవ వాచకాలు, భోగాలు ఇవన్నీ ఎందుకు ఈ కీర్తనలో వాడాడంటే, భగవంతునికి భక్తులను సన్నిహితము చేసేటందుకు.

శృంగారము ఎవరినైనా ఆకర్షించే రసరాజము. దాని ద్వారా భక్తులను ఆకర్షించి,పెరుమాళ్లకు ఎరుక అయిన లోగుట్టును తెలియ చేయాలని అన్నమయ్య తాపత్రయము. అందుకే అన్నమయ్య కీర్తనలలో అత్యధిక భాగము శృంగార కీర్తనలే. అన్నమయ్య శృంగార కీర్తనలను ఈ దృష్టితో చదవాలి. స్వస్తి..

37.చెలపచెమట

పల్లవి: శిరసు వంచకు మిక శ్రీనరసింహా నీ
సిరు లెన్నైనాఉగలవు శ్రీ నరసింహా

చ1: చెలి నీతొడపై నెక్కె శ్రీనరసింహా
చెలరేగ నీమోము శ్రీనరసింహా
సెలవుల నవ్వుదేరె శ్రీనరసింహా నీమై
చెలప చెమట లుబ్బె శ్రీనరసింహా

చ 2: చేరడేసికన్ను ల శ్రీనరసింహా
చీరుమూరాడీ వలపు శ్రీనరసింహా
చీరకొంగంటేవేమీ శ్రీనరసింహా
చేరె నీకు నామేలు శ్రీనరసింహా

చ3: చేవల్లకు వచ్చితివి శ్రీ నరసింహా నా-
సేవలెల్లా మెచ్చితివి శ్రీనరసింహా
శ్రీవేంకటాద్రి మీది శ్రీనరసింహా
చేవమీరె నీవేడుక శ్రీనరసింహా (రేకు:1461-6సం: 24-366)

తాత్పర్యం

ఓ నరసింహ స్వామీ ! ఇక నీ తలను వంచకయ్యా ! నువ్వు చూడవలసిన కాంతులు, సంపదలు ఎన్నో ఉన్నాయి.

చ 1: ఓ నరసింహ స్వామీ ! నీకు ఇష్టమైన స్నేహితురాలు లక్ష్మీదేవి నీ తొడపైకి ఎక్కింది. అందుకే గామోసు- నీ మొగం కాంతితో
విజృంభిస్తోంది. అవును స్వామీ ! నీ పెదవుల మూలలో (సెలవుల) నవ్వులేమిటి? నీ చెంపల (చెలప)మీద ఆచెమటలు ఉబ్బిపోతున్నాయి. ఏమిటి కథ?

చ 2: శ్రీనరసింహా! నీకళ్లు విశాలంగా(చేరడేసి) ఉంటాయి. ఆ పెద్దకళ్లు తెరచి, నీ వలపుతో చిందరవంద (చీరుమూరాడు) చేస్తున్నావేమిటి?నా చీర కొంగు అంటుకొంటావేమిటి? నీకు నామేలు చేరిందికదా ? ఇంకా ఈ వేషాలేమిటి?

చ 3: ఓ నరసింహా ! నా సమీపానికి , చేతివైపుకు వచ్చావు.నేను తమరికి చేసుకొన్న అన్ని రకాల సేవలను మెచ్చు కొన్నావు. శ్రీవేంకట పర్వతముపై

వేంకటేశ్వరుని రూపంలో ఉండే శ్రీనరసింహా! నీ వినోద కార్యక్రమం శక్తిని దాటి పోయింది.

పరమార్థం

అన్నమయ్య వేంకటేశుని తర్వాత –నరసింహ స్వామిపై ఎక్కువ కీర్తనలు వ్రాసాడు. నరసింహుని రూపాలలో లక్ష్మీ నరసింహ రూపం చాలా ప్రసిద్ధమైనది. ఆ లక్ష్మీ నరసింహ రూపాన్ని అన్నమయ్య ఈ కీర్తనలో మొదటగా సాక్షాత్కరింప చేసాడు.ధర్మపురి అంతర్వేది, యాదగిరి, సింహాచలం, వాడపల్లి, మంగళగిరి– ఇలా తెలుగు రాష్ట్రాల్లో లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాలు ఎన్నో చూసి ఆపుకోలేని అనందంతో అన్నమయ్య ఇటువంటి కీర్తనలు రచించాడు.

"కంభమున వెడలి ఘననరసింహము,కానవచ్చె నిందులోన కారుణ్య నరసింహా,చిత్తగించు మా మాఉట శ్రీనరసింహా, చిత్తజగురుడవో శ్రీ నరసింహా చేకొని కొలువరో శ్రీనరసింహము, నమో నమో లక్ష్మీనరసింహా, ఫాలనేత్రానల"– ఇలా అన్నమయ్య నరసింహ కీర్తనలు ఎన్నో ప్రసిద్ధిలో ఉన్నాయి.

శిరసు వంచకు మిక

నరసింహ స్వామిది సింహపు తల. సాధారణంగా తల రెండు సందర్భాలలో వంచుతాం. సిగ్గు వల్ల, అవమానం వల్ల. కాని అన్నమయ్య నరసింహుడు తలవంచుతున్నది తన ఎడమతొడ మీద కూర్చున్న లక్ష్మీ దేవి అందాలను చూడటానికి. అందుకే కవి తలవంచకు అంటూ కవి స్వామివారితో హాస్యాలాడు తున్నాడు. ఇంకొకరకంగా దీని సమన్వయంచెప్పవచ్చు. ఏనుగులు మొదలయిన మృగాలను హింసించేది అని సింహ శబ్దానికి ఉన్న వ్యుత్పత్తి. మా ఆవిడ – లక్ష్మీదేవి లలితమైన ముఖ శోభలతో ప్రకాశిస్తుంటే – నేను ఈ భయంకరమైన సింహ ముఖాన్ని ధరించాను కదా– అని నరసింహస్వామి తలదించుకొంటే– నువ్వు తలదించనక్కరలేదు. నీ ముఖంలో లక్ష్మీదేవిని చూడటంతో ఎన్నో కాంతులు విజృంభించాయి. అని కవి చమత్కారంతో కీర్తన మొదలుపెట్టాడు..

చెలి నీతొడపై నెక్కె శ్రీనరసింహా

స్త్రీలు ఎడమ వైపు కూర్చోవాలని, పురుషులు కుడి వైపు కూర్చోవాలని శాస్త్రం. పంచమవేదమయిన మహాభారతంలో గంగానది – ప్రతీప మహారాజు కుడి తొడ మీద కూర్చున్న సందర్భంలో ఈ వివరణ ఉంది. (ఆది04–139వ.)

ఆ ఆచారాన్ని అన్నమయ్య ఈ కీర్తనలోనూ పాటించాడు.

ఇంతకీ అన్నమయ్య వర్ణించిన ఈ చెలి అసలు లక్ష్మినా? చెంచు లక్ష్మినా? అనే సందేహం వస్తుంది. ఎందుకంటే అసలు లక్ష్మి హిరణ్య కశిపుని చంపిన నరసింహావతారాన్ని చూసి బెంబేలెత్తింది. దగ్గరకు వెళటానికి భయపడింది. చెంచు లక్ష్మికి ఇలా భయాలు గట్రా ఏమీ ఉన్నట్టు లేవు.ఈ చెంచు లక్ష్మి భాగవతము లాంటి పద్య కావ్యాల్లో రాదు కాని జానపద కథల్లో వస్తుంది.

ఇదీ చెంచులక్ష్మి కథ

సముద్రుడు తన కూతురు లక్ష్మీదేవిని విష్ణువుకిచ్చి పెళ్లి చేస్తాడు. ఈ పెండ్లికి దూర్వాసో మహర్షిని పిలవడం మరిచిపోతాడు. శాపాల విడిది అయిన ఆ మహర్షి భూలోకంలో చెంచులుగా తిరుగమని సముద్రుని, అతని భార్యను శపిస్తాడు. 'మహా ప్రభో ! తప్పయింది. శాపవిముక్తిని కలిగించ'మని సముద్ర దంపతులు వేడుకొంటారు.లక్ష్మీదేవి చెంచులుగా ఉన్న వారి ఇంట కుమార్తెగా పుడుతుందనీ, విష్ణువు అల్లుడవుతాడనీ ..వెంటనే వారి శాపం తొలగిపోతుందంటూ దూర్వాసుడు చెబుతాడు..

లక్ష్మీదేవి 'కళ' ఉన్న మామిడి పండును చెంచు స్త్రీగా వున్న సముద్రుని భార్య తిని. 'చెంచులక్ష్మి' కి జన్మ ఇస్తుంది. యుక్త వయస్సు వచ్చిన తరువాత – ఈ చెంచులక్ష్మి నరసింహస్వామిని చూస్తుంది . ఆ సమయంలో ఆయన హిరణ్యకశిపుని సంహరించి ఉగ్రత్వంతో ఉంటాడు. ఆయనను ఈ చెంచులక్ష్మి శాంతపరిచి పెళ్లి చేసుకొంటుంది.

ఈ చెంచులక్ష్మినే నరసింహ స్వామి తన అంకము మీద కూర్చోబెట్టుకొన్నాడేమో! ఏ లక్ష్మి అయితేనేం– ఇద్దరూ ఒకటే కదా

సెలవుల నవ్వుదేరె

ఈ సెలవుల నవ్వు అన్నమయ్యకు ఇష్టమయిన ప్రయోగాలలో ఒకటి. ఎన్నో కీర్తనలో ఈ పెదవిమూలల నవ్వులు నవ్వించాడు.

చిత్తగించు మామాట శ్రీ నరసింహా కీర్తనలో "సెలవుల నవ్వేవిట్టే శ్రీ నరసింహా– నీకే/సెలవు మావలపులు శ్రీ నరసింహా"అని కవి వాక్కు.

పెదవి మూలలలో ఎందుకు నవ్వుతావయ్యా! మావలపులు అన్నీ నీకే ఖర్చు(సెలవు) పెడుతున్నాము కదా !అని నాయిక తమాషాగా అంటుంది. ప్రస్తుత

కీర్తనలో కూడా "నీ పెదవుల మూలలో నవ్వులేమిటి? నీ చెంపల మీద ఆచెమట లుబ్బిపోతున్నాయి. ఏమిటి కథ?"అని ప్రశ్నిస్తుంది. ఇక్కడ నరసింహుడు కవి

దృష్టిలో ఒక కథానాయకుడు.ఆయనది సింహపు మొగం కదండీ ! ఈ సాత్విక భావాలు, రసోదయాలు ఇవన్నీ ఉంటాయండీ ! అనే ప్రశ్న రాకూడదు.

చూసే దృష్టిని బట్టి సృష్టి ఉంటుంది. **"వాసిగా నా మనోవాంఛ దీరెడునట్లు – సొగసుగా నీరూపు జూపవయ్య"–** మనోజ్ఞమైన నీ రూపాన్ని నాకు చూపించు తండ్రీ! దుష్టసంహార! నరసింహా! దురితదూర! అని శేషప్పకవి లాంటి వాళ్లు నరసింహుని సుందరరూపం చూడటానికి తపించారు. అన్నమయ్య ఆ సుందరరూపాన్ని దర్శించి మనచేత దర్శింపచేసాడు.

చేరడేసికన్ను ల శ్రీనరసింహా

చేరెడేసి అంటే చెయ్యంత (A handful) చచ్చినవాడి కళ్ళు చేరడేసి అనేది ఒక సామెత. అంటే బతికున్నప్పుడు ఎలాగున్నా చనిపోయిన తర్వాత వాడికళ్లు పెద్దవిగా ఉన్నాయని, బాగున్నాయని చెప్పటానికి చేరడేసి పదం వాడతారు.ఈ పదం ఇదివరకటి రోజుల్లో చిన్నపిల్లలు పాడుకొనే 'చెమ్మ చెక్క చేరడేసి మొగ్గ అట్లు పోయంగ, ఆరగించంగ" అనేఅందమైన తెలుగు పాటలో వినబడేది. ఇటువంటి అందమైన తెలుగు పదాలను అన్నమయ్య అసలు విడిచి పెట్టడు. నరసింహుని అందమైన కళ్లు విశాలంగా, అందంగా ఉన్నాయని చెప్పటానికి 'చేరడేసి' పదం వాడాడు.

నీకు నామేలు చేరిందికదా

తిక్కనగారి దగ్గర ఉన్న అల్పాక్షరాలలో అనల్పార్థ రచనా శక్తి అన్నమయ్య దగ్గర కూడా పుష్కలంగా ఉంది.ఒక నాయిక నరసింహుడనే నాయకునితో అంటోంది.**"నీకు నామేలు చేరింది కదా!"** అని. ఏమి మేలు? అది పాఠకుల ఊహకే కవి వదిలిపెడుతున్నాడు.

ప్రణయము వలన కలిగే "మేలు"– నాయికా నాయకులకి మాత్రమే పరిమితమైన వ్యవహారం. ఆ మేలు స్వరూప స్వభావాలు ఇతరులకి తెలియ చేయవలసిన అవసరం లేదు. తెలియ చేయ కూడదు కూడా. ఈ ప్రణయ ధర్మ శాస్త్రాన్ని అన్నమయ్య చక్కగా పాటించాడు.

చేవల్లకు వచ్చితివి నరసింహా

హైదరాబాదుకి సమీపంలొ చేవెళ్ల అని ఒక ఊరు ఉంది. బహుశా అది అన్నమయ్య ప్రయోగించిన "చేవల్ల"అర్థంలో ఏర్పడిందేమో ! క్రమ క్రమంగా చేవెళ్ల అయి ఉండవచ్చు. "చేవల్లకు రావోయి శ్రీధరా, శ్రీ వేంకటాద్రి మీఉది శ్రీధరా." (15-245) అని ఇంకోచోట కూడా అన్నమయ్య ప్రయోగం ఉంది." చేతి వైపుకి వచ్చావు నరసింహా"- అని ఒక నాయిక నరసింహుడిని చిలిపిగా బెదిరిస్తొంది. "నా చేయికి దగ్గరగా ఉన్నావు ! ఇక చూసుకో !"అని మాటల గమ్మత్తు.

చేవమీరె నీవేడుక శ్రీనరసింహా

"నరసింహా ! నీ వినోద కార్యక్రమం నా సహన శక్తిని దాటి పోయింది. ఇక నావల్ల కాదు. ఇక నేనేంచేసినా నా బాధ్యత కాదు"అని నాయిక రూపంలో మధుర భక్తితో అన్నమయ్య ఉత్తుత్తి బెదిరింపు.

ఫాలనేత్రానల ప్రబల విద్యుల్లతా కేళీ విహార లక్ష్మీ నారసింహా

లక్ష్మీదేవితో కూడిన ఓ నరసింహస్వామీ ! నుదుట ఉన్న అగ్ని నుండి వృద్ధి పొందే మెరుపులతో ఆటలాడుకొనేవాడా ! నీ నిట్టూర్పులో ప్రళయ కాలానికి సంబంధించిన గాలి ఉంది. భయంకరమైన కొలిమి తిత్తిలో నిప్పురాజేయటానికి ఊదే ఫూత్కారముంది. నీ నిట్టూర్పు ఉయ్యాలలా మారి ఏడు కుల పర్వతాలను, భూమిని, సూర్యుడిని, ఆకాశాన్ని ఒక ఊపు ఊపుతోంది. నువ్వు మాత్రం నిశ్చలుడిలా ఉన్నావు. వికారులైన రాక్షస శత్రువుల వంశాలను భస్మం చేయటం కోసం పటపటలాడుతూ ఒరుసుకొంటున్న నీ పళ్ల మధ్య నిప్పురవ్వలు స్నేహం చేస్తున్నాయి "అని లక్ష్మీ నరసింహస్వామిని భయంకరంగా సంస్కృత కీర్తనలో వర్ణించిన అన్నమయ్య ఈ తెలుగు కీర్తనలో పరమ శాంత మూర్తిగా , రూపసిగా స్వామినివర్ణించాడు.

తండ్రి- కోపం వచ్చినప్పుడు నరసింహ మూర్తి అవుతాడు.

ప్రేమ వచ్చినప్పుడు పరమ శాంత మూర్తి అవుతాడు.

"జగముల కన్నతండ్రి "నరసింహుడు ఇంతే.

అందుకే అన్నమయ్య కీర్తనల్లో నరసింహుని ఉగ్ర,శాంత రూపాలు రెండూ కనబడతాయి. స్వస్తి.

38. చద్దికి వేఁడికి

అన్నమయ్య ఒక చెలికత్తెగా మారి అలమేలుమంగమ్మతో ముచ్చట్లాడుతున్నాడు.

పల్లవి: రాకుంటే మానుగాక రంతులేటికే
వేకపు గుబ్బలాండ్ల విటుడాతడు

చ.1: అంపిన కప్పురమొల్ల నంటే దాననుగాక
వంపు మోముతోడ నీకు వాడనేటికే
చెంపల లప్పలు నిండ జెరిగిన కప్పురపు -
గంపకొప్పుల సతుల ఘనుడాతడు

చ.2: ఒద్దికగాకక్కడనే వుంటే దానుండు గాక
ముద్దుమోము వంచి నీకు మొక్కనేటికే
చద్దికి వేడికి మంచిచక్క సతుల మోవి
పొద్దునొద్దుకారగించే భోగి యాతడు

చ.3: అబ్బురపు వేంకటేశుడైతే దానవు గాక
గబ్బి చూపులెల్లా నీకై గప్పనేటికే
జొబ్బిలేటి జవ్వాదిసోనల పన్నీట నన్ను
గుబ్బలంటి సరసానగూడెనాతడు (రేకు: 0001-5 సం:05-005)

తాత్పర్య పరమార్థం

ఏమే అలమేలుమంగమ్మా! ఆ వేంకటేశుడు రాకపోతే రాక పొమ్మను. ఆటలెందుకే!

అయినా వాడు వెగటు కలిగించే యౌవనము గల ఆడవాళ్ల యొక్క శృంగారి (అలాంటివానికి నీలాంటి అందగత్తెల పనిలేదు)

చ01. అలమేలుమంగా! వాడికోసం నువ్వు ముచ్చట పడి కర్పూర తాంబూలముపంపించావు.

వాడు కర్పూర తాంబూలము ఇష్ట పడనంటే వంకరజుట్టుతో అందమైన నీ మొగము వాడిపోయింది ఎందుకే?

ఆ వేంకటేశుడు తక్కువ వాడా !చెంపలలో రాసులు రాసులు కర్పూరము

నింపుకొని, తన పరాక్రమముతో అవి చెదిరిపోగా, పెద్ద కొప్పులున్న పతివ్రతల కథానాయకుడు తల్లీ !ఆ వేంకటేశుడు. నీదగ్గరికి ఎందుకు వస్తాడే!

చ02. నీమీద ప్రేమ లేకుండా ఆ పతివ్రతల దగ్గరనే ఆయననిఉంటేఉండ మను.నీదగ్గరికి వచ్చినప్పుడు నిన్ను కరిగించటానికి నీ ముద్దుల మోమును వంచి నీకు మొక్కటం ఎందుకే? ప్రొద్దున, మధ్యాహ్నము అయనగారి రసికత్వపు విడిది ఆ పతివ్రతల పెదవులు. ప్రతినిత్యము వాటిని భుజించే భోగి నిన్ను బతిమిలాడు కోవటం ఎందుకే?

చ03. అందరికీ తన మహిమలతో ఆశ్చర్యము కలిగించే వేంకటేశునిగా ఆయనకు లోకంలో పేరుంటే ఉండుగాక !

నీదగ్గరకు వచ్చి తన గర్వపు, మోసపు చూపులను నీ మీద కప్పటం ఎందుకు?

ఏమిటంటున్నావు?అలమేలు మంగా! వేంకటేశుడు జవ్వాది సుగంధ ద్రవ్యముల సన్నని వానలలో తడిపి, గుబ్బలంటి నీకు పరవశం కలిగించి నిన్ను వినోదంతో కలుస్తున్నాడా ! నేను చెప్పినవన్నీ మరిచిపోయావా ! హతోస్మి.

పరమార్థం

వేంకటేశుని సాన్నిహిత్యంలో, మధుర భక్తి పారవశ్యములో అన్నమయ్య

హృదయములో పాడుకొన్న కీర్తన ఇది.లౌకిక శృంగారపు పదాల పరదాల చాటున చిన్ని కృష్ణుని గజ్జెల చప్పుడు వినిపిస్తుంటుంది. స్వస్తి.

39. చలివాపీ

పల్లవి: పొత్తుల మగువలకు బోవునా యింక
యిత్తల గూడుండుదము యీడకిట్టేరావే

చ.1: మచ్చరము నాకేలే మగడు మొదలనే
మచ్చికచేసి నిన్ను మన్నించునట
వెచ్చనూర్పు నీకేలే వెరపులింకానేలే
కుచ్చినేనూగౌగిలించుకొనేగాని రావే

చ.2: వెంగెమాడ నాకేలే విభుడు వేడుకపడి
సింగారించి నిన్ను రట్టుసేసు దానట
ముంగిటనే కొంకనేలే ముసిముసి నవ్వులేలే
సంగడిబూవానకు చలివాపీ రావే

చ.3: పెనగగ నాకేలే ప్రియుడు లోలోనె వచ్చి
కనుసన్న సేసి నిన్ను గలపునట
నను శ్రీవేంకటేశుడు నవ్వుతానిట్టికూడె
తనిసిన రతులు చింతనసేసే రావే (రేకు:0143-1 సంపుటం:07-249)

ఓ చెలీ ! వాడు- ఆ- వేంకటేశుడు- ఉమ్మడిగా అవతల మగువలను కలవటానికి పోతున్నాడే ! ఆలస్యము చేయకు.ఇక

నామాట విని- నువ్వు- నేను ఇద్దరము కలిసి - ఇవతల ఆయనతో కలిసిఉ ందాము. ఇంకెక్కడికి వెళతాడో చూద్దాం.

వెంటనే ఆలస్యము చేయకుండా ఇక్కడికి రా !

చ.1: అరే! నా ఇంటికి రావటానికి సందేహమెందుకు? నాకు నీమీద ద్వేషము ఎందుకే ! నా భర్త(ప్రభువు) ముందే చనువు చేసి నిన్ను గొప్ప చేసాడట. అందరూ చెప్పుకొంటున్నారు.

అనుమానంతో వేడి నిట్టూర్పులు వదులుతావెందుకు?భయపడతావెందుకు!?

నన్ను జతచేసి కౌగిలించుకొంటే గాని - సరిగ్గా దొంగని పట్టుకోవటానికి అదే సమయమని - అప్పటిదాకా -మా ఇంట్లోకి రావా ? భలే ఉన్నావే!

చ.2: నీతో పరిహాసాలు నాకెందుకు తల్లీ ! ప్రభువు ఆసక్తితో అలంకారము

చేసి నిన్ను చనువుతో ఉత్తుత్తి నింద చేస్తాడట కదా! నా ముందే సిగ్గుపడతావెందుకే!? జత కలిస్తే వచ్చే పూలవానకోసం వాడిని బుజ్జగించి ఒప్పించటానికి రావే!

చ.3: పేరుకు మాత్రం వాడు నామగడు కాని, వాడితో యుద్ధము చేసే సౌభాగ్యము నాకెక్కడిది? నా ఇంటికి వచ్చిన నీ ప్రియుడు (నా భర్త) లోలోపలికి వచ్చి, నీకు కళ్లతోటిసైగలు చేసి, నిన్ను కలుస్తాడు.

అయినా.. ఆవేంకటేశుని మీద నాకు కోపం రావటం లేదే! ఎందుకంటె నీదగ్గరినుంచి ఎప్పుడు వస్తాడో తెలియదు. నవ్వుతూ వేగంగా తాను నన్ను కలుస్తాడు. మీ ఇద్దరి మధ్య జరిగిన తృప్తిపొందిన రతులను పలుమార్లు నా దగ్గర తలుచుకొన్నాడే! అవేమిటో చెబుతాను. రావే. !

పరమార్థం

మనం అలా అనలేం.

మన మనస్సులో స్వామి వారిని మనతో పాటు శృంగార సీమలలో జతగానిగా భావించాలంటే , ప్రియునిగా సంబోధించాలంటే అమ్మో ! తప్పు అనుకొంటాం.

ఎందుకంటే మన ఎద భక్తి భావంలో ఎదగలేదు.

ప్రపంచంలో అందరూ స్త్రీలే. వేంకటేశ్వరుడు ఒక్కడే పురుషుడు అంటే.... "శాస్త్రాలు చెప్పాయి కాబట్టి నిజమే కానీండి"...అంటూ

మన పరిధులలో మనం కుంచించుకు పోతాం.

కాని అన్నమయ్య ఎదిగినవాడు.

ఆ యన దృష్టిలో అందరూ స్త్రీలే. వేంకటేశ్వరుడు ఒక్కడే పురుషుడు. అందుకే తోటి జీవిని ఇంకొక స్త్రీగా సంబోధిస్తూ, ఆమెతో జతగాని లీలలను తేట తెల్లంగా, తేట తెలుగులో ఈ కీర్తనలో పలుకుతున్నాడు.

కలవటమంటే అన్నమయ్య దృష్టిలో జీవుడు దేవునిలో కలవటం.

ఈ ఒక్క అంశం దృష్టిలో పెట్టుకొంటే ఈ కీర్తనలోని శృంగారపు పదాల పరదాల వెనుక భక్తి గంటల చప్పుడు వినిపిస్తుంది.

40.చిక్కపు బుత్తి

అన్నమయ్య గోపికలలో తాను ఒక గోపికగా మారి విట్ఠలరాయనిలో కృష్ణుని, వేంకటేశుని చూసుకొంటూ ఈ పాట పల్లవిలో స్వామిని "బుద్ధుల గోల నీకు ఎందు" కని ఆట పట్టించాడు.చరణాలలో అ బుద్ధుల వివరణ చేసి, స్వామిని ఉన్నతంగా మన హృదయాలలో నిలిపాడు.

పల్లవి: పసులు గాచేటి కోల పసపు జేల
పొసగ నీకింతయేల బుద్ధుల గోల

చ1: కట్టిన చిక్కపు బుత్తి కచ్చకాయల తిత్తి
చుట్టిన పించెపుబాగ చుంగుల సోగ
ఇట్టి సింగారము సేయ నింత నీకు బ్రియమాయ
వెట్ట నీచేతల మాయ విట్టలరాయ

చ2: పేయల బిలుచుకూత పిల్లగోవి బలుమోత
సేయరాని గొల్లెతల సిగ్గులచేత
ఆయెడల దలపోత యమున లోపలి యీత
వేయరాని మోపులాయ విట్టలరాయ

చ3: కొంకులేని పొలయాట కూరిములలో తేట
అంకెల బాలులతోడి యాట పాట
పొంకపు తుత్తురు కొమ్ము పొలుపైన నీ సొమ్ము
వేంకటనగము చాయ విట్టలరాయ (రేకు:0017-1 సం: 05-096)

పల్లవి: విట్టలరాయహంపి క్షేత్రంలోని విఠ'లుడు .

విట్ఠల రాయకు అన్నమయ్య ప్రయోగము విట్టలరాయ.

కన్నడదేశంలో రాజులకు బిరుదు నామము" రాయ'.అందుకే 'విటల' శబ్దం పక్కన రాయ వాచకం.

ఓ విట్టలరాయ! పశువులను కాయటానికి వాడే కర్ర ఒకటి, పచ్చటి బట్ట - ఈరెండూ నీకు సరిపోతాయి గాని నీకు దేహబుద్ధి, జీవబుద్ధి, ఆత్మబుద్ధి అనే బుద్ధుల గోల ఇంత ఎందుకు? (ఇంతయేల అనేది ప్రేమతో, భక్తితో పైకి చేసిన

ఎగతాళి ప్రయోగము. స్వామి బుధ్ధులు ఇంత "అని చెప్పలేమని అంతరార్థము.)

చ.1: విట్టలరాయ ! నీకు దేహ బుధ్ధి ఉంది.

అందుకే తీగలు లోనగువానితో అల్లి పసులమూతికి తగిలించెడు బుట్ట– అదేనయ్యా – చిక్కపు బుత్తిని – మా ఆడవాళ్లు పెట్టుకొన్నట్లుగా మోచేతికి అడుగున అమరేటట్లు అందంగా పెట్టావు. ఎప్పుడు పడితే అప్పుడు ఆటలాడుకోవటానికి వీలుగా గచ్చకాయల తోలు సంచిని బొడ్డులో అందంగా పెట్టావు.

అందంగా చుట్టిన నెమలి పించెపు తలకట్టు(పాగ) వ్రేలాడు వస్త్రపు కుచ్చె కొనల పొడవులు (పంచె కట్టడంలో పొడవుగా, అందంగా వేలాడే కుచ్చె తీసాడట కృష్ణుడు)

ఇలా అందంగా అలంకారము చేసుకోవటము ఇంతగా నీకు ఇష్టమయిందా!

ఓ విట్టలరాయ! ప్రతి ఫలం లేకుండా చేసే నీ చేతలలో అంతా మాయ.(దేహ బుధ్ధితో చేసిన నీ అలంకారాలు

మమ్మలిని మాయలో ముంచటానికి. మాకు ఆవిషయం తెలుసులే.)

చ.2: ఓ విట్టలరాయా! జీవులు నాలుగు విధాలు. మిత్రులు, శత్రువులు, భృత్యులు, ఉదాసీనులు. ఈ నాలుగు రకాల జీవులను ఆకర్షిస్తావు.

ఆవులను పిలిచే కూతలో, మురళిని వాయించే గొప్ప మోతలో

ఏ మహాను భావుడు చేయరాని, చేయకూడని గోపికల సిగ్గుల వస్త్రాపహరణ చేతలోఅక్కడ నీశత్రువయిన కంసుని తలపోతలో (ఆలోచనలో) యమునా నదిలో మాతో ఆటలాడుతూ తమరు చేసిన ఈతలో ఎన్నని చెప్పమంటావు. ! ఇవన్నీ కూడా తలచుకొన్నకొద్దీ – ఆ ఆలోచనలు గడ్డి మొదలైన వాటి కట్టలా – మోపులూ మోయరాని బరువులవు తున్నాయి.

చ.3: ఓ విటలరాయా! ఇక నీఆత్మ బుధ్ధి చెబుతాను విను.

గోపికలతో సంకోచము లేకుండా(కొంకులేని) చేసిన ప్రణయ కేళి (పొలయాట), కుచేలుడు మొదలయిన వారితో చేసిన స్నేహాల నిర్మలత్వము(తేట);

సన్ని హితంగా ఉండే (అంకె) గోప బాలులతో నువ్వు చేసిన ఆట పాట;

పొందికైన,అందమైన తురుతురు అని చప్పుడు చేసే వాయిద్యము, మీ అమ్మ యశోదమ్మ నీ శరీరము మీద పెట్టిన అందమైన నీ అలంకారములు;

ఇవన్నీ వేంకట పర్వతము నీ ఆత్మ ఎలా చాటుతున్నదో– అలా– నీ

ఆత్మావిష్కరణము చేస్తున్నాయి.

గోపికలతో నీ ప్రణయ కేళి జీవాత్మ పరమాత్మల సంయోగం.

ఆత్మయందే రమించు యోగి ఆత్మారాముడు . కుచేలుడు నీకు అటువంటి వాడు. అతని అత్మలో నీవే నిలిచి ఆనందాన్ని ఇచ్చావు

బ్రహ్మ మొదలయిన దేవతలు -ఎంగిళ్ళు తింటూ- పిల్లలతో ఆటా పాట చేస్తున్న నిన్ను చూసి ఆశ్చర్య పోయారు.ఆత్మయందు నిన్ను నమ్ముకొన్నవారికి నువ్వు కల్పించే అదృష్టము అది.

తేలికయిన తుత్తురు కొమ్ము నీస్పర్శతో, రాగాలాపనకు పాత్రమయింది.

ఎవరు అహంకార శూన్యులై నిర్మమత్వంతో ఉంటే , వారి ఆత్మలో నీ కొలువు రాగరంజితమవుతుందని చెప్పటానికి తుత్తురు కొమ్ము ఊదావు.

గవ్వలు మొదలయిన అమ్మ పెట్టిన సామాన్యాభరణాలు ధరించి, నిన్ను అత్మయందు ప్రతిష్ఠించుకోవటానికి అతి సామాన్య జీవనముచాలని నిరూపించావు. కృష్ణం వందే జగద్గురుమ్. స్వస్తి

41. చెయ్యొగ్గు

నమస్కరించు అనటానికి అన్నమయ్య ప్రయోగించిన పదం చెయ్యొగ్గు. (చెయ్యి, ఒగ్గు). ఒగ్గు అంటే చాచు. చేతిని చాచటం– నమస్కరించటం. ఆ చెయ్యొగ్గు ను అన్నమయ్య కీర్తనలో దర్శిద్దాం

పల్లవి: నాకు నాకే సిగ్గయ్యాని నన్ను జూచుకొంటేను
చేకొని నీవే మన్నించ జెయ్యొగ్గేగాని

చ.1: సేయరాని పాపములు సేసివచ్చి యేనోర
నాయెడ నిన్ను వరములడిగేను
కాయముతో నింద్రియకింకరుడనై యేమని
చేయార నీబంటనని చెప్పుకొనేను

చ.2: వేగిలేచి సంసారవిధులకే వొడిగట్టి
యేగతి గొసరి నీపై నేట వేసేము
ఆగడపు బంగారుకాతుమనే నమ్ముకొని
భోగపుమోక్షము నెట్టు వొందించు మనేము

చ.3: కలుపుట్టుగుబదుకు కాంతలకు వెచ్చపెట్టి
వలసి నేడెట్టు నీవార మయ్యేము
నెలవై శ్రీవేంకటేశ నీవే కరుణించితివి
బలిమిసేసి నీకెట్టు భారము వేసేము (రేకు:0301–02సం: 04–002)

అర్థం

పల్లవి: ఓ వేంకటేశా ! అనేక పాప కర్మములు చేసిన నన్ను నేను చూసుకొంటే –ఎవరో అనక్కర్లేదు– నాకు నాకే సిగ్గవుతోంది.(అన్ని సిగ్గు మాలిన పనులు చేసానని భావం)

నువ్వు ఆదరముతో (చేకొని)మన్నించటానికి – నమస్కరిస్తున్నాను. ప్రార్థిస్తున్నాను.

చ.1: చేయరాని పాపాలు అనేకము చేసివచ్చి ఏ నోటితో
నాకు వరాలు ఇమ్మని నిన్ను ప్రార్థిస్తాను!? (అడిగే అర్హత లేదని భావం)

ఈ శరీరంతో ఇంద్రియాలకు సేవకుడినయి , కన్ను ముక్కు, చెవి మొదలయిన పది ఇంద్రియాలు చెప్పినట్లువిని, అనేక తప్పుడు పనులు చేసి-

తని వితీరా, తృప్తిగా (చేయారా) నీ సేవకుడిని అని ఎలా చెప్పుకొంటాను!?

చ. 2: వేంకటేశ్వరా !పొద్దున లేచిన దగ్గరినుంచి సంసారధ్యాసలో పడి రకరకాల పనులు చేయటానికి సిద్ధపడతాను. నిన్ను తలుచుకోను. కానిఏదన్నా జరగరానిది జరిగితే మాత్రం "దేవుడా ! ఇలా చేసావేమి"టని నిన్ను నిందిస్తాను.(ఏటవేసెము)

నిన్ను తలుచుకోని నాకు నిన్ను నిందించే హక్కు ఎలా ఉందయ్యా ! (ఏరకంగాను లేదని భావం)

జీవితంలో చెడ్డపనులు చేయించే బంగారమే మమ్మలిని రక్షిస్తుందని భ్రమ పడి దానినే నమ్ముకొన్నాము.భోగాలనుభవిస్తున్నాము. (చెడ్డపనులు చేసి భవిష్యత్తు బంగారమగుగాక అని కోరుకొంటున్నాము);

అటువంటి మేము బ్రహ్మానందము కలిగించే మోక్షాన్ని (భోగపు మోక్షము) ఇమ్మని నిన్ను ఎలా కోరతాము!?

చ. 3: బండిచక్రము వంటి జన్మ పరంపర కలిగిన బతుకును కాంతలకొరకు ఖర్చు చేసి(వెచ్చపెట్టి)

వయసుడిగిన ఈ రోజు మా బతుకు నీకేనని అంటే నీ వాళ్లమవుతామా ?

మనస్సు అనే స్థానములో నిలిచి మమ్మలిని వేంకటేశ్వరా ! రక్షించావు.

అలా అని చెప్పి బలాత్కరించినట్లుగా ప్రతిదీ నీదే భారమని మా తప్పుడు పనులు కూడా నీపై ఎలా మోపుతాము.?

పరమార్థం

సంతృప్తి అనే అర్థంలో "చెయ్యార"(22-337)అని , అధికుడగు అనే అర్థంలో చెయ్యి మీదగు (11-331) అని- ఇలావిచిత్ర ప్రయోగాలు చేసిన అన్నమయ్య ఈకీర్తనలో చేతి"ని "చెయ్యి" అన్నాడు.

"చింతలెల్ల బెడబాసి, చెక్కు చెయిదియ్యవమ్మ(11-113)" అని ఇంకొక చోట చేతిని "చెయి" అన్నాడు. పద నిరంకుశుడైన ఆమహాకవి వేంకటేశునికి చెయ్యొగ్గాడు.(నమస్కరించాడు, ప్రార్థించాడు) ఆ మహాకవికి మనంకూడా చెయ్యొగ్గుదాం. స్వస్తి

42. చెంగిపోయి

"దగ్గర్లోనే అన్ని పెట్టుకొని ఎందుకయ్యా! అంత కష్ట పడతావ్!"అనేది తెలుగు వాడి పలుకుబడి.ఈ పలుకుబడి ఆధారంగా అన్నమయ్య కుమారుడు పెద తిరుమలాచార్యుల వారు వ్రాసిన మధురభక్తి కీర్తన ఇది.

పల్లవి: ఎంచి చూడవైతిగాక యింతి నీ కిన్నియుగాదా
మంచిదాయ యికనైనా మఱువకువయ్యా

చ. 1: పొంగేటి జలధి దచ్చి పుట్టించితి వమృతము
అంగనమోవినే కాదా అమృతము
చెంగి పోయి వైకుంఠాన శేషునిపై బండితివి
చెంగట నీచెలి యారు శేషుడే కాడా

చ2: ఆకాసాన నొకడుగు అడిగితివి బలిని
ఆకసము చెలినడుమందునే కాదా
మేకొని వేదాలకుగా మీనవై పొడమితివి
కైకొని సతికన్నులే గండుమీలు గావా

చ 3: కోరి శ్రీవేంకటమనేకొండ యెక్కితివి నీవు
కూరిమి చెలికుచాలు కొండలే కావా
చేరి సర్వజీవులచిత్తములో నిలిచితి
తేరి యాకె నీ వురాన దిరమాయ గాదా(రేకు: 88-3 సం:17-469కీ)

అర్థ పరమార్థం

ఓ వేంకటేశా ! ఒక్కో అవతారంలో నువ్వు చాలా చాలా పనులు చేసావు. కాని ఆ ఆ పనులు చేసేటప్పుడు నీ ఆడుదాన్ని- (=ఇంతి) తలుచుకోలేదు. మనస్సులో ఆమె రూపాన్ని చూడలేదు కదా ! నువ్వు చేసిన అవతారాల ప్రయోజనం అంతా ఆవిడ దగ్గరే ఉంది.

కాని ఆవిడని మరిచిపోయి రకరకాల అవతారాలెత్తావు. మంచిది. ఇకనైనా ఏదైనా అవతారమెత్తినప్పుడు ఆ అవతార ప్రయోజనం మీ ఆవిడ దగ్గరే ఉన్నదన్న విషయం మరిచిపోకు.

చ. 1: దేవ దానవుల చేత అమృతం కోసం కూర్మావతారంలో సముద్రాన్ని మథింపచేసావు.వాళ్లు ఆ క్షీర సముద్రాన్ని మథిస్తున్నప్పుడు ఆ సముద్రపు నీళ్లు పైకి పొంగాయి.(=పొంగేటి జలధి) ఆ సముద్రాన్ని మథింప చేసి (=తచ్చి) అమృతాన్ని వాళ్లచేత పుట్టింపచేసావు. ఎందుకయ్యా! ఇంత శ్రమ పడ్డావు?! నీ భార్య ,మా అమ్మ అలమేలుమంగమ్మ పెదవిలో ఆ అమృతము ఉందికదా !

ఒక్క దూకుతో వెళ్లి (=చెంగి పోయి) ఆ వైకుంఠములో వేయి పడగలు ఉన్న ఆ ఆది శేషునిపై వెళ్లి పడుకొన్నావు.

అక్కడికే వెళ్లి పడుకోవాలా? దగ్గర్లోనే నీ భార్య ,మా అమ్మ అలమేలుమంగమ్మ నూగారు (ఆరు) ఆది శేషుడు కాదా?

(ఆరు= రోమరాజి, నూగారు (the line of hair upon the abdomen just above the navel.)

పరమార్థం

ఆదిశేషుడు పతంజలిగా అవతారమెత్తిన కథలు విన్నాం

మేరు పర్వత భాగమైన ఆనందశిఖరాన్నిఆది శేషువు చుట్టుకొని ఉండగా, ఆ పర్వతాన్ని వాయుదేవుడు శేషువు పడగ ఎత్తి నప్పుడు కదిలించాడని అదే శేషాద్రి అని విన్నాం.కాని ఒక్క దూకుతో వెళ్లి ఆ వైకుంఠములో వేయి పడగలపై స్వామి పడుకొన్న దృశ్యం పెదతిరుమలాచార్యులవరి యోగ సమాధి దర్శనమయి యుంటుంది. పుస్తకాల్లో మాత్రం ప్రసిద్ధి లేదు.

తిరువనంతపురం లోని అనంతపద్మనాభస్వామిగా తిరువళ్ళూరు లో వీరరాఘవ స్వామిగా, నెల్లూరు లో రంగనాయకుల స్వామిగా ఆదిశేషుడిపై శయనించిన దృశ్యాలను ఈ రోజుకి మనం చూడవచ్చు.

చ. 2: ఎందుకయ్యా ! వామనావతారంలో ఆ బలి చక్రవర్తి దగ్గరికి వెళ్లి ఆకాశములో ఒక అడుగు అడుక్కొన్నావు. ఆ ఆకాశము నీ భార్య ,మా అమ్మ అయిన అలమేలుమంగమ్మ నడుములోనే ఉందికదా ! (ఆకాశము అంటే శూన్యము. పాతకాలపు కవులు ఆడువారికి నడుములేనితనాన్ని అందంగా భావిస్తూ , ఆ సన్నటి నడుమును శూన్యమైన ఆకాశంతో పోల్చేవారు)

సమ్మతించి (=మేకొని) వేదాల కోసం మత్స్యావతారము ఎత్తి చేపవయ్యావు. నువ్వు గ్రహిస్తే, లక్ష్య పెడితే నీ భార్య ,మా అమ్మ అలమేలుమంగమ్మ కన్నులు

కొర మీనుల్లా (ఒక జాతి మంచి నీటి చేప) ఉండే పెద్ద చేపలు.ఆ కన్నులనే చేపలతోనే వేదాల ఉద్ధరణ పూర్తయ్యేది. అనవసరంగా మత్స్యావతారము ఎత్తి శ్రమపడ్డావు.

చ3: కోరి కోరి శ్రీ వేంకటము అనే పేరున్న కొండ ఎక్కి అలసిపొయ్యావు. ఎందుకయ్యా ! ఆ శ్రమ నీకు. ప్రేమ(=కూరిమి) నిండిన నీ చెలి స్తనాలు కొండలే కదా !

నీ భక్తులయిన సర్వ జీవుల హృదయాలను సమీపించి వాళ్ల మనస్సుల్లో నిలిచావు. ఎందుకయ్యా ! ఆ బాధనీకు!

మొత్తంగా(=తేరి) ఆమె–(ఆకె) అదేనయ్యా! మా అమ్మ నీ మనస్సులో స్థిరంగా ఉన్నది కదా!

ఉపసంహారం

అలంకారం మనిషికి, కవితకి ఇద్దరికీ ప్రకాశాన్నిస్తుంది. ఈ కీర్తనలో కూడా అలంకారం ప్రాణం.

పెద తిరుమలయ్య –అయ్య – అన్నమయ్య లానే – మధుర భక్తి అనే కుంచెతో గీసిన అందమైన కీర్తన అనే చిత్రమిది.

43.జమళి పాన్పు

అధునాతన వ్యవహారంలో డబుల్ బెడ్ రూం – త్రిబుల్ బెడ్ రూం – ఇలాంటి ఆంగ్ల పద బంధాలు– ఆంగ్లం రానివారికి కూడా బాగా తెలిసిన పదాలు. దీనిని తెలుగులోకి "రెండు పాన్పుల గది"– "మూడు పాన్పుల గది"– ఇలా అనువదించి అబ్బే – సరిగా కుదరలేదని మనకు మనమే అనుకొంటాం. ప్రతిభావంతుడైన అన్నమయ్య డబుల్ బెడ్ ను "జమళి పాన్పు" (ఇద్దరు పడుకోవటానికి వీలయిన పాన్పు) అని తెలుగులో ఆనాడే చెప్పాడు. ఆ జమళిపాన్పును (జంట పాన్పు) ఆయన కీర్తనలో దర్శిద్దాం.

పల్లవి: అప్పటి నీ సుద్దులెల్ల అడుగబుత్తెంచె నన్ను
తప్పకచూచినవాడు తాఁ గాడా

చ1: నగుతా నండకు వచ్చి నాకు నాపెకును
తగవు చెప్పినవాడు తా ఁ గాఁ డా
జిగిమాపయ్యద లంటి సిగ్గుల నేము నవ్వగ
అగడు సేసినవాడు అప్పటి తాఁ గాఁ డా

చ2: జమళిపాన్పుమీద సరసాన నాపె నన్నుఁ
దమిరేచినవాడు తాఁ గాఁ డా
ప్రమదాన నిద్దరికి పంతములు సరిచేసి
తములమిడినవాడు తాఁ గాఁ డా

చ3: అరసి యక్కచెల్లెండ్లమైన మమ్మింతలోనే
దరిచేర్చి కూడినాడు తాఁ గాఁ డా
యిరవై శ్రీవేంకటేశుఁ డింటిలోననే వుండి
తిరమై మన్నించినాడు దేవుడు తాఁ గాఁ డా

(రేకు: 1694–1సం: 26–558)

పల్లవి: ప్రాచీనమైన కావ్య భాష రానివారిని "**తాఁగాఁడా** "అను అన్నమయ్య పద బంధాన్ని చదవమంటే పానీయమేమన్నా తాగాడా అను అర్థంలో" తాగాడా" అని చదువుతారు. తాన్ + కాడా అని విడదీసి చదువుకోవాలి. తాను కాడా అని అర్థం.

ఒక నాయిక ఇంకొక నాయికతో ఇలా మాట్లాడుతోంది.

ఆనాటి నీ కబుర్లు అడగటానికి వేంకటేశుడు నన్ను పంపించాడు.

నేను అడగటమేమిటే– అప్పుడు – చాలారోజులక్రితం మీ ఇద్దరి మధ్య ఏంజరిగిందో – ఆయనకి తెలియదా!?

అదంతా కళ్లారా చూసింది తను కాదా? (తనే కదా అన్నీ చూసాడు. ఈరోజు కొత్తగా నన్నుఆనాటి కబుర్లు తెలుసుకొని రమ్మని నీదగ్గరకి పంపించాడు! అవ్వా!)

చ 1: వేంకటేశుడు ఏమి చేసాడో తెలుసా !ఒకరోజు నవ్వుతూ నా దగ్గరకి వచ్చి, నాకు, ఆమెకి మధ్య ఉన్న తగవు తీర్చాడు. గొప్పవాడు తను కాడా? కాంతితో వెలిగే మా పయ్యదలను అంటి ,సిగ్గులతో మేము నవ్వగా ఆనాడు అల్లరి చేసినవాడు(అగడు సేయు) త ను కాడా? !

(ఈ చరణంలో మూడవ కథా నాయిక ప్రస్తావన వచ్చింది.అమెకు రెండో కథా నాయికకు మధ్య నడిచిన వ్యవహారాలు ఈ చరణంలో వివరించాడు.ఇక్కడ శ్రోత మొదటి కథానాయిక.)

చ 2: జంట పాన్పు మీద (ఇద్దరు పడుకోవటానికి వీలయిన పాన్పు మీద) ఆమెని, నన్ను ఒకచోటికి చేర్చి మోహాలు రేపిన వాడు తను కాడా? సంతోషంతో మా ఇద్దరికి పంతాలు సరి చేసి తాంబూలమిచ్చినవాడు తను కాడా?(తృప్తిగా భోజనం చేసిన తర్వాత తాంబూలము ఇస్తారు.)

చ 3: పరిశోధించి అక్కాచెల్లెళ్లమయిన మమ్ములను ఇంతలోనే
దగ్గరికి చేర్చి కలిసిన మహాను భావుడు తను కాడా!?
అనుకూలుడై శ్రీ వేంకటేశుడు ఇంటిలోపలే ఉండి
నిబ్బరంగా మమ్మలిని రక్షించిన దేవుడు తను కాడా!?

పరమార్థం

వేంకటేశుడేమిటి? ఈ ఇద్దరు ముగ్గురు కథా నాయికలేమిటి?

అన్నమయ్య ఈ జమళి పాన్పుల వ్యవహారాలు వ్రాయటమేమిటి? అనిపిస్తుంది.

అన్నమయ్యే దీనికి జవాబు చెప్పాడు ఈ కీర్తన చివర్లో.

దేవుడు తను కాడా (దేవుడు **తాఁ గాఁ డా**? !)

వేంకటేశుడు దేవుడు.

సమస్త జీవులు ఆయన స్వరూపాలు. ఆయన లీలా వినోది.

అందరితోనూ ఆయన ఆడుకొంటుంటాడు.

ఆయన లీలలు ఎవరి దృష్టిని బట్టి వారికి అర్థమవుతుంటాయి.

స్వామి వారి మహిమలను భక్తి మార్గంలో ఎంత గొప్పగా వర్ణిస్తాడో- శృంగార మార్గంలో కూడా అన్నమయ్య అంత గొప్పగా వర్ణిస్తాడు.

మానవ శృంగార స్థాయిలో దేవుడు వర్ణించబడుతున్నాడంటే, ఆయనని మన మనస్సులకు దగ్గరగా చేర్చటానికి కవి తాపత్రయబడుతున్నాడని గ్రహించాలి.

మన స్థాయిలో స్వామి వారి శృంగార వర్ణనలలో పరవశించిన మనస్సు- స్వామి వారి భక్తిలో తరించాలి.స్వస్తి.

44. జాజర

పల్లవి : చాలు చాలు నీ జాజర నన్ను
జాలి బరచె నీ జాజర

చ1: వలపు వేదనల వాడెను యీ-
తలనొప్పుల చే దలకేను
పులకల మేనితో బొరలేను కడు
జలిగొని చల్లకు జాజర

02. ఒల్లని నినుగని వుడికేను నీ-
చిల్లర చేతల జిమిడేను
కల్లగందవొడి గా గేనుపై
జల్లకు చల్లకు జాజర

03. తివిరి వేంకటాధిప నేను నీ-
కవుగిట కబ్బితిగడు నేను
రవరవ చమట గరగినేడు యిదె
చవులాయను నీ జాజర (05-332 రేకు 87)

వేంకటేశునితో ఆత్మీయత పెంచుకొనే మధుర భక్తి అనే రహదారిలో అన్నమయ్య ఒక నాయికగా మారిపోయాడు.

ఆయనతో మాటలతో ఆడుకొన్నాడు. పాడుకొన్నాడు. చివరలో ఆయనలో తాను కరగిపోతున్నానని మురిసిపోయాడు. దేవునితో ఆత్మీయంగా మసలగలిగితే ఆయనలో కరగటం ఎంత సులువో నిరూపించాడు.

❖

బాబూ ! తిరుపతి సామీ ! ఇక నీ జాజర చాలు.
జాజర అంటే ఏమిటో తెలియనట్టు అడుగుతావా!
జాజర అంటే మోసం...వంచన.
నీకు అలవాటయింది అదే కదా స్వామీ !
నీ జాజర నన్ను బాగా దుఃఖ పెట్టింది. బాధ పెట్టింది. ఇక చాల్లే.
చ01. ప్రేమ బాధలతో వాడిపోతున్నాను. ఇదివరకు ఎంత కాంతిగా ఉండేదాన్నో!

తమరు చేసే తలనొప్పు పనులతో వణికిపోతున్నాను.

ముందు ముందు ఇంకా ఎలాంటి వేషాలు వేస్తావో అని భయపడిపోతున్నాను.

నా ఖర్మ... నామటుకు నేను అంటూనే ఉంటాను . దొంగ వేషాలు వేసి నన్ను కౌగిలించుకొని పారిపోతావు. ఆతరువాత ఆగమన్నా ఈ పులకలు ఆగి చావవు. నీకు దూరమై ఈ పులకల శరీరంతో పక్క మీద అటూ ఇటూ దొర్లుతున్నాను.

సరిగ్గా.. ఇప్పుడే సమయం కుదిరిందా నీకు.. అతిశయించిన ,ఉత్సాహంతో జాజర –రంగుల ఉత్సవం – చల్లుతావేమిటి !?

చ02. నీ తప్పులను క్షమించి నీ పక్కకు వచ్చినా నన్ను ఒల్లవు. ఇష్టపడవు. అలాంటి నిన్ను చూసి ఉడికిపోతున్నాను. ఏమనుకొన్నావో !

కనబడకుండా ఎన్ని చిన్ని చిన్ని పనులు చేస్తావో నా తండ్రీ ! నీ చిల్లర చేతలు ఎవరికీ చెప్పుకోలేక సిగ్గుతో చితికిపోతున్నా.

గంధపు పొడి చల్లుతావేమిటి? ! అది నీ అబద్ధాల సుగంధం కలిసిన గంధపుపొడి.. అది మీద పడుతుంటే చల్లదనం కాదు. ఒళ్లు మండిపోతోంది.

ఆ గంధపు పొడి మీద చల్లకు .

చ03. ఓ వేంకటాచలపతీ ! ఇదుగో! ఈ రోజు నీ కౌగిలిలో చెమటలు మిలమిలా శరీరం మీద మెరిసిపోతుండగా కరిగిపోయాను.

ఆలోచించి, ప్రయత్నపూర్వకముగా, త్వరపడి , నేను నీ కౌగిలిని దొరికించుకొన్నాను. ఇందాకటినుంచి ఏదో అన్నాను కాని – ఏమనుకోకు! నీ రంగులు చల్లే ఉత్తుత్తి మోసాల కార్యక్రమం బాగానే ఉంది.

45. డిమికీలు

అన్నమయ్య కీర్తనల్లో ముందు వెనుక పదాలు ఒకటికి రెండు సార్లు సరిగా చదవకపోతే– ఈ యన కొత్త పదం సృష్టించాడని , దాని అర్థం ఏమిటని ప్రమాదంలో పడే సందర్భాలు కొన్ని ఉంటాయి. అలాంటి వాటిలో "డిమికీలు" (అనుకొన్న పనిని పూర్తిగా సాధించలేకపోవటం.ఒకటి). అసలు ఈ ప్రయోగం ఎలా అన్నమయ్య కీర్తనలో ఉందో తెలుసుకొన్న తర్వాత " అరే.. ఇంతేనా...ఎలా అర్థం చేసుకొన్నాం" అని మనం నవ్వుకొంటాం.ఆ డిమికీలు ఉన్న కీర్తనను అర్థ పరమార్థాలతో తెలుసుకొందాం.

పల్లవి:ఎటువలెబొగడినా నిన్నిటికి దగినది
ఘటిఇంచె మేలుమేలు కంటిమి యీవేడుక

చ 1:చెలిచన్నులబలిమి సింగారానకు గలిమి
అలరుగన్నులచూపు ఆసలదాపు
నిలువయిక్కదనము నెమ్మి దాచినధనము
కులుకుగుత్తికసొంపు కోవిలలగుంపు

చ 2:కాంతవెట్టినకొప్పు గండుదుమ్మిదలకప్పు
చెంత నెన్నడిమికీలు సింగము బోలు
యెంతే పిరుదుతీరు ఇంచువిలుతునితేరు
వింతచిరునవ్వులాగు వెన్నెలపోగు

చ 3:లేమపాదములసోగ లేతచిగురులో చేగ
భూమిలో మించె యీయమ్మ పుత్తడిబొమ్మ
ఆముక శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి
ప్రేమ నేలితివి పొందు బెరసినవిందు (రేకు: 1316–5సం: 23–095)

పల్లవి: వేంకటేశ్వరా! ఎలా పొగడినా ఆ నాయిక ఇన్నిటికి (నేను చరణాల్లో చెప్పబోయే పోలికలకు) తగినది.

సౌందర్యపు పోలికలన్నీ ఈమెకు బాగా కుదిరాయి. మేలుమేలు. మా అదృష్టం కొద్దీ ఈ అందంగా పోలికలు కుదిరిన వేడుక చూసాం.

చ 1:వేంకటేశ్వరా ! నీ నాయిక స్తనముల శక్తి – శృంగారానికి ఐశ్వర్యము

కలిగిస్తుంది.

సంతోషంతో వికసించే ఆమె కన్నుల చూపు– ఆశలను దాచిపెట్టేది. (చూపులలో ఆశలను దాచిపెట్టడం ఒక అందమయిన అపూర్వమయిన ప్రయోగం.ఒకరు దాచిన ఆశలు ఎదుటి హృదయానికి – తెలిసే దారి చూపులట. ఆశలను దాచుకొన్న చూపులను చదవగలిగే సామర్థ్యం ఈ లోకంలో అభిమానించే వారికే ఉంటుంది.)

ఆ మేనిలో నిలువ ఉన్న అందం – ప్రేమతో దాచుకొన్న ధనం.(నాయకుడు ప్రేమ పంచుతున్నకొద్దీ అందపు నిలవ పెరుగుతుంటుంది. ఎందుకంటే ఆ అందం – ప్రేమకు సంబంధించిన ధనం కనుక)

వయ్యారంగా కదలు గొంతు లోని అందం– కోకిలలగుంపు.

చ 2: నీ నాయిక పెట్టిన కొప్పు – పెద్దవయిన తుమ్మెదల ఆచ్ఛాదనం.

దగ్గర్లోనే ఉన్న అందమయిన నడుము యొక్క రహస్యమంతా – సింహాన్ని పోలిస్తే తెలుస్తుంది. (సింహం నడుములా అమె నడుము సన్నదని భావం)

ఎంతో గొప్పదయిన నితంబము– చెరకు విల్లుగా కలిగిన మన్మథుని రథము

వింతయిన ఆమె చిరునవ్వు విధానం– వెన్నెల యొక్కసన్నని దారం(సన్నని చిరునవ్వు చాలా అందమైనది. అందుకే వెన్నెల యొక్క సన్నని దారంతో పోలిక.)

చ 3: నీ నాయిక పాదముల యొక్క అందం– లేత చిగురులోని సారం.

భూమిలో నీ నాయిక – మా అమ్మ– బంగారపు బొమ్మ ప్రకాశిస్తోంది.

విశ్వమంతా వ్యాపించిన వేంకటేశా ! నువ్వు ఆ నాయిక అయిన అలమేలుమంగ భర్తవి. ఆమెను ప్రేమతో పరిపాలించావు. ఆమె స్నేహము నీకు వ్యాపించిన విందు.

పరమార్థం

నెన్నడుము (అందమయిన నడుము) మనకు తెలుసు.దానిని అన్నమయ్య "నెన్నడిమి" దానితో కీలు పదాన్ని కలిపి సమాసం చేసాడు. అంటే "అందమయిన నడుము యొక్క రహస్యం "అని అర్థం వస్తుంది. మనం పొరబాటున ఆ ఆ పాదం చదువుతూ " చెంత నెన్న వరకు' ఆపామనుకోండి. "డిమికీలు సింగము బోలు" అని చదువుకోవలసివస్తుంది. డిమికీల సింగము ఏమిటి? దీని పోలికను ఎలా సమన్వయించుకోవాలి అని తలబద్దలు కొట్టుకోవాలి.

అందుకే అన్నమయ్య వేంకటేశుని పాదాలకు నమస్కరించి ఆ యన పాదాలు చదువుకొంటే "డిమికీలు" రావు. స్వస్తి.

46. తడమారి

శ్రీ కృష్ణుని చిలిపి క్రీడలు వర్ణిస్తూ –గోపికలు యశోదమ్మతో చెప్పుకొన్న పోతన్నగారి మాటల మకరందాలు మనందరికీ పరిచయమయినవే.

"ఓ అమ్మా ! నీకుమారుడు మా యిండ్లను పాలు పెరుగు మననీడమ్మా !" అంటూ ఆ రస గంగా ప్రవాహం సాగుతుంది. ఇందులోని "అమ్మ" పదంతోటే అన్నమయ్య కూడా ఒక కీర్తన గోపికల చేత యశోదమ్మకు చెప్పించాడు..

అయితే ఈ కీర్తనలో అన్నమయ్యకు ప్రత్యేకమయిన కొత్త తెలుగు పదాలు ఉన్నాయి.

ఈ కీర్తనలోని "తడమారి" అనే పదానికి ఏ నిఘంటువు అర్థం చెప్పలేదు. ఆ పద పరమార్థాన్ని సందర్భానుసారంగా ఈ కీర్తనలో తెలుసుకోవటానికి ప్రయత్నిద్దాం.

కీర్తన పూర్తి పాఠం ఇది.

పల్లవి: ఓయమ్మ నీలిబిడ్డ డోయమ్మ
యీయెడ యశోద నీవెట్టు గంటివమ్మ

చ 1: గాలిగొట్టె తిరిగినగామిడివా డోయమ్మ
గోలవలె నుండుగాని కోడెకాడమ్మా
తాలిమి యించుకాలేని తరువరివాడమ్మ
ఆలరీడు నీబిడ్డడదె బుద్ధిచెప్పరో

చ2: కడలేనిసాహసాల గట్టు(ట్టి) వాయివాడమ్మ
తడమారి ఇందరిలో తాటగట్టమ్మ
ముడికారితనముల మునిముచ్చువాడమ్మ
బడిబడి నుద్దండపనులు మానుపవో

చ3: శ్రీవేంకటాద్రిమీది నేతలయేతులవాడు
వావాత నుడుగులవడ్డి వాడు
వేవేలు దూరినాను విడువక మమ్ము నేలె
వోవల మాతప్పులెల్ల నోరుచుకొమ్మనవో (రేకు: 1212-3 సం: 22-069)

ఓ యశోదమ్మా ! నీ బిడ్డ నల్లని బిడ్డ.

ఇక్కడ (ఈ వ్రేపల్లెలో) వాడిని ఎలా కన్నావమ్మా !

చ 1: అమ్మా ! నీ కుమారుడు గాలికి తిరిగే దుష్టుడు, ధూర్తుడు అమాయకుడు,

తెలివిమాలినవాడుగా ఉంటాడు కాని విటుడు తల్లీ ! ఓర్పు కొంచెం కూడా లేని వాడు. ఉత్తరువులతో ఆత్రంతో ఇతరులను కష్ట పెట్టేవాడు.

నీ బిడ్డడు అవివేకి. వాడికి బుద్ధి చెప్పమ్మా !

చ 2: అమ్మా ! నీ కుమారుడు అంతము లేని సాహసాలు కలిగిన గట్టి నోరు కలవాడు. ధైర్యవంతుడయిన వీడు ఇంతమందిగోపాలకులలోనూ పెద్ద మోసగాడు. (తడమారొతడమాటము అంటే గాబరా. తబ్బిబ్బు. దానికి శత్రువు. అంటే ధైర్య వంతుడని భావము)

తగాదాలు పెట్టే స్వభావాలతో చూస్తుండగానే దొంగలించేవాడు.

మాటి మాటికి అతగాడు చేసే దీరమైన కొంటె పనులను మాన్పు .

చ 3: బడాయి మాటలు, గొప్పలు చెప్పే నాయకుడు శ్రీ వేంకటాద్రి పర్వతముపై ఉన్నాడు.

అతడు నోరార అందరూ పిలుచుకొనే వడ్డి కాసులవాడు.

వేన వేలుగా నిందించినా, మమ్మలిని విడువకుండా పరిపాలించాడు.

ఆవల – అంటే జరిగిందేదో జరిగింది. ఇకనుంచి మా తప్పులన్నీ ఓర్చుకొమ్మని చెప్పవే!

❖

పరమార్థం

మనస్సు, బుద్ధీ రెండూ విడివిడిగా పనిచేస్తుంటాయి.

మనస్సు కృష్ణుడిని ఇష్ట పడుతుంది.

తప్పొప్పులను ఎంచే బుద్ధి కృష్ణుని తిడుతుంది.

గోపికల మనస్థితి ఇదే.

వాళ్ల మనస్సంతా కృష్ణుడు ఆక్రమించాడు.

బుద్ధి వాళ్ల నాలుక చివర చేరి – కృష్ణుడు చెసే వెన్నదొంగతనాలు– చిలిపి చేష్టలు – ఇవన్నీ విశ్లేషించి – నిందించింది.

చివరకు బుద్ధిని మనస్సు జయించింది.

అందుకే కీర్తన చివర్లో మేము నిందించినా ఆయన ఓర్చుకొన్నాడు. మమ్మలిని క్షమించ"మనే ధోరణిలో యశోదమ్మతో గోపికలు విన్నవించారు. స్వస్తి.

47. తమ్మా

తాళ్ళపాక అన్నమాచార్యుల కుమారుడు పెదతిరుమలాచార్యులవారు తిరుమలలో స్వామి ఎదుట తాను చూసిన వివిధ వ్యక్తులను చూస్తూ, స్వామి గొప్పతనాన్ని ఈ కీర్తనలో పొగిడారు

పల్లవి: నెట్టున నంతమాత్రాన నీ వాడె వాడు
యెట్టైనా గావకపోదు యీ సంబంధమునను

చ.1: చిలుకను రామ తమ్మా పలుకు మను నొక్కడు
పిలుచుదిమ్మా యని నీ పేరిటివాని నొక్కడు
వెలయ గోవిందా యని వెగువడు నొక్కడు
అలసినవేళ హరి హరి యను నొక్కడు

చ.2: సింగారానకు నొక్కడు చిన్ని తిరుమణి వెట్టు
వెంగొంగ నామము వెట్టు వెక్కిరింపుచు నొక్కడు
పంగనామముగబెట్టు బహురూపగాఉడొక్కడు
సంగాతాలకుబెట్టు వేసాల నామ మొక్కడు

చ.3: సరుగ నీ గుడిలోన సాగిలి పండు నొక్కడు
వరుస నూరకే తల వంచు సారె నొక్కడు
యిరవై శ్రీవేంకటేశ యిన్నీ నీ మొక్కులుగానే
అరసి చేకొందువు నీ వంత సులభుడవు

(రేకు: 0062-04 సం: 15-355)

అర్థ పరమార్థం

పల్లవి: ఓ వేంకటేశా ! నీ భక్తుడు ఒక్కొక్కడు ఒక్కోరకంగా నీ పట్ల భక్తిని ప్రకటిస్తున్నాడు. వాడు ఆ మాత్రము (=అంతమాత్రాన)భక్తిని చూపిస్తే చాలు తత్క్షణమే (=నెట్టనన్) వాడు నీ వాడయిపోతున్నాడు.

ఏ విధంగా అయినా (=యెట్టైనాన్) మీ ఇద్దరి మధ్య సంబంధము- ఆ భక్తుడిని రక్షించకుండా పోదు.(=కావకపోదు)

నువ్వు భక్తునితో సంబంధము పెట్టుకొంటే - వాడికి సంసార పరమైన సంబంధము పోతుంది. పునర్జన్మ ఉండదు.

ఇదే స్వామి భక్తుడిని కాపాడే విధానము.

చ. 1: ఒక భక్తుడు నీదగ్గరలో నిలబడి ఆచిలుకను రామ! తమ్మ ! ఈ పదాలు పలుకు అంటున్నాడు.

వాడు తెలిసి అన్నాడో, తెలియక అన్నాడో కాని – పరశురాముడు; బలరాముడుఇ శ్రీరాముడు– అను నీ మూడు అవతారాలను "రామ" పదంలో పలికాడు."తమ్మ" అంటే నమిలిన తాంబూలము అని అర్థము కావచ్చు. కాని నీకు చేసే షోడశోపచారాలలో తాంబూలము కూడా ఒకటి కదా ! అలా వాడు నీకు మాటల తాంబూల సేవ చేసాడు. ఆ మాత్రము (=అంతమాత్రాన)భక్తిని చూపించి తత్క్షణమే వాడు నీ వాడయిపోతున్నాడు.

నీ పేరు పెట్టుకొన్న ఒకడిని ఒకడు పిలుస్తూ "తిమ్మా" అంటున్నాడు.

తిమ్మడంటే కోతి. ఆంజనేయ స్వామి. ఆంజనేయునికి నీకు భేదమేముందయ్యా! ఆయన పేరే నీపేరు. నీపేరే ఆయన పేరు.

"ఆంజనేయా!" అని పిలిచినంత మాత్రాన – ఆ పిలిచిన వాడు– నామము పలికిన వాడు–తత్క్షణమే నీ వాడయిపోతున్నాడు

ప్రసిద్ధి కెక్కిన (వెలయ)నీ పేరుతో గోవిందా అని ఒకడిని ఒకడు పిలిచాడు. అంతలొనే ఆశ్చర్య పడుతున్నాడు. నిశ్చేష్టుడవుతున్నాడు.

నీ పేరులలో కెల్లా నీకు బాగా ఇష్టమయిన పేరు గోవిందుడు అనే విషయం వాడికి తెలుసునో – తెలియదో !

నీ సన్నిధిలో నీకు దగ్గరగా నిలబడి నీ ఎదురుగా "గోవిందా!"అంటున్నాడు. నీ కటాక్షపు స్పర్శ విద్యుత్తులా వాడి ఒళ్లంతా పాకి ఉంటుంది.అందుకే ఆశ్చర్య పడుతున్నాడు. నిశ్చేష్టుడవుతున్నాడు.(=వెగువడు) తత్క్షణమే నీ వాడయిపోతున్నాడు

కొండ మీదికి వచ్చి – జనం లేరు కదా– నీ దగ్గరే కొంతమంది ఆటలు మొదలుపెట్టారు. అందులో ఒకడు అలిసిపోయాడు. తెలియకుండానే వాడి నోటిలోనుంచి "హరి, హరి" అని పిలుపు వచ్చింది. అంతమాత్రపు నీ నామ పారాయణ భక్తిని చూపించిన ఫలితానికి తత్క్షణమే వాడు నీ వాడయిపోయాడు.

చ. 2: ఇంకెక్కడ సింగారము చేసుకోవటానికి స్థలం దొరకలేదు. నీ కొండ మీదికి వచ్చి నీ ఎదుట ఒకడు తన మొగం మీద చిన్న తెల్ల నామము (=చిన్ని తిరుమణి) పెట్టుకొన్నాడు.

తిరుమణి దురిత విదూరము
తిరుమణి సౌభాగ్యకరము త్రిజగములందున్
తిరుమణి పెట్టిన మనుజుడు
పరమపవిత్రుండు భాగ్య వంతుడు కృష్ణా?!

ఓకృష్ణా!తిరుమణి అనగా త్రిపుండములు పాపములను పోగొడతాయి. భాగ్యమిస్తాయి. సంపదలను కలిగిస్తాయి.కాబట్టి మూడు లోకములనందును తిరుమణిని ధరించినవాడు పాపరహితుడు, పవిత్రమైన వాడు,ఐశ్వర్య వంతుడు. అందుకే తిరుమణిని పెట్టుకొన్నంత మాత్రమున తత్‌క్షణమే వాడు నీ వాడయిపోయాడు.

తిరుమణి పెట్టుకొన్నవాడిని వెక్కిరిస్తూ ఇంకొకడు తెల్లని కొంగ నామము (వెంగొంగ నామము) పెట్టాడు.మొత్తానికి నామము పెట్టాడు కదా !– తత్‌క్షణమే వాడు నీ వాడయిపోయాడు

వేంకటేశా ! వంచించటం, , తిరస్కరించటం, గురువు మొదలయిన పెద్దల మాట వినక తిరుగఉబడటం పంగనామములు పెట్టడం అని లోకంలో ప్రసిద్ధి ఉంది. కాని నీదగ్గర అనేక వేషాలు వేసే వాడు ఒకడు ఏమి చేసాడో తెలుసా! బుంగ నామము పెట్టలేదు !

ఇలా మాటలతో తాంబూల సేవ చేస్తూ – ఆనాటి సమాజంలోని వ్యక్తుల వర్ణనను కవి శాశ్వతం చేసాడు.

48.తలపిడి కొలుపిడి

అన్నమయ్య తన కాలంలో వ్యవహారంలో ఉన్న పదాలను, తన కీర్తనలలో యథేచ్ఛగా వాడాడు.అలాంటివాటిలో "తలపిడి కొలుపిడి" ఒకటి. దాని పూర్వాపరాలు చూద్దాం.

పల్లవి: పులుగు చెప్పెడినదె పొంచి మాగురుడు నీకు
తలచుకో నేడు నీవు దాచినర్థము

చ.1: యిలమీఁద తమసొమ్ము లెవ్వరివద్ద నుండినా
తలపిడి కొలుపిడి తగిలినట్టు
తొలుత పంచేంద్రియపు దొంగలవద్ద నున్నాడ
వెలయ నీసొమ్మనుచు విడిపించుకొనవే

చ.2: చేరి తమవూరివారి చెవట్టుకొని పోతే
కోరి కుయివోయి తెచ్చుకొన్నట్టు
వూరక నీకుక్షిలోనవున్న నన్ను నీమాయ
వీరానజెరవట్టెను విడిపించుకొనవే

చ.3: బడిదప్పి తిరిగేటి పడుచుల తమవారు
తడయక తెచ్చుక ఆదరించినట్టు
వెడబుద్ధి దిరిగేను వెర్రి ని శ్రీవేంకటేశ
విడువక అజ్ఞాని నన్ను విడుపించుకొనవే (రేకు:0101-05సం:02-005)

ఓ వేంకటేశా !

నీ గుర్తుగా వైష్ణవులమైన మేము మేము లలాటం, హృదయ స్థానం, ఉదరం, కంఠం, బాహువులు మొదల్కెన పన్నెండు స్థానాలలో పుండ్రం ధరిస్తాం. శంఖ చక్ర ముద్రలు వేసుకొన్నాం.

మేము ఎక్కడ దాగిఉన్నా, ఏ ముసుగులు వేసుకొన్నా మా శరీరముపై ఉండే నీ గుర్తు మమ్మలిని నీకు పట్టిస్తుంది. ఇది మా గురువు గారు చెప్పారు.కనుక నువ్వు మావద్ద దాచిన నీ భక్తి అనే సొమ్మును తలచుకొని, దానిని మా దగ్గరినుంచి తీసుకుపో.

వేంకటేశా ! నీకు తెలియనిది కాదనుకో ! ఈ భూమి మీద ఒకరి నగను ఇంకొకడు దొంగిలించాడు. దొంగ తన దురదృష్టమువల్ల దొరికిపోయాడు.అప్పుడు

పోయిన నగ కొలత ఎంత ఉందో (తలపిడి) లెక్కచూస్తారు. తరువాత దొరికిన నగ కొలత ఎంత ఉందో (కొలుపిడి) రెండూ సమానమని లెక్క కట్టిన తర్వాత నగ స్వంత దారుడు స్వీకరిస్తాడు.కదా !

నేను కూడా నగలాంటి వాడిని. నన్ను పంచేంద్రియములనే దొంగలు (చెవి, ముక్కు, కన్ను, నాలుక, చర్మము) దొంగిలించారు. నీకు దొరికిపోయారు. ఇప్పుడు నా కొలతలు కూడా పరీక్షించి స్వీకరించు. (తాను ఇంద్రియ నిగ్రహము కలవాడినని భావం)

చ.2: తమ ఊళ్లో వాళ్లని –పక్క ఊరి వాడు చెరబడితే– ఆ ఊరి వాళ్లు ఊరుకొంటారా? కేకలు పెడుతూ ఆ ఊరివాళ్లు రక్షించుకొంటారా ? లేదా? అలాగే నీ పొట్టలో ఉన్న నన్ను మాయ వీరత్వంతో ఎత్తుకుపోయింది. నీ వాడిని కాపాడవయ్యా! ఆ మాయనుంచి నన్ను విడిపించవయ్యా !

చ.3: దారితప్పిన తమ పిల్లలని పెద్దవారు అలాగే వదిలేస్తారా? ఏదో నయానో భయానో చెప్పితిరిగి తమ ఇంటికి తెచ్చుకొని ఆదరిస్తారా? లేదా? అలాగే నీచ బుద్ధితో తిరిగే వెర్రివాడిని నేను .దారి తప్పిన వాడిని.. నా మానాన నన్ను వదిలేయకుండా, ఈ అజ్ఞానిని కోరికల కట్లనుంచి విడిపించి ఆదరించవయ్యా!. వైరాగ్య సందర్భంలోనే కాదు – “తలపిడి” అనేదానిని శృంగార సందర్భంలో కూడా అన్నమయ్య ప్రయోగించాడు. (రేకు:1109–3సం 21–045)

పల్లవి: ఈ నాయిక కథ ఏమిటో కాస్త చూడవయ్యా స్వామీ !

నేర్పరి తనమంతా నువ్వు చేయబోయే కార్యక్రమంలో ఉంది.

చ 1: ఒక అమ్మడు నీతో అనేక సార్లు పందెమేసి జూదమాడింది.

కిందపడ్డ ఉంగరాన్ని గెలిచిన పందెపు సొమ్ముగా తీసుకొంది

నీపక్కనే ఉన్న ఇంకో అమ్మడు ఆ ఉంగరము తనదని మొదటి అమ్మడితో నీ సమక్షంలో తగాదా వేసుకొంది.

అప్పుడెప్పుడో ఆ రెండో అమ్మడికి తమరు ఆ ఉంగరము చేయించారట. ఆ ఉంగరపు కొలతలు ఖచ్చితంగా చెబుతూ ఆ ఉంగరం తనదే అంటోంది.

నారీనారీ నడుమ వేంకటేశా ! ఆ తలపిడులను, ఆ తలకాయ నొప్పులను తేల్చగలిగివాడివి నువ్వే.

ఇంతకీ “తలపిడి కొలుపిడి” అనేది అన్నమయ్య కాలంలో ఉన్న ఒక జాతీయంగా తోస్తోంది. స్వస్తి.

49. తిమ్మిరెడ్డి

"ఈ కాలంలో వాళ్లు సరిగా తినలేరు. అరిగించుకోలేరు. గట్టిగా పనిచేయలేరు. దంత సామర్థ్యం తక్కువ అయిపోయింది. " అని అప్పుడప్పుడు పెద్దవాళ్లు ఈ తరం మీద వ్యాఖ్య చేస్తుంటారు. నేటి సాహిత్యానికి కూడా ఈ అభిప్రాయం వర్తిస్తుంది.

ఇన్ స్టెంట్ కాఫీలా– ఇన్ స్టెంట్ సాహిత్యం కావాలి. అర్థం వెంటనే తెలిసిపోవాలి. కాని ప్రాచీన కాలం వారు దంత పుష్టి, ఆలోచనా సామర్థ్యం ఉన్నవాళ్లు.

"సలిలవిహారు లిద్దరును, సంతత కాననచారు లిద్దరున్,
వెలయగ విప్రు లిద్దరును, వీర పరాక్రమశాలు లిద్దరున్,
పొలతుల డాయు వాడొకడు, భూమిని బుట్టెడు వాడొక్కడున్,
చెలువుగ మీకభీష్టఫలసిద్ధి ఘటింతు రనేక కాలమున్"అనే పద్యం ఎవరైనా చెప్పారనుకోండి. కొంచెం ఆలోచించేవారు.

సలిలవిహారు లిద్దరును= (1) మత్స్య (చేప), (2) కూర్మ (తాబేలు)

సంతత కాననచారు లిద్దరున్=(3) వరాహ (పంది), (4) నారసింహుడు (సగం నరుడూ, సగం సింహం),

వెలయగ విప్రు లిద్దరును=(5) వామన (మరుగుజ్జు) (6) పరశు రాముడు పరశువు చేబూనిన రాముడు

వీర పరాక్రమశాలు లిద్దరున్=(7) శ్రీరామచంద్రుడు (సూర్య వంశ సంభవుడు), (8) బలరామ (శ్రీకృష్ణుడి అగ్రజుడు),

పొలతుల డాయు వాడొకడు= (9) శ్రీక ృష్ణ(యదుకులతిలకుడు),

భూమినిబుట్టెడు వాడొక్కడున్ =10.కల్కి (కలియుగాంతంలో అవతరించే విష్ణు స్వరూపం) – ఇదే కాదా – నువ్వు చెబుతున్నది అని సమాధానం చెప్పే వాళ్లు.

ఇటువంటి దశావతారాల చిక్కుముడులను విప్పగలిగి, ఆనందించగలిగే సాహితీ పరుల కోసం అన్నమయ్య అనేక దశావతార కీర్తనలు రాసాడు.

అందులో "తిమ్మిరెడ్డి మాకునిచ్చె దిష్టమైనపొలము" అను కీర్తన ఒకటి.

తిమ్మప్ప(తిరుమలప్ప), తిమ్మనాయడు, తిమ్మి నాయడు– ఇలా స్వామికి రకరకాల పేర్లు పెట్టిన కవిగారు – తిమ్మిరెడ్డి మాకునిచ్చె కీర్తనలో వేంకటేశ్వర స్వామిని తిమ్మిరెడ్డి అన్నాడు. ఆ కీర్తనను ఆస్వాదిద్దాం.

పల్లవి: తిమ్మిరెడ్డి మాకునిచ్చె దిష్టమైనపొలము
బొమ్మిరెడ్డి కప్పగించి పోదిసేసె బొలము

చ.1: నిండినట్టి మడుగుల నీరువంక పొలము
కొండలు మోచినపెద్ద గొబ్బరపుబొలము
అండనే పొలము రాజులుండేటి పొలము
చెండివేసి మాకులెల్లా సెలగినపొలము

చ.2: అసపడి వరదానమడిగిన పొలము
బాసలతో గడు నెత్రుపట్టమైనపొలము
రాసికెక్కేమునులకు రచ్చైన పొలము
వేసరక నాగట వేగిలైన పొలము

చ.3: మంచి గురుతైన రావిమానిచేని పొలము
వంచిన గుట్టము దోలే వయ్యాళి పొలము
యెంచగ శ్రీవేంకటేశు నిరవైన పొలము
పంచుకొని లోకులెల్లా బ్రదికేటి పొలము

(రేకు: 0309-04సం: 04-052)

అర్థం

పల్లవి: వేంకటేశ్వరుడు (తిమ్మిరెడ్డి) మాకు భాగ్యవంతమైన ప్రపంచము (పొలము) ఇచ్చాడు.

బ్రహ్మ దేవునికి (బొమ్మిరెడ్డి) ఈ సృష్టి చేసే బాధ్యతను అప్పగించి , తాను పోషిస్తున్నాడు. (పోదిసేసె)

చ.1: నీటితో వ్యాపించిన సముద్రములో సోమకాసురుని చంపి, మత్స్యావతారంలో వేదాలు వర్ధిల్లిన ప్రపంచమిది..(నీరువంక పొలము)

కూర్మావతారంలో మందర పర్వతాన్ని మోసిన పెద్ద ఎరువు కలిగిన ప్రపంచమిది. (గొబ్బరపు పొలము) ఎరువు భూమిని సారవంతము చేసినట్లుగా, క్షీర సముద్ర మథనంలో కామధేనువు, లక్ష్మి మొదలయిన రకరకాల పుట్టుకకు స్వామి ఎరువైనాడని భావం)

భక్తులు ఆశ్రయించిన (అండనే) హిరణ్యాక్షుని సంహరించిన వరాహావతారము లున్న ప్రపంచమిది.

ఖండించిన (చెండివేసి) స్తంభాలు (మాకు) కలిగిన నరసింహావతారాలతో ప్రకాశించిన (సెలగిన) ప్రపంచమిది.

చ. 2: ప్రేమతో, ఆసక్తితో (అసపడి) బలిచక్రవర్తిని శ్రేష'మయిన మూడు అడుగుల దానాన్ని అడిగిన వామనావతారమున్న ప్రపంచమిది.

ప్రతిజ్ఞలు చేసి క్షత్రియ సంహారము చేసిన పరశురామావతారంతో (=బాసలతో) బాగా (=కడు) నెత్తురు కూడు లా, (=నెత్రుపట్టమైన) మారిన ప్రపంచమిది.

రామావతారం వల్ల ప్రసిద్ధి పొందిన (రాసికెక్కే) మునులకు రక్ష (రచ్చ) అయిన ప్రపంచమిది.

శ్రమపడక (వేసరక) బలరామావతారంలో ఆయన నాగేటితో కదిలించిన నువ్వు చేను అడుగులు (వేగిలి) కలిగిన ప్రపంచమిది.

ఎర్రన రచించిన హరివంశంలో కథ ఇది.

బలరాముడు ఓసారి దూరంగా ఉన్న యమునా నదివైపు చూసి తనకు ఆ నదిలో స్నానం చేయాలని ఉందని తనదగ్గరకు రమ్మని పిలిచాడు.

ఆ నది బలరాముని మాటలు వినలేదు. బలరామునికి కోపం వచ్చి తన భుజం మీద ఉన్న నాగలిని తీసి యమునా నది నుంచి తనదాకా ఒక పెద్ద కాలువను చేసాడు. ఆ రోజునుంచి బలరామునికి కాళిందీభేదనుడు అనే పేరొచ్చింది. ఇంకో సందర్భంలో నాగలితో యమునా నదిలోకి హస్తినాపురాన్ని లాగబోయాడు. వీటిని వేగిలి అనే పదంతో అన్నమయ్య ఇక్కడ సంకేతించాడు.

చ. 3: బుద్ధావతారంలో మంచి గుర్తుగా మిగిలిన రావి చెట్టు కలిగిన ప్రపంచమిది.(బుద్ధావతారంలో విష్ణువు రావిచెట్టులో ప్రవేశించి త్రిపురాసురుల భార్యల పాతివ్రత్యం నశింపచేసినట్లుగా ఒక కథ)

కల్క్యావతారంలో తనముందు వంగిన గుర్రాన్ని తోలే విహారములు(వయ్యాళి) కలిగిన ప్రపంచమిది.

లెక్కించగా(ఎంచగా) శ్రీ వేంకటేశ్వరునికి స్థానమైన(ఇరవైన)ప్రపంచమిది.

వేంకటేశ్వర స్వామి దయ పంచుకొని లోకులు అందరూ బ్రదుకుతున్న ప్రపంచమిది.

పరమార్థం

"మహా కవులు చెప్పిన పదాలను అర్థాలు వెతుక్కొంటూ వస్తాయి." అని భవభూతి మహాకవి చెప్పిన మాట అన్నమయ్య విషయంలో నూటికి నూరు పాళ్లు సత్యం. స్వస్తి.

50. తెంకి

అన్నమయ్య అలమేలుమంగమ్మ సౌందర్యాన్ని వేంకటేశునికి వివరిస్తున్నాడు ఈ కీర్తనలో.

పల్లవి : ఈవిలాసంబులును యీ చక్కదనములును
భావించి చూడ నీ పడతికే తగును

చ1. నలినాక్షి చెక్కులివి నవ్వు వెన్నెల పొలము
విలుసామి గరిడి బొమ్మలకు నొసలు
పలుకు జిలుకకు మోవి పంజరపు దండెంబు
నలిగుంతలముల కాణాచి పెనుగొప్పు

చ2. గురు కుచములివియే సిగ్గులకు బుట్టిన ఇండ్లు
సరసములకిరవు హస్తముల కదలు
సురతముల విభవముల దాపురమున నెయ్యపు బిరుదు
కరుల యానముల నిలుకడ వనము తొడలు

చ3. అన్నువగు నడుము గుట్టనెడి సింహపు నెలవు
తిన్నని మొగము కళలు దేరు తెంకి
మన్నించి యేలితివి మరిగి శ్రీవేంకటేశ
ఇన్ని సింగారముల నెనసె నీ లలన

(27 వ సంపుటము 591 కీర్తన 1799 రేకు)

అర్థ తాత్పర్యాలు

వేంకటేశా ! ఈ విలాసాలు, ఈ అందాలు – ఆలోచించి చూస్తే – ఈ లోకంలో నీ భార్య యైన అలమేలుమంగమ్మలోనే ఉన్నట్లు అనిపిస్తోంది. ఇంకా వేరే ఏ స్త్రీ మూర్తిలోనూ లేవయ్యా! (ఆ విలాసాలు, ఆందాలేమిటో మూడు పాదాలలో కవి వర్ణిస్తున్నాడు.)

చ1. తామరలవంటి కన్నులు గల అలమేలుమంగమ్మ చెక్కిళ్లు – నవ్వు అనెడి వెన్నెల పొలాల వంటివి. (పైరు పెట్టు నేలపొలము. నవ్వు అనే పైరు ఆమె చెక్కిళ్లలో ఎప్పుడూ విరగ కాస్తుంటుందని కవి భావం)

ఆమె ధనుస్సులాంటి కనుబొమ్మలకు నుదురు వ్యాయామ శాల. (వ్యాయామముతో బలము, అందం వస్తాయి. నుదురు అనే వ్యాయామశాలలో కను బొమ్మలు అందం కోసం వ్యాయామం చేస్తుంటాయి.కనుబొమ్మలు అందంగా ధనుస్సులాగా వంపు తిరిగి ఉన్నాయని భావం)

అలమేలుమంగమ్మ పలుకు చిలుకలాంటిది. ఈ చిలుక ఎగిరిపోకుండా అమె పెదవి ఒక పంజరపు దండెములా ఉంది. ఆ పంజరం చెరుకుగడలకు అడ్డముగా కట్టిన వెదురుతో అల్లబడింది .(రెండు పెదవులను చెరుకుగడలతో పోల్చాడు కవి. నమో నమః)

అమ్మవారికి పెద్ద జడ ఉంది. అది నలిగిన, యోగ్యమయిన సువాసనలీనే వెంట్రుకల నివాస స్థానము.(నలిగిన వెంట్రుకలేమిటండి అని అడిగే పరిస్థితి అన్నమయ్య పాఠకులకు రాకుండు గాక!)

చ2. గొప్పవయిన ఆమె స్తనములు సిగ్గులకు పుట్టిన ఇళ్లు. అమె చేతుల కదలిక సరసాలకు స్థానము.ఆమె నితంబములు రతి వైభవాలను దాచిన సొమ్ములు. ఏనుగు నడకలలోని అందాల సమూహాలకు ఉనికి ఆమె ఊరువులు.

చ3.అందాల రహస్యమనెడి సింహానికి స్థానము - ఆమె నడుము. (సింహము నడుము వంటి నడుము గలది అని అర్థము."కడగిన శ్రీ వేంకటగిరి పతితోదడవి సింహమధ్యయు నొనగూడె." (తాళ్ల-7(13)-308)అని ఇంకోచోట కవి ఇలానే ప్రయోగించాడు.)

అందమైన ఆమె మొగము - కళల ముగింపు స్థానము. (అంటే ఇంక అంతకుమించి కళలు లేవు, అన్ని కళలు ఆమె మోములో ఉన్నాయని అందమయిన భావము)

శ్రీ వేంకటేశా ! ఆమెను అలవాటుగా ఆదరించి భార్యగా స్వీకరించావు.

నీ భార్య ఈ రకంగా ఇన్ని అలంకారములతో శృంగారములతో పోలికలు కలిగి ప్రకాశిస్తోంది.

(ఇద్దరూ మమ్మలిని దయ చూడండి)

51. తీదీపులు

ప్రపంచంలో ప్రతివారు సుఖాన్నే కోరుకొంటారు. కష్టాన్ని ఎవరూ ఆశించరు. నిజమైన సుఖమంటే ఏమిటో, త ద్వారా ఉత్తమ మానవుని ప్రవర్తన ఎలా ఉండాలో అన్నమయ్య వట్టిలంపటాల బడి కీర్తనలో తెలియ చేసాడు.

వట్టిలంపటాల బడి వడ బొరలుటకంటే
వొట్టినవిరతి నూరకుండుటే సుఖము

దొంగగొడ్డు పఱి గెత్తి పోకుండ మోకాళ్లకు కొట్టుకొనునట్లు మెడకు వ్రేలాడ గట్టిన రెండు కొయ్యలు లంపటాలు.ఇలాగే సంసారంలో అనేక బంధాలు భగవంతుని వైపు మనస్సు పోనీయకుండా పట్టి పీడిస్తుంటాయి.ఈ లంపటాలు తగిలించుకొని బాధలు పొందటం కంటే , విశ్రాంతిగా ఉండటమే మంచిది.అంటే అనవసరమైన విషయాలను కావాలని తగిలించుకొని తరవాత బాధలు పడటం కంటే ముందే వాటికి దూరంగా ఉండటం మంచిదని కవిభావం.

పాపముమానినయట్టి బదుకొక్కటె సుఖము

దుష్కృతము గలది పాపము.చెడ్డ పని చేస్తే పాపం. పాపాలు మానిన బతుకు సుఖాన్ని కలుగచేస్తుంది. పాపం పండుతుంది. చేసిన చెడ్డ పనులకు ఫలితము అనుభవించాలి.

కోపమువిడిచినట్టి గుణమొక్కటి సుఖము

ఎన్ని మంచి గుణాలు ఉంటే ఏమి ప్రయోజనం. కోపం ఉంటే అవి ఉన్నా లేనట్టే. అందువల్ల కోపం లేని ఒక్కగుణము ఉన్నా అది సుఖాన్ని కలుగచేస్తుంది.

చేపట్టి గురుబుద్ధి సేసేటిదే సుఖము

గురువు చెప్పినది చేయటమే సుఖం.ఇక్కడ అన్నమయ్య చెప్పిన గురువు బోధ గురువు. శిష్యునికి సంబంధించిన ధనాన్ని అపహరించాలని కల్లబొల్లి మాటలు చెప్పే బాధ గురువు మాటలు వినవసరం లేదు.

వాంఛాద్వేషాలకు అతీతుడైన గురువు చెప్పినది ఆచరిస్తే సుఖం.

తీదీపులబడనియట్టి దినమే సుఖము

తీవ్రమైన బాధలను –తీదీపులు అంటారు.ఆ తీదీపులుపొందని రోజు సుఖం. తీవ్రమైన బాధలు శారీరకంగా సంభవిస్తే మనం ఏమీ చేయలేం కాని, మానసికంగా ప్రశాంతతను అలవరచుకొంటే – తీదీపులు లేకుండా సుఖంగా ఉండవచ్చు.

మహి జంచలములేనిమనసొక్కటి సుఖము

చలించునది చంచలము. చంచలము లేని మనస్సు సుఖాన్ని కలుగ చేస్తుంది. చంచలం హి మనః కృష్ణ– అన్నది భగవద్గీత. మనస్సు దాదాపుగా మనిషినితన వశంలోకి తీసుకొంటుంది. మనస్సును తన వశం చేసుకోవటం – చెప్పినంత తేలిక కాదుగాని మొదలు పెట్టాలి . అభ్యాసేనతు కౌంతేయ అభ్యాసం చేస్తే అది సాధ్యమవుతుంది. అప్పుడది నిజమైన సుఖాన్ని కలుగ చేస్తుంది.

సహజాచారముతోడి జన్మమొక్కటి సుఖము

సహజమైన ఆచారానికి స్వభావానికి దగ్గర సంబంధం ఉంది. స్వధర్మే నిధనం శ్రేయః తన ధర్మాన్ని తాను ఆచరిస్తే , అలా ఆచరించిన వానికి సుఖం కరతలామలక మవుతుంది.

యిహపరసాధనపుయెన్ని కొక్కటి సుఖము

మంచివిషయాన్ని ఎంపిక చేసుకోవటం మాములుగా అందరికి లభ్యమయ్యే విషయం కాదు. ఒక విషయాన్ని ఎంపిక చేసుకొన్నామంటే అది ఈ లోకానికి పై లోకానికి ఉపయోగకరంగా ఉభయతారకంగా ఉండాలట. ఉదాహరణకి భగవత్సంకీర్తనలను గానం చేయటం వృత్తిగా స్వీకరించాడనుకొందాం. అది ఈ లోకంలోను పరలోకంలోను తనకి మేలు చేస్తుంది. తద్వారా సుఖాన్ని ఇస్తుంది.

బహుళపుటాసకంటె పరిపాటి సుఖము

బహుళపు ఆశ అంటే అధికమైన ఆశ. దానికంటే ఒక క్రమ పద్ధతిలో ఆశ పడటం సుఖాన్ని కలుగచేస్తుంది..

న్యాయంగా లభించవలసినదానిమీద ఆశ ఉండాలి. అన్యాయంగా అధికంగా రావాలనుకోవాలనుకోవటం దురాశ. అన్నమయ్య ఆశ తప్పు అనటం లేదు. దురాశ తప్పంటున్నాడు. ఏ మహానుభావుడైనా చెప్పేదదే.

పరుల బీడించితేనిపసి డొక్కటి సుఖము

పసిడి అంటే బంగారమనే కాదు. ధనమని కూడా అర్థముంది. ఇతరులను పీడించి సంపాదించని ధనంలో సుఖముందనిఅన్నమయ్య ఒక సమసమాజ కాముకునిగా నిర్వచించాడు. ఆధునిక సమాజంలో కూడా ఈ భావన అమలయితే అందరూ సుఖ శాంతులతో ఉంటారు. ఇతరుల కన్నీటి చుక్కలతో కలిసిన ధనాన్ని బలవంతంగా గ్రహిస్తే– ఎప్పుడోసారి గ్రహించిన వాడికంటి వెంట కన్నీళ్ళు తెప్పిస్తాయి.

గరిమ నిజముతోడగలమాటలే సుఖము

గొప్పతనము, నిజముతో ఉండే మాటలు సుఖం కలుగ చేస్తాయి. "**తెలివిలేని నాలుక ఏదేదో వాగుతుంటుంది తన వని కాగానే తాను లోనికి వెళ్ళిపోతుంది కానీ దెబ్బలు మాత్రం తలకాయ మీద పడతాయి**" అని ఒక దోహా భావం. నోరా! వీపుకు దెబ్బలు తేకే! అని తెలుగులో దీనికి అనువాదం. అబద్ధాలతో సుఖాలు కలుగుతాయని చెప్పేవారు చాలామంది ఉండవచ్చు. కాని సత్యమేవ జయతే.

ధరలో శ్రీవేంకటేశుదాసానుదాసుడయి /సరవితో నడచేటిశాంతమే సుఖము

శ్రీవేంకటేశ్వరుని దాసులకు దాసుడవై, ఒక క్రమ పద్ధతిలో శాంతంగా నడుచుకొంటే అది సుఖాన్ని కలుగ చేస్తుంది.

జీవితంలో రకరకాల పద్ధతులు అనుసరించటం ద్వారా ప్రశాంతత కలుగుతుంది. తెలుపు రంగు బట్టలు ధరిస్తే మనసుకు ప్రశాంతత చేకూరుతుంది. పసిపిల్లల నవ్వు మనసుకు ఎంతో సుఖాన్నిస్తుంది. విరబూసిన పూలు ఆనందాన్నిస్తాయి. ఉత్తమ స్నేహితులతో ఆనందంగా గడిపిన సమయం మనసుకు హాయి ఇస్తుంది... మంచి సాహిత్యం, సంగీతం ఉన్న చక్కటి పాటలు , కీర్తనలు వింటుంటే ప్రశాంతంగా ఉంటుంది. తోటపని, కుట్లు, అల్లికలు లాంటి నచ్చిన హాబీలు మనసుకు ఆనందాన్ని ఇస్తాయి.ఇలా ఎవరికి ఏది ఇష్టమైతే ఆ మంచి అలవాట్లల్లో కొన్నిటిని అలవరుచుకొంటే ఒక పద్ధతిగా నడుచుకొంటే జీవితం సుఖ దాయకమని అన్నమయ్య ప్రబోధం.అన్నమయ్య పాటలు–ఉత్తమ జీవితం గడపాలనుకొనేవారికి చక్కటి బాటలు.

52. త్రుప్పివ్వి

పల్లవి : అబ్బురంపు శిశువు ఆకుమీది శిశువు
దొబ్బుడు రోల శిశువు త్రుప్పివ్వి త్రుప్పివ్వి త్రుప్పివ్వి

చ1. పుట్టు శంఖు చక్రముల బుట్టిన యా శిశువు
పుట్టక తోల్లే మారుపుట్టువైన శిశువు
వొట్టుక పాలువెన్నలు నోలలాడు శిశువు
తొట్టెలలోని శిశువు త్రుప్పివ్వి త్రుప్పివ్వి త్రుప్పివ్వి

చ2. నిండిన బండి దన్నిన చిన్ని శిశువు
అండవారి మదమెల్ల నణచిన శిశువు
కొండలంతేససురులగొట్టిన యా శిశువు
దుండగంపు శిశువు త్రుప్పివ్వి త్రుప్పివ్వి త్రుప్పివ్వి

చ3. వేగైన వేంకటగిరి వెలసిన శిశువు
కౌగిటి యిందిర దొలగని శిశువు
ఆగి పాలజలధిలో నందమైన పెనుబాము
తూగుమంచము శిశువు త్రుప్పివ్వి త్రుప్పివ్వి త్రుప్పివ్వి (05-220)

ముఖ్యమైన అర్థాలు

అబ్బురంపు =ఆశ్చర్యము కలిగించు
శిశువు =బిడ్డ, పిల్ల.
దొబ్బుడు =నెట్టడం, తోయడం
త్రుప్పివ్వి =శిశువు చేసే ధ్వనికి అనుకరణ శబ్దం
పుట్టు = పుట్టుకతోనే
పుట్టక తోల్లే = పుట్టుకకు ముందు
మారు = బదులు
ఒట్టుక = ఒట్టు పెట్టుకొను
ఓలలాడు =స్నానముచేయు;2. ఓలఓల యనుచు ఆడు.
తొట్టెల =ఉయ్యాల తొట్టి

అండవారు = దగ్గరగా చేరి చంపదలిచిన రాక్షసులు

దుండగంపు =కొంటెతనపు

వేగైన =శుభోదయమగు

ఆగు = కాపాడు.

పెనుబాము =ఆదిశేషుడు

తూగుమంచము =ఉయ్యాలమంచము

తాత్పర్యము

ఆకుమీద పడుకొన్న చిన్ని కృష్ణుని చూస్తూ, పరవశించిన అన్నమయ్య ఆనందానుభూతి ఇలా కీర్తనలోని అక్షరాలుగా మారింది.

మర్రి ఆకు మీద పడుకొన్న ఈ బిడ్డ ఎంత ఆశ్చర్యము కలిగించాడో తెలుసా! వీడు తేలికగా ఉన్నాడని అనుకొంటున్నారా! ఎంతో బరువైన రోలును తోసిన వాడు వీడు. ఏమి తెలియని నంగనాచిలా త్రుప్పువ్వి త్రుప్పువ్వి అంటున్నాడు. నేనూ అంటాను.

చ1. ఎవడైనా పుట్టిన తర్వాత వాళ్ల అమ్మో, నాన్నో, బంధువులో ఆభరణాలు చేయిస్తే ఒంటి మీదికి చేరతాయి. కాని ఈ కిట్టయ్యకి –పుట్టుకతోనే శంఖ చక్రాలు ఒంటి మీదికి చేరాయి. ఎవరైనా ఒకేచోట పుడతారు. కాని ఈ కిట్టయ్య దేవకి గభరేలో పుట్టడానికి ముందే , యశోదకి పుట్టిన వాడిగా చెలామణీ చేసుకోవటానికి ఏర్పాటు చేసుకొని(యోగ మాయగా) మరీ పుట్టాడు తల్లీ ! ఎవరైనా నీళ్లలో హాయిగా ఉందని మునిగి తేలుతుంటారు. కాని వీడికిదేమి బుద్ధో ! ఒట్టు పెట్టుకొన్నట్లుగా పాలు వెన్నలలో తేలిపోతుంటాడు. ఆ నాడు యశోదమ్మ ఉ య్యాల తొట్టెలోని శిశువు ఇప్పుడు మర్రి ఆకు మీద పడుకొన్నాడు. అదిగో ! నన్ను చూసి త్రుప్పువ్వి త్రుప్పువ్వి త్రుప్పువ్వి అంటున్నాడు. నేనూ అంటాను.

చ2. చిన్నవాడి లేత పాదం ఎంత ఉంటుందండి! ఎలా ఉంటుందండి! ముట్టుకొంటేనే కందిపోతుంది. అటువంటి పాదంతో రాక్షసుడి మాయతో నిండిన బండిని ఒక్క తన్ను తన్నాడు. ఇంతే సంగతులు చిత్తగించవలెను. ముక్కలు ముక్కలు! తన దగ్గరగా చేరి చంపదలిచిన రాక్షసుల మదాన్ని అణిచివేసిన బిడ్డ. ఆకారంలో ఇంత చిన్నగా ఉన్నాడు. కాని కొండలంత ఆకారంలో ఉన్న రాక్షసులను కొట్టిన వాడు వీడు. ఏమీ తెలియని వాడుగా ఉన్నాడు కాని కొంటెవాడు ఈ పిల్లవాడు త్రుప్పువ్వి త్రుప్పువ్వి త్రుప్పువ్వి.

చ3. శుభోదయాలు కలిగించే వేంకటాద్రి మీద వేంకటేశునిగా వెలసిన వాడు ఈ శిశువు. తన కౌగిటిలో (వక్షస్థలంలో) ఎప్పుడూ లక్ష్మిని ఉంచుకొనే వాడు ఈ శిశువు. పాల సముద్రంలో అందమైన ఆదిశేషుడనే ఉయ్యాలమంచము మీద ఉండే ఆ విష్ణుమూర్తి ఈనాడు మర్రి ఆకుమీద ఉన్నాడు. ఆ బిడ్డ అన్నట్లు నేను కూడా అనగలను. త్రుప్పివ్వి త్రుప్పివ్వి త్రుప్పివ్వి

పరమార్థం

పుట్టు శంఖు చక్రముల బుట్టిన యా శిశువు

కృష్ణునికి పుట్టుకతోనే అతని పొడవైన నాలుగు చేతులలో గద, శంఖం, చక్రం, పద్మం వెలుగొందుతున్నాయని భాగవతంలో ఉంది.(చారు గదా శంఖ చక్ర పద్మ విలాసు-భాగ-10-112వ ప) దీనినే అన్నమయ్య శంఖు చక్రములతో పుట్టాడని చెప్పాడు.

దొబ్బుడు రోల శిశువు

అన్నమయ్య భావనలలో ఎంత తీపి ఉంటుందో భాషలో అంత స్వేచ్ఛ ఉంటుంది. దొబ్బటం అనేది తెలంగాణా ప్రాంతంలో తోయటం అనే అర్థంలో వాడే మాండలిక పదం. దీనిని తన కీర్తనలో హాయిగా వాడుకొన్నాడు కవి.

కొండలంతేసి , అసురుల ఈ రెండు పదాలకు సంధి రాదు. కాని అన్నమయ్య భాషలో అసాధ్యం సుసాధ్యం. కొండలంతేసి + అసురుల = కొండలంతేససురుల అయింది. (ఈ సంధి విషయం దూరభాషణంలో నాకు సముద్రాల లక్ష్మణయ్యగారు వివరించారు) యశోద శ్రీకృష్ణుని నడుముకి రోలుకి కట్టింది. కృష్ణుడు రోలు లాగుకొంటూ రెండు చెట్ల మధ్యకు వచ్చాడు. నడుముతో ఒక్క లాగు లాగ గానే, చెట్లు మొదళ్ళతో కూలిపోయాయి.నలకూబరుడు, మణిగ్రీవుడు ఇద్దరు గంధర్వులకు శాపం పోయింది. ఇది రోలు 'దొబ్బిన' కథ. -

53.తొలిచేవు చేగలే

అన్నమయ్య పద సాహిత్యంలో ఒక పదాన్ని , సరియైన క్రియతో కలిపిన తీరు అబ్బుర పరుస్తుంది. అది అతని భావనాశక్తికి సాక్ష్యంగా నిలుస్తుంది. తొలిచేవు చేగలు అటువంటిదే.

చేగ అంటే చేవ, ధైర్యము. దానిని నాయకుడు పోగొడుతున్నాడు అనే అర్థంలో తొలుచు అనే క్రియా పదాన్ని వాడాడు కవి.

తొలుచు అంటే రంధ్రము చేయుట. నశింపచేయుట. నాయకుడిని తుమ్మెదతో పోలుస్తున్నాడు. పురుగు తొలుస్తుంది. అందుకే నాయకుడైన తుమ్మెద తన ధైర్యాన్ని తొలుస్తున్నాడు అని నాయిక సాభిప్రాయంగా అంటోంది. ఆ మాటలు కీర్తనలో విందాం.

పల్లవి: తొల్లిటివలె గావు తుమ్మెదా యింక
నొల్లవుగా మమ్మునో తుమ్మెదా

చ.1: తోరంపు రచనల తుమ్మెదా కడు
దూరేవు గొందులే తుమ్మెదా
దూరిన నెగవు తుమ్మెదా మమ్ము
నోరగజూడకువో వో తుమ్మెదా

చ.2: తొలు ప్రాయపు మిండ తుమ్మెదా కడు
దొలిచేవు చేగలే తుమ్మెదా
తొలుకరి మెగనే తుమ్మెదా యింక
నులికేవు మముగని వో వోతుమ్మెదా

చ.3: దొరవు వేంకటగిరి తుమ్మెదా మా
తురు మేల చెనకేవు తుమ్మెదా
దొరకె నీ చనవులు తుమ్మెదా యింక
నొరు లెంగిరి గదవో వో తుమ్మెదా

(రేకు:0043-3 సంపుటం: 06-009)

అర్థం

పల్లవి: ముందున్నట్టుగా లేవు ఓ తుమ్మెదా !

ఓ తుమ్మెదా ! మమ్మలిని ఇష్టపడవు కదా ! (ఒల్లవుగా)

చ. 1: ఓ తుమ్మెదా ! చక్కని కూర్పులతో వేషాలతో (తోరంపురచనలు) బాగా సన్నగా ఉన్న ఇరుకైన వీథులలో దూరుతున్నావు.

సన్నగా ఉన్న ఇరుకైన వీథులలో దూరుతున్నప్పటికీ మమ్మలిని తెలుసుకోలేవు.

కనుకొనలగుండా (ఓరగా) మమ్మలిని చూడకు.

చ. 2: లేత వయస్సులో ఉన్న మగ (మిండ) తుమ్మెదా !బాగా

ధైర్యములను(చేగలే) నశింపచేస్తావు. (తొలిచేవు)

చైత్ర వైశాఖములలో కురిసే వాన తొలకరి. ఆ తొలకరి వానలో మెరిసే మెరుపులాంటి వాడా !

మమ్మలిని చూసి అదిరిపోతావు(ఉలికేవు) ఎందుకు?(మెరుపును చూసి మేము అదిరిపోవాలి కాని, మమ్మలిని చూసి నువ్వు ఎందుకు అదిరిపోతున్నావని అద్భుతమయిన ప్రశ్న.)

చ. 3: వేంకటాద్రిపై ఉన్న వేంకటేశ్వరుడనే తుమ్మెదా ! నువ్వు గొప్పవాడివి(దొర).

మా కొప్పు (తురుము) ఎందుకు తడుముతున్నావు? (=చెనకేవు)

మామీద నీ ప్రేమలు (చనవులు) ఏ పాటి ఉన్నాయో మాకు సాక్ష్యాలతో సహ దొరికాయిలే.

మాకే కాదు– ఇతరులకు కూడా తెలిసాయిలే.

పరమార్థం

పొంచి తామర పువ్వుల బోలిన పాదాలాతడు

వంచి తుమ్మెదల కొప్పు వడిసోక మొక్కవే (సం: 18–251)అని ఒక కీర్తనలో అన్నమయ్య వేంకటేశుని పాదాలను తామరలతో పోల్చాడు. ఆ తామరలలోని మకరందాన్ని ఆస్వాదించే తుమ్మెదల కొప్పుతో నాయికను మొక్కమన్నాడు.

తుమ్మెద అంటే షట్పది. అయిదు ఇంద్రియాలు, మనస్సు అనే ఆరు ఇంద్రియాలు పాదములుగా కలిగిన జీవుడు షట్పది.

స్వామి పదాలలోని మకరందాన్ని పీల్చి ధన్యుడివి కమ్మని తుమ్మెదను జీవుని పరంగా ఒక కీర్తనలో చెప్పి, ఈ కీర్తనలో అదే తుమ్మెదను వేంకటేశుని పరంగా చెప్పాడు.జీవుడు , దేవుడు ఇద్దరూ సన్నిహితులు.అందుకే ఒకే తుమ్మెద సంబోధన.

తుమ్మెదా తుమ్మెదా అని పాడు పాటలను తుమ్మెద పదాలంటారు. ప్రస్తుత అన్నమయ్య కీర్తన అటువంటి తుమ్మెద పదం.

తొలిచేవు చేగలే

వేంకటేశ్వరా ! నీలాంటి తిరుగుబోతులను దగ్గరికి రానీయకూడదని బలంగా నిర్ణయించుకొంటాం. కాని మా బలాలను నశింపచేస్తావు. మమ్మలిని లోబరుచుకొంటావని పైకి అర్థం.

స్వామీ ! నీ మీద నిరంతరం మనస్సును నిలపాలనుకొంటాం. బలంగా నిర్ణయించుకొంటాం. కాని అంతలోనే మా బలాలను నశింపచేస్తావు. దృఢ నిర్ణయాలు కోల్పోయి, చంచల మనస్కులమవుతామని, మా మనస్సులను దృఢంగా ఉంచవలసిన బాధ్యత నీదే అని లోపల పరమార్థం.స్వస్తి.

54.దావతి సుఖం

తెలంగాణములో బాగా ప్రసిద్ధమయిన పదం "దావత్." (విందు)

"దావత్" కి చివర ఇకారం కలిపితే "దావతి" అని వస్తుంది. ఇది అన్నమయ్య వంశీకుల సృష్టి.

తాళ్లపాక కవిత్రయం "దావతి "తో అనేక పదాలను కలిపారు. దావతి బడు, దావతి కర్మము, దావతి జలనిధి, దావతి సుఖము- ఇలా రకరకాల ప్రయోగాలు అన్నమయ్య సాహిత్యంలో ఉన్నాయి.ఇందులో చినతిరుమలాచార్యులవారి "దావతి సుఖాన్ని" కొంచెం ఆస్వాదిద్దాం

పల్లవి: ఏమొకొ నేమేమొకో
యీ మోహము మానమేమొకో

చ.1: కావరించినట్టి కాపురములలో
నీవలావలయ్యే మేమొకో
దావతిసుఖమిల దారి దెలిసియు
నేవగించలే మేమొకో

చ.2: గాలపుజిక్కుల కర్మపుతొడసుల
యీలకరచే మేమొకో
తాలిమిచెరిచెటి ధనముమీదివాంఛ
యేలొ యింకా మాన మేమొకో

చ.3: వోడుపోయినట్టి వుంగిటిబతుకుల
యీడగిలఉడే మేమొకో
వేడుకతో శ్రీవెంకటనాథుడు
యీడనె మము గాచె నేమొకో (చి.ఆ.రేకు:0001-05సం: 10-005)

ఓ వేంకటేశా ! ఎందుచేతనో తెలియదు.
ఎంత వద్దనుకొన్నా ఈ మోహాన్ని మానలేకపోతున్నాము.
చ.1: మదమెక్కిన కాపురాలలో
నీ మాయల వలలో చిక్కుకొన్నాము.
మాకు కాపురాల్లో లభిస్తున్న ఈ సుఖం -ఆసక్తిని కలిగించి, దుఃఖాన్ని కలిగించే

సుఖమని, (దావతి సుఖము)తెలుసు. ఇది తెలిసి కూడా ఎందుకో ఆ సంసార సుఖము మీద రోత కలగటం లేదు.

చ.2: చేపలను పట్టటానికి ఉక్కుకమ్మితో వంకరగా చేసిన సాధనం గాలం. కర్మతో వచ్చే రకరకాల అకర్షణలు అలాంటి గాలాలు అని తెలుసు.. చిక్కులు పెడతాయని తెలుసు. అయినా కర్మ సంబంధాలలో ప్రాణాలు బిగబడతాము. అవి లేకపోతే బతకలేం.ఎందుకో తెలియదు. ధనము మీద కోరిక జీవితంలో ధైర్యాన్ని పోగొడుతుందని తెలుసు. అయినా ఆ ధనము మీద కోరికను మానలేక పోతున్నాం. ఎందుకో తెలియదు.

చ.3: ముందుకు వెళ్లాలని పరుగులెత్తుతున్నాం. వెనకబడి పోతున్నాం. ఎందుకో తెలియదు.

శ్రీ వేంకటేశ్వరుడు వినోదముతో మమ్మలిని ఈ లోకంలో రక్షిస్తుంటాడు..బహుశా దానికి మా స్తోత్రమే కారణమా !

❖

కాపురాల్లో లభిస్తున్న సంసార సుఖం – ఆసక్తిని కలిగించి , దుఃఖాన్ని కలిగించే సుఖమని (దావతి సుఖము)చిన తిరుమలాచార్యులవారి కంఠోక్తి.

ఒక గోపిక యశోదమ్మతో ఫిర్యాదు చేస్తోంది.

కృష్ణుడు ఒకసారి ఆవుల తాళ్లు తెంచి అడవిలోకి తోలాడు.

ఆ గోపిక వెదకి వెదకి నానాకష్టపడి ఆవులను తిరిగి ఇంటికి తెచ్చింది

ఈ లోపల కృష్ణుడు దూడలను తెచ్చి ఇంట్లో కట్టాడు.

బయట ఆవులనుంచి ఆసక్తితో (దావతి)దూడలకోసం గోపిక తలుపులు తెరిచింది.

లోపల దూడలతో పాటు, ఆవులు కూడా కృష్ణ మాయతో లోపల ఉన్నాయి. (సం: 02-166)

ఇలా కృష్ణ లీలలలో ఈ దావతి సుఖాన్ని అన్నమయ్య రుచి చూపించాడు.

ఓ పెద్దలారా ! పండితులారా ! కాస్త మీరు చెప్పండయ్యా ! ఆ విష్ణు మూర్తి మాయలలో మేము చిక్కుకుపోయి ఉన్నాం.

మాకు దేవుడు లేదు ! ధర్మమూ లేదు.

మాకు భవ బంధాల భయము లేదు! పాడులేదు. ఆచారాలు లేవు. నియమాలు లేవు.

ఆసక్తిని రగిలించి , దుఃఖాన్ని కలిగించే దావతి సుఖంలో ఆసక్తి విపరీతంగా ఉంది (సం: 03-058) అని అన్నమయ్య ఇంకొక కీర్తనలో దావతి సుఖం గురించి చెప్పాడు. ఈ తోవలోనే మనవడు చిన్నన్న కూడా దావతి సుఖాన్ని నిరసించాడు.

దావతి సుఖము కోసం చేసే అన్వేషణలో ధనము మీద విపరీతంగా కోరిక కలుగుతుంది. ఆ కోరిక ధైర్యాన్ని పోగొడుతుంది అని కవిమాట. సాధారణంగా ధనము ధైర్యాన్ని పెంచుతుంది కదా! ఏది చేయాలన్నా ధనం ధైర్యంగా నడిపిస్తుంది కదా! మరి కవి అలా ఎందుకన్నాడు?

ధనవాంఛ ఇంద్రియ నిగ్రహాన్ని పోగొడుతుంది. తనమీద తనకు ఉండే అదుపును తప్పిస్తుంది. చెడు విషయాల వైపు వెళ్లకుండా

ఉండే ధైర్యాన్ని పోగొడుతుంది. అందుకే కవి ఆసక్తిని రగిలించి , దుఃఖాన్ని కలిగించే దావతి సుఖం ధైర్యాన్ని నశింపచేస్తుందని చెప్పాడు. స్వస్తి.

55. దివ్వెలెత్తు పొద్దు

సాయం సంధ్యా సమయానికి అన్నమయ్య పెట్టిన పేరు దివ్వెలెత్తు పొద్దు.దీపాలు పెట్టే సమయమని అర్థం. అలపొద్దు, దీపాలవేళ, సందెకాడ (కళింగ మాండలికం) పొద్దుమీకి,సందాల (తెలంగాణ మాండలికం) అన్నకార, ఎసుర్లయాల, పొద్దు, పొద్దూకు, పైటేల, మూసిడింతల, సందెకాడ, సాయంకాలం (రాయలసీమ మాండలికం) అను ప్రయోగాలు సంధ్యా కాలానికి సంబంధించి ఇదివరకటి రోజుల్లో ప్రజల నాలుకల మీదుండేవి.

విద్యుచ్ఛక్తి దీపాలు రాజ్యమేలుతున్న ప్రస్తుత కాలంలో కార్తిక మాసం, దీపావళి – ఇలాంటి సందర్భాల్లోనే సంప్రదాయజ్ఞుల ఇళ్లలో సంధ్యా దీపాలు వెలుగు తున్నాయి. కొంతమంది నేటికీ విద్యుచ్ఛక్తితో సంబంధంలేకుండా దీపాలు వెలిగించే వారు లేకపోలేదు కాని తక్కువ.అన్నమయ్య దివ్వెలెత్తు పొద్దులోని కాంతులను తన కీర్తనలో చదివి పరవశిద్దాం.

పల్లవి: వచ్చినవారమిదివో వాకిటనె వున్నారము
నెచ్చెలి యెదురుచూచీ నీచిత్తమికను

చ.1: నవ్వుల పండుగలాయ ననుపులెండుగలాయ
యివ్వల చెలితో పొందులికనెన్నడు
రవ్వలాయ నీచేతలు రాజసమే నెరపగా
దివ్వెలెత్తుబొద్దులకు తిరమాయబనులు

చ.2: మాటలివే విందులాయ మంతనాలే సందులాయ
యీటున కాంతతో మేలమికనెన్నడు
మూటలాయ నేర్పులు మోచుకవున్నారమిదే
మేటిశింగారాల వేగీ మిగిలె చీకట్లు

చ.3: వీడెములే వొడినిండె వేడుకలు పంటవండె
యీడ వచ్చున్నది చెలియ యికనెన్నఁడు
పాడితో శ్రీ వెంకటేశ పడతిగూడితివిట్టె
యేడుమద్యాన్నములెక్కె యెట్టి రహస్యములో

(రేకు: 0197-3సంపుటం: 07-575)

అర్థం

అన్నమయ్య ఒక చెలికత్తెగా మారి, వేంకటేశునితో మాట్లాడుతున్నాడు.

పల్లవి: అయ్యా ! వేంకటేశా !

నీకోసం వచ్చిన వాళ్లం ...వాకిటలో నీకోసం ఎదురుచూస్తున్నాం.

మాతో బాటు నీస్నేహితురాలు కూడా ఎదురుచూస్తోంది.

నీ చిత్తం.. ఎప్పుడు అవిడని కలుస్తావో !

చ. 1: నవ్వుల పండుగలు అయిపోయాయి. అనురాగాలు (ననుపులు) ధాన్యాదులు ఎండబెట్టినట్లుగా ఎండిపోయాయి. (ఎండుగలాయ)

ఈ వైపుగా నాతో ఉన్న చెలితో పొందులు ఇక ఎప్పుడు?

రజోగుణము వల్ల పుట్టిన గర్వంతో నువ్వు చేసే చేష్టలు అల్లరవుతున్నాయి. అపకీర్తి పాలవుతున్నాయి.(రవ్వలాయ). నువ్వది గమనిస్తున్నావా?

సంధ్యాకాలానికి "వ్యవహారాలు" చక్కబడతాయా? లేదా?

చ. 2: వేంకటేశా! ఇదివరలో నీ మాటలు విందులయ్యాయి. ఆనాటి రహస్య చర్చలు అవకాశం కోసం ఎదురుచూస్తున్నాయి.

కాంతతో వేళాకోల హాస్యాలు ఇక ఎంతకాలం? !

నీ నేర్పుల జ్ఞాపకాలు మూటలుగా మోచుకొని ఉన్నాం.

గొప్పవైన సింగారాలలో తపించి, మా జ్ఞాపకాల చీకట్లు మిగిలిపోయాయి.

చ. 3: తాంబూలాలు ఒడిలో నిండిపోయాయి. (పెళ్లి నిశ్చయమయిందని భావం) వేడుకలు సమృద్ధమయ్యాయి (పంటవండె)

నీ చెలి ఇక్కడకు వచ్చి ఉన్నది.

నీ సహజ స్వభావంతో (పాడితో) పడతితో కలిసావు.

ఏడు పట్టపగళ్లు గడిచిపోయాయి. తెమలని ఆ రహస్యాలేమిటయ్యా !

పరమార్థం

అన్నమయ్య నిరీక్షణతో, బాధతో కీర్తనని పూర్తి చేయడు.

రెండు చరణాలలో నిరీక్షణ గురించి కమ్మగా చెప్పాడు.

మూడో చరణంలో నాయిక నాయకుల కలయికను వర్ణించాడు.

తెమలని రహస్యాలేమిటంటూ , దివ్వెలెత్తు పొద్దు దీపాల కాంతులను అక్షరాలలో చూపించాడు.. స్వస్తి.

56. దీము కోపము

దీము అనే విశేష్యానికి కోపము, విజ్ఞానము, ప్రతిమ, భోగము మొదలైన విశేషణాలు జోడించి అన్నమయ్య – దీము కోపము, దీమపు విజ్ఞానము, దీము ప్రతిమ, దీము భోగము –ఇలా –రకరకాల కొత్త ప్రయోగాలు చేసాడు.దీము అంటే పక్షి మృగాదులను పట్టుకోవటానికి వేట కానిచే పెంచబడిన పక్షి, మృగం. లేదా ఎర. వీటిలో దీము కోపాన్ని అన్నమయ్య ఎంత సొగసుగా ప్రయోగించాడో ఒక కీర్తనలో చూద్దాం.

పల్లవి: కాయమనేవూరికి గంతలు తొమ్మిదియాయ
పాయక తిరిగాడేరు పాపపుతలారులు

చ.1: కాముఉడనియెడిరాజు గద్దెమీద నుండగాను
దీము గోపపుప్రధాని దిక్కు లేలీని
కోమలపుజ్ఞానమెల్లా గొల్లబోయ నాడనాడ
గామిడులై రింద్రియపుగాపులెల్లా నిదివో

చ.2: చిత్తమనేదళవాయి చింతలనేపొజు వెట్టి
యిత్తలవిషయములు యెన్నికిచ్చిరి
తుత్తుమురైకోరికెల దొండెము రేగగజొచ్చె
జొత్తుల వెరగుపడిచూచీబుట్టగులు

చ.3: బలుసంసారమనేటిభండారము ఘనమాయ
కలదీగి జవ్వనపుకై జీతము
యిలలో శ్రీవేంకటేశుఉడింతలో జీవుడనేటి
బలువుని రాజుజేసి పాలించె నన్నును (రేకు:0097-06సం:01-488)

అర్థం

పల్లవి: ఈ శరీరమనే ఊరికి తొమ్మిది రంధ్రాలు కదా ! రెండు చెవులు, రెండు ముక్కు ద్వారాలు, నోరు, రెండు మల మూత్ర ద్వారాలు, ఈ తొమ్మిది రంధ్రాలలోను పాపమనే కాపలా కాచేవాళ్లు (తలారులు) ఎప్పుడూ (పాయక) తిరుగుతుంటాడు. (ఎక్కడ పుణ్యము చేస్తారో అని జాగ్రత్తగా పాపాలు చేయించటానికి కోరిక అనే తలారులు ఎప్పుడూ రాత్రింబగళ్లు తిరుగుతుంటారని భావం.)

చ. 1: ఈ శరీరమనే ఊరిలో మన్మథుడు అనే రాజు సింహాసనమెక్కి కూర్చుంటాడు.

పక్షి మృగాదులను పట్టుకోవటానికి వేట కానిచే పెంచబడిన పక్షి, మృగంలా ఉండే – కోపమనే ప్రధాని – దిక్కులు పరిపాలిస్తుంటాడు

మృదువైన జ్ఞానమంతా దోపిడికి గురి కాగా (= కొల్లబోయ) అక్కడక్కడా ఇంద్రియాలు బాధలు తొలగించి రక్షించేవిగా (=గామిడులై) మారాయి.. ఇదిగో...

(అసలుమోక్ష విషయికమయిన జ్ఞానము శ్రేష్ఠమయినది. అదే జీవుడిని రక్షించేది. కని ఆ రక్షకత్వాన్ని ఇంద్రియాలు దానినుండి దోపిడి చేసాయి. తామే అసలైన రక్షకులమని జీవునికి భ్రాంతి కలిగిస్తున్నాయని భావం)

చ. 2: మనస్సు అనే సైన్యాధిపతి బాధలు లేక ఆలోచనలు అనే సైన్యాన్ని నడిపిస్తూ ఇవతలవైపు (ఇత్తల) ఉండే విషయాలను శ్రేష్ఠములుగా భావించాడు. (ఇవతల అంటే ఈ లోకము. అవతల అంటే ఆ లోకము. ఈ లోకానికి సంబంధించిన విషయాలను మనస్సు శాశ్వతములుగా తలచి ఆ లోకానికి సంబంధించిన వాటి వైపు దృష్టి పెట్టడం లేదని కవి భావన.)

మిక్కిలి పొడిగా మారి కోరికలనే గుంపు విపరీతంగా చెలరేగిపొతున్నాయి. అలంకార విశేషాలను(శృంగారాలను) ఆశ్చర్యపడి చూస్తున్నాయి జన్మములు. (విపరీతములైన కోరికలు – జీవితాలను సుఖంగా ఉండనివ్వకుండా ముక్కలు ముక్కలు చేస్తున్నాయి. అందువల్ల మోక్షమనే గమ్యాన్ని చేరుకోకుండా జీవుడు జన్మలు ఎత్తుతున్నాడు. ఎత్తిన ప్రతి జన్మలోను అలంకారాలమీద – శృంగారాల మీద జీవునికి మోజు.)

చ. 3: గొప్పదయిన (బలు) సంసారము అనే ఖజానా(ధనగృహము) గొప్పగా అనిపిస్తుంటుంది.

ఇది దేవుడు జీవునికి అనుగ్రహించాడు.

తియ్యగా అందంగా వ్యాపించే (కలదీగి) పదునారేండ్లకు పైన ఉండే వయస్సు జవ్వనము. ఆ యవ్వనములో ఇంద్రియాలతో చిలిపి చేష్టలు చేయించే శక్తి జీవునికి దేవుడు ఇచ్చు దినము వారీ కూలీ. (కై జీతము)

ఈ లోకములో శ్రీ వేంకటేశ్వరుడు ఇంత మైమరపు కలిగించి జీవుడనే బలవంతుని రాజుగా చేసి నన్ను అనే భావాన్ని – అంటే– నాది అనే స్వార్థ భావం పెంచి పరిపాలింప చేస్తున్నాడు.

పరమార్థం

మహా బాగవతములోని పురంజనోపాఖ్యానములో శరీరాన్ని తొమ్మిది ద్వారాలతో పోల్చిన వర్ణన సుప్రసిద్ధం. దానినే అన్నమయ్య ఇక్కడే అనుసరించాడు.

చిదంబర దేవాలయంలో తొమ్మిది ద్వారాలు మానవ శరీరంలోని నవరంధ్రాలను తెలుపుతాయి.

ఈ శరీరాన్ని పురముతో పోలుస్తారు కనుక జగన్నాథ స్వామి ఉన్న పూరికి ఆ పేరు వచ్చిందని చెబుతారు.

ఏమి చెప్పేదిది యీశ్వరమాయలు / దీము ప్రతిమకును త్రిజగము గలిగె(సం: 02-251) అను మరొక గీతములో కూడా మలమూత్రంబుల మాంసపు ముద్దకు/ కులగోత్రంబుల గుఱి గలిగె/ తొలులు తొమ్మిదగు తోలు దిత్తికిని/ పిలువగ బేరును బెంపును గలిగె" అని నవరంధ్రాల తిత్తిని కవి వెక్కిరించాడు. స్వస్తి.

57.దైవారవమ్మ

పల్లవి: మెఱుగుఁ జెక్కుల అలమేలుమంగా
తరి తోడి రతులను దైవారవమ్మా

చ.1: చనవులు నీకిచ్చి చక్కనివదన మెత్తి
పెనగి నాతడు నిన్ను బ్రేమతోడను
కనువిచ్చి చూడవమ్మ కందువల నవ్వవమ్మ
మనసిచ్చి యాతనితో మాటలాడవమ్మా

చ.2: పొందులు నీతో నెరపి పూచి నీపై జేయివేసి
చిందీ నీపై నతడు చిరుజెమట
విందుల మోవియ్యవమ్మ వేడుకలు చూపవమ్మ
అందుకొని ఆకుమడి చాతని కీవమ్మా

చ.3: గక్కునను గాగిలించి కరుణ నీపై నించి
ఇక్కువ గూడె శ్రీ వేంకటేశుడు నిన్ను
వక్కణ లడుగవమ్మ వన్నెలెల్లా జూపవమ్మ
నిక్కుచు నురముమీద నిండుకొనవమ్మా

(రేకు: 1078-1సంపుటం: 20-463)

మెరుగు జెక్కుల -మెరుపులా ప్రకాశించేచెక్కిళ్ళు
తరితోడి =సముచిత కాలములో
రతులను =1.ఆనందాలలో2.సంభోగాలలో
దైవారవమ్మ =1.అతిశయించవమ్మ2.పొంగిపొరలవమ్మ
చనవులు =ప్రేమ,పెత్తనము,కోరిక,అవకాశము
పెనగీని =అంటెను
కందువల =చమత్కారముల
పొందులు =చెలిమి(మిత్ర భావము,స్నేహము)
పూచి =చెమట చేత చిన్న చిన్న చుక్కలు ఏర్పడటంతో బట్టలు మొదల్కెన వాటిమీద మరకలు ఏర్పడగా
నెరపి =నిర్వహించి

చిందీని =రాల్చాడు

విందులమోవి =సంతోషాల పెదవిబీఅతిథి సత్కారము చేసిన మోవి

గక్కున=తొందరగా

గాగలించి =కౌగిలించి

ఇక్కువ =స్థానము,నివాసము

వక్కణలు= వైనములు (వ్యాఖ్యానములు,వివరణములు)

వన్నె =విలాసము,శ ృంగార చేష్ట

నిక్కుచు =కులుకుచు(విలాసము)

ఉరము=రొమ్ము

నిండుకొనవమ్మ =చక్కగా నిండుగా ఉండుము తల్లీ!

భావం

అలమేలుమంగతో అన్నమయ్య ఈ కీర్తనలో మాట్లాడుతున్నాడు.

పల్లవి: మెరుపులా ప్రకాశించేచెక్కిళ్ళు ఉన్న అలమేలుమంగా! తగిన కాలములో మా స్వామితో రతి సుఖాలనుభవించిపొంగిపో తల్లీ!

చరణం1: మా స్వామి నీదగ్గరకు నెమ్మదిగా చేరాడు.ప్రేమలు నీకు వివిధ చేష్టలతో పంచాడు.అనేక విధాల్కెన ప్రేమ పెత్తనాలుచేసాడు. నీ అందాల మోమును అలా సున్నితంగా పైకెత్తాడు.సిగ్గుతో అతనిని చేరలేకపోతున్న నీతో పెనగులాడాడు. నువ్వు దగ్గర లేకపోతే వల్ల కాదని భీష్మించుకొన్నాడు.అలా కళ్ళు మూసుకొని – మరీ– తెగేదాక–వ్యవహారాన్నిలాగకమ్మా!కొంచెం కళ్ళువిప్పి చూడవమ్మా! స్వామి వారితో చమత్కారాలు చేస్తూ కొంచెం నవ్వు తల్లీ!కొంచెం మనస్సు పెట్టి మాస్వామితో మాట్లాడవమ్మా!

చరణం2 : అమ్మయ్యా! మొత్తానికి మా స్వామితో నీ వ్యవహారం సర్దుబాటు అయింది తల్లీ! హాయిగా నీతో కలిసి మాస్వామిసుఖాలనుభవించాడు. పాపం! ఆ మీ పెనగులాటలో, కౌగిలి నలుగుళ్ళల్లో మాస్వామి బట్టల మీద అక్కడక్కడా డాగులు (మరకలు) ఏర్పడ్డాయి.నీ మీద అలసటతో చేయి వేసాడు.తన ఒంటి మీది చిరు చెమటలను నీ మీద చల్లాడు. పాపం కష్టపడ్డాడు కదమ్మా! మా స్వామికి నీ పెదవి విందులు ప్రసాదించు.సంతోషాలు చూపించుతల్లీ! అదుగో– ఆ పక్కనే ఉన్నాయితాంబూలపుటాకులు. కొంచెం అందుకొని వక్కలు,సున్నం దట్టించి ,మడిచి మా స్వామికి అందించు.

చరణం3 : అలా తాంబూలం మడిచి అందిస్తున్న నిన్ను మా స్వామి వెంటనే ఒడిసి పట్టుకొని కౌగిలిలో బంధించాడు.నీ మీదదయతో శ్రీ వేంకటేశుడు కళాస్థానాలలో కలిసాడు.ఏవైనా విషయాలలో వ్యాఖ్యానాలు,వివరణలు నీకు కావాలిసి ఉంటే అడుగు.నీ విలాసాలు చూపించు తల్లీ!కులుకుతూ మా స్వామి అలిసిపోయిన వేళ వారి రొమ్ము మీదికి చేరి చక్కగా, నిండుగా ఉండు !

58.దోమటి పలుకులు

శృంగారపు మాయ మాటలు అనే అర్థంలో దోమటి పలుకులు అనే పదాన్ని అన్నమయ్య ప్రయోగించాడు.

పల్లవి: నెలత సొబగు లివి నీ సొమ్ము
కలసి మెలసి యిటు గైకొనవయ్యా

చ 1: వేమరు నవ్వుల వెన్నెల గాసీ
రామ కడకు నిటు రావయ్యా
దోమటి పలుకుల దొరిగీ దేనెలు
ఆమని కాలము అవధరించవయ్యా

చ 2: వలపుల చెమటల వానలు గురిసీ
సొలవక యీకెను జూడవయ్యా
పెలుచుఉ గుచంబుల పిందెలు వొడమెను
అలరిన కానుక లందుకోవయ్యా

చ 3: గములై మెయి మరుకళలు దొలకీ
తమితో గౌగిట దగులవయ్యా
జమళి శ్రీ వేంకటేశ్వర సతిగూడితి
వమరె నీకు మే లవునయ్యా (రేకు:0489-5సం: 12-473)

అన్నమయ్య ఈ గీతంలో స్వామితో మాట్లాడుతున్నాడు.

పల్లవి: స్వామీ! ఈ అలమేలుమంగ అందాలు నీ అలంకారాలు. (సాధారణంగా ఎవరి అందాలు వారికి అలంకారాలు. కాని అన్నమయ్య అలమేలుమంగ అందాలు స్వామికి అలంకారాలు అంటున్నాడు.అలంకారాలను ధరిస్తారు. ఆలమేలుమంగ అందాలు స్వామి ధరిస్తాడు అనటంలో శృంగారపు ఆలోచనామృతం ఉంది) ఆమెతో కలిసిమెలసి ఉండి ఆ అందాల సొమ్ములు జాగ్రత్తగా తీసుకో !

1వ చరణం : స్వామీ!మాటిమాటికీ మీ ఇద్దరి మధ్య నవ్వుల వెన్నెల పుడుతోంది.అలా దూరంగా ఉంటావేమిటయ్యా! ఇటు మాఅలమేలుమంగ దగ్గరగా రావయ్యా! అదుగో ! దగ్గరగా వచ్చినట్టే వచ్చి ఏవో శృంగారపు మాయ మాటలు (దోమటి పలుకులు) చెబుతున్నావు. ఆ మాటలలోమాటల పువ్వుల తేనెలు

జాలువారుతున్నాయి. తేనెలు(పువ్వుల మకరందాలు) చిందే వసంత ఋతువు వచ్చింది. అవునా!కాదా! దయతో వినవయ్యా!.

2వ చరణం : స్వామీ ! వచ్చిన వాడివి వచ్చినట్టు ఊరుకోకుండా ఏదో అల్లరి చేసావు. దాంతో ఇద్దరి మధ్య ప్రేమతో కూడిన చెమటల వానలు కురిసాయి. ఇందాక వసంత ఋతువువచ్చిందన్నాను. అంతలోనే వానాకాలము కూడా తెప్పించావు. నువ్వు సామాన్యుడివికాదు. మరీమైమరిచి పోయి నీ విహారంలో మా అమ్మ సంగతి పట్టించుకోవటంలేదు.కాస్త ఈమెను జాగ్రత్తగా చూడు.ఆమె కఠిన స్తనాలమీద లేతపిందెలలాగ చూచుకాలు(స్తనాగ్రాలు)బయటికి పొడుచుకొని వస్తున్నాయి.(స్త్రీ అత్యంత ఆనందపరవశురాలయినప్పుడు స్తనాగ్రాలు పరవశంతో నిక్కబొడుచుకొంటాయి.)ఈ ఆనంద సమయంలో ప్రకాశించే కానుకలు అందుకో! ఆవేమిటో నేను చెప్పాలా ! నీకు తెలుసులే!

3వ చరణం : మా అలమేలు మంగ శరీరంలో మన్మథుని కళలు గుంపులు గుంపులుగా ఉబికుబికి వస్తున్నాయి.ప్రేమతో ఆమె కౌగిలిసంబంధం పెట్టుకో స్వామీ! ఏమిటి అర్థం కావటంలేదా! మా మాండలికంలో చెప్పాలా ! మానాయికను ప్రేమతో తగులుకోవయ్యా ! (=సంబంధము పెట్టుకో) స్వామీ!సెబాస్! నామాట విన్నావు. మీ ఇద్దరి జంటకలిసింది. వేంకటేశ్వరా! నీకు మేలుజరుగుగాక!.

59. నలిరేగిన

పల్లవి : నవమూర్తులైనట్టి నరసింహము వీడె
నవమైన శ్రీ కదిరి నరసింహము

చ1. నగరిలో గద్దెమీది నరసింహము వీడె
నగుచున్న జ్వాలా నరసింహము
నగము పై యోగానంద నరసింహము వీడె
మిగుల వేదాద్రి లక్ష్మీ నరసింహము

చ2. నాటుకొన్న భార్గవూటు నరసింహము వీడె
నాటకపు మట్టెమళ్ల నరసింహము
నాటి యీ కానుగుమాని నరసింహము వీడె
మేటి వరాహపులక్ష్మీ నారసింహము

చ3. పొలసి అహోబలాన బొమ్మిరెడ్డి చెర్లలోన
నలిరేగిన ప్రహ్లాద నరసింహము
చెలగి కదిరిలోన శ్రీ వేంకటాద్రి మీద
మెలగేటి చక్కని లక్ష్మీ నారసింహము(04-182)

అనంతపురం జిల్లా కదిరిలో ఉన్న నరసింహ స్వామిలో -తొమ్మిదిమంది నరసింహ మూర్తులను దర్శిస్తూ అన్నమయ్య పాడిన గీతమిది:

ఎప్పటికప్పుడు కొత్తగా కనిపిస్తూ , తొమ్మిది రూపాలు ధరించిన , నరసింహ స్వామి మన కళ్ల ఎదురుగా ఉన్న ఈ కదిరి నరసింహస్వామి. భక్తితో చూస్తే ఈయనలో తొమ్మిది రూపాలు కనిపిస్తాయి.

చ1. అహోబిలం కొండమీద ఒక గుహలో అరుగు మీద పది భుజాలతో ఉన్న వీర నరసింహస్వామి ఈ కదిరి నరసింహ స్వామి. పైన అహోబిలంలో నవ్వుతున్న జ్వాలా నరసింహ స్వామి ఇతడే. చిన్న అహోబిలపు కొండపై ఉన్న యోగానంద నరసింహ స్వామి ఇతడే. వేదాద్రిలో ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి ఇతడే.

చ2. చిన్న అహోబిలానికి దగ్గరలో భార్గవ తీర్థం అనే క్షేత్రంలో వెలసిన నరసింహ స్వామి ఇతడే. పెద్ద అహోబిలానికి నాలుగు మైళ్ల దూరంలో బీభత్స

మూర్తిగా వెలసిన మట్టెమళ్ల నరసింహ స్వామి ఇతడే. కానుగ చెట్టు కింద ఉన్న కానుగ నరసింహస్వామి (వరాహ లక్ష్మీ నరసింహుడు) ఈ కదిరి నరసింహస్వామి.

చ3. విజృంభిస్తూ ఎగువ అహోబిలంలో నరసింహ స్వామికి, ఉగ్ర స్తంభానికి మధ్యలో వెలసిన ప్రహ్లాద నరసింహస్వామి ఇతడే. కదిరిలో ఉన్న ఈ నరసింహ స్వామియే వేంకటాద్రి మీద ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి.

పరమార్థం

కర్నూల్ జిల్లాలోని నంధ్యాలకు కు 74 కి.మీల దూరంలో, చిత్తూరు జిల్లా తిరుపతికి 75 కి.మీ దూరంలో, హైదరాబాద్కు 365 కి.మీల దూరంలో అహోబిల పుణ్యక్షేత్రంఉన్నది. ఇక్కడ నరసింహస్వామి తొమ్మిది రూపాలలో కనిపిస్తాడు కనుక ఈ క్షేత్రానికి 'నవ నరసింహ క్షేత్రం'అని ఇంకొక పేరు. ఆ తొమ్మిది రూపాలు ఇవి : 1.జ్వాల,2. వీర, 3.యోగానంద,4. కానుగుమాని, 5.మట్టెమళ్ల, 6. భార్గోటి, 7.ప్రహ్లాద, 8.లక్ష్మీ, 9.వరాహ నరసింహులు. వీరిని అన్నమయ్య ఈ కీర్తనలో వర్ణించాడు.

ఖాద్రి అనే పేరు కాల క్రమంగా కదిరిగా మారిందని స్థల పురాణం. ఖాద్రి అనేది ఒక చెట్టు పేరని, ఆ చెట్టు కింద ఉన్న చీమల పుట్టలో నరసింహస్వామి పుట్టాడడని ఒక కథ. ఖదిర (=ముడుగుదామర) వృక్షాలు ఎక్కువగా ఉండటం వల్ల కదిరి అని పేరు వచ్చిందని ఇంకొక కథ. ఈ కదిరి నరసింహస్వామిని దర్శించుకొన్న అన్నమయ్య హృదయాకాశంలో అహోబిలంలోని నవ నారసింహ మూర్తులు దర్శనమిచ్చారు. మిగతా అవతారాల నిడివి ఎక్కువ. నరసింహ స్వామి అవతార కాలం తక్కువ. కాని ఆ అవతార ప్రభావం భక్తుల మీద చాల ఎక్కువ.

నగుచున్న జ్వాలా నరసింహము

అతి భయంకర మైన రూపంతో హిరణ్యకశిపుని రొమ్ముని చీల్చి చంపినందుకు ఈ స్వామిని "జ్వాలా నరసింహుడు" గా వ్యవహరిస్తారు.జ్వాలా నరసింహస్వామి క్షేత్రము దగ్గర భవనాశని అను జలపాతము ఉంది. ఇక్కడ స్నానంచేస్తే అన్ని పాపాలు పోతాయి అని భక్తుల నమ్మకం. ఇక్కడ అన్నమయ్య నగుచున్న విశేషణం వికటాట్ట హాసానికి సంబంధించినది.

నగము పై యోగానంద నరసింహము వీడె

యోగములో ఆనందాన్ని ఇస్తాడు కాబట్టి స్వామివారికి యోగానంద నరసింహ

స్వామి అని పేరు. .ప్రహ్లాదుడు ఈ యోగ నరసింహుని దయతో యోగాభ్యాసం చేసాడట. తమిళనాడు లోని ఘటికా చల క్షేత్రం లో. యోగానంద నరసింహ స్వామి (శాంత నరసింహ) దేవాలయం ఉన్నది. ఇక్కడ స్వామి పద్మాసనంలో ఉండి శాంతం గా భక్తులకు కనిపిస్తారు. ఇరువదినాలుగు నిమిషముల కాలములో పాటు ఇక్కడ స్వామిని ధ్యానం చేస్తే చాలు మోక్షం ప్రసాదిస్తాడని నమ్మకం. అన్నమయ్య వర్ణించిన అహోబిలంలో నగముపై యోగానంద నరసింహ స్వామి కూడా ఆ శక్తి సామర్థ్యములు కలవాడే.

మిగుల వేదాద్రి లక్ష్మీ నరసింహము

లక్ష్మీ నరసింహ స్వామి అహోబిలంలోని వరాహ స్వామికి పైన రెండు మైళ్ల దూరంలో ఉన్న స్వామి. అన్నమయ్య ఈ కీర్తనలో ఉద్దేశించిన నవ నరసింహులు అహోబిలానికి సంబంధించిన వారు కనుక ఈ కీర్తనలో వేదాద్రికి – వేదములు కొలువైన అహోబిలం అని చెప్పుకోవాలి.వేదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వేరు. ఇది కృష్ణా జిల్లా జగ్గయ్యపేటకు 9 కి.మీ.ల దూరంలోఉంది. పంచ నారసింహ క్షేత్రంగా ప్రసిద్ధి పొందిన ఈ వేదాద్రిలో స్వామివారు 1. శ్రీ జ్వాలా నరసింహస్వామి 2.శ్రీ సాలిగ్రామ నృసింహ స్వామి 3. శ్రీ వీర నృసింహ స్వామి 4. శ్రీ యోగానంద స్వామి 5. శ్రీ లక్ష్మీ నృసింహస్వామి రూపాలలో అవతరించారు.

అన్నమయ్య కీర్తనలో నరసింహ దేవుని పరమార్థం ఎన్ని చెప్పినా తరగవు. ఎందుకంటే నరసింహ దర్శనానుభూతి కీర్తనలోని పదాలుగా మారింది కాబట్టి. స్వస్తి.

60. నాములాయ

అన్నమయ్య ఒక చెలికత్తెగా మారి అలమేలుమంగమ్మతో ముచ్చట్లాడుతున్నాడు.

పల్లవి: మేలే నీనేరుపులు మెలత
చాలుకొన్నసరసాలు చవులాయను

చ 1: సూటి దప్పవు గదవే చూపులు నీవి
పాటించి నేదాతనిపై నిండెను
వాటమాయ గదవే నీవలపులు
కూటము లాతనివద్ద గుప్పలాయను

చ 2: నాములాయగదవే నీ నవ్వులు
కామించి యాతని మోహము కళ లెక్కెను
వాములువడె గదవే వట్టి మాటలూ
కోమలపు వీనుల కొటారులజేరెనూ

చ 3: కమ్ముకొనె గదవే కౌగిలి నిది
పమ్మి శ్రీ వేంకటేశ్వరు బాయ వెన్నడూ
చిమ్మిరేగె గదవే చెమట లెల్లా
కుమ్మరింపు వేడుకల గుఱుతులాయనూ(రేకు: 0430-2 సం:12-176)

ఓ అలమేలు మంగమ్మా ! ఎన్ని నేర్పులు మా అయ్య దగ్గర చూపించావో కాని, అన్ని లాభాలే !నీ సరసాలు- వరుసలు కట్టి ఒకదాని వెనుక ఒకటిగా మా అయ్యకి రుచి పుట్టిస్తున్నాయి. (సమక్షంలోనూ, జ్ఞాపకాల్లోనూ కూడా)

చ 01. ఏం చూస్తావు తల్లీ ! నీ చూపులు అసలు గురి తప్పవు. నేడు మా అయ్యపై ఆదరంతో నిండిపోయాయి? (ఎక్కడో నీకు తెలియదా తల్లీ ! హృదయంలో). నువ్వు మా వేంకటేశునిపై చూపించే ప్రేమలు నీకు అనుకూలమయ్యాయి (నువ్వు ప్రేమ చూపిస్తే మాఅయ్య ఏనాడు నీకు అననుకూలత చూపించడు. నీ ప్రేమ అంత గొప్పదని భావము) మీ ఇద్దరి కలయికలు ఒకటారెండా ! ఎన్నెన్నో ! రాశులు! రాశులు !

చ02. ఓ అలమేలు మంగమ్మా ! ఏమి ఉత్సాహంతో ఉన్నావో కాని – నీనవ్వులు ఎక్కువై పోయాయి. నిన్ను ఇష్టపడిన మా ఆయ్య మోహములు కళలుగా మారాయి. ఆ మోహాల కళలు నీ విషయంలో ఎన్ని నేర్పులు ప్రదర్శించాయో నీకే ఎరుక.)

మీ మధ్య ఉండే కల్తీలేని మాటలు కుప్పలు తెప్పలు. మెత్తని మీ చెవుల ధాన్యపు కొట్టులలొ అవి చేరి పోయాయి.(గడ్డి మోపులను ఒక్కచోట చేర్చిన కుప్పల్లాగా మీ చెవులయ్యాయని భావం)

చ 03. ఇదుగో !అలమేలు మంగమ్మా ! మా అయ్య వేంకటేశుని కౌగిలిలో చుట్టు ముట్టావు.అతిశయించి మావేంకటేశ్వరుని ఏనాడు విడవవు.మీ ఇద్దరూ మల్లబంధ పరమార్థం అనేకము ప్రదర్శిస్తుండగా – మీ సంతోషాలకు గుర్తులుగా అనేక చెమట బిందువులు మీ శరీరాలలో నిండి పోయాయి.

పరమార్థం

జనాలు ఏమి మాట్లాడుకొంటారో వాటినే అన్నమయ్య తన కీర్తనల్లో వాడతాడు

“ఏమే ! “ అనే ఆత్మీయతా పిలుపు ఇప్పటికీ కొన్ని కుటుంబాల్లో బంధుత్వాల మధ్య వాడబడుతోంది.అదే– అన్నమయ్య “ కదవే !”అని వాడాడు.” “అలా జరిగింది కదా ! అవును కదే !”అను రెండు పదాలు కలిసి “కదవే!” అయింది. గ్రామీణ ప్రాంతాలలోని పలుకుబడులు –వాములు, కుప్పలు పోలికలయ్యాయి.

“వట్టి” అనే పదానికి ఏమియులేని, నిష్ప్రయోజనమైన, కల్తీలేని అని అర్థాలు ఉన్నాయి. ఈ కీర్తనలో కల్తీలేని ఆనుఅర్థము వట్టి అను పదానికి స్వీకరించబడినది. (ఆధారము ఆంధ్ర–తమిళ–కన్నడ త్రిభాషా నిఘంటువు ఆం.ప్ర.సా.అ. 1979) చూపులు కుప్పలయ్యాయి. నవ్వులు రాశులయ్యాయి. సంతోషాలు మాత్రం గుర్తులయ్యాయి . అన్నమయ్య కీర్తనలు కూడాఅలాంటివే. గుర్తుపెట్టుకొనదగినవి. స్వస్తి.

61. నిజదాసులు

నిత్యాత్ముడై యుండి నిత్యుడై వెలుగొందు
సత్యాత్ము డై యుండి సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి బ్రహ్మమై యుండు సం-
స్తుత్యు డీతిరువేంకటాద్రివిభుడు

1. ఏమూర్తి లోకంబులెల్ల నేలెడునాత- డేమూర్తి బ్రహ్మాదులెల్ల వెదకెడునాత-
డేమూర్తి నిజమోక్షమియ్యజాలెడునాత- డేమూర్తి లోకైకహితుడు
యేమూర్తి నిజమూర్తి యేమూర్తియునుగాడు - యేమూర్తి త్రైమూర్తు లేకమైనయాత-
డేమూర్తి సర్వాత్ము డేమూర్తి పరమాత్ము- డామూర్తి తిరువేంకటాద్రివిభుడు

2. యేదేవుదేహమున నిన్నియును జన్మించె - నేదేవుదేహమున నిన్నియును నణగె మరి
యేదేవువిగ్రహం బీసకల మింతయును - యేదేవునేత్రంబు లినచంద్రులు
యేదేవుడీజీవులిన్నింటిలో నుండు - నేదేవుచైతన్య మిన్నిటికి నాధార-
మేదేవుడవ్యక్తుడేదేవుడద్వంద్వుం- డాదేవుడీవేంకటాద్రివిభుడు

3. యేవేల్పుపాదయుగ మిలయునాకాశంబు - యేవేల్పుపాదకేశాంతం బనంతంబు
యేవేల్పునిశ్వాస మీమహామారుతము - యేవేల్పునిజదాసు లీపుణ్యులు
యేవేల్పు సర్వేశుడేవేల్పు పరమేశు- డేవేల్పు భువనైకహితమనోభావకుడు
యేవేల్పు కడుసూక్ష్మ మేవేల్పు కడుఘనము - ఆవేల్పు తిరువేంకటాద్రివిభుడు (01-75)

ముఖ్యమైన అర్థాలు

నిత్యాత్మ=ఎల్లపుడూ జ్ఞానస్వరూపం కలవాడు: నిత్యుడు=ఎల్లప్పుడును ఉండువాడు అద్వంద్వుడు తత్త్వజ్ఞుడు, నిస్సంగుడు

తాత్పర్యము:

వేంకటేశుడు నిత్య స్వరూపుడు. సత్య స్వరూపుడు.అయన మన కళ్ల ఎదురుగా పరబ్రహ్మ మూర్తిగా ఉండి తనను ఆరాధించే భక్తుల పొగడ్తలందుకొంటున్నాడు.

ఈ వేంకటేశ్వరుడు లోకాలను పాలించేవాడు. బ్రహ్మ మొదలైన దేవతలచేత వెతుకదగినవాడు.తనను శరణన్నవారికి మోక్షము ఇచ్చేవాడు. లోకానికి మేలు చేసేవాడు. ఒక ఆకారంగా కనబడుతున్నప్పటికీ, ఆకారం లేనివాడు. త్రిమూర్తులు ఒకటైన మూర్తి. అంతటా వ్యాపించి యున్నవాడు. పరమాత్మ.

ఈ వేంకట దేవుని శరీరములో ఈ సమస్త లోకాలు పుట్టాయి. ఈ లోకాలన్నీ అతనిలో లయమౌతున్నాయి. ఈ కనబడే సకల సృష్టి అతని శరీరము. సూర్య చంద్రులు నేత్రాలుగా కలిగిన వాడు. అందరియందు ఉండే పరమాత్మ. ఆ స్వామి చైతన్యమే ఈ కదిలే వాటన్నింటికి ఆధారము. అతడు విశారదుడు. తత్వము తెలిసినవాడు.

వేంకటేశుని పాదాలు భూమి, ఆకాశము. ఆయన పాదాలకు , కేశాలకు చివర లేదు. ఆయన నిట్టూర్పు మహావాయువు. ఆయన నిజమైన దాసులు పరమ భక్తులు. అతనే అందరికీ ప్రభువు. పరమేశుడు. లోకానికి మంచి చేయాలని అతను ఎప్పుడూ భావిస్తుంటాడు. సూక్ష్మము అతడే. స్థూలము అతడే.

పరమార్థం

నిత్యాత్ముడై యుండి

అన్ని జీవుల హృదయదేశంలో ఈశ్వరుడున్నాడని భగవద్గీత. (18-61) నిత్యమూ ఆత్మ రూపంలో ఉండే దేవుడు నిత్యాత్ముడు. నిత్యాత్ముడై ఉండి కూడా, కేవలం ఒక జీవికి , ఒక కాలానికి ఆయన పరిమితం కాడు. మూడు కాలాలలో ఎప్పుడూ ప్రకాశించే నిత్యుడు. పరిమిత కాలము ఆయుస్సున్న జీవి హృదయంలో ఉంటూ కూడా, నిత్యుడిగా ఉండటం ఆయనకే సాధ్యం.

సత్యాత్ముడై

పరమాత్మ సత్యము. శివము. సుందరము. మంచివారియందు పుట్టేదాన్ని సత్యమంటారు.సత్యంలో దేవుడు ఉన్నాడని మహాభారతం చెబుతోంది. (69-13) ఆ పరమాత్మ సత్యస్వరూపుడు.(=సత్యాత్ముడు) సత్యాత్ముడై ఉండి , సత్య స్వరూపంగా తాను ఉన్నాడు. లక్షణము, ఉదాహరణ రెండూ అతడే . సత్యము లక్షణము . సత్యాత్ముడు ఉదాహరణము. రెండూ అతడే అని కవి మాట.

ప్రత్యక్షమై యుండి

బ్రహ్మ సాక్షాత్కారము అంత తేలికైన విషయం కాదు. కాని మన అదృష్టం

కొద్దీ శ్రేష'మైన బ్రహ్మ తిరుపతిలో మన కళ్లెదురుగా కనబడుతూ మనలిని ఆశీర్వదిస్తున్నాడు. ప్రత్యక్షంగా కనబడుతూ బ్రహ్మంగా తాను ఉన్నాడని అన్నమయ్య మాట.

ఏవేల్పునిజదాసు లీపుణ్యులు

పరమ పుణ్యాత్ములు విష్ణు మూర్తి దాసులని అర్థం. ఇందులో దాస శబ్దం (= సేవకుడు) పై పండిత లోకంలో ఒక చమత్కార కథ ఉంది.

ఒక అద్వైతి తన ఇంటి గోడ మీద 'సో2హం' (=ఆ దేవుడే నేను) అని రాసాడు.

ఒక విశిష్టాద్వైతి 'సో2హం' కు ముందు 'దా' అనే అక్షరాన్ని చేర్చాడు. 'దాసో2హం' (నేను భగవంతుని సేవకుడను) అయింది.

అద్వైతి 'దాసోహం' కు ముందు 'స' అనే అక్షరాన్ని చేర్చాడు. 'సదా సో2హం '(=ఎప్పుడూ అతడు నేనే) అయింది.

విశిష్టాద్వైతి 'సదా సో2హం'కు ముందు 'దా' చేర్చాడు. 'దాస దాసో2హం' (=భగవంతుని సేవకుడి సేవకుడిని) అయింది.

ఈ రకంగా దేవుని సేవకుడి సేవకుడిని అనేవారు నిజదాసులు.

యేమూర్తి త్రైమూర్తు లేకమైనయాతడు

ఒక పాదంలో 'త్రిమూర్తులు ముగ్గురూ నారాయణుడే' అని అని చెబుతూ, ఇంకొక పాదంలో 'బ్రహ్మ అతనికోసం వెతుకుతాడు 'అని చెప్పటంలో కొంచెం తికమక అనిపిస్తుంది. త్రిమూర్తులలోని బ్రహ్మ కాక ఇంకో బ్రహ్మ ఉన్నాడా అనే సందేహం వస్తుంది.ఇందులో తికమక ఏమీ లేదు. వెతికేవాడు అతడే. వెతకబడేవాడు అతడే. అంతా ఆయన వినోదం. ఇలా అనుకొంటే గందరగోళం అదృశ్యమవుతుంది.

ఈ 'నిత్యాత్ముడై' పాటలోని మొదటి చరణమైన 'ఏమూర్తి లోకంబులెల్ల నేలెడు' ప్రభావంతో రామదాసు చలన చిత్రంలో 'శుభకరుడు' అను పాట తయారయింది. పదాలు మారాయి కాని ఎత్తుగడ , ముగింపులలో అన్నమయ్య ఫక్కి ఆ పాటలో కనిపిస్తుంది. అన్నమయ్య పాటల మీద అత్యంతాసక్తి ఉన్న రాఘవేంద్రరావు గారు, కీరవాణిగారు 'ఇంటింటా అన్నమయ్య' చిత్రంలో 'నిత్యాత్ముడై ఉండి' కీర్తనలో 'ఏ దేవు దేహమున ...'అను రెండవ చరణం స్వీకరించారు. ఇది అభినందించదగిన అంశం.

యేవేల్పుపాదకేశాంతం బనంతంబు

ఆ పరమాత్మ యొక్క ఆదిని, మధ్యాన్ని , అంతాన్ని చూడలేకపోతున్నానని నారాయణుని విశ్వరూపాన్ని చూసి అర్జునుడు పలికిన మాటలు మనందరకు తెలిసినవే . (గీత11-16) అన్నమయ్య గీతను స్ఫురింపచేస్తూ విశ్వరూప ప్రతీకలుగా పాదాంత, కేశాంత పదాలు వాడాడు

ఆవేల్పు తిరువేంకటాద్రివిభుడు

'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ' అన్నది ఛాందోగ్యోపనిషత్తు. (3-14) ఉన్నది ఒక్కటే. రెండవవాడు లేడు అని ఉపనిషత్తులు , వేదాలు ఘోషిస్తున్నాయి. ఈ భావమే 'నిత్యాత్ముడై' కీర్తనలో అన్నమయ్య చెప్పాడు. 'మమకారాన్ని వదిలిపెట్టాలి. అది సాధ్యం కాకపోతే ఆ మమకారాన్ని ఏ ఒక్క దాన్ని వదిలిపెట్టకుండా అన్నిటి యందు చూపించాలి' అని పెద్దలు చెప్పారు. ఆ మమకారంతో అన్నిచోట్లా భగవంతుని దర్శించాలి. అన్నింటిలో ఉన్నది ఒకటే అను జ్ఞానాన్ని పెంచుకోవటానికి కృషి చేయాలి. ఇదే ఈ కీర్తన పరమార్థం. స్వస్తి.

62. నెప్పుగా

స్థైర్యముగా, ఉపాయముగా. అనే అర్థాల్లో నెప్పుగా అనే విచిత్ర పద ప్రయోగము చేసాడు అన్నమయ్య.

పల్లవి : నందగోపనందనుండే నాటిబాలుడు
ఇందునేడే రేపల్లె నేచి పెరిగెను

చ1. పువ్వువంటి మ్టయాకు పొత్తిబవళించనేర్చె
యెవ్వడోకాని తొల్లె యీబాలుడు
మువ్వంక వేదములను ముద్దుమాటలాడనేర్చె
యెవ్వరూ కొంతనేర్ప నేటికే వీనికి

చ2. తప్పటడుగు లిడగనేర్చె ధరణియందు నాకసమున
నెప్పుగా రసాతలమున నొంటి తొల్లియే
రెప్పలెత్తి చూడనేర్చె రేసీఉజెంద్రునందు పగలు
గొప్పసూర్యునందు నింకఉ గొత్త నేర్పనేటికే

చ3. మంచివెన్నబువ్వ లిపుడు మలసి యారగించనేర్చె
నంచితముగ శ్రీవేంకటాద్రి మీదను
యెంచి యప్పలప్పలనుచు యెనసి కాగిలించనేర్చె
దించరానివురము మీద దివ్యకాంతను (02-387)

గోపాలకులు చిన్ని కృష్ణుని చూసిన ఆనందంలో తమలో తాము ఇలా మాట్లాడు కొంటున్నారు.

ఆనాడు మర్రాకు మీద పడుకొన్న బాలుడు - ఈనాడు నందుని కుమారుడు. ఇదిగో! మన అదృష్టం కొద్దీ మన రేపల్లెలో అందరినీ మించిపోతూ పెరుగుతున్నాడు.

చ1:ఏమమ్మో ! ఎందుకే వీడిని అలా పడుకోబెట్టటానికి ప్రయత్నిస్తున్నావు! పూర్వం ఈ బాలుడు 'వీడు' అని ఖచ్చితంగా చెప్పలేము. ఎవడో -ఎక్కడివాడో తెలియదు కాని- ఈ బాలుడు -పువ్వులాంటి మర్రాకు పొత్తిలో పడుకోవటం నేర్చుకొన్నాడు. ఓ అక్కా ! నువ్వేదో మాటలు కొంత కొంత వీడికి నేర్పటానికి ప్రయత్నిస్తున్నావెందుకే ! మూడు వేదాలను ముద్దుగా మాట్లాడటం నేర్చుకొన్నవాడే వీడు. (కొత్తగా నువ్వు నేర్పవలసిన పనిలేదని భావం)

చ2: ఏమిటే ! వీడికి నడక నేర్పించాలని తాపత్రయ పడుతున్నారు! వీడు తక్కువవాడు కాడు.పూర్వం ఒక్కడే వామనావతారంలో భూమిలో, ఆకాశములో, పాతాళములో మూడు అడుగులు పెట్టిన ఘనాపాఠి. ఒక కన్ను రెప్ప ఎత్తి రాత్రిలో చంద్రుడిని చూడటం నేర్చాడు. ఇంకో కనురెప్పలో పగటిని సూర్య నేత్రంలో చూడటం నేర్చాడు. ఇంకా వీడికి నువ్వు కొత్త కొత్తవి నేర్పాలా! (కృష్ణుడి రెండు కళ్లు సూర్య చంద్రులని భావం)

చ3: ఈ కిట్టమ్మ చిన్న పిల్లాడు కాదు తల్లీ ! ఈ వేంకటగిరి పర్వతం మీద ప్రకాశిస్తూ పోట్లాడి పోట్లాడి వెన్నబువ్వలు తినటం మాబాగా నేర్చాడు. చిన్నపిల్లాడికి మల్లే అప్ప అప్ప అంటూ – ఎవ్వరూ దించటానికి వీల్లేకుండా తన రొమ్ము మీద లక్ష్మీ దేవిని పెట్టుకొని – ఆవిడతో కౌగిలింతలు మొదలైనవి ఎంత బ్రహ్మాండంగా నేర్చాడో !

పరమార్థం

భక్త కవులందరికీ చిన్ని కృష్ణుడంటే విపరీతమైన మమకారం. అన్నమయ్య కూడా ఇందుకు మినహాయింపుకాదు. కృష్ణుడంటే చాలు –ఆయన కీర్తనలో బాలకృష?ి గజ్జెలు అక్షరాలుగా మారతాయో – మరేమో– కాని– ఘల్లు ఘల్లు మంటూ భావాలు ఝల్లుమనిపిస్తాయి.

ఈ మంత్రాకు మీద కృష్ణుడి ప్రస్తావన మనకు మహాభారతంలో కనిపిస్తుంది. చిరంజీవియైన మార్కండేయుడు ధర్మరాజుతో ఇలా చెబుతాడు " ధర్మజా! ఈ కల్పం చివర వచ్చే జల ప్రళయంలో నేను దిక్కుతోచక తిరిగాను. ఆ ప్రళయంలో పెద్ద మర్రి చెట్టు చూసాను. ఒక మంత్రాకు మీద శ్రీ మహావిష్ణువు చిన్ని బాలునిలా పడుకుని ఉన్నాడు. అతనినోట్లోకి ప్రవేశించి పొట్టలో సమస్త జగత్తు చూసాను. నా భ్రాంతిని తొలగించమని ప్రార్థించగా ఆ చిన్ని కృష్ణుడు నేను బాలుడి రూపంలో ప్రళయకాలంలో వేయి మహా యుగాలు యోగ నిద్రలో ఉంటాను" అని జవాబు చెప్పాడు. (మహా భారతం – అరణ్య పర్వం –చతుర్థాశ్వాసం)

మహా భారతంకంటే కూడా మంత్రాకుతో కృష్ణుడనగానే లీలాశుకుడి కృష్ణ కర్ణామృతంలోని ఈ శ్లోకం చాలామందికి గుర్తుకు వస్తుంది. 'కరారవిందేన పదారవిందం ముఖారవిందే వినివేశయంతం వటస్య పత్రస్య పుటే శయానం బాలం ముకుందం మనసా స్మరామి' (పద్మం లాంటిది ఆ కృష్ణుని చేయి. దానితో

తన పాద పద్మాన్ని ముఖ పద్మంలో ఉంచుకొని మర్రాకు మీద పడుకొన్నాడు. అతనిని మనసారా తలుస్తున్నాను.) బాల కృష్ణుని చేయి సృష్టికి, పాదం స్థితికి, ముఖం లయానికి ప్రతీకలుగా చెబుతారు.

మర్రికి బదులు అశ్వత్థమని (రావి ఆకు) కొందరు చెబుతున్నారు. (శ్రీ భగవద్గీతా మథనం – 33వ అధ్యాయము. కంచి కామకోటి పీఠ ప్రచురణ). కాని ఇది అంత ప్రసిద్ధమైనది కాదు. అన్నమయ్య కూడా మర్రాకునే స్వీకరించాడు.

చిన్న పిల్లవాడు అడుగులు వేయటం సరిగా రాక అడుగులు వేయటంలో తొట్రుపడి, ఇటు అడుగు అటు, అటు అడుగు ఇటు వేస్తాడు. వామనమూర్తి భూమి , ఆకాశములను ఆక్రమించినప్పుడు వేసినవి ఈ తప్పటడుగులని అన్నమయ్య మనోహరమైన పోలిక.

నందగోపుడు

గోపుడంటే 1. గొల్లవాడు2. రాజు3. గోవులకధిపతి4. అనేక గ్రామము లకధిపతి అని నాలుగు అర్థాలున్నాయి. కనుక నందగోపుడంటే నందుడనే గొల్లవాడనే అర్థంతో పాటు , నందుడను గ్రామాధిపతి అని చెప్పుకోవచ్చు. అతని నందనుడు –కుమారుడు– కృష్ణుడు. తండ్రిని సంతోషింపచేసేవాడు నందనుడు. తండ్రిని అనేక సందర్భాలలో కృష్ణుడు సంతోష పెట్టాడు.

నందగోపుడనే పదాన్ని చినజియ్యర్ స్వామి ఇలా వ్యాఖ్యానించారు. "నంద గోపుడినే మనం ఆచార్యుడు అంటాం. ఎందుకంటే భగవంతుణ్ణి తలచి, భగవంతుణ్ణి తనలో కల్గి ఆనందించేవాడు కాబట్టి ఆయన నందుడు, ఆ భగవంతున్ని దుష్టుల దృష్టిలో పడకుండా దాచి గోప్యంగా ఉంచేవాడుఈ అందుకే ఆయన గోపుడు. ముందుగా మనం చేరాల్సింది ఆచార్యుడి వద్దకు" (11వ పాశుర వ్యాఖ్యానంలో).

హరిని కీర్తిస్తూ కావ్యాలు వ్రాసే కవులకి మోక్షం వస్తుందట. మరి ఆ హరిని పెంచే తల్లిదండ్రులకి ఏం లభిస్తుందో? అని పోతన్న ప్రశ్నిస్తాడు. (భాగవతం. ద.పూ. 350) అన్నమయ్య కీర్తనల్లో నిలిచిపోయి ప్రజల నాలుకలమీద చిరంజీవిత్వం పొందే అదృష్టం పొందుతాడని మన జవాబు. స్వస్తి.

63. నీకొక్కసరి

ఒకసారి అనటానికి ఒక్కసరి అని అన్నమయ్య ప్రయోగము.

పల్లవి: ఇందరు నీకొక్కసరి యెక్కువ తక్కువ లేదు
చెంది నీసుద్దులు యేమిచిత్రమో కాని

చ.1: నీనామ ముచ్చరించి నెరవేరె నొక్క మౌని
నీ నామము వినక నెరవేరె నొకడు
వూని నిన్ను నుతియించి భోగియాయ నొకడు
మోనమున నిన్ను దిట్టి మోక్షమందె నొకడు

చ.2: మతిలో నిన్నుదలచి మహిమందె నొకయోగి
తతి నిన్ను దలచకే తగిలె నిన్నొకడు
అతిభక్తిc బని సేసి అధికుడాయ నొకడు
సతతము బనిగొని సఖుడాయ నొకడు

చ.3: కాగిటి సుఖములిచ్చి కలసిరి గొందరు
ఆగి నిన్ను వెంటదిప్పి ఆవులు మేలందెను
దాగక శ్రీవేంకటేశ దగ్గరైన దవ్వయిన
మాగి నిన్ను దలపోసే మనసే గుతు (రేకు:0302-02 సం:04-008)

పల్లవి: వేంకటేశా ! లోకంలో ఇంతమంది భక్తులు ఉన్నారు. వాళ్లలో ఏ ఒక్కరిని ఒకసారి (=ఒక్కసరి) ఎక్కువ, ఇంకొకరిని తక్కువగా భావించవు. కారణభరితమైన (=చెంది) నీ కథలు (=సుద్దులు) ఎంత చిత్రమో కదా !

చ. 1: నీ పేరును పలికి ఒక ముని తన ఆశయాన్ని నెరవేర్చుకొన్నాడు. (ఆముని పేరు నారదుడు. నిరంతరము నారాయణ నామాన్ని జపించాలని ఆయన ఆశయము. అది నెరవేరింది.)

నీ పేరును ఎప్పుడూ వినకూడదని పట్టుబట్టిన వాడి కోరిక నెరవేరింది. (నేను విష్ణువు నామాన్ని వినని ఘంటాకర్ణుడు అనేవాడు చెవులకు గంటలు కట్టుకొన్నాడు. విష్ణునామం వినిపించగానే గంటలు మోగించేవాడు. విష్ణు నామము వినకూడదనే వాడి కోరికను దేవుడు నెరవేర్చాడు. ముందు నామము వినిపించేది కనుక, అది

విన్న పుణ్యానికి వాడు మోక్షము పొందాడు.)

ప్రయత్నించి (=పూని) నిన్ను పొగిడి ఒక భక్తుడు భోగి అయ్యాడు. (కుచేలుడు ఎట్టి పరిస్థితిలో ఉన్నా ప్రయత్నపూర్వకంగా స్వామిని తలుచుకొంటూ నుతించేవాడు. అందువల్ల భోగి అయ్యాడు)

మోసముతో నిన్ను తిట్టి మోక్షము ఒక భక్తుడు పొందాడు. (ధర్మరాజు రాజసూయ యాగము చేయుచుండగా అచ్చటికి వచ్చి కృష్ణుని పలురీతుల నిందించి అతనిచేతనే చనిపోయాడు. శిశుపాలుడు, దంత వక్త్రుడు ఇద్దరూ సనకసనందనుల శాపముచే రాక్షస కృత్యములు కలవారుగా పుట్టారు. వారు విష్ణు భక్తులయిన జయవిజయులు. మోసమంటే అజ్ఞానమని ఒక అర్థముంది. రాక్షస జన్మలో తాను పూర్వము విష్ణు భక్తుడననే జ్ఞానము శిశుపాలునికి లేదు. ఆ అజ్ఞానముతో కృష్ణ నింద చేసాడని కవి భావము)

చ. 2 : నిరంతరము తలపులో (మతిలో) నిన్ను తలచి ఒక యోగి గొప్పతనాన్ని పొందాడు. (శుక యోగి ఎప్పుడూ విష్ణువును తలచి మహాత్మ్యము పొందాడు) ఏ సమయములో కూడా(తతి) నిన్ను తలవకుండా, చివరిదశలో నిన్ను కలుసుకొన్నాడు ఒకడు. (అజామిళుడు ఎప్పుడూ విష్ణువును తలవలేదు. చివరి నిమిషములో నారాయణా అని తన కొడుకు పేరును తలచుకొన్న మాత్రము చేత స్వామి అనుగ్రహించాడు.)

ఎక్కువ భక్తితో నీకు పనులు చేసి ఒకడు అధికుడయ్యాడు. (శ్రీ కృష్ణునకు పరమాప్తుడగు యాదవుడు ఉద్ధవుడు. అతడు ఎప్పుడూ కృష్ణుని పనులు చేసేవాడు. తన సందేశాన్ని గోపికలకు ఉద్ధవుని ద్వార కృష్ణుడు పంపాడు. శ్రీ కృష్ణభగవానుడు తన పరంధామమునకు చేరుటకు ముందు ఉద్ధవునకు తత్త్వజ్ఞానమును (ఉద్ధవగీతను) ఉపదేశించాడు. అందుకే ఉద్ధవుడు అధికుడయ్యాడు)

ఎప్పుడూ ఒక భక్తుని పనులు చేయుటకు నువ్వు నియోగింపబడ్డావు. అతనికి స్నేహితుడవయ్యావు. (అర్జునుడు ఎన్నో పనులు కృష్ణునిచే చేయించుకొన్నాడు. చివరకు రథము కూడా తోలించుకొన్నాడు. అతనికి కృష్ణుడు స్నేహితుడయ్యాడు)

చ. 3: కొందరు భక్తులు నీకు కౌగిలి(కాగిటి) సుఖాలిచ్చి నీలో కలిసిపోయారు. (గోపికలు) తాము ఆగితే నిన్ను కూడా ఆపి(ఆగి) నిన్ను తమవెంట దిప్పుకొని ఆవులు మేలు పొందాయి.

వేంకటేశా! మనస్సులో ఏ అభిప్రాయాలు ఉంటే ఆ అభిప్రాయాలను దాచకుండా (దాగక) కొంతమంది భక్తులు నీకు దగ్గరయ్యారు. మరికొంతమంది దూరమయ్యారు.. ఏదయినా – పక్వమయి నిన్ను ఏదోరకంగా (శత్రు, మిత్ర భావాల్లో ఏదో ఒకటి) తలపోసే మనస్సు నీ భక్తికి గుర్తు .స్వస్తి.

64. పత్ర సాలము

అన్నమయ్య సృష్టించిన పదాలలో "పత్ర సాలము" (రుణ పత్రము) ఒకటి. రుణ పత్రమంటే అప్పును మంజూరు చేస్తున్నట్టుగా ప్రకటిస్తూ బ్యాంకు వాళ్ళు ఇచ్చే కాగితం (loan-certificate)

భక్తుడు దేవునికి రుణమా? దేవునికి భక్తుడు రుణమా? అని ప్రశ్న. ఈ ప్రశ్న అడిగితే సాధారణంగా ఎవరైనా - "దేవుడు భక్తునికి రుణమేమిటి? భక్తుడే దేవునికి రుణము."అని వెంటనే జవాబు చెబుతారు. కాని అన్నమయ్య అనే భక్తుడు "నీకే నేను రుణమిచ్చాను. కాని నువ్వు నాకు పత్ర సాలము - (రుణ పత్రము) ఇచ్చావు అని దేవునితో మాటల యుద్ధానికి దిగాడు. వేంకటేశునితో చనువున్న అన్నమయ్య ఎలా తమాషా మాటల దెబ్బలాడాడో చూద్దాం.

పల్లవి: హరి నీకేనే రుణ మత్తుగాక తగవైతే
వొరిమ నొకరియ్యగ నొకరికి దిద్దుటా

చ.1: మొలచు జననలోకమునకు నుదుట వ్రాసే
బలుడ నీచే నే బత్రసాల మందుకొంటి
పెలుచు దేవతలకు పితరులకు రుణము
యిల నత్తునట యివి యేనాటి రుణము

చ.2: యేయెడ నేమిసేసి యేలోకమందున్నా
పాయని నీవే నాకు ప్రాణబంధుడవైతి
కాయపు జుట్టరికాలు ఘన కరుణానుబంధ
మీయెడగలిగెనట యేనాటి రుణము

చ.3: శ్రీవేంకటేశ నీవీ చిక్కులబెట్టి నాకు
కావిరి గర్మాలు మెడఉగట్టితివిగా
సోవల నీ శరణము చొచ్చిన నాకు నివి
యేవూరి కేవూరు యేనాటి రుణము (రేకు: 371-6సంపు: 4-421)

ఓ వేంకటేశా ! నీకే నేను రుణము ఇచ్చాను - రుణము నువ్వు తీసుకొన్నావు.ఇది అసలు కథ-

కాని–ప్రేమతో ఒకరిస్తే – ఇంకొకరికి దిద్దటం ఏమన్నా బాగుందా? అంటే రుణమిచ్చిన వాడి పేరు దగ్గర – రుణం తీసుకొన్న వాడి పేరు– రుణం తీసుకొన్న వాడి పేరు దగ్గర రుణం ఇచ్చిన వాడి పేరు మార్చి దిద్దటం ఏమన్నా బాగుందా?

చ 01 : పుట్టుకలు కలిగిన ఈ జన్మల లోకానికి నుదుటి వ్రాతలు వ్రాసే బలవంతుడివి నువ్వు. నీచేత నేను రుణపత్రము అందుకొన్నాను. కాఠిన్యము కలిగిన ఆ దేవతలకి, పిత ృదేవతలకి –నేను రుణమా? నేను భూమి మీద పుట్టడంతోనే నాకు ఆ రుణం అంట గట్టావు. ఇది ఏనాటి రుణం? "బలవంతుడు" చాలా చమత్కార ప్రయోగం. బలవంతుడివి కాబట్టే రుణ పత్రము నాకు అంట గట్టావు అని ఒక చెణుకు,

పిత ృదేవతలు రెండు రకాలు. వసురుద్రాదిత్యరూపులు అయి చంద్రలోకమున ఉండే పితృ దేవతలని అగ్నిష్వాత్తులు అంటారు. అగ్నిష్వాత్తులు యజ్ఞము చేయనివారు. వీరు శ్రాద్ధములో బ్రాహ్మణుని చేతి రూపమయిన అగ్నివల్ల శ్రాద్ధాన్నము మొదలయిన వాటిని పొందేవారు.

యజ్ఞము చేసిన పిత ృ దేవతలని బర్హిషదులు అంటారు.

అన్నమయ్య సంప్రదాయాల పట్ల విముఖుడు కాదు.పిత ృదేవతారాధనని నిరసించే వాడు కాడు.

కేవలం చనువుతో స్వామి వారితో దెబ్బలాట. అంతే.

చ 02 : అయ్యా ! వేంకటేశ్వర స్వామీ ! ఎక్కడ, ఏమి చేసినా, ఏ లోకమందున్నా నన్ను విడవని నువ్వు నాకు ప్రాణసమానుడగు బంధువువయ్యావు. అవునా? కాదా?

మరి నాకు ప్రతి జన్మలోనూ ఒక్కో శరీరముతో చుట్టరికాలు.. గొప్పవైన దయానుబంధాలు ఈ లోకంలో కలుగుతున్నాయి. ఏనాటి రుణాలయ్యా ఇవి.

వెనక జన్మలలో ఈ జీవుడు ఎందరికి కొడుకు? ఎందరికి తోబుట్టువు? (ఎవ్వరెవ్వరి వాడో ఈ జీవుడు)అని ఒక కీర్తనలో అన్నమయ్య సూటిగా ప్రశ్నించాడు. ఈ విషయాన్ని కొంచెం మార్చి ఇక్కడ స్వామివారిని ప్రశ్నిస్తున్నాడు.

నేనెక్కడున్నా, ఏ జన్మ ఎత్తినా నువ్వు నాకు ప్రాణసమానుడగు బంధువువి అయినప్పుడు నాకు ఈ లంపటాలు, రుణాలు ఏమిటయ్యా ! నా వల్ల నీకు కీర్తి వచ్చినప్పుడు నువ్వు నాకు రుణపడ్డావు. మరి నాకు రుణాలు అంటగడతావేమిటి? అని స్వామివారితో భక్తుని దెబ్బలాట.

03. శ్రీవేంకటేశ! ఇన్ని రకాల చిక్కులు నాకు పెట్టి
కావిరి కర్మలని మెడకు కట్టావు.

ప్రత్యక్షంగా(సోవల) నీ శరణము కోరిన నాకు ఇన్ని రుణాలేమిటి?

ఏనాటి రుణాలు ఇవి? ఈ రుణాలన్నీ నీ సంబంధం ఉన్ననాకు సంబంధంలేనివి. (ఏ ఊరికే వూరు?)

అన్నమయ్య ఈ మూడో చరణంలో మూడు కొత్త పదాలు (కావిరి కర్మలు, సోవల, ఏ ఊరికే వూరు?) సృష్టించాడు. చివరి రెండింటికి నిఘంటువులలో అర్థాలున్నాయి. మొదటి పదమైన కావిరి కర్మలకు లేదు. దాని పరమార్థం తెలుసుకొందాం.

కర్మలు చాలా ఉన్నాయి.

ద్వివిధ-కర్మలు : 1.అర్థకర్మ (దర్శపూర? మాసాదికము), 2. గుణకర్మ (ఇడా భక్షణాదికము).

త్రి-కర్మలు:1. యజ్ఞము, 2. వేదాధ్యయనము, 3. దానము.

త్రివిధ-కర్మలు 1. సంచితము, 2. క్రియమాణము, 3. ప్రారబ్ధము.

చతుర్విధ కర్మలు : 1. ధ్యానము, 2. శౌచము, 3. భిక్ష, 4. ఏకాంతమున నుండుట.

పంచ కర్మలు : 1. ఉత్క్షేపణము, 2. అవక్షేపణము, 3. ఆకుంచనము, 4. ప్రసారణము, 5. గమనము.

షట్-కర్మలు : 1. అధ్యాపనము, 2. అధ్యయనము, 3. యజనము, 4. యాజనము, 5. దానము, 6. ప్రతిగ్రహము

నవ-కర్మలు : 1. సంధ్య, 2. జపము, 3. హోమము, 4. స్వాధ్యాయము, 5. దేవతార్చనము, 6. వైశ్వదేవము, 7.ఆతిథ్యము, 8. పితృతర్పణము

షోడశ-కర్మలు: 1. గర్భాధానము, 2. పుంసవనము, 3. సీమంతము, 4. జాతకర్మము, 5. నామకరణము, 6.అన్నప్రాశనము, 7.చౌలము, 8. ఉపనయనము, 9. ప్రాజాపత్యము, 10. సౌమ్యము, 11. ఆగ్నేయము, 12. వైశ్వదేవము, 13. గోదానము, 14. సమావర్తనము, 15. వివాహము, 16. అంత్యేష్టి.

కావిరి పదం నిఘంటువులో ఉంది.

కావిరి కర్మ లేదు.

కావిరి అంటే పొగ లేకయే పొగవలె ముంచుకొనేటిది. (any thing that appears like smoke%) అటువంటి నల్లనైన దూష్యమైన కర్మ – కావిరి కర్మ

ఈ జన్మలో చేయకుండానే క్రితం జన్మల చేతల ఫలితంగా అనుభవానికి వచ్చే దూష్యమైన – కావిరి కర్మలు మెడకు ఎందుకు కట్టావు? నాకు ఎందుకు తగిలించావు ? అని అన్నమయ్య ప్రశ్న.

దేవ ఋణము, పితృఋణము, ఋషిఋణము అని మూడు రకాలుగా ఋణాలను కొందరు చెబితే వీటికి కొంతమంది మానవ– ఋణము కూడా చేర్చి మొత్తం నాలుగన్నారు.(ఋణము –సరియైన పదం. రుణము –ఆధునిక కాలంలో వాడుకలో ఉన్న పదం)

దేవుడు అన్నమయ్యకిఋణపడ్డాడో లేదో తెలియదు కాని, తెలుగు సారస్వత ప్రపంచం అన్నమయ్య కవిత్వానికి ఋణ పడింది. స్వస్తి.

65.పదారువేల బంగారు వుంగరము

కృష్ణమూర్తి అనగానే నిర్వచించటానికి వీలులేని తియ్యదనం ఆయన పెదవుల మీద నవ్వుగా మారి మనలిని పరవశింపచేస్తుంది. ఆనవ్వుల తీపి వానలో తడిసిపోయిన అన్నమయ్య కుమారుడు పెద తిరుమలయ్య - ఆ నల్లనయ్యను మధురంగా ఈ కీర్తనలో పిలుచుకొంటున్నాడు.

పల్లవి: మొక్కేటి గోపాంగనల మోహనాకారము
చిక్కని నవ్వులు నవ్వీ శ్రీవేంకటేశ్వరుడు

చ. 1: సత్యభామవురముపై చల్లని కస్తూరిపూత
తత్తరించే రుక్మిణిచేతామరపూవు
హత్తిన భూకాంతకు యంగపు పయ్యదకొంగు
చిత్తగించరమ్మ వీడే శ్రీవేంకటేశుడు

చ. 2: పంతపు వదారువేలబంగారువుంగరము
బంతికే కుబ్జగట్టిన పసిడితాళి
వింతగా రాధాదేవి వేసిన కలువదండ
చెంతలను వీడే యమ్మ శ్రీవేంకటేశుడు

చ. 3: ఆసల తులసీదేవియచేతిలో యద్దము
బాసురపు యిళాదేవి పట్టుగొమ్ము
శ్రీసతి యెక్కినయట్టి సింహాసనపు గద్దె
సేస వెట్టించుకున్నాడు శ్రీవేంకటేశుఁడు

(రేకు: 0038-03 సంపుటము: 15-221)

❖

గోపికలు మొక్కుతున్న మోహనమయిన ఆకారముతో శ్రీ వేంకటేశ్వరుడు చిక్కని నవ్వులు నవ్వుతున్నాడు.

చిక్కని నవ్వులు అంటే
చిక్కనైన నవ్వులా?
అంతు చిక్కని నవ్వులా?

దీని భావమేమి తిరుమలేశా?

అసలు నవ్వులలో పలుచని నవ్వులు, చిక్కని నవ్వులు ఇలా ఉంటాయా?

కారణము లేక నవ్వును... ప్రేరణమును లేని ప్రేమ... వృధా"ట".

మరి ఏ కారణముతో తమరు నవ్వుచుంటిరి వేంకటేశా?

1. పిన్న నవ్వు,
2. చిరు నవ్వు,
3. అల్లన నవ్వు,
4. అలతి నవ్వు,
5. మందస్మితం,
6. హర్ష మందస్మితం,
7. ఉద్గత మందస్మితం,
8. జనిత మందస్మితం,
9. అనాద మందస్మితం అని చిన్న నవ్వులు తొమ్మిదట.
10. కలకల నవ్వు,
11. పెలుచ నవ్వు,
12. ఉబ్బు మిగిలిన నవ్వు అని పెద్ద నవ్వులు మూడట.
13. కన్నుల నవ్వు,
14. కన్నుల నిప్పురాలు నవ్వు,
15. ఎలనవ్వు
16. కినుక మునుంగు నవ్వు,
17. నవ్వు గాని నవ్వు,
18. ఎఱ నవ్వు,
19. కటిక నవ్వు,
20. కినుక నవ్వు ఇంకో ఎనిమిది. నవ్వులు .. ఇలా ఇరవై రకాల నవ్వులు మా తిక్కన్న, అన్నమయ్యలు చెప్పారు .

వీటిలో ఏవి చిక్కని నవ్వులు?

గోపికలు మీ వైపు అంత మోహంగా చూడటానికి ఏనవ్వులు నవ్వారు మహా ప్రభో! వేంకటేశా!

మా పెద తిరుమలయ్య చిక్కని నవ్వులతో మీరు ఉన్నారని చెప్పాడు.

ఆ చిక్కని నవ్వుల ముఖ దర్శనము అన్నమయ్య కీర్తనల ఆరాధకులమైన మాకు కూడా ప్రసాదించు దేవా !

చ. 1: ఏమే విన్నావా ! ఈ వేంకటేశుడు కృష్ణావతారములో సత్యభామ వక్షస్థలంపై కస్తూరిపూత.

తొందరపడే (=తత్తరించే) రుక్మిణి చేతిలోని తామరపూవు.

తనను కౌగలించుకొన్న భూకాంతకు అంగపు పయ్యద కొంగు.

మనసుపెట్టి వినండి. దయతో వినండి. (=చిత్తగించరమ్మ) ఆ కృష్ణుడెవడో కాడు. వీడే- మనకళ్ల ఎదుట కనబడుతున్న వేంకటేశుడు.

పరమార్థం

"మృగమదంబు చూడ మీద నల్లగనుండు
బరిధవిల్లు దాని పరిమళంబు
గురువులైన వారి గుణము లీలాగురా
విశ్వదాభిరామ...! వినుర వేమ...!"

కస్తూరి చూసేందుకు నల్లగా కనిపిస్తుంది... దాని సువాసన నాలుగు దిక్కులకూ వెదజల్లుతుంది. అలాగే పెద్దలైన వారు బయటికి గొప్పగా కనిపించరు కానీ , వారు గొప్ప గుణాలను కలిగి ఉంటారని వేమన మహాకవి పద్యం

సరే స్వామీ !

కస్తూరి నల్లన. మీరు నల్లనయ్య.

మీరూ గొప్పగుణాలు కలిగినవారే.

అదలా ఉంచుదాం.

మగ కస్తూరి జింక %--% ఆడ కస్తూరి జింకను ఆకర్షించటానికి ఈ సువాసనల కస్తూరి తయారు చేస్తుందట.

ఆ లెక్కన-

తమరు సత్యభామ వక్షస్థలానికి చల్లని కస్తూరి పూత అంటే ఏమి అర్థం తీసుకోవాలి స్వామీ!

ఆవిడ హృదయంలో చెలరేగే మదన తాపానికి చల్లదనం కలిగించే వారనా!?

అవిడని ఆకర్షించే విద్యలో పండిపోయారనా?

కస్తూరి రంగరంగ.....నాకెందుకులే సామి రంగ..

ఇక రుక్మిణమ్మ విషయానికి వద్దాం

ఆవిడ చేతిలో తామరపూవట తమరు.

తామర పూవును విలాసంగా ఇదివరకటి రోజుల్లో ఆడవాళ్లు పట్టుకొనేవారట.

రుక్మిణమ్మ కూడా అలాగే పట్టుకొని ఉండవచ్చు.

స్వామీ ఇలా చెప్పటం ద్వారా మా పెదతిరుమలయ్య ఆంతర్యం ఏమి అయి ఉంటుంది.

చేతిలో ఉసిరికాయ అంటే కరతలామలకం ఎక్కడికి పోదని ధీమా !

అలాగే చేతిలో తామర పూవుఅంటే మీరు తనపట్టులోనే ఉన్నారని లోకానికి రుక్మిణమ్మ చెబుతోందా?

తామరపూవును పట్టుకోవటం వల్ల చేతికి అందమా?

చేతి అందం వల్ల తామరపూవుకి విలాసమా?

ఏమో బాబూ !

మీ ఇద్దరిలో ఎవరి వల్ల ఎవరికి గొప్ప వస్తోందంటే చెప్పేంత శక్తి ఉందా నాకు.

తగు నీచక్రి..... మీ యిద్దరం దగులం గూర్చిన బ్రహ్మ నేర్పరి కదా" అన్నాడు కదా మా పోతన్న.

66. పలికెటి చదువులు

వేదాలకు అన్నమయ్య పెట్టిన తెలుగు పేరు పలికెటి చదువులు

1.మంత్రరూపము లోను(దేవస్తుతి రూపము), 2. బ్రాహ్మణ రూపములోను (యజ్ఞానుష్ఠాన వర్ణన రూపము) వేదాలు రెండు రకాలుగా ఉంటాయి.

1. ఋగ్వేదము, 2. యజుర్వేదము, 3. సామవేదము అని వేదములను మూడు రకములుగా , 1. ఋగ్వేదము, 2. యజుర్వేదము, 3. సామవేదము, 4. అథర్వవేదము. ("ఋగ్యజుస్సామ చాథర్వేత్యపి వేదచతుష్టయమ్") అని వేదములను నాలుగు రకములుగా చెబుతారు.

విష్ణువు కృష్ణద్వైపాయనుని యవతారము ఎత్తి అట్టి అనంతములు అయిన వేదములను ఋగ్యజుస్సామాథర్వణములు అని నాలుగు భాగములుగా విభజించి వేదవ్యాసుఁడు అయ్యాడని ప్రసిద్ధి.

ఋగ్వేదము ఎక్కువగా మంత్రభాగము. యజుర్వేదము విశేషించి విధుల యొక్క రీతులను చెబుతుంది. సామవేదము స్తోత్రరూపము గా ఉంటుంది. అథర్వణ వేదము శాంత్యాదులను గుంచి చెబుతుంది. బ్రాహ్మణాలు (వేదభాగములు), అరణ్యకాలు (అరణ్యమున చదువదగిన భాగము. ఉదా. తైత్తిరీయారణ్యకము మొ), ఉపనిషత్తులు(వేదసారాలు) వేద ప్రశస్తిని తెలిపేవి. వేద విజ్ఞానాన్ని ఒక మహావృక్షంగా భావిస్తే బ్రాహ్మణాలు ఆ చెట్టు పూలుగా, అరణ్యకాలు పచ్చి కాయలుగా, ఉపనిషత్తులని పండ్లుగా వర్ణిస్తారు.

వేదాలకే "శ్రుతులు", "ప్రభు సంహితలు" అనికూడా అంటారు. శ్రుతి అంటే విన్నది అని అర్థం. ఇవి భగవంతుని ద్వారా తెలియ చేయబడినవి అని ఒక నమ్మకం. వేదం అనే పదం సంస్కృత పదం 'విద్' (తెలుసుకొనుట) నుంచి పుట్టింది. భగవంతుడు పలికిన చదువులుగా వేదాలను భావించి అన్నమయ్య వేదాలను పలికిన చదువులు అన్నాడు.అన్నమయ్య తన కీర్తనలో ఈ పలికిన చదువులను పేర్కొన్న తీరును పరిశీలిద్దాం.

పల్లవి: ఎన్నఁడుఁ దీరవు యీ పనులు
పన్నిన నీ మాయ బహుళంబాయ

చ.1: పెక్కు మతంబుల పెద్దలు నడచిరి
వొక్క సమ్మతై వొడబడరు

పెక్కుదేవతలు పేరు వాడెదరు
తక్కక ఘనులము తామేయనుచు

చ.2: పలికెటి చదువులు బహుమార్గంబులు
కలసి యేకవాక్యత గాదు
చలపాదంబులు జనులును మానరు
పలు తర్కంబులె పచరించేరు

చ.3: శరణాగతులకు శ్రీవేంకటేశ్వర
తిరముగ నీవే తీర్చితివి
పరమవైష్ణవులు పట్టిరి వ్రతము
యిరవుగ నాచార్యు లెరుగుదురు (రేకు: 0260-06సం: 03-348)

అర్థం

పల్లవి: వేంకటేశ్వరా ! ఈ జన్మలో మేము చేయవలసిన పనులు ఎప్పటికీ ముగియవు. అంతంలేదు.

నీ మాయ చాలా అధికం. (బహుళము)

చ.1: మా పెద్దలు అనేక మతాలలో , అనేక అభిప్రాయాలతో నడిచారు.

అందరికీ ఒక దేవుడు, ఒక మతము అను అంగీకారము లేదు.

తప్పకుండా తామే , తమ మతమే గొప్పదని

రకరకాల దేవతల పేర్లను వాడుతారు.

చ.2: వేంకటేశ్వరా ! ఇక నువ్వు పలికిన వేదాలు రకరకాలుగా ఉన్నాయి.

ఏకాభిప్రాయము లేదు.

గర్వము, మాత్సర్యము, పట్టుదల (చలపాదంబులు) ఈ ప్రజలు మానుకోరు. **(చదివితిననియెడి చలపాదమింతె కాని/ అదన నందులోని అర్థమెరగ(**02-255) అని చదువుకొన్న జీవులలోని మాత్సర్యాన్ని ఇంకొక కీర్తనలో అన్నమయ్య ఎండగట్టాడు) అనేక వాదాలు చేస్తారు.

చ.3: శ్రీ వేంకటేశ్వరా ! శరణు జొచ్చినవారికి రక్షణ కోరినవారికి

స్థిరముగా నువ్వే అభయమిచ్చి జీవితాలను తీర్చిదిద్దుతుంటావు.

శ్రేష్ఠులయిన వైష్ణవులు పంచ సంస్కార వ్రతము ఆచరిస్తారు.

స్థిరముగా ఈ పద్ధతి వైష్ణవ ఆచార్యులకి (గురువులు) బాగా తెలుసు.

పరమార్థం

విష్ణుదేవుని అర్చన ప్రధానమైన మతం వైష్ణవం. విష్ణుని పూజించేవారు వైష్ణవులు. విష్ణు మంత్ర దీక్షాపరులు మెడలో తులసి పూసల మాలను ధరిస్తారు. ఊర్ధ్వ పుండ్రాలను ధరిస్తారు. శంఖచక్ర చిహ్నాలు ముద్రించుకొంటారు.

లక్ష్మీనాధ సమారంభామ్ నాధ యామున మధ్యమామ్

అస్మదాచార్య పర్యంతామ్ వందే గురు పరంపరాం (శ్రీమన్నారాయణునితో మొదలయ్యి నాధమునులు మరియు యామునాచార్యులు మధ్యముగా తమ ఆచార్యులు చివరిగా కల గురు పరంపరని నేను ఆరాధిస్తున్నాను అని కూరత్తాళ్వాన్ అను ఆచార్యులు వైష్ణవ గురు పరంపరని ఉద్దేశించి శ్లోకం రచించారు.

వైష్ణవ సంప్రదాయంలో ఆచార్య భక్తి అధికం.

వైష్ణవ గురువయిన రామానుజుల వారికి వడుకనంబి అని శిష్యుడొకడు ఉండేవాడు. ఇంట్లో అతను గురువు కోసం పాలను వేడి చేస్తున్నాడు. వీధిలో రంగనాథస్వామి ఉత్సవ మూర్తి వెళుతోందట. 'స్వామిని చూడు ' అని రామానుజుల వారు శిష్యుని పిలిచారు. శిష్యుడు రాలేదు. దర్శనం ఎందుకు చేయలేదు అని గురువు మందలిస్తే ." పెరుమాళ్లకు చేస్తున్న ఈ క్షీరసేవ మధ్యలో వదిలి వెళ్లడం భావ్యమా??" అని శిష్యుని జవాబు.

వైష్ణవ దీక్ష పంచ సంస్కారాలతో ఉంటుంది. వీటిలో గురువు పాత్ర అధికం.

1. పుండ్ర సంస్కారం

ఆగమ పద్ధతుల ద్వారా జ్ఞానానికి గుర్తుగా బొట్టును ధరిస్తారు. తెలుపు ప్రశాంతతని సూచిస్తాయి. 'U ఆకారం విష్ణు దేవుని పాదాలకు గుర్తు.

2 తాప సంస్కారం

అనేక జన్మలనుంచి అంటిపెట్టుకొని ఉన్న పాపాలను తొలగించుకోవడానికి, భగవంతుడి గుర్తులుగా చెప్పబడిన శంఖ-చక్రాలని మన భుజమున అద్దుతారు. దీన్నే తాప సంస్కారం అని అంటారు.

3 నామ సంస్కారం

గురువు పేరును ధరించటం. ఉదాహరణకు రామానుజ దాస లేక రామానుజ దాసి

4 మంత్ర సంస్కారం

ఈ జ్ఞాన జన్మకి గురువు తండ్రి అయితే, మంత్రం తల్లి. పరంపరగా వచ్చే గురువుల ద్వారానే మంత్రాన్ని స్వీకరించుట.

5 యాగ సంస్కారం

ఈ శరీరం భగవంతుడు ఉండే స్థలమని భావించి , ఆ శరీరంతో చేసే ప్రతి పని యాగం గా భావించటం.

అన్నమయ్య ఈ పంచ సంస్కారాలను కలిపి వ్రతమన్నాడు.

బహు మార్గాల్లో వేదాలు ఉన్నాయన్న అన్నమయ్య మాట – వేదాల పట్ల నిరసన కాదు.వేదాల పట్ల పూజ్యత.

ఏకంసత్ విప్రా బహుధా వదంతి(విప్రాః = విజ్ఞులు, ఏకంసత్ = ఒకే సద్వస్తువును పరతత్త్వమును: బహుధా = బహువిధములుగా అనేక నామములతో, వదన్తి = పలుకుచున్నారు) అనే వాక్యం అన్నమయ్య **పలికెటి చదువు**లలోని అంతర్యం.

67.పాలకూడు

పాలతో వండిన అన్నాన్ని క్షీరాన్నమని , పాయసమని, పరమాన్నమని - ఇలా రకరకాల పేర్లతో పిలుస్తారు.అన్నమయ్య ఈ క్షీరాన్నానికి పాలకూడు అని పేరు పెట్టాడు."కూడు" అను తెలుగు పదము ఇప్పుడు మనకు మోటయిందేమో కాని, అన్నమయ్య దృష్టిలో అన్నమంత పవిత్రం. ఒక కీర్తనలో ఆయన మనకు పంచిపెట్టిన పాలకూడు తిని పరవశిద్దాం

పల్లవి: ఏమిటికిఁ జింత యిదె నీకు
ప్రేమపు బెండ్లి బెరసెగా నీకు

చ.1: కలికి నీ చూపుల కలువదండలు దెచ్చి
తలకకాతనిమెడ దగులవేసి
మొలక నగవుల నీ ముత్యపుసేసలు చల్లి
తొలగని పెండ్లి దొరకెగా నీకు

చ.2: చనవు గూరిముల కొసరులను గరమిడి
ఘనమైన కాకల గాలుదొక్కి
పనివడి వెన్నెల పాలకూడు గుడిచి
తనివోని పెండ్లి దగిలెగా నీకు

చ.3: తరుణి నీ హృదయపుదమ్మిపరపుతోడ-
నిరవైన సిరులతో నిల్లు నించి
తిరువేంకటగిరి దేవునితోగూడి
సరసపు బెండ్లి జరగెగా నీకు (రేకు: 0022-1సం: 05-120)

అర్థం

ఒక చెలికత్తె ఎందుకో బాధ పడుతోంది.అన్నమయ్య ఇంకో చెలికత్తెగా మారి ఆమెను పరామర్శిస్తున్నాడు.

పల్లవి: ఎందుకే ఇలా బాధ పడుతున్నావు.! మీ ఇద్దరూ చేసుకొన్నది ప్రేమ పెండ్లే కదా !(ప్రేమతో పెండ్లి చేసుకొన్నప్పుడు విచారాలు రాకూడదని కవి హృదయం)

చ.1: ఓ అమ్మడూ ! నీ చూపులనే కలువ పూల దండలు తీసుకువచ్చి ఏమాత్రం చలించకుండా, భయపడకుండా (తలకక) అతగాడి మెడలో ప్రేమతో

వేసావు.

లేత నవ్వులనే (మొలకనవ్వులు) నీ ముత్యాల తలంబ్రాలు పోసిన

ఏ మాత్రం పక్కకు జారని(తొలగని) పెండ్లి నీకు దొరకింది కదా !

(పెండ్లి చేసుకొన్నప్పటికి వధూవరులు ఇంకో "పక్కకి"చూపులు ప్రసరించకుండా పరస్పరం ఆనందంతో ఉన్నారని భావం)

చ. 2: అసలు కంటె కొసరు ముద్దు కదా ! నీ ప్రియుడికి చనవులతో కూడిన ప్రేమలు కొసరులుగా బాగా పెట్టావు.

ఆ రోజు పెండ్లిలో కాకతో అతగాడి కాలుతొక్కావు.! ఏమి కాక (తాపము) తల్లీ ! నేను చూస్తూనే ఉన్నాగా !

కావాలని ,ప్రయత్నపూర్వకంగా(పనివడి) పని కల్పించుకొని వెన్నెలలో పాల కూడు అతనితో పాటు తిన్నావు (వెన్నెలవంటి స్వచ్ఛమైన పాలకూడు తిన్నావు)

ఎంత సుఖపడ్డా తృప్తి ఏమాత్రం తగ్గని పెండ్లి చేసుకొన్నావు కదా ! ! ఇంకా ఈవిచారము దేనికి?

చ. 3: ఏమే ! ఎవరైనా పెండ్లి జరిగిన తరువాత ,గృహ ప్రవేశం చేస్తారు. నువ్వు మా వేంక టేశునితో పెండ్లి జరిగిన తర్వాత

తామరపూలు పరపులతో కూడిన

సిరులకు నిలయమైన నీ హృదయమనే ఇంట్లోకి తీసుకెళ్లావు. (నువ్వు మా స్వామిని హృదయంలొ పెట్టుకొన్నావని భావం)

శుభ ప్రదుడైన మా వేంకటేశునితో కలిసి

నీకు సరసాల పెండ్లి జరిగింది కదా ! ఇంకా నీకు ఈ దిగులేమిటే?

పరమార్థం

పాలకూడు పదం రెండో చరణంలో వచ్చినా, దాని రుచి మాత్రం అన్ని చరణాలలో ఉంది.

అన్నమయ్యకు ఈ పాలకూడు చాలా ఇష్టమేమో !

"అనురాగంతో పెదవి మూలలలో నవ్విన నవ్వులు పాలకూడు లయ్యాయి"(19-018)"అతను నేను కలిసి కూర్చొని పాలకూడు తింటుంటే, ఎందుకే అలా చూస్తావు?!"(21-059) ఇలా పరమాన్నంలో జీడిపప్పులవంటి భావనలు అన్నమయ్య సాహిత్యంలో ఉన్నాయి. అన్నమయ్య సాహిత్యం ఘుమఘుమలాడే వేడి వేడి పరమాన్నం. స్వస్తి.

68. పుక్కట

వ్యర్థంగా అనే అర్థంలో పుక్కట అనే పదాన్ని అన్నమయ్య వాడాడు.

పల్లవి : ఇద్దరి తమకము నిటువలెనే
పొద్దున నేమని బొంకుదమయ్యా

చ1. లలి నాకధరము లంచమియ్యగా
పలు సోకులయి పరగెనవే
పిలువగరాగా బెరసి నిందవడే
పొలతికి నేమని బొంకుదమయ్యా

చ2. అడుగుకొనుచు నిన్నంటి పెనగగా
తడయక నఖములు తాకె నవే
తొడుకొనిరాగా దూఱు మీదబడె
పొడవుగ నేమని బొంకుదమయ్యా

చ3. పెక్కులు చెవిలో బ్రియములు చెప్పగ
ముక్కున జవ్వాది మోచె నిదే
యిక్కడ శ్రీవెంకటేశుడ సడివడె
పుక్కటి నేమని బొంకుదమయ్యా

జీవునికి నిరంతరము స్వామితో మాట్లాడాలని ఆశ. ఆయనలో కలిసిపోవాలని ఆశ. అందుకే అన్నమయ్య ఆ జీవునికి ఒక నాయికారూపమిచ్చాడు. వేంకటేశుని నాయకునిగా చేసాడు. నాయకుడు నోరెత్తితే ఒట్టు. ఆయనను తనతో సన్నిహితంగా ఉన్నాడని, ఆయన ఎప్పుడుబడితే అప్పుడు పిలుస్తున్నాడని నాయికా రూపంలో ఉన్న జీవుడు పరమాత్మను గద్దిస్తున్నాడు. ఇంతపని చేసావా !? అంటున్నాడు. ఆవైనం చిత్తగించండి.

నన్ను కలసుకోవాలని నువ్వెంత తపన పడుతున్నావో, నేనూ అంతే తపనపడుతున్నాను. మనం కలిసి కబుర్లు చెప్పుకుంటూ ఎవరి కంటైనా పడితే వాళ్ళడగరూ ఏం చేస్తున్నారని? ఆ సమయానికి వారికి చెప్పేందుకు ఏం సాకులుంటాయి? నువ్వు రమ్మన్నా నేను రాలేదంటే ప్రేమలేకకాదు– ఏ వంకతో కలవాలో తెలియక.

ఎలాగో కలుసుకున్నా, నాకేమో వెళ్ళాలనీ, నీకేమో ఉండాలనీ ఉంటుంది. నువ్వు ఊరుకుంటావా? నన్ను ఇక్కడే కట్టిపడేసేలా, ప్రేమగా అధరాలతో ముద్దుల లంచములిచ్చిపుచ్చుకుంటాము. అప్పుడు తనువులు తాకి, పరవశములు పెరిగిపోతాయి. స్పర్శలూ పెరుగుతాయి. ఇంతలో నేనుకనబడలేదని మావాళ్ళు నన్ను వెతుక్కుంటారు. వెతికే చెలికత్తెలు నన్నుగనుక ఇక్కడ చూస్తే ఇక అంతే! అనవసరమైన నిందలొస్తాయి. ఇక్కడెందుకున్నావని అడిగితే నేనేంవంక చెప్పను?

ఏమయ్యా ! నాతో కలిసి ఉండాలనే తహతహ నీ ఒక్కడి కేనా ఉంది!నాకు లేదనుకొన్నావా!? ఇద్దరి తహతహలు, మోహాలు ఇట్లాగే ఒకే పద్ధతిలో ఉ ంటాయి.నీకో పద్ధతి , నాకో పద్ధతి ఉండదు. అయినా పొద్దున్నే(పొద్దుగాల్ల) పిలుస్తా వేమిటయ్యా బాబూ ! ఇంట్లో ఏమి అబద్ధం వ్యర్థంగా (పుక్కట)చెప్పి రమ్మంటావు? నువ్వే చెప్పు.

తమరు ప్రేమతో, ఉత్సాహముతో (లలి) అధర తాంబూలము లంచమిచ్చారు. ఆ పెదవి పలు అందాలతో ప్రవహించింది.మీరు పిలువగ మంచివారని వచ్చాను. నింద వచ్చింది. మీ ఆవిడ అలమేలుమంగమ్మ అక్కడే ఉంది. ఆవిడ విషయమేమిటని నన్నడిగితేఏమి అబద్ధము చెబుదాం?

నిన్నవచ్చినప్పుడు ఎంత బతిమిలాడాను. అడుక్కొన్నాను. నిన్ను కౌగిలించుకొన్న వేళలో వద్దు వద్దని పోట్లాటతో పెనగాను. ఆ పెనుగులాటలో తమరి గోళ్లు నన్ను తాకాయి. ఆ గుర్తులను వెంట తీసుకొని (తొడుకొని) రాగా నింద ఎక్కువగా మీద పడింది. ఆ విషయం గురించి ఎవరన్నా అడిగితే ఏమని అబద్ధమాడమంటావు?

మీరు దూరం నుంచి కబుర్లు నాతో చెప్పవచ్చు కదా ! దగ్గరకు వచ్చి చెవిలో ఏవో ఇష్టమయిన మాటలు చెప్పారు. అలా మీరు కబుర్లు చెబుతున్న సమయంలో మీ ముక్కున ఉన్న జవ్వాది సుగంధ ద్రవ్యం నన్ను అంటుకొని ఊళ్ళో వారందరికి నా వార్తను మోసేసింది.ఇక్కడ కూడా ఆ వార్త చప్పుడు చేస్తోంది. ఊరికే (పుక్కటికి) ఏమని అబద్ధం చెప్పమంటావు?

❖ ❖

పతంజలిః అన్నమయ్య వేంకటేశా! దయతో ఇందులో అంతరార్థం తెలియ చేయ మనవి. జీవునికి స్వామిలో కలవాలని. తహతహ. మరి దేవునికి ఎందుకుంటుంది?

అన్నమయ్యఃఁ దైవానికి కూడా ఈ జీవుడు ఎప్పుడు నన్ను నిండు మనస్సుతో తలుచుకొంటాడా ! వీడికెప్పుడుమోక్షమిద్దామా అని తహతహలాడుతుంటాడు . అందుకే పల్లవి ఇద్దరికి తహతహలుంటాయన్నాను.

పతంజలి ఃఁ మొదటి చరణంలో పెదవులు, అందాలు, నిందలు ఇవేమిటండి?

అన్నమయ్యఃఁ తన దయ ప్రసరించిన భక్తునికి తన నామ జపము నిరంతరం చేసుకొనే అదృష్టాన్ని దైవం కలిగిస్తాడు.రాను రాను మాటలకు అందని, మాట పలకని ధ్యానసిద్ధి కలుగుతుంది కాని , ప్రారంభంలో స్వామి పేరు పెదవులగుండా ప్రవహించాలి కదా ! అందుకే స్వామి అనుగ్రహము కలిగిన విషయాన్ని తెలియ చేస్తూ పెదవుల ప్రసక్తి తెచ్చాను.

స్వామి నామ జపం చేస్తుంటే కొంతమంది భరించలేరు. నిందిస్తారు.అందుకే నిందప్రసక్తి ..

69. పురుషామృగము

పల్లవి: ఎక్కడ గడచేరీ నరులు
తక్కుల బెట్టేరు తరుణులు భువిని

చ.1: కన్నుల చూపులు గాలపు చిలుకులు
వెన్నెలనవ్వులే వెలితెరలు
మిన్నక పురుషామృగముల వేటలు
పన్నుక యాడేరు పడతులు భువిని

చ.2: ముంచిన మాటలే మోహనఘంటలు
మంచియధరములే మచ్చులవి
మించిన పురుషామృగముల వేటలు
అంచెల నాడేరు అతివలు భువిని

చ.3: కట్టువగట్లు కందువ కుచములు
పట్టు శ్రీవేంకటపతి మాయ
మెట్టుగ పురుషామృగముల వేటలు
నెట్టన నాడేరు నెలతలు భువిని (రేకు:0251-06 సం: 03-295)

మగవాళ్లందరూ మంచి వాళ్లు కారు.

ఆడవాళ్లని ఆకర్షించి జీవితాలను నాశనంచేసే ప్రబుద్ధులు ఉన్నారు.

ఆడవాళ్లందరూ మంచి వాళ్లు కారు.

మగవాళ్లని ఆకర్షించి, జీవితాలను నాశనంచేసే వారు ఉన్నారు.

కోరికలలో మగవారు సాటివానిని ఎరగరు(20-326)మొండికెత్తే మగవారు పనికి మాలిన చేతలను చేస్తుంటారు (14-264) అని మగవారిని నిందించిన అన్నమయ్య ఈ కీర్తనలో మగవాళ్లని ఆకర్షించే స్త్రీలను వర్ణిస్తున్నాడు.

పల్లవి: అబ్బబ్బా ! ఈ మానవులు ఎలా వీళ్లని తప్పించుకొంటారు?! దాటి పోతారు? (కడచేరు?)

యౌవనంలో మిసమిసలాడే ఈ స్త్రీలు(తరుణులు) ఈ లోకంలో మోసపుచ్చు తుంటారు (తక్కుల బెట్టేరు)

చ.1: యౌవనంలో మిసమిసలాడే ఈ స్త్రీల కన్నుల వెంట ప్రసరించే

చూపులు– చేపలను పట్టు వంపు గల కొక్కి బడిశములు.(గాలపు చిలుకులు)

వెన్నెలలాంటి వాళ్ల నవ్వులు తెల్లటి తెరలు(వెలితెరలు).తెర కప్పేసినట్లు పురుషులను మాయతో కప్పేస్తారు.

ఊరికే , అప్రయత్నముగా (మిన్నక) పురుష మృగాలను (పురుషామృగమూ తల పురుషుడు, మొండెం మృగం) వేట చేస్తుంటారు

ఈ లోకంలో స్త్రీలు చాలా అందంగా (పన్నుక) పురుషులతో ఆడుకొంటుంటారు

చ. 2: అతిశయించిన (ముంచిన) ఈ ఆడువారి మాటలు పురుషులకు మోహన రాగము వినిపించే గంటలు. మూర్ఛతెప్పించే గంటలు(మోహనఘంటలు)

మేలైన వారి పెదవులు మచ్చులు. (మచ్చులు= మృగాలు మొదలైనవి వలలో పడటానికి వలకు దగ్గరగా ఉంచే ఆహారాలు, చొక్కు మందులు, వశ్యౌషధాలు)

శక్తికి మించిన పురుష మృగాల వేటలను–

దశలువారీగా, వరుసబెట్టి ఈ ఆడువారు ఆడుకొన్నట్లు చేస్తుంటారు.

చ. 3: ఈ ఆడువారి చమత్కార భరితమైన (= కందువ) స్తనములు పొలము సరిహద్దులలో నిర్మించిన రాతి కట్టడాల గట్లు.(కట్టువ గట్లు)

మా వేంకటేశ్వరుని మాయను కూడా వీళ్లు పట్టుకోగలరు.(పట్టు)

పురుష మృగాల వేటలో ప్రవేశించి–

ఈ ఆడువారు బ్రహ్మాండంగా (నెట్టన) ఆడుకొంటుంటారు.

70.పొద్దులేదు

ప్రపంచంలో జీవిస్తున్న ప్రతివారు వ్యర్థంగా తమ జీవితాలను గడుపుతున్నారని, శ్రీ హరిని తలిచే సమయం లేకుండా భౌతిక ఆకర్షణలలో మునిగిపోతున్నారని అన్నమయ్య బాధపడుతూ ప్రబోధాత్మకంగా గాలినే పోయ గలకాలముకీర్తన రచించాడు.

గాలినేపోయగలకాలము/తాలిమికి గొంతయు బొద్దులేదు

ఈ ప్రపంచంలోని విషయాలు గాలి విషయాలు.వాటినే తలుచుకొంటూ, వాటిల్లోనే మనస్సును కలుపుతూ జీవితాన్ని వ్యర్థ పరుచుకొంటున్నానుకాని, స్వామిని తలుచుకొంటూ, ఆ స్వామి సేవలో నిరంతరం ఉండేఓర్పు అలవాటు చేసుకోలేదు.ఆ ఓర్పును అలవాటు చేసుకోవటానికి సమయం ఇవ్వాలి. (లౌకికానికి ప్రాధాన్యత ఇస్తూ, ఆధ్యాత్మికానికి ప్రాధాన్యత ఇవ్వటం లేదని భావం)

అడుసుచొరనే పట్టె నటునిటు గాళ్ళు/గడుగుకొననే పట్టె గలకాలము
ఒడలికి జీవుని కొడయండైన హరి/దడవగా గొంతయు బొద్దు లేదు

ఈ ప్రపంచంలో ఆకర్షించే భౌతిక విషయాలన్నీ బురద గుంటల వంటివి. అందులో కాళ్ళు పెట్టి అటుఇటు తిరగటంతోనే, చాలా కాలం గడిచింది. ఆ బురద గుంటల నుంచి బయటికి వచ్చి కాళ్ళు కడుగుకోవటం, మళ్ళీ బురద గుంటల వంటి ఆకర్షణలలోకి చొరబడటం ఇలా గడిచింది. ఈ శరీరానికి, శరీరంలోని జీవునికి స్వామియైన(=ఒడయడు) హరిని తలవటానికి కొంచెంసేపు కూడా సమయం లేదు

గుంటలో దొర్లాడి బయటికి వచ్చిన పందికి-అరే! నేను బురద గుంటలో దొర్లాననే పశ్చాత్తాపం ఉండదు.మనస్సు మళ్ళీ ఆ బురదగుంటల వైపు లాగుతూనే ఉంటుంది. సామాన్య మానవుడిపరిస్థితి కూడా ఇంతే. ఎక్కువమంది దుర్యోధన, రావణ వారసులు.తప్పేమిటో తెలుసు.చేయకూడదని తెలుసు. కాని ఆతప్పు చేయటానికే మనస్సు మొగ్గు చూపిస్తుంటుంది.ఇలా సామాన్య మానవమనస్తత్వాన్ని అన్నమయ్య వివరించాడు. .

కలచి చిందనే పట్టెగడవ నించగబట్టె /కలుష దేహపు బాధగలకాలము
తలపోసి తన పాలి దైవమైన హరి/దలచగా గొంతయు బొద్దు లేదు

బాధలతో ఒళ్ళూ, ఇల్లూ గుళ్ళ చేసుకొంటూ , నా పొట్ట , కుటుంబపు పొట్ట

నింపటానికి పాపాలు చేస్తూ, ఈ పాపపు శరీరము ఇంత కాలం గడిపింది. తనకు దిక్కయిన అతనిని గురించి ఆలోచించటానికి సమయం లేదు.

శిరసు ముడువబట్టె చిక్కుదియ్యగ బట్టె /గరిమల గపటాల గలకాలము
తిరువేంకటగిరి దేవుడైన హరి/దరిచేరా గొంతయు బొద్దు లేదు,

గొప్పతనాలు, కపటాలు ప్రదర్శించటానికి తల ముడవటానికి,అందంగా కనబడటానికి తల చిక్కులు తీసుకోవటానికి ఎక్కువ సమయం తీసుకొన్నాను. (ఇదివరకటిరోజుల్లో క్రాఫ్ లేదు. మగవాళ్ళు కూడా జడలు పెంచి వాటిని ముడుస్తూ, చిక్కులు తీస్తూ ఉండేవారు.దానిని అన్నమయ్య ప్రస్తావిస్తున్నాడు.) శుభప్రదుడైన వేంకటేశ్వరుని దగ్గరికి వెళ్ళటానికి, మనస్సును అతనివైపు మళ్ళించటానికి సమయం లేదు.(లౌకిక ఆకర్షణలు మాని స్వామిని ఆరాధించమని అన్నమయ్య సందేశం)

అమ్మకి తన బిడ్డలలో తెలివైన వారి మీద కన్నా , తెలివి తక్కువ వారి మీద ఒక పిసరు ఎక్కువ ప్రేమ ఉంటుంది.అలాగే భక్త కవికి కూడా వ్యర్థంగా జీవితాలని పాడు చేసుకొంటున్న వారి మీద అధికమైన ప్రేమ ఉంటుంది. అయ్యో !వీళ్ళు బాగు పడటం లేదనే ఆవేదనలోనుంచి వచ్చిన ప్రేమ అది.అందుకే వారి పక్షాన నిలబడి అన్నమయ్య దైవాన్ని ఈ కీర్తనలో వేడుకొన్నాడు.

ఇది చేయటానికి సమయం లేదు- అని ప్రతిపాదం చివర అన్నమయ్య పేర్కొన్నవన్నీ వ్యతిరేక వాక్యాలలో ఉండే ఆధ్యాత్మిక సందేశాలు.స్వామిని తలుచుకొంటూ తదేకంగా ఓర్పుగా ఉండు, స్వామి నామాన్ని కీర్తించు, స్వామి సన్నిధిలో రోజు కొంచెం సేపయినా గడుపు -అని భక్త కవి సందేశాలు.ఇవి విని ఆచరించిన వాడు బాగుపడతాడు. లేదా ఎనభై నాలుగు లక్షల జన్మ పరంపరలో తిరుగుతూ తనకూ, తన వారికీ బరువౌతాడు.

71. పొలయలుకలు

ప్రణయ కోపము అనే అర్థంలో పొలయలుక అనే పదానికి అన్నమయ్య ప్రాచుర్యం కల్గించాడు.

పల్లవి : వలపులధికము సేయు వైభవములు
తలపు లధికము సేయు దలపోతలు

చ.1: కోపమధికము సేయు గోరికలు
తాప మధికము సేయు దమకంబులు
కోపంబు దాపంబు గూడ నధికము సేయు
యేపయిన మోహముల నేమందమే

చ.2: మచ్చికధికము సేయు మన్ననలు
యిచ్చ లధికము సేయు నీరసములు
మచ్చికలు నిచ్చలును మగుడ నధికము సేయు-
నెచ్చరిక కూటముల నేమందమే

చ.3: అందమధికము సేయు నైక్యములు
పొందులధికము సేయు బొలయలుకలు
అందములు బొందులును నలరనధికముసేయు-
నెందు నరుదగు వేంకటేశు కృపలు

(రేకు:0024-04 సం:01-146)

వేంకటేశ్వరుడు , పద్మావతీదేవి తోటలో విహరిస్తున్నారు.

సరస సంభాషణాలలో ఉన్నట్టుండి వేంకటేశ్వరుడు "వలపులధికము సేయు వైభవములు" (ప్రేమలు- వైభవాలను ఎక్కువ చేస్తాయి") అన్నాడు.

"వైభవాలంటే... "పద్మావతీదేవి ప్రశ్నించకుండానే కళ్లతోటి ప్రశ్నించింది.

"వైభవాలంటే ఐశ్వర్యములు..గొప్పతనాలు... నువ్వు నన్ను ప్రేమించడం వల్ల కదా.. నాకు గొప్పతనం.ఇదివరకు నాకు గొప్పతనముండేది. నీ వలపుతో ఆ గొప్పతనపు వైభోగము ఇంకా పెరిగింది."వేంకటేశుడు జవాబిస్తూనే "తలపోతలు తలపులను అధికము చేస్తాయి."అన్నాడు.

"తలపోతలు..."అమ్మ అర్థోక్తిలో ఆగింది

"ఆలోచనలు అభిప్రాయాలను అధికము చేస్తాయి.నిన్ను ఎలాగయినా కలవాలని నా అలోచన. ఇలా కలవాలని ఒక అభిప్రాయము వస్తుంది. ఆ ఆభిప్రాయాన్ని ఆలోచన బలపరుస్తుంది."

"అబ్బో.."పద్మావతీదేవి ముద్దుగా వెక్కిరించింది. కీర్తన పల్లవించింది.

చరణము 01 : "కోపం- కోరికలను అధికము చేస్తుంది.

బాధ - తహతహలని ఎక్కువ చేస్తుంది..

కోపము, బాధ ఈ రెండూ కూడా మోహాలను అధికము చేస్తాయి. ఏం చేస్తాము!?" అంటూ వేంకటేశ్వరుడు నిట్టూర్చాడు.

"మీరు దగ్గరికి వస్తారు. నేను రానివ్వను. అప్పుడు మీకు కోపము వస్తుంది. ఆ కోపము మీ కోరికలను అధికము చేస్తుంది.నాకు దూరమయిన బాధ మీ తహతహలని ఎక్కువ చేస్తుంది. కోపము , బాధ ఈరెండూ కలిసిపోయి మోహాలను ఎక్కువ చేస్తాయి.అవునా? "వేంకటేశుని నిర్వచనాలను పద్మావతి వివరిస్తూ, చిలిపిగా దూరంగా స్వామివారిని నెట్టింది.

చరణము 02 : "ఆసక్తులు గౌరవాలను అధికము చేస్తాయి.

కోరికలు బలహీనతలను అధికము చేస్తాయి.

ఆసక్తులు, కోరికలు రెండూ మాటిమాటికి ఆనందపు కూడికలను పెంచుతాయి. ఏమంటాము.!?" వేంకటేశ్వరుడు పద్మావతి కళ్లలోని తన ప్రతి బింబాన్ని ఆసక్తిగా చూస్తూ అన్నాడు.

"ఈ ఆసక్తి ఏమి గౌరవం పెంచుతుంది స్వామీ !" పద్మావతి నవ్వుతూ అంది.

"లోకాలన్నీ నా వైపు ఆసక్తిగా చూస్తుంటే నేను నీ వైపు ఆసక్తిగా చూస్తున్నాను. ఇది నీకు గౌరవం పెంచటమే కదా !"

"అబ్బో !" నవ్వుతున్న పద్మావతీదేవి బుగ్గలు సొట్ట బడ్డాయి.

తరువాత చర్యకు బుగ్గలను తుడుచుకొంటూ ,పద్మావతి కోపం నటిస్తూ స్వామి వారిని చూసింది.

"కోరిక బలహీనతలను అధికం చేయటమంటే ఏమిటో చెప్పటానికి అలా చేసాను. అంతే. వేరే ఉద్దేశ్యం లేదు"

వేంకటేశుడు తన చర్యను సమర్థించుకొన్నాడు.

"ఆసక్తి , కోరిక కలిస్తే మాటిమాటికి ఆనందపు కూడికే. తీసివేత లేదు." వేంకటేశుని నవ్వులతో తోటలోని పూలు విరబూసాయి.

చరణము 03 : "అందము ఒకటిగా అయ్యే విషయాలను ఎక్కువ చేస్తుంది. కలయికలు ప్రణయ కోపాలను (పొలయలుకలు)ఎక్కువ చేస్తాయి.

అందములు, కలయికలు– అద్భుతమయిన, ఆశ్చర్యమయిన, అపురూపమయిన వేంకటేశ్వరుని దయలను అధికము చేస్తాయి."

"అబ్బో ! అబ్బో ! నేను చెప్పకుండానే నువ్వే మొదలుపెట్టావు? "వేంకటేశ్వరుడు అన్నాడు.

"అన్నమయ్యకు మీకంటే ముందుగా ప్రసాదం పెట్టింది నేను. మీ చేతల్లోని తీపిని, దయని, తన కీర్తనల్లోకి ముందుగాప్రవహింపచేసింది నేనే! అమ్మని నేను"

"అలాగా ! అయ్య మీద అమ్మ దయ ఎప్పుడూ ఉండు గాక !" వేంకటేశ్వరుడు భావ గర్భితంగా అన్నాడు.

❖ ❖

72. పైడికోర

పైడి కోర బంగారు పాత్రకు అన్నమయ్య చందమామ రావో జాబిల్లి రావో కీర్తనలో వాడాడు.

పల్లవి : చందమామ రావో జాబిల్లి రావో మంచి
కుందనపు పైడి కోర వెన్న పాలు తేవో

చ1. నగుమోము చక్కనయ్యకు
నలువ పుట్టించిన తండ్రికి
నిగమములందుండే అప్పకు
మా నీలవర్ణునికి
జగమెల్ల ఏలిన స్వామికి
చక్కని ఇందిర మగనికి
ముగురికి మొదలైన ఘనునికి
మా ముద్దుల మురారి బాలునికి

చ2. తెలిదమ్మి కన్నుల మేటికి
మంచి తియ్యని మాటల గుమ్మకు
కలికి చేతల కోడెకు
మా కతలకారి ఈ బిడ్డకు
కులముద్ధరించిన పట్టెకు
మంచి గుణములు కలిగిన కోడెకు
నిలువెల్ల నిండ వొయ్యారికి
నవనిధుల చూపుల చూచే సుగుణునకు

చ3. సురల గాచిన దేవరకు
చుంచు గరుడు నెక్కిన గబ్బికి
నెరవాది బుద్ధుల పెద్దకు
మా నీటు చేతల పట్టికి
విరుల వింటివాని అయ్యకు
వేవేల రూపుల స్వామికి

సిరిమించు నెరవాది జనకు
మా శ్రీ వేం కటనాథునికి
ఓ చందమామ! ఇటు రా !చంద్రుడా !ఇటురా !

మేలిమి బంగారపు పసుపు పచ్చని గిన్నెలో వెన్న, పాలు తీసుకురా !
ఎప్పుడూ నవ్వుతూ ఉండే అందాల బాలునికి,
బ్రహ్మ యొక్క కన్నతండ్రికి,పాలు తీసుకొనిరా !
వేదాలలో వర్ణించబడిన మా తండ్రికి,
మా నల్లనివానికి,
ప్రపంచాలను పరిపాలిస్తున్న మా ప్రభువుకు,
అందమైన లక్ష్మీ దేవి మగనికి ,
బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు మూల కారణమైన దేవునికి,
ముర అను రాక్షసుని చంపిన మా ముద్దుల బాబుకు పాలు తీసుకొని రా !
తెల్లతామరవంటి కన్నులుకలిగిన మా విష్ణు మూర్తికి,
గుమ్మ అంటే పాలుపిండునప్పుడు వచ్చెడు ధార.
అలా మంచివైన, తియ్యనైన మాటలుమాట్లాడే
మా అందమైన బాబుకి,
నేర్పు కలిగిన పనులు చేసే మా పడుచువానికి
మా మాట కారి యైన బిడ్డకు
తన కులాన్ని ఉద్ధరించిన బిడ్డకు,
మంచి గుణములు కలిగిన మా పడుచువానికి,
శరీరమందు అణువణువున అందం కలిగిన మా అందగాడికి,
1.మహాపద్ముము2.పద్ముము3.శంఖము4.మకరము
5. కచ్ఛపము6. ముకుందము7. కుందము
8.నీలము9.ఖర్వముఅనునవనిధులనుతనచూపులలో ప్రసాదించే మంచి గుణములుకలిగినవానికిపాలు తీసుకొని రా !
దేవతలను రక్షించిన ప్రభువుకు,
బలమైన గరుత్మంతుని వాహనంగా చేసుకొని ఎక్కిన గొప్పవానికి,
నేర్పరి, పెద్ద బుద్ధులు కలవానికి,

మా మురిపెపు చేతలు కలిగిన బిడ్డకు,
మన్మథుని అయ్యకు,
అనేక రూపములు ధరించిన ప్రభువుకు,
నేర్పరియైన ప్రద్యుమ్నుని తండ్రికి,
వేంకటేశ్వరుని అవతారమైన మా బాల కృష్ణ మూర్తికి పాలు తీసుకొని రా!

పరమార్థం

1.అన్నమయ్య జీవిత చరిత్ర పీఠికలో ఈ చందమామ పాట ఉన్నది. 29 సంపుటాలలో లేదు.

చందమామ రావే, జాబిల్లి రావే
కొండెక్కి రావే, గోగుపూలు తేవే
బండెక్కి రావే, బంతి పూలు తేవే
పల్లకిలో రావే, పారిజాతం తేవే
తేక్కి రావే, తేనెపట్టు తేవే
ఆటలాడ రావే, అబ్బాయి(అమ్మాయి)కిచ్చి పోవే

ఈ పాట ముందు పుట్టిందా? అన్నమయ్య చందమామ పాట ముందు పుట్టిందా? చెప్పటం కష్టం కాని రెండు పాటల పల్లవులు ఒకనాటి తెలుగు వారికి నాలుక మీద నర్తించేవి. ఇందులో అనుమానం లేదు.

2. రావే... రావో.. ఈ రెండు పదాల్లోను ఆత్మీయత ఉంది. బిడ్డని చంకనెత్తుకొని తల్లి పాడే పాటలో ఆ కొసరు కొసరు ముద్దలో రావో అనే పిలుపు అందమైన రుచిని జతపరుస్తుంది.

3.చంద్రుడు తెలుగు వారికి మామ. లక్ష్మి మనకు తల్లి. లక్ష్మికి తమ్ముడు చంద్రుడు. ఇద్దరూ క్షీర సాగర మథన సమయంలో ఒకరి తర్వాత ఒకరు పుట్టారు కనుక అక్కా తమ్ముళ్ల వరుస పెట్టి, చంద్రుడిని మామగా , చందమామగా తెలుగు వాడు మార్చేసాడు.

4.బహుజనపల్లి శబ్దరత్నాకరములో జాబిల్లి పదానికి అర్థం ఇస్తూ జాను+ బిల్లిక= జాబిల్లి అన్నారు. జాను అంటే అందమైన అని అర్థం. బిల్లిక అంటే బింబం. కనుక జాబిల్లి అంటే అందమైన చంద్రబింబం అని అర్థం చెప్పుకోవాలి.

5. అన్నమయ్య ఈ కీర్తనలో ఒక తల్లిగా మారాడు. వేంకటేశుని(కృష్ణుని) తన

బిడ్డగా భావించి, ఆ తాదాత్మ్యతలో ఈ అందమైన తెలుగు పదాలతో స్వామికి గోరు ముద్దలు పెట్టాడు.

6. చందమామ వెన్న , పాలు తెస్తుందా ? నిజంగా ఆలోచిస్తే తీసుకురాదు. మరి ఎందుకు అన్నమయ్య ఆహ్వానిస్తున్నాడు ? భ్రాంతి అని తెలిసినా సంసారంలో ఆనందం ఉంది. కుటుంబ సభ్యులలో ఒకరికి అనారోగ్యం అని తెలిసినప్పుడు, ఆస్పత్రి పాలయినప్పుడు , ఆత్మీయులు తల్లడిల్లుతున్నారు. తనపై తనవారికి ఉన్న ప్రేమను చూసి ఆ రోగి మానసికంగా స్వస్థత పొందుతున్నాడు. తెలియని ఆప్యాయతల ఆనందాన్ని అనుభవిస్తున్నాడు. ఈ నిర్వచనాలకి అందని ఆనందం చందమామ పిలుపులో ఉంది. పసిదనం , చల్లదనం రెండు విడదీయలేని పద బంధాలు. అందుకే ఆ పసిదనం చల్లదనం ఇచ్చే చందమామ రూపాన్ని చూసి పరవశించి పోతుంది. అందుకే పసివానికి చందమామను చూపిస్తూ చందమామ రావో అంటూ కవిలోని మాతృ హృదయం ఆలపించింది.

73. బడిబడి

మాటిమాటికి, వెంట వెంటనే, క్రమక్రమంగా అను అర్థాలలో "బడిబడి" అనే అవ్యయాన్ని అన్నమయ్య తరచూ ప్రయోగించాడు. ఒక శృంగార కీర్తనలో ఆ "బడిబడి" ప్రయోగ మధురిమలు గమనిద్దాం

పల్లవి: వలవనిజోలింక వద్దనరే తన
తలపులోన నేదగిలితిని

చ.1: పిలువరె పిలువరె ప్రియునీ తా-
నలిగి యలిగి కడ నరిగీని
తెలిసినవే తనతెగువలూ నే
నలుగడ నిందుకు నవ్వితినే

చ.2: అడుగరె యడుగరె యతనీ నే
దొడరిపట్టినాదొలగీని
విడువుమనవె తనవిద్యలూ తా
బడిబడి నిందు కె భ్రమసితినే

చ.3: తలగరె తలగరె దగ్గరీ నే
గలసిన తా నిక గాదనునా
అలరెను శ్రీవేంకటాధిపుడూ నా
యిలు చొచ్చి కలసె నెఱిగితి నేను

(రేకు1035-2సంపుటం: 20-206)

అర్థం

అన్నమయ్య ఒక చెలికత్తెగా మారి ఇంకో చెలికత్తెతో అంటున్నాడు.

పల్లవి: ఏమే ! వాడితో - ఆవేంకటేశునితో తగని (వలవని) సంబంధం (జోలి) ఇంకా వద్దని చెప్పండి.

తన ఆలోచనలో నేను ఎప్పుడో చిక్కుకొన్నాను. (తగిలితిని)

(అయ్యగారు నన్ను కాదని వేరే వేరే చిల్లర వేషాలు వేస్తున్నారు. ఆ సంబంధాల జోలికి వెళ్లద్దని చెప్పు. ఒక్క విషయం బాగా గుర్తుపెట్టుకోమను. తన ఆలోచనలో నేను ఎప్పుడో చిక్కుకొన్నాను. ఈ చిక్కు ఎప్పుడూ తెగదని చెప్పు- అని భావం)

చ. 1: అరే ...నేనేదో తమాషాకి ఒక మాటంటే అలిగి అలిగి దూరంగా వెళ్లి పోయాడు. నా ప్రియుని– ఆవేంకటేశుని పిలవండి. పిలవండి

వాడి ధైర్యాలు ఏపాటివో నాకు తెలుసులే.

నేను అందుకే నాలుగు దిక్కులలో నలుగురికి తెలిసేటట్టుగా నవ్వాను.

(నన్ను విడిచి వెళ్లే ధైర్యం వాడికి లేదు. మా ఇద్దరి మధ్య ఉన్న ప్రేమ అటువంటిది. ఈ విషయం నలుగురికి తెలిసేటట్టు నవ్వు తున్నాను– అని భావం)

చ. 2: అతన్ని నేను అనుసరించి గట్టిగా పట్టుకొన్నా – ఎన్నిసార్లు నా కొగిలి పట్టు విదిల్చి తప్పుకొన్నాడో ...

అతగాడిని – ఆవేంకటేశుని అడగండి .. అడగండి..

వాడి విద్యలు– తెలివితేటలు కాస్త – నాదగ్గర వదిలిపెట్టమనండే బాబూ!

అలా అంటుంటాను కాని– వాడి విద్యలకు– ఇలా తప్పించుకొనే కొంటె చేష్టలకి– మాటి మాటికి– (బడిబడి) ఉబ్బితబ్బిబ్బౌతుంటాను.

చ. 3: తొలగండి.. తొలగండి.. ఎందుకు వాడికి, నాకు మధ్య అడ్డుగా ఉన్నారు. వాడి దగ్గరికి నేను వెళ్లి కలిస్తే – ఇక – వాడు నన్ను కాదంటాడా !

అదుగో ! నేను అన్నట్లుగానే శ్రీ వేంకటాచల స్వామి నన్ను చూసి సంతోషించాడు. అయ్యగారి ముఖం చూడు ఎంత వికసించిందో!

మా ఇంటికి వచ్చి నన్ను కలిసాడు. ఆ విషయం నాకు బాగా గుర్తు ఉంటుంది. (ఎరిగితి)

పరమార్థం

స్వామివారితో అన్నమయ్యకు ఉన్న భక్తి తాదాత్మ్యత ఈకీర్తనలో అడుగడుగునా కనబడుతుంటుంది.

అన్నమయ్య సంభాషణాశైలికి ఈ కీర్తన నిలువుటద్దం.

ఎంతో అర్థమున్న చిన్న చిన్న పదాలు ప్రయోగించే మహాకవుల కళాశాలకు అన్నమయ్య అధ్యక్షుడు..

నవ్వితినే... ఇలాంటి పదాల్లో ఎంత అందమైన అర్థముంది.. తలచుకొన్నవారికి తలచుకొన్నంత మహానుభావా !

బడిబడి నమ్మీ బాలిండ్ల(01-042) బడిబడి నే శ్రీపతి నాత్మలో(01-084) వడి వేంకటేశు గొలువదుగాక కొలిచినను/బడిబడినె చెడని సంపద లిట్లు

రావా(01-319) బడిబడి నింద్రియాలే పరువులు వెట్టుగాని(04-480) బడిబడి నీవలపు పాలవంటిదె(11-022) ఇలా అన్నమయ్య కీర్తనల్లో బడిబడి ప్రయోగాలెన్నో ఉన్నాయి.

ఈ మనస్సు వేంకటేశుని నిలకడగా కొలువదు. కొలిస్తే వెంట వెంటనే నశించని సంపదలు వస్తాయని (01-319) అన్నమయ్య హామీ ! స్వామిని కొలిచే నిలకడ గల మనస్సు ఆయనే ఇవ్వాలి. అందుకోసం మనం కూడా ప్రార్థిద్దాం.స్వస్తి.

74.రాయిడించే సొలపులు

అల్లరి చేసే పారవశ్యాలు – అను విచిత్రార్థంలో రాయిడించే సొలపులు అని అన్నమయ్య కవి ప్రయోగం.

పల్లవి : బలిమి సేయకురే పట్టి పెనగకురే
పొలసి పో వచ్చినాడు పోనియ్య గదరే

చ1. కొసరే మా మాటలు కూరిములో తేటలు
నసలు నే డిం పౌనా నాడే కాక
వస మైనా డెవ్వతెకో వలసీ నొల్లము లీడ
బొసగీనా వాని కట్టె పోనియ్య గదరే

చ2. రవ్వల మా పిలుపులు రాయిడించే సొలపులు
నవ్వులు నేడిం పౌనా నాడే కాక
యెవ్వ తాస యిచ్చినదో యింతకు నేరడు తొల్లి
పువ్వువంటిది వలపు పోనియ్య గదరే

చ3. తనివోనిరతులును తలపోతమతులును
ననుపు నే డిం పౌనా నాడే కాక
యెనసెను శ్రీవెంకటేశుడింత సేసి నన్ను
పొనిగి పోయినసుద్ది పోనియ్య గదరే

(రేకు: 0326-4 సంపుటం: 11-154)

బలిమి సేయకురే పట్టి పెనగకురే

ఒక భక్తుడు భగవంతుని రాకకోసం తల్లడిల్లుతున్నాడు. ఆయన ఎప్పుడూ తన దగ్గర ఉండాలని ఆశపడుతున్నాడు. కాని పరమాత్మ జీవునికి నిరంతర సాన్నిధ్యాన్ని అనుగ్రహించటంలేదు.కొంత కాలం స్వామి భక్తుని హృదయములోనే ఉన్నాడు.భక్తునితో ఆట లాడుకొన్నాడు. మెరిపించాడు. మురిపించాడు. కాని ఏమి జరిగిందో .. ఏమో ! జీవుని హృదయములోనుంచి దేవుడు తప్పుకొన్నాడు. ఇంద్రియాలనే జీవుని చెలికత్తెలు వేరే చోటికి వెళ్ళిన స్వామిని భక్తుడి దగ్గరకు తీసుకొచ్చారు.

సున్నలో సగభాగము జీవుడు. సగభాగము పరమాత్మ. కనుక పూర్ణత్వం

సిద్ధించాలంటే తన అవసరం కూడా దేవునికి కూడా ఉందని భక్తుడు– స్వామిని చూసి అలిగాడు.దేవుడిని బలవంతంగా తీసుకొచ్చినఇంద్రియాలతో మాట్లాడుతూ ఆయన దోవన అయన్ని పోనివ్వండే అంటూ నిష్ఠూరాలతో స్వామివారిపై ప్రేమను వ్యంగ్యంగా తెలుపుతున్నాడు. జీవున్ని నాయికగా మార్చి అన్నమయ్య వలపుల

ఊయెలలో– ఆధ్యాత్మికతను – ఈ కీర్తనలో మన మనస్సుల దగ్గరికి చేరేటట్లు మలిచాడు.

పల్లవి : ఆ వేంకటేశుడు నాదగ్గరికి రానంటుంటే – ఎందుకు – ఊరికే బలవంత పెడతారు?!బలవంత పెట్టకండి. ఆయన చేతులు కాళ్లు పట్టుకొని నా దగ్గరకు వచ్చేటట్లు గుంజకండి.

అక్కడక్కడా తిరుగుతూ(=పొలసిపోవు) ఏదో తప్పనిసరియైనట్లు ఆ మహాను భావుడు వచ్చాడు. ఆయన మనస్సులో ప్రేమ లేనప్పుడు బలవంతం దేనికి? ఆయన ఇష్టం వచ్చిన చోటికి పోనివ్వండి.

చ1: మా మాటలు ఒకనాడు వారికి ముద్దులొలికేవి. మా ప్రేమలో నిర్మలత్వాలు, ప్రసన్నత్వాలు కనిపించేవి.ఒకనాడు నేను పదే పదే మాట్లాడితే ముద్దులు. నేడు నా మాటలు నసలు. ఆనాడు నాచేష్టలు, మాటలు ఇష్టముగా ఉండేవి కాని, నేడు ఇష్ట మౌతాయా?ఎవతెకో ఆ వేంకటేశుడు స్వాధీనమయ్యాడు. నేనన్నా , ఈ ప్రదేశము పేరు చెప్పినా అయిష్టాలు.(=వలసీ నొల్లములు)మీరెంత చెప్పినా వాడికి నాకు అనుకూలిస్తుందటే! వాడిని అలాగే (=అట్టె) పోనివ్వండే.

చ2: మా పిలుపులలోని వజ్రాలు, అల్లరి చేసే (=రాయిడించే) సొలపులు, (పారవశ్యాలు) నవ్వులు ఒకనాడు ఇష్టముగా ఉండేవి కాని, నేడు ఇష్ట మౌతాయా? ఏ మహా తల్లి ఏమి ఆశ పెట్టిందో కాని– ఇలా నా దగ్గరకు రాకపోవడమనే చేష్టలు ఇంతకుముందు లేవు. సరేకాని– వలపు – పువ్వు లాంటిది అంటారు కదా! నా మీద ఉండే ప్రేమ అనే పువ్వు వాడిపోయిందేమో ! ఎంతకని బతిమిలాడతారు? పోనియ్యండే.(జీవ నాయిక తనని తాను నా అనకుండా రాజ హొదాలో మా అంటోంది.అల్లరి చేసే సొగసులగురించి వివరణ చేస్తే అన్నమయ్య కవిత్వంలోని మాధుర్యము అనుభవించలేము. ఆ అల్లరి చేసే సొగసులు ఏమిటో, వాటి కార్యక్రమమేమిటో ఎవరికి వారు ఊహించుకొంటే ఆ అనందంలో కవికి జోహార్ అంటారు.)

3. పద్మాసన, నాగపాశ, లతావేష్ట, నరసింహ, విపరీత, క్షుబ్ధ, ధేనుక, ఉత్కంఠ, సింహాసన, రతి నాగ, విద్యాధర – ఇలా ఒకనాడు ఎన్నో తృప్తి పడని రతులు – సంభోగ బంధాలు మా మధ్యఉండేవి! ఒకరి మనస్సులో ఇంకొకరి గురించి ఎన్నో ఆలోచనలు ఉండేవి. ఆ ప్రేమ(=ననుపు) ఒకనాడు ఇష్టముగా ఉండేదికాని,నేడుఇష్టమౌతుందా? ఇంతచేసి ఆ వేంకటేశుడు నా వల్ల ప్రకాశించాడు. అయినా ఇప్పుడు ఈ మాట ఎవరు నమ్ముతారే. అదంతా శూన్యమయిన మాట. పోనివ్వండే.

ఉపశ్రుతి : నావల్లే నీకు కీర్తి వచ్చిందని , నేను లేకపోతే నీకు కీర్తి ఎక్కడుందని స్వామిని దబాయించిన అన్నమయ్య తనవల్లనే స్వామికి ప్రకాశము వచ్చిందని ఈ కీర్తనలో చెబుతున్నాడు. అస్తు.

75.బాలగండవర గోపాల

నెల్లూరు జిల్లా కోవూరు మండలములోని గండవరమనే గ్రామంలో వెలసిన గోపాల కృష్ణుడు బాల గండవర గోపాలుడు . ఆయనను అన్నమయ్య ఈ పాటలో "బాలగండవరగోపాల" అని సంబోధిస్తున్నాడు.

పల్లవి : లాలనుచు నూచేరు లలనలిరుగడల
బాలగండవరగోపాల నిను చాల
లాలనుచునూచేరు

చ1. ఉదుటు గుబ్బల సరము లుయ్యాల లూగ -
పదరి కంకణరవము బహుగతులమ్రోగ
వొదిగి చెంపల కొప్పు లొక్కింత వీగ
ముదురు చెమటల నళికములు తొప్పదోగ

చ2. సొలపు తెలిగన్నుగవ చూపులిరువంక -
మలయ రవళులకు బహుమాను బెళంక
కొలది కోవిల గములు క్రోలుమదనాంక -
ములగ్రేణిసేయు రవములు వడిదలంక

చ3. సరస పదములు జంగ చాపుచే బాయ -
గురులీల మీగాళ్ళ గుచ్చెళ్లు రాయ
కరమూలములు కాంతి కడుజాయజేయు -
సరస నురుకుసుమ వాసనలెదురుడాయ

చ4. కొలది నునుమేను లతకూనలసి యాడ
-మెలకువతోనొకరొకరి మెచ్చి సరియాడ
తలలూచి చొక్కి చిత్తరు బొమ్మలాడ -
అలరి యెల్లరు మోహనాకృతులు చూడ

చ5. లలిత తాంబూల రసకలితంబులైన -
తళుకు దంతములు కెంపుల గుంపులీన
మొలక వెన్నెల డాలు ముసురు కొనితోన -
చెలగి సెలవుల ముద్దు చిరునవ్వులాన

చ6. మలయ మారుత గతులు మాటికి జెలంగ –
పలుకు గపురపు తావి పైపై మెలంగ
పలుగానలహరి యింపుల రాల్గరంగా –
బలసి వినువారి చెవి బడలిక దొలంగ

చ7. లలనా జనాపాంగ లలిత సుమచాప
–జలజలోచన దేవ సద్గుణ కలాప
తలపు లోపల మెలగు తత్వప్రదీప –
భళిర గండపరేశ పరమాత్మరూప

అర్థం

స్త్రీలు రెండు వైపుల నుంచి (=లలనలుంఇరుగడల) లాలి లాలి యనుచు నిన్నుఊయెలలో చక్కగా (=చాల) ఊపుతున్నారు?

బాలకృష్ణా ! నీకు స్త్రీలు ఉయ్యాల ఊపేటప్పుడు వారు ధరించిన హారములు (=సరములు) గర్వించిన (=ఉదుటు) వారి చనులపై ఊగుచున్నవి?

చేతులకు ధరించిన కంకణములు తొందరపెడుతూ (=పదరి) అనేక ధ్వనులతో మ్రోగుచున్నవి?

కొప్పులు ఒరిగిపోయి (=ఒదిగి) వదులై చెంపలపై చలించుచున్నవి?(=వీగ)

వారి నుదురులు (=అళికములు) వర్ధిల్లు చెమటలతో (=ముదురు చెమటల) మునిగిపోవుచున్నవి(=తొప్పదోగ)

పారవశ్యముతో ఉన్న (=సొలపు) తెల్లని, నిర్మలమయిన (=తెలి) వారి కన్నుల జంటనుంచి (=కనుగవ) వచ్చే చూపులు నీ రెండు పక్కల(=ఇరువంక)తిరుగు (=మలయు)ధ్వనులకు , అనేకసార్లు (=బహుమాను)చలించుచున్నవి

(కృష్ణా! నీకు ఊయెల ఊచేటప్పుడు చుట్టుప్రక్కల మ్రోగే చప్పుళ్ల చేత వాళ్ళు బెదురు చూపులు చూస్తున్నారని భావం)

పరిమితికి అందని (=కొలది) కోకిలల గుంపులు(=కోవిల గములు) అనుభవించు(=క్రోలు) మదనుని గుర్తులను (=మదనాంకముల)పరిహాసము చేయు(=క్రేణి సేయు)వారి కంఠ ధ్వనులు(=రవములు) వేగముగా చలించుచున్నవి(= వడి దలంక)

(కోకిలలు మధురంగా పాడతాయి. అవి మన్మథ భావావేశమునకు గుర్తులు.

తియ్యటి ఆ కోకిలల కంఠ స్వరములను ఊయెల ఊచే స్త్రీల గొంతులు నువ్వెంత అని తీసిపడేస్తాయి. అంటే కోకిలలకంటె ఊయెల ఊచే స్త్రీలు బాగా పాడుతున్నారని భావం).

కృష్ణా! నీ సమీపంలో (=సరుస) వారు పదాలు పాడుచూ పాటకు అనుగుణంగా .. అంగలు వేయుటచే (=జంగ చాపు)వేరు చేయు(=పాయ) గొప్పలీలచే (=గురు లీల) వారి పాదములయొక్క పై భాగములలో (మీగాళ్ళ) చీర కుచ్చిళ్ళు రాచు కుంటున్నాయి. (పాటకుఅనుగుణముగా. అంగలు వేస్తున్నప్పుడు చీర కుచ్చిళ్ళు రాచుకుంటున్నాయని భావము)

నిన్ను ఊపునప్పుడు వారి కరమూలముల (=చంకలు) కాంతులు ఆ ప్రదేశాన్ని బాగా కాంతులతో నింపుతున్నాయి.(=కడుజాయజేయు) నీసమీపంలో (=సరస) గొప్పవైన పూల వాసనలు దిక్కులలో వ్యాపిస్తుంటాయి. (=ఎదురుడాయ)

ఓ కృష్ణా! నీకు ఊయెల ఊచేటప్పుడు సన్నని (=కొలది) వారి మెత్తని దేహమనే తీగలు (=లతకూనలు) చలించుచున్నవి.(=అసియాడు)

జాగ్రత్త (=మెలకువ) చూసుకొంటూ ఒకరినొకరు మెచ్చుకొంటూ సరిగా కలసి ఊపుచున్నారు(=సరియాడ)

వారు ఊపేటప్పుడు ఊపే ఊయెలకు కట్టిన బొమ్మలు (=చిత్తరు బొమ్మలు) తలలూపి ఎగురుచున్నవి?

సంతోషించి(=అలరి) అందరు నీ మోహనరూపములను చూస్తూ ఊపుచున్నారు?.

వారు వేసుకొనిన మనోహరమైన (=లలిత)తాంబూల రసముతో కూడుకొన్న (=కలితంబులైన) ప్రకాశించు దంతాలు ఎర్రబారి ఉన్నాయి.(కెంపుల గుంపులీన)

లోపలి ఆనందముతో పెదవుల మూలలనుండి వారి చిరునవ్వులు కలిగిౌచెలగి), పైకి వచ్చి (=ఆన) చిరు వెన్నెలల కాంతులను(మొలక వెన్నెల డాలు) చిమ్ముచున్నవి(=ముసురుకొనితోన)

వారి లాలి పాటలలో కమ్మగాడ్పు(=మలయమారుతము) రకరకాల పద్ధతులలో (=గతులలో) మాటి మాటికి వీచుచున్నది (మాటికి జెలంగ)అంటే అంత హాయిగా వారిలాలిపాటలు ఉన్నాయని భావం.

వారి లాలిపాటలలో కర్పూరపు పరిమళము పయిపయిన చిమ్ముచున్నది?

వారు పాడే రకరకాల పాటల ప్రవాహాలకు(=గానలహరి) ముద్దుగా

(=ఇంపుల) రాళ్ళు కరుగుతున్నాయి?

చుట్టూ నిలబడి (=బలసి) వారి– లాలి పాటలు వినే వారి చెవి అలసటలు పోతున్నాయి (=చెవి బడలిక దొలంగ) లౌకికమైన పిచ్చిపిచ్చిపాటలు , మాటలు విని వారిచెవులు అలసిపోయాయి. ఇప్పుడు కృష్ణమూర్తి లాలి పాటలు వినటం వల్ల వారి చెవుల అలసట పోయిందని భావం

సొగసుగత్తెలయిన ఆడువారి (=లలనాజన) కంటి చివరలలో (=అపాంగ)చూసే చూపులను, పుష్ప చాపముగా ధరించిన మనోహరమయినమన్మథునివంటి వాడా! (=లలిత సుమచాపా)

పద్మములవంటి కన్నులు కలిగినవాడా (=జలజలోచన)! ప్రకాశించే వాడా (=దేవ) మంచిగుణములు నెమలిపురిగా కలిగినవాడా ! ఆభరణములుగా కలిగిన వాడా (=సద్గుణకలాప)

హృదయములోపల (=తలపు లోపల) సంచరించు(=మెలగు) పరమాత్మ అనెడి దీపమా!(=తత్వప్రదీప)

సెబాసు (=భళిర) గండవరము అను గ్రామములో కొలువయిన శ్రేష్ఠుడయిన ప్రభూ ! చిన్నపిల్లవాని రూపములో కనిపించు భగవంతుని రూపుడా ! నమస్కారము.

76. బూజగుండలు

వివాహంలో పూజకోసం వేదికలో ఉంచే కుండలను బూజగుండలుగా అన్నమయ్య తన కీర్తనలో ప్రచారంలోకి తెచ్చాడు.

ఈ కీర్తనలో శ్రీవేంకటేశ్వర స్వామి పెండ్లి ముచ్చట్లు అన్నమయ్య చనువుగా ఆయనకే విన్నవిస్తున్నాడు:

ఇదె పెండ్లిలగ్న వేళ యింటికి నీకు

పల్లవి: ఇదె పెండ్లిలగ్న వేళ యింటికి నీకు
సుదతిమోవిచిగుళ్ళ సోబనపత్రికలు

చ.1: తొయ్యలి చూచినచూపు తుమ్మిదపేరటాండ్లు
నెయ్యమున నవె నీకు నివాళ్ళు
పయ్యదలో చన్నులు పరగ బూజగుండలు
నియ్యడఉ గంత కవె నిమ్మపండ్లు

చ.2: చెలియ నవ్విననవ్వు జిగి నీకు దలబాలు
చెలగి బువ్వాన కవె చిలుపాలు
పలుకుల సరసాలు బలుమంగళాష్టకాలు
మలసి యవె మదనమంత్రాలు

చ.3: వనిత కాగిలి నీకు వాటపు బెండ్లిచవిక
దినము నదె దోమతెరమంచము
వినయపు రతులు శ్రీవేంకటేశ యిద్దరికి
కనుగొన నవె మీకు కంకణదారాలు (రేకు:0775-1సం:16-439)

పల్లవి: స్వామీ! అదుగో నీ పెండ్లి వేళ సమీపిస్తోంది. పెండ్లికి ఆహ్వానించే శుభలేఖలు ఎక్కడంటావా!అదుగో! చక్కనిపలువరుస కలిగిన అమ్మ అలమేలుమంగ లేత చిగుళ్ల వంటి పెదాలు రా...రమ్మని ఆహ్వానించే శుభలేఖలు .

చరణం1: పెళ్లిలో ఆశీర్వదించే ముత్తైదువులు ఎక్కడంటావా! అదుగో స్వామీ! మా అమ్మ చూసే తుమ్మెదల్లాంటి చూపులు ముత్తైదువులు. (ముత్తైదువులు సుఖంగా ఉండమని ఆశీర్వదిస్తూ పాటలు పాడతారు.తుమ్మెదఝంకార ధ్వనులు ఆ ఆశీర్వాదాలని భావం)

మా అమ్మ చూసే తుమ్మెదల్లాంటి చూపులునీ ముఖం చుట్టూ తిరుగుతున్నాయి కదా! అవేనయ్యా! నీకు ప్రేమతో ఇచ్చే మంగళారతులు.

వివాహ వేదికలో ఉంచే కుండలు ఏవయ్యా! అంటున్నావా! స్వామీ! మా అమ్మ పైటలో ఉన్నస్తనాలు ఆ కుండలు. అవి ఉభయతారకాలు.ఈ వివాహ సమయంలో పెండ్లిలో ఉప్పు-పప్పు-బియ్యము పెట్టెలో ఉంచి తీసుకొని పోయి పెండ్లి వారికి ఇచ్చునవి కూడా అవే. (పెండ్లివారు వేంకటేశుడని ఇక్కడ గ్రహించాలి)

చరణం2 : స్వామీ! మా అమ్మ నవ్వే నవ్వులు వివాహకాలంలో దోసిళ్లతో ఒకరి తలపై ఒకరు పోసికొను తలంబ్రాలు.(నవ్వులు నాలుగు పక్కకి విరబూస్తాయి. తలంబ్రాలు కూడా అలాగే విస్తరిస్తాయి కనుక నవ్వుకి, తలంబ్రాలుకి పోలిక.)

ఆనవ్వులే పెండ్లివారితో సహ భోజనం చేసే బువ్వపు బంతిలో తియ్యనిపాలు. (ఇష్ట మ్మెన వారి నవ్వు రుచిగా ఉంటుంది.కనుక రుచిగా ఉన్న పాలతో పోలిక.)

స్వామీ! మీ ఇద్దరు మాట్లాడుకొనే సరసాల మాటలు పెండ్లి సమయంలో చదివే దీవెనలు. స్వామీ! మీ ఇద్దరి విజృంభణను కలపటానికి మన్మథుడు చదివే మంత్రాలు కూడా ఆ సరసపు మాటలే.

చరణం3 : స్వామీ! అమ్మ వారి కౌగిలి నీకు అనుకూలంగా పెండ్లిలో వేసే నాలుగు కాళ్ల మంటపం.(కౌగిలిలో నీవి,ఆవిడవికలిపి మొత్తం నాలుగు కాళ్లు. అందుకే నాలుగు కాళ్ల మంటపంతో పోల్చానయ్యా!) ప్రతిదినము ఒకరికొకరికి సుఖాన్నిచ్చే దోమతెరమంచం కూడా అమ్మ వారి కౌగిలి.అవునుకదా!

శ్రీ వేంకటేశా!కార్యం నెరవేరేవరకు చేతికి విప్పని దారాలు ఏవయ్యా! దేనితో పోలుస్తానంటావా! స్వామీ! మీ ఇద్దరిరహస్యమైన-మంచి పద్ధతులు- ఒకరికొకరు నేర్పే -కలయికలు కంకణదారాలు. ఆ కంకణ దారాలు. విప్పకయ్యా స్వామీ! మాకు శుభాన్నిచ్చేవి అవే.

పరమార్థం

పెండ్లి ఇద్దరికి సంబంధించిన వ్యవహారం. కనుక అన్నమయ్య కూడా ప్రతి పోలిక రెండింటికి అన్వయించాడు. ఉదాహరణకి అమ్మ నవ్వే నవ్వులు వివాహకాలంలో దోసిళ్లతో ఒకరి తలపై ఒకరు పోసికొను తలంబ్రాలు ఆనవ్వులే పెండ్లివారితో సహ భోజనం చేసే బువ్వపు బంతిలో తియ్యనిపాలు .అది ఈ కీర్తనలో చమత్కారం.స్వస్తి.

77. బెళకులు

చెప్పదలుచుకొన్న విషయాన్ని హృదయానికి హత్తుకొనే విధంగా చెప్పటం అన్నమయ్యకు వెన్నతో పెట్టిన విద్య. వేంకటేశుని సంబోధిస్తూ, లోకానికి సంబంధించిన విషయాలను అన్నమయ్య భక్తి నీ పైదొకటే పరమసుఖము అనే కీర్తనలో పేర్కొన్నాడు. చలించే గుణాలు అనే అర్థంలో బెళకులు అను పదాన్ని వాడాడు.

పల్లవి: భక్తి నీపైదొకటె పరమసుఖము
యుక్తి చూచిన నిజంబొక్కటే లేదు

చ.1: కులమెంత గలిగె నది కూడించు గర్వంబు
చలమెంత గలిగె నది జగడమే రేచు
తలఉపెంత పెంచినాఉ దగిలించు కోరికలు
యెలమి విజ్ఞానంబు యేమిటా లేదు

చ.2: ధన మెంత గలిగె నది దట్టమౌ లోభంబు
మొనయుజక్కందనంబు మోహములు రేచు
ఘనవిద్య గలిగినను కప్పు బైపై మదము
యెనయగబరమపద మించుకయు లేదు

చ.3: తరుణు లెందరుఅయిన తాపములు సమకూడు
సిరులెన్ని గలిగినను చింతలే పెరుగు
యిరవయిన శ్రీవేంకటేశ నిను గొలువగా
పెరిగె నానందంబు బెళకు లికలేవు (రేకు:0256-03సం: 03-322)

స్వామీ! వేంకటేశా ! ఈ లోకంలో నీ మీద ఉన్న భక్తి మాత్రమే సుఖము. మిగతావాటిల్లో ఎంత జాగ్రత్తగా చూచినా శాశ్వత గుణం లేదు.

కులాలు మతాలుగా విడిపోవద్దని జాతీయ సమైక్యతను ఈ పాదంలో అన్నమయ్య ప్రబోధించాడు. నాదీ కులము, నాదీ మతము అని ఊరికే గొప్పలు చెప్పుకోకు. అది గర్వాన్ని పెంచి నాశనం చేస్తుంది. పగ, ద్వేషం పెరుగుతున్న కొద్దీ తగాదాలు పెరుగుతాయి.

లౌకిక విషయాల మీద అధికమైన ఆలోచన పెరుగుతున్న కొద్దీ కోరికలు పెరుగుతాయి. కులంలోను, ద్వేషంలోను, అధికమైన ఆలోచనలోనూ విశేషజ్ఞానం లేదు. అంటే కులాలు మొదలైన వాటి మీద ఆసక్తి పెంచుకొంటే అజ్ఞానివి

అవుతావని అన్నమయ్య సందేశం.

ధనం పెరుగుతున్న కొద్దీ పిసినారి తనం , ఆకాంక్ష పెరుగుతాయి. అందం గా కనిపించాలనుకొన్న కొద్దీ అజ్ఞానం, దానితోపాటు వలపులు పెరుగుతాయ్.

ధనం సంపాదించాలి. అంతేకాని విపరీతమైన అనుబంధాన్ని దానితో పెంచుకో కూడదు. డబ్బు మీద ఉండే విపరీతమైన ధ్యాసతో దైవాన్ని మరువకూడదని కవి భావం.

ఎనిమిది రకాల మదాలున్నాయంటారు.

అన్నమదము, అర్థమదము, స్త్రీ మదము, విద్యామదము, కులమదము, రూపమదము, ఉద్యోగమదము, యౌవనమదము .ఈ మదాలలో విద్యామదం విలక్షణమైనది. నాలుగు అక్షరాలు అందరికంటే ఎక్కువగా వచ్చాయని , అందరూ పొగడటం మొదలు పెట్టిన మరుక్షణం విద్యామదం నరనరాన పాకటం మొదలుపెడుతుంది. పండితుడికి కప్పే శాలువా అతడిలోని విద్యకు ఎదుటివాళ్ళ చేస్తున్న అలంకారం. శాలువా అతనిలోని అహం కారాన్ని కప్పేయాలి. కాదూ నేనే అందరికంటే గొప్ప అని విజృంభిస్తే ఎదుటివాళ్లని తన విద్యతో నవ్వులపాలు చేయాలని చూస్తే ఏదో ఒకనాడు విద్యా గర్వం కలవాడు నవ్వుల పాలవుతాడు. విద్యావంతులకు అన్నమయ్య చేసిన ఈ బోధ శిరోధార్యం.

ఒక భర్తకు ఒకరే భార్య. బహుభార్యాత్వం వలన బాధలు కలుగుతాయి. సంపదలు పెరుగుతున్న కొద్దీ చింతలు పెరుగుతాయి. పెరిగిన సంపద ఎలా దాచిపెట్టాలి, పన్ను బాధలనుంచి ఎలా తప్పించుకోవాలి. ఇలా రకరకాల చింతలు. అందుకే అవసరానికి మించి సంపదలు వద్దని కవితా ప్రబోధం.

ఓ వేంకటేశా ! నీవు ఇరవువి. అంటే ఆనంద స్థానానివి. ఆనంద నిలయుడివి. నిన్ను కొలిస్తే ఆనందం పెరుగుతుంది. మిగతా విషయాలను సేవిస్తే ఆనందం తరుగుతుంది. నిన్ను కొలిస్తే బెళకులు అంటే–చలించే గుణాలు తగ్గిపోతాయి.

స్వామిని కొలిస్తే మనస్సు స్థిరత్వం పొందుతుందని , చంచల గుణం పోతుందని అనుభవ పూర్వకంగా కవి చెప్పిన సత్యం. స్వామిని ఆలంబనగా చేసుకొని ఇలా అన్నమయ్య అందం, ధనం మొదలైన వాటి మీద ఆధునిక సమాజానికి పనికి వచ్చే విషయాలను చర్చించాడు.

అన్నమయ్య పదాలు జ్ఞాన పథాలు. చదివిన ప్రతిసారి కొత్త కొత్త అర్థాలు కనబడుతుంటాయి. ప్రతిభ అంటే ఎప్పటికప్పుడు కొత్తగా వికసిస్తూ ఆనంద పరిచేది. అన్నమయ్య కీర్తనలు అటువంటి ప్రతిభా కాంతి యుతాలు. జయహో అన్నమయ్య!

78. బొడ్డు తామెర

నాభి నుండి పుట్టిన తామరలోఅల్పకాలపు వయస్సు అనే అర్థంలో బొడ్డు తామెరలోన గడ్డివయసు అను పదబంధాన్ని అన్నమయ్య సృష్టించాడు

పల్లవి: బొడ్డు తామెరలోన గడ్డివయసు పెద్ద
బిడ్డ గన్నట్టివాడుపిన్నవాడు

చ1: బిరుసైన దొకకొండ పెనుబాముతోజుట్టి
బిరబిరనె త్రిప్పే పిన్నవాడు
గురుతైనదొకకొండ గొడగుగా నొకచేత
పెరికి పట్టేవాడు పిన్నవాడు

చ2: బెడిదంపు శిశుపాలు పెనుమోతతోగూడ
పెడచేతనే వేసె బిన్నవాడు
పడవేసి చాణూరు బట్టి యురము దొక్కి
పిడికిటనే చంపే పిన్నవాడు

చ3: ఎక్కడఉ జూచిన నింతటదానై
పెక్కురూపములైన పిన్నవాడు
ఇక్కడ దిరువేంకటేశుడై జగమెల్ల
పిక్కిటిల్లినవాడు పిన్నవాడు (రేకు:9054-01సం:04-567)

పల్లవి:

ఈ కృష్ణుడనే చిన్నవాడు తన నాభి నుండి పుట్టిన తామరలో(బొడ్డు తామెరలోన) అల్పకాలపు వయస్సు (గడ్డివయసు) కలిగిన పెద్ద బిడ్డను కన్నవాడు.

కృత, త్రేత, ద్వాపర. కలి అని నాలుగు యుగాలు.

వీని పరిమాణము 12000 దివ్య సంవత్సరములు.

ఒక దివ్య సంవత్సరానికి 360 మానుష సంవత్సరములు కనుక నాలుగు యుగములకు 4320000 మానుష వత్సరములు అగును. ఈనాలుగు యుగములు చేరితే ఒక మహాయుగము .

అందులో కృతయుగానికి 1728000 సంవత్సరములు. త్రేతాయుగమునకు

1296000 సంవత్సరములు. ద్వాపర యుగమునకు 864000 సంవత్సరములు. కలియుగమునకు 430000 సంవత్సరములు. ఇట్టి మహాయుగములు 1000 అయితే చతుర్ముఖ బ్రహ్మకు ఒక పగలు, మయు వేయి ఒక రేయి అగును. అట్టి దినములు 360 అతనికి ఒక సంవత్సరము .అట్టి 100 సంవత్సరముల కాలము బ్రహ్మ ఆయుష్కాలము.

ఆది మధ్యాంత రహితుడైన దేవునితో పోలిస్తే బ్రహ్మ ఆయుష్కాలము తక్కువే కనుక అన్నమయ్య బ్రహ్మ వయస్సు దేవుని వయస్సుతో పోలిస్తే అల్పకాలపు వయస్సు .అందుకే అన్నమయ్య "గడ్డివయసు" అన్నాడు.

చ. 1: కఠినమయిన (బిరుసైనది)ఒక కొండవంటి పెద్దపామును –కాళియుని – తోకను చుట్టి(తో జుట్టి) ఆ చిన్నవాడయిన కృష్ణుడు బిరబిరాతిప్పాడు. కృష్ణుడు కాళియుని "జిర జిర ద్రిప్పి వైచె " అన్నారు పోతన్న. (10.1–663–చ) అన్నమయ్య "బిరబిరనె త్రిప్పే" అన్నాడు.. పామేమో పెద్దది. దానిని తిప్పిన వాడు చిన్నవాడు. పెను, పిన్న అనే పదాలను చమత్కారంగా అన్నమయ్య ప్రయోగించాడు

గొప్పదయినది (గురుతైనది) గోవర్ధనమను పేరు గల కొండ. ఆకొండను (గొడగుగా) నేలనుంచి పీకి, పెల్లగించి(పెరికి) ఒక చేతిలో గొడుగుగా పట్టిన వాడు ఈ చిన్నవాడయిన కృష్ణుడు.

చ. 2: భయంకరుడైన (బెడిదంపు) శిశుపాలుని చంపుటకు తన చక్రాన్ని కృష్ణుడు ప్రయోగించాడు. అప్పుడు పెద్ద చప్పుడు తో(పెనుమోతతోగూడ) దిక్కులు వణికాయి. ఆ శిశుపాలుని ఈ చిన్నవాడయిన కృష్ణుడు పెద్ద చేష్టతో (పెడచేతనే) నరికాడు. (వేసె)

చాణూరుడను మల్లుని పడవేసి, అతని రొమ్మును తొక్కి, ఈ చిన్నవాడయిన కృష్ణుడు పిడికిలితో గుద్ది చంపాడు.

(చాణూరుఉడు కంసుని భటుడయిన మల్లుడు.. కృష్ణుడు మధురానగరమునకు వచ్చినప్పుడు కంసుని ఆజ్ఞతో అతని ని ఎదిరించి మల్లయుద్ధముచేసి కృష్ణుని చేత చంపబడ్డాడు. దీనిని అన్నమయ్య ఈ చరణములోని రెండు పంక్తులలో వర్ణించాడు.)

చ. 3: బ్రహ్మ ఒకసారి ఆవులను, గోపాలకులను ఎత్తుకొనిపోయాడు. ఆ సందఠరేలో చిన్నవాడయిన కృష్ణుడుఅందరి రూపాలు తాను ధరించాడు. ఆ సమయంలో ఎక్కడ చూసిన అక్కడ ఇంతటిలో తానయి (ఇంతట తానై)

చిన్నవాడు కృష్ణుడు అందరి ఆకారములు తాను ధరించాడు.

"చూసే వాళ్లు అటు చూస్తే అక్కడ కృష్ణుడు కనిపించాడు. ఇటు చూసేటంతలో – ఇంతటిలో–క్షణము కూడా ఆలస్యము కాకుండా ఇక్కడ కూడా కృష్ణుడు కనిపించాడని చెప్పటానికి అన్నమయ్య ఇంతట అని ప్రయోగించాడు.

(రూపంబు లెల్ల నగు బహు/రూపకుడిటు బాలవత్సరూపంబు లతోనేపారు టేమి చోద్యము?/రూపింపఁగ నతని కితరరూపము గలదే?(10.1–512–క.) అని పోతన పరవశించాడు. స్వరూపములు సమస్తము తానే ఐనట్టి సర్వవ్యాపి ఇలా పిల్లల దూడల రూపాలతో ఉండుటలో ఏమి ఆశ్చర్యము ఉంది!? ఆ భగవంతుని కంటె అన్యమైన స్వరూపము ఉన్నదా? ! అని పోతన్న ప్రశ్నించాడు. అన్ని రూపాలు దేవునివే అని భావము)

ఇక్కడ – ఈ భూలోకములో , పూజ్యమైన వేంకటేశుని స్వరూపమై (తిరువేంకటేశు డుై) ఈ ప్రపంచమంతావర్ధిల్లినవాడు చిన్నవాడయిన కృష్ణుడు. స్వస్తి.

79. బొమ్మబెట్టు

బొమ్మబెట్టు అను ఒక విచిత్రమైన పద ప్రయోగము అన్నమయ్య సాహిత్యంలో కనబడుతుంది. శత్రువులను తిరస్కరించు, అవమానించు అను అర్థంలో ఈ పద ప్రయోగము చేసిన అన్నమయ్య దశావతార కీర్తనను ఆస్వాదిద్దాం.

పల్లవి: పెట్టని కోటిందరికి బెండ్లికొడుకు బొమ్మ-
బెట్టె నసురలకెల్ల- బెండ్లికొడుకు

చ.1: పెల్లగించి భూమెత్తీబెండ్లికొడుకు వాడె
పిల్లగోవి రాగాల పెండ్లికొడుకు
పెల్లైన యీవుల పెండ్లికొడుకు వాడె
పిల్లదీపుపెన్నుద్ది పెండ్లికొడుకు

చ.2: పెంచెపు శిరసుపాగ పెండ్లికొడుకు గుం-
పించిన కోపగించీ బెండ్లికొడుకు
పెంచకప్పుడే పెరిగె బెండ్లికొడుకు వల-
పించె జక్కనిసిరి బెండ్లికొడుకు

చ.3: పెంట పెరుగులదొంగ పెండ్లికొడుకు భూమి
బెంటి పోతుల గూరిచె బెండ్లికొడుకు
గెంటులేని వేంకటగిరిమీదను వాడె
పెంట వెట్టుకున్నవాడు పెండ్లికొడుకు (రేకు:0062-6సం: 05-186)

అర్థం

పల్లవి : ఎక్కువ రక్షణగా మత్స్యావతారంలో ఉన్న పెండ్లి కొడుకు వేంకటేశుడు.

పెండ్లి కొడుకైన వేంకటేశుడు రామావతారంలో రాక్షసులను యుద్ధములో జయించి వారిని తిరస్కరించాడు, అవమానపరిచాడు.(శత్రువులను జయించిన సూచనగా వారి బొమ్మలను జయించిన వారు తమ కాలిఅందెలపై చెక్కిస్తారు. ఇదేబొమ్మ పెట్టుట.)

చ. 1: వరాహావతారములో భూమిని పెల్లగించి పైకెత్తిన పెండ్లి కొడుకు. వాడే. ఆ వేంకటేశుడే!

చిన్న గొట్టమైన మురళిలో అనేక రాగాలు కూర్మావతారంలో పలికిన పెండ్లి కొడుకు.

అధికమైన దానములు పరశురామావతారములో ఇచ్చిన పెండ్లి కొడుకు వాడే. ఆవేంకటేశుడే! పిల్లదీపుబాలక్రీడావిశేషములతో బలరామావతారములో పెద్ద ఆట గాడు ఈ పెండ్లికొడుకు

చ. 2: పించం తలపాగాగా కృష్ణావతారంలో కలిగిన వాడు ఈ పెండ్లికొడుకు నరసింహావతారము లో మంచివారిని బాధించిన హిరణ్య కశిపునిపై కోపగించిన వాడు ఈ పెండ్లికొడుకు ఈవామనావతారములో పెరిగిన వాడు ఈ పెండ్లికొడుకు

చక్కని శోభ కలిగిన స్త్రీల చేత వలపించుకొన్నవాడు ఈ పెండ్లికొడుకు బుద్ధావతారము

చ. 3: చిలిపితగాదాలు పెడుతూ పెరుగులు దొంగగా కృష్ణావతారంలో ఉన్న వాడు ఈ పెండ్లికొడుకు పశుపక్ష్యాదులలో నాడుదానిని పెంటి అంటారు. పశు పక్ష్యాదులలో పురుష జాతిని పోతు అంటారు. కల్క్యవతారములో పెంటిని, పోతును కలిపిన వాడు ఈ పెండ్లికొడుకు చలనము లేని వేంకట పర్వతము మీద పెంట వెట్టుకున్నవాడు బెండ్లికొడుకు తిరుమల అను ఒక పేటను(=పెంట) వెంట పెట్టుకొన్న వాడు ఈ పెండ్లికొడుకు.

పరమార్థం

మత్స్యావతారం : చైత్ర బహుళ పంచమి- ప్రాత:కాలమున

యుగము అంతమగు సమయములో విచిత్రమైనమత్స్యావతారమును ధరించి సమస్త భూమండలమునిండినదిఅగుచుసమస్త ప్రాణులకును ఆశ్రయము అయినవాడు అయ్యాడని పోతన్నగారి వర్ణన.(2-142-సీ.) దీనినే అన్నమయ్య పెట్టనికోట అన్నారు.

కూర్మావతారం : జ్యేష్ఠ బహుళ ద్వాదశి- ప్రాత: కాలమున

పిల్ల గోవి అంటే సన్నటి గొట్టము. పైన ఉన్న తాబేలు బొమ్మను జాగ్రత్తగా పరిశీలిస్తే ముఖము భాగంలో ఒక సన్నటి గొట్టంలా అనిపిస్తోంది. ఈ కూర్మావ తారం మనకు స్ఫురింపచేయటానికి అన్నమయ్య పిల్లగోవి రాగాలు అన్నాడని ఆనిపిస్తోంది. విజ్ఞులు ఇంకా మెరుగైన సూచనలు ఇస్తే శిరసావహిస్తాను.

పెల్లగించి భూమెత్తి బెండ్లికొడుకు వాడే

వరహావతారం : చైత్ర బహుళ త్రయోదశి – మధ్యాహ్నం

నీటిలో మునిగియున్న భూమిని తన కోరలపై తీసికొని పాతాళము నుంచి పైకి వరాహస్వామి వచ్చాడు. హిరణ్యాక్షుడు గదతో వరహ భగవానునితో తలపడ్డాడు. సింహము, ఏనుగును చంపినట్లుగా వరాహ స్వామి హిరణ్యాక్షుని చంపాడు..

గుంపించిన కోపగించి

నరసింహావతారం : వైశాఖశుద్ధ చతుర్దశి –

ప్రదోషకాలములో దేవతల సమూహమును బాధించి పైకెత్తిన గదను ధరించినవాడు అయి వచ్చుచున్న రాక్షసునిగా హిరణ్య కశిపుని –రాక్షసుని చూసి తళుక్కుమనే కోరలుభయంకరమైన ముఖము చిట్లించిన కనుబొమలముడి తో నరసింహ స్వామిని భాగవతము పోతన వర్ణించాడు. దేవతల సమూహమును బాధించిన వాడు కనుక అన్నమయ్య గుంపించి (=బాధించి)అను క్రియను వాడాడు.

పెంచకప్పుడే పెరిగె బెండ్లికొడుకు

వామనావతారం : భాద్రపద శుద్ధ ద్వాదశి – మధ్యాహ్నం కాలం

మొదటిలో శరీరము ఎక్కువ పెంచకుండానే – పొట్టి వాడుగా ఉండి– తరువాత – ఉన్నట్టుండి పెరిగిపోయిన వాడు ఈ పెండ్లికొడుకు అనే అర్థాన్ని – పెంచక, అప్పుడే పెరిగి– అనే రెండు పదాల్లో వర్ణించిన కవి ప్రతిభ కొనియాడదగినది.

పెళ్లైన యీవుల పెండ్లికొడుకు వాడే

పరశురామావతారం : మార్గశిర బహుళ విదియ – సాయంకాలం

ఒకరోజు పరశురాముడు ఇంట్లోలేని సమయం చూసి, కార్తవీర్యార్జునుని కుమారులు అతని తండ్రి జమదగ్ని తల నరుకుతారు. తల్లి రేణుక తండ్రి శవంపై పడి ఏడుస్తూ 21 మార్లు గుండెలు బాదుకుంటుంది. పరశురాముడు కార్తవీర్యార్జునుని కుమారులలను చంపి జమదగ్ని తలను తెచ్చి మొండానికి అతికించి బ్రతికిస్తాడు.రాజులు తన తండ్రిని చంపారని కోపంతో వారిపై 21 మార్లు దండెత్తి క్షత్రియవంశాలను నాశనం చేస్తాడు. తరువాత భూమినంతటినీ కశ్యపునకు దానమిస్తాడు. అధికమైన దానములు ఇచ్చిన పెండ్లి కొడుకుగా అన్నమయ్య పరశురాముని వర్ణించాడు.సమస్త భూమండలము దానముగా ఇవ్వటం అధికమైన దానమే కదా!

బొమ్మ బెట్టె నసురులకెల్ల బెండ్లికొడుకు

శ్రీరామావతారం : చైత్రశుద్ధ నవమి – మధ్యాహ్న సమయంలో

శ్రీరాముడు అనేకమంది రాక్షసులను చంపి న విషయం జగద్విదితం.దీనినే అన్నమయ్య తనదైన కవితాశైలిలో బొమ్మ బెట్టె అన్నాడు.

పెంట పెరుగులదొంగ పెండ్లికొడుకు

శ్రీకృష్ణావతారం : శ్రావణ కృష్ణ అష్టమి – అర్ధరాత్రి సమయంలో

పోతన గారి భాగవతంలో బాల కృష్ణుడు చేసిన చిలిపి తగాదాలు, వెన్న దొంగతనాలు జగత్ప్రసిద్ధాలు.

వలపించె జక్కని సిరి బెండ్లికొడుకు

బుద్ధావతారం : భాద్రపద శుద్ధ సప్తమి – సాయంకాలము

దశావతారాలలో పేర్కొన్న బుద్ధుడు వేరు . గౌతమ బుద్ధుడు వేరు.

మహాపతివ్రతలయిన త్రిపురాసురుల భార్యల పాతివ్రత్య మహిమ వల్ల త్రిపురాసురులను జయించటం కష్టమవుతుంది. అప్పుడు శ్రీ మహా విష్ణువు బుద్ధ రూపాన్ని ధరించాడు. చక్కటి రూపముతో, ఒక అశ్వత్థ వృక్షమూలములో తమ కళ్లఎదుట కనబడిన బుద్ధ రూపాన్ని చూసి మోహ పడ్డారు. త్రిపురాసురుల భార్యలు. అందువల్ల త్రిపుర రాక్షసుల బలం పోయి శివుని చేత చంపబడ్డారు. దీనినేవలపించె జక్కని సిరి బెండ్లికొడుకు అని కవి వర్ణించాడు.

పెంటి పోతుల గూరిచె బెండ్లికొడుకు

కల్కి అవతారం : భాద్రపద శుక్ల విదియ – ప్రాత:కాలము

తూర్పు దిక్కునకు ప్రవహించు సరస్వతీ నదీ గట్టున ధర్మదేవతయును(పోతు) భూదేవియును (పెంటి) ఆవు ఎద్దు రూపములతో తమ బాధలను కలబోసు కోవటానికి మూలకారణము కల్కి. (తెలుగు భాగవతము 01-411 వచనము) దీనిని పెంటి పోతుల గూరిచె బెండ్లికొడుకు అని కవి వర్ణించాడు.

పిల్లదీపు పెన్నుద్ది పెండ్లికొడుకు భాగవతంలో బలరామ కృష్ణుల బాలక్రీడలు ఇలా వర్ణించారు.

మోకాళ్ళపైనుండి చేతులు విడిచివచ్చునట్లుగ చేసి నిక్కుతూ వెళ్ళెదరు. కొంచముదూరము అమ్మల యొక్క పైటకొంగులు అందుకొని ఊగులాడెదరు. ఆవుదూడల తోకలను గట్టిగా పట్టుకొని వదల లేక వాటి వెనకాతలనే జారుతారు.

ఆబీ బురదలలో దుడుకుతనము అతిశయించగా దూరుదురు. ఈ విధంగా బలరామక ృష్ణులు బాల క్రీడలందు ఆసక్తులై ఉన్నారు..(10.1-289-సీ.) ఇందులో బలరాముడి బాలక్రీడలను పిల్లదీపు పదంతో అన్నమయ్య సూచించాడనిపిస్తోంది.స్వస్తి.

80. మందుల కొండ

తెలుగు భాష పరిపుష్టం కావాలంటే ఇతర భాషా పదాలను తెలుగులోకి అనువాదం చేసుకోవలసిన ఆవశ్యకత ఎంతో ఉంది. అయితే అనువాదం కృత్రిమ మయితే నిలవటం లేదు. ఉదాహరణకి రైలు అనే పదానికి ధూమ శకటమని అనువాదం చేసారెవరో. అది అపహాస్యం పాలయింది. నిలవలేదు. internet - -అంతర్జాలం;cellphone -చరవాణి ;air hostess - గగనసఖి;browser `- విహారిణి;User name-వినియోగ నామము ;Password -సంకేత నామము ఇలాంటి సమర్థ వంతమయిన కొన్ని అనువాద పదాలు నిలదొక్కుకొన్నాయి.

ఆనాడు సంస్కృతంలో ఉన్న కొన్ని ప్రసిద్ధ పదాలకు అన్నమయ్య తన కీర్తనలలో సమర్థవంతమయిన అనువాదాలు చేసాడు. ఉదాహరణకి సంజీవని పర్వతానికి "మందులకొండ "అని అన్నమయ్య అనువాదం. (దీనిని నాకు తెలిసి మొదట గ్రంథస్థం చేసినవారు జయప్రభ గారు) మనం ఇప్పుడు ఆమందులకొండ పరమార్థం వివరించుకొందాం.

పల్లవి: నేలమిన్ను నొక్కటైన నీబంటు వొక్క-
వేలనే యక్షుని దెగవేసెగా నీ బంటు

చ.1: ఉంగరమెగరవేసి యుదధిలో బడకుండ
నింగికి జెయిచాచె నీబంటు
చంగున జలధిదాటి జంబుమాలి నిలమీద
కుంగదొక్కి పదముల గుమ్మెగా నీబంటు

చ.2: వెట్టగా రావణు రొమ్ముమీరుగ జేతనే గుద్దె
నిట్టతాడువంటివాడు నీబంటు
దిట్టయై మందులకొండ తేజమున నడురేయి
పట్టపగలుగ దెచ్చె బాపురే నీబంటు

చ.3: అలర నన్నియుజేసి అజునిపట్టానకు
నిలుచున్నా డదివో నీబంటు
బలువేంకటేశ ఈ పవననందనుడు
కలిగి లోకములెల్ల గాచెగా నీబంటు

(రేకు:0011-03సం:01-069)

రామునితో మాట్లాడుతూ ఆంజనేయ స్వామి ఎంత గొప్పవాడో అన్నమయ్య వివరిస్తున్నాడు.

ఓ రామా ! చిత్రమైన ధనస్సుతో రావణుని కుమారుడు అక్షకుమారుడు రాగా, అతని ప్రతిభనుచూసి సంతోషించి నీ సేవకుడైన హనుమంతుడు నేలా, ఆకాశము ఒకటయ్యేటట్లుగా శరీరాన్ని పెంచాడు. పాముని గరుత్మంతుడు గట్టిగా పట్టుకున్నట్లుగా అక్షకుమారుని పాదాలను గట్టిగా పట్టుకొని వేయిమార్లు గిర గిర తిప్పాడు. ఆ తరువాత నేలపై కొట్టి చంపాడు.

చ1: ఓ రామా ! నీ సేవకుడయిన హనుమంతుడు నువ్వు ఇచ్చిన ఉంగరాన్ని తన సహజ స్వభావముతో ఎగురవేసి సముద్రములో పడకుండా, ఆకాశము వైపు చేయి చాచాడు.

హఠాత్తుగా ఒక్క గెంతు వేసి సముద్రాన్ని అవలీలగా దాటి జంబుమాలిని నేలమీద పడవేసి కుంగదొక్కి పాదాలతో నీసేవకుడయిన హనుమంతుడు నలిపాడు కదా! (జంబుమాలి ప్రహస్తుని కొడుకు. రావణుని సేనాధిపతులలో ఒకడు. అశోకవనభంగ సమయములో హనుమంతుడు ఇతనిని చంపాడు).

చ. 2: రామా ! తాపము కలిగేటట్లుగా యుద్ధములో రావణుని రొమ్ము విరిగిపోయేటట్లుగా తన చేతితో గుద్దిన – నిలువుగా ఉన్న తాటి చెట్టులాంటి వంటి వాడు(నిట్ట తాడు) నీ సేవకుడయిన హనుమంతుడు (రావణుడు – హనుమంతుడు కొట్టిన అరచేతి దెబ్బకి భూకంప సమయంలొ పర్వతంలా వణకి పోయాడని వాల్మీకి రామాయణం)

బాపురే ! ఎంత ధైర్య వంతుడయ్యా ! మందులకొండ అయిన సంజీవని పర్వతాన్ని తేజస్సుతో నడు రేయి తీసుకువచ్చి ఆ పర్వత కాంతులతో రేయిని పట్టపగలు చేసిన వాడు నీ సేవకుడయిన హనుమంతుడు

చ. 3: రామా ! అన్నీ చేసి నీపట్టాభిషేకములో ఏమి తెలియనట్లుగా ఒక మూలగా నిలబడ్డాడు నీ సేవకుడయిన హనుమంతుడు. బలవంతుడవయిన ఓ వేంకటేశా ! నీ సేవకుడయిన హనుమంతుడు ఈ లోకములనన్నింటిని రక్షించేవాడు.

❖

హనుమంతునిపై అన్నమయ్య రచించిన కీర్తనలు 54 ఉన్నాయని ఆచార్య కే. సర్వోత్తమరావుగారు నిర్ధారించి వాటిని ఒకచోట ప్రచురించి ఈ అన్నమయ్య

పదసేవకునికి పంపించారు. (పుస్తకం పేరు- తాళ్లపాక పద కవుల హనుమత్సం కీర్తనలు) సంజీవని పర్వతాన్ని మందులకొండగా ఇంకోకీర్తనలోనూ (రేకు: 9111-01సం: 04-598) అన్నమయ్య పేర్కొన్నాడు.

మందుల కొండ కథ

రావణుడు ప్రయోగించిన శక్తి (బల్లెం) ప్రభావానికి లక్ష్మణుడు మూర్ఛపోయి నేల మీద పడ్డాడు.అప్పుడు సుషేణుడనే కపి వైద్యుడు రాముడికి ధైర్యం చెప్పాడు.

హనుమంతుడిని పిలిచి సంజీవని పర్వతం దక్షిణ శిఖరంలో ఉన్న 1.విశల్యకరణి (శరీరంలో నాటుకొన్న బాణాలను తొలగించి గాయాలను మాన్పేది), 2.సవర్ణకరణి (శరీర కాంతిని సహజ స్థితికి తెచ్చేది), 3.సంజీవని (స్పృహలోకి తెచ్చి చైతన్యాన్ని కలిగించేది), 4.సంధానకరణి (విరిగిన ఎముకలను జోడించేది) అనే ఔషధులను త్వరగా తీసుకు రమ్మని చెప్పాడు.

హనుమంతుడు వేగంగా పర్వతం దగ్గరకు వెళ్లాడు కాని సుషేణుడు చెప్పిన నాలుగు మందులను వెంటనే గుర్తించలేకపోయాడు. వెంటనే పర్వతం మూడుసార్లు అటూ ఇటూ ఊపి పెళ్లగించి , ఆకాశములోకి ఎగిరి చెండులా దానిని ఎగరవేసి పట్టుకొని మహావేగంతో బయలుదేరి సుషేణుని దగ్గరకు ఆ పర్వతాన్ని చేర్చాడు..

సుషేణుడు ఆ పర్వతం మీద ఉన్న మందుల తీగలను పెకిలించి లక్ష్మణుడి ముక్కుపుటాల దగ్గర ఉంచాడు. లక్ష్మణుడు ఆరోగ్యవంతుడయ్యాడు.

అసలు వేంకటేశ్వరునే తిరుమల మీద ఉండే "మందు"గా చెప్పిన (రేకు:0001-02 సం:01-002) అన్నమయ్య సంజీవనీ పర్వతాన్ని మందులకొండ అనటంలో పెద్దగా ఆశ్చర్య పడనక్కరలేదు. స్వస్తి

81. మన్నకాలము

కాలము అనే పదము అనేక చోట్లా అన్నమయ్య కీర్తనల్లో కనబడుతుంది. శ్రీ హరిని నుతిస్తే కాలముపై భ్రమములు తొలగి పోతాయని చెప్పిన కవి మనం ఈ నాడు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకుంటున్నట్లే ఒక కీర్తనలో" మీకు నిచ్చీని శుభములు యివి యెల్లకాలము" (01-338) అన్నాడు. మనస్సులోపల పొరలను తొలగిస్తే, అనవసరపు కోరికలను వదిలివేస్తే - కాలము మనకు శు భాన్ని ఇస్తుందని కవి హితోక్తి. సంస్కృతంలోని భూత కాలానికి చన్న కాలము , వర్తమానకాలానికి మన్నకాలము అని తెలుగులో అన్నమయ్య పేరు పెట్టాడు. వీటి ప్రస్తావనలున్న కీర్తనని తలచుకొందాం.

పల్లవి: ఇతరము లేదిక నెంచి చూచితే
బ్రతివచ్చు నితడు ప్రత్యక్షమై

చ.1: సకలలోకములు చర్చించి వెదకిన
వొకఉడేపో పురుషోత్తముడు
ప్రకటము బహురూపములయి నాతడు
అకుటిలమహిమల యనంతుడే

చ.2: పర్విన జీవుల భావించి చూచిన
సర్వాంతరాత్ముడు సర్వేశుడే
వుర్విని వెలుపలనుండిన యాతడు
నిర్వహించె నీ నీరజాక్షుడే

చ.3: చన్నకాలమున మన్నకాలమున
నున్నవాడు యీవు పేంద్రుడే
కన్నులెదుట నిక గల కాలంబును
అన్నిటా శ్రీవేంకటాధీశుడే

(రేకు:0250-06శంకరాభరణంసం: 03-289)

పల్లవి:

ఒక్కసారి మనము ఆలోచించి చూస్తే - ఈ ప్రపంచములో శ్రీ హరికంటె ఇతరమైనది ఏది లేదు.

మన కళ్ల ఎదుట ఇతడు ప్రత్యక్షమై ఉండగా , ఇతనికి సాటి వచ్చేది, సమానమైనది (ప్రతివచ్చు) ఇంకొకటి లేదు.

చ. 1: భూలోకము, భువర్లోకము, సువర్లోకము, మహాలోకము, జనలోకము, తపోలోకము, సత్యలోకము, అతలము, వితలము, సుతలము, రసాతలము, మహాతలము, తలాతలము, పాతాళము - ఇలా ఎన్ని లోకాలలో వెతికినా పురుషోత్తముడు వేంకటేశ్వరుడు ఒకడే.

కదిలే రూపాలలో, కదలని రూపాలలో అతడు మనకు కనబడుతున్నాడు. అంతములేని ఆ వేంకటేశ్వరుని మహిమలు చాలా గొప్పవి.

చ. 2: అన్ని చోట్లా వ్యాపించి, నివసిస్తున్న జీవుల విషయమై ఒకసారి ఆలోచిస్తే ఆ సర్వేశుడయిన వేంకటేశ్వరుడు అందరిలోనూ అంతరాత్మగా ఉన్నాడు.

ఈ భువనములో - మనకు బయట తిరుమలపై కనబడుతున్న ఈ పద్మములవంటి కన్నులు కలిగిన వేంకటేశుడు మనలోపల కూడా ఉండి అన్నీ నిర్వహిస్తున్నాడు.

చ. 3: గడచిన భూత కాలములో, మనం జీవిస్తున్న వర్తమాన కాలములో ఆ ఇంద్రుని తమ్ముడైన ఉపేంద్రుడు (కృష్ణుడు) ఒక్కడే -నశించకుండా ఉన్నట్టివాడు. కన్నులెదుట ఉన్నవాడు వాడే. కలకాలము ఉండేవాడు వాడే. అన్నిటా, అంతటా ఉన్నవాడు శ్రీ వేంకటేశ్వరుడే.

పరమార్థం

మను అను పదమునుంచి పుట్టింది మన్న. మను అంటే జీవించు. జీవించే కాలము వర్తమానకాలం. అందుకే వర్తమానకాలాన్ని అన్నమయ్య "మన్న కాలము" అన్నాడు. జీవముంటేనే శరీరానికి విలువ. అలాగే వర్తమానకాలానికే ఎక్కువ విలువ. ఆంగ్లభాషలో ఇది ప్రెజెంట్ టెన్స్. - జీవితము బహుమతి. జీవిస్తున్న ప్రతి నిమిషం బహుమతి. అన్నమయ్య కూడ నడుస్తున్న కాలంలో జీవించమన్నాడు. నిరాశలతో, లేని పోని అనుమానాలతో చచ్చి పోతూ బతకవద్దంటున్నాడు.

చైతన్యం జీవలక్షణం. వర్తమానకాలాన్ని కూడా చైతన్య భరితం చేసుకొమ్మనే అన్నమయ్య హితోక్తిని పాటిద్దాం. ఆనందంగా జీవించే కాలముగా వర్తమాన కాలాన్ని- మన్నకాలముగా నిర్వచించిన అన్నమయ్యకు జేజేలు పలుకుదాం.

82. మవ్వపు కూరిమి

కూరిమి అంటే స్నేహమని, ప్రేమ అని మనందరికి తెలుసు. కాని మనకు అంతగా తెలియని మవ్వపు కూరిమిని అంటే సొగసైన, కోమలమైన ప్రేమను అన్నమయ్య మనకోసం అందించాడు. ఆ కథా కమామిషు చూద్దాం.

ఒక అలుక చెందిన నాయిక ఇలా అంటోంది.

పల్లవి: చిన్నదాన జేసినట్టు సేయుమనవే
విన్నపమిదే తనకు వేవేల కనవే

చ.1: సిగ్గువడ్డచిత్త మిది చేరి మాటాడనియ్యదు
యెగ్గుపట్టుజో నాత డేమిసేతునే
అగ్గలపు సతులలో అరితేరినట్టి వాడు
వొగ్గి తానే యిప్పుడు నా వొద్దికి రమ్మనవే

చ.2: జవ్వనపుమద మిది సరసములాడనీదు
రవ్వ గాతాళించునేమో రతి నతడు
యివ్వల నావంటివారి నెదుగా నేలినతాను
మవ్వపుగూరిమి నన్ను మాటాడించుమనవే

చ.3: తనకాగిటిదేహము తగులు వాయగనీదు
అను వెట్లనో తనక దెఱగనే
యెననెను శ్రీవేంకటేశుఉ డిన్నిటా దాను
మనసుమర్మ మెరిగి మన్నించుమనవె

(రేకు: 1054-4 సంపుటం: 20-322)

చిన్నదానిని ఎలా చూసుకొంటారో – అలా వేంకటేశుని నన్ను చూసుకోమనవే!

తనకు నా వేలవేల విన్నపములు ఇవే. చూడవే !

చ1. ఆయనతో మాట్లాడాలని ఉంటుంది. కాని సిగ్గు పడ్డ మనస్సు ఆయన దగ్గరగా మాట్లాడనీయదు.

ఇదేమో ఆయన తప్పు పట్టుకొంటున్నాడు. నేనేమి చేస్తానే!

అధికమైన సతులలో ఆరితేరినవాడు.

వాడికి నేను నేర్పాలిసిన పని ఏముంది?

ఇష్టపడి , ఒప్పుకొని తననే ఇప్పుడు నా వద్దకు రమ్మనవే!

చ2. యౌవనకాలములో వచ్చే మదమిది. అలకలో ఒక మెట్టు కిందికి దిగి– ఆయనతో నా అంతట నేను సరసాలాడటానికి ఒక పట్టాన ఒప్పుకోదు.

ఒకవేళ నేను అలా చేస్తే –అల్లరిగా రతులలో అతగాడు గలగలలాడిస్తాడేమో!

నావంటి వారిని ఎక్కువగా పరిపాలించినవాడు ఆ వేంకటేశుడు.

సొగసైన, కోమలమైన ప్రేమతో నన్ను మాట్లాడించమనవే!

చ3.తన కౌగిలిలో చిక్కకుండా ఈ శరీరము ఆసక్తి పొందదు.

తనకు ఆ అవకాశము దక్కే పద్ధతి ఏదో – నేను ఎరగను.

ఇన్ని విషయాలలోనూ ఆ వేంకటేశుడు నాకు సరిపోయాడు. నా మీద అలక పూని తాను కూడా నా దగ్గరికి రావటంలేదు.

నా మనస్సులోని అంతరార్థాన్ని తెలుసుకొని వాడిని మన్నించమని చెప్పవే !

❖

సొగసైన, కోమలమైన ప్రేమతో నన్ను మాట్లాడించమనవే! అనటమే ఒక చిత్రమైన వాక్య సంవిధానం.

ఎవరైనా ప్రేమతో మాట్లాడమని ఎదుటివారికి చెబుతారు.

కాని ప్రేమతో నన్ను మాట్లాడించమని ఒక నాయిక – చెలికత్తెద్వారా నాయకునికి చెప్పించటం సాహిత్య చరిత్రలోనే అపూర్వం.

అసలు ఈ ఊహ చాల కోమలం.

సొగసయిన ప్రేమతో నన్ను మాట్లాడించమని వాడికి చెప్పు.

సొగసయిన ప్రేమ నాయకునికా? నాయికకా? ఎవరికి కావాలని కవి అంటున్నాడు?

ఇద్దరికీ.

❖

ప్రేమకి, కోమలత్వానికి – చంద్రునికి వెన్నెలకి ఉన్నంత దగ్గర సంబంధం.

కోమలత్వం ప్రేమకి అవసరం. రాక్షసత్వం కాదు.

ప్రేమ నెత్తురిని ఉడికించదు. నెత్తురిని కదిలిస్తుంది.

ప్రేమ భాషలో కఠినాక్షరాలుండవా? ఉంటాయి? కాని అవికూడా కోమలంగా ఉచ్చరింపబడతాయి.

ప్రేమించే ప్రతి వ్యక్తి –చిన్నపిల్లగా ఎదుటివాని దృష్టిలో ఉండాలని కోరుకొంటుంది. (కోరుకొంటాడు)

పసిపాపని ఎత్తుకొంటారు. ఆడిస్తారు. తాను ఏడిస్తే తల్లడిల్లి పొతారు. ముద్దుగా అలంకరించి పరవశించిపోతారు.

తన ప్రేమికుడు(రాలు) అలా చూడాలని – ప్రేమించేవారు ఆశ పడతారట

ప్రేమికులు పరస్పరం ఆటువంటి చిన్నపిల్లల మమతలు ఆశిస్తారని కవి కోమల హృదయం.

సొగసైన ప్రేమ బంధాన్ని –మవ్వపు కూరిమి పద బంధాన్ని సృష్టించిన అన్నమయ్యకు జయహో అనకుండా ఉండ గలమా !

83. మించుతీలూ

పల్లవి: మేలెల్ల నొక్కటే మించుతీలూ నొకటే
తాలిమితో ఫలియించు తలపూ నొకటే

చ.1: ఆకలి గడు హెచ్చితే నన్నము రుచి గోరును
జోక బాపము హెచ్చితే సుకృతము గోరును
పైకొని యవివేకికి బాపమైనా నుపకారి
ఆకడ మూర్ఖునకు బుణ్యమైనా బంధకమే

చ.2: యెందు నెండబడ్డ గాని ఇంపునీడ గోరడు
కందువ సంసారియైన గాని మోక్షము గోరడు
చందపు యోగికి సంసారమైనా నుపకారి
కందువబద్ధున కదే కట్టినట్టి కట్లు

చ.3: కలయ జీకటియైతేగాని దీప మిడుకోడు
ఇల నజ్ఞుడైనగాని యెరుక వెదకడు
తలచి శ్రీవేంకటేశుదాసుని కింతా జయమే
బలిమి జంచలునికి బహుళ దు:ఖములే

సమస్తమయిన శుభాలు (మేలు) ఒక్కటే. మించు తీగలు ఎక్కడయినా ఒక్కటే. (రాయలసీమ ప్రాంతాల్లో పెండ్లికొడుకు కుడికాలి రెండో వేలికి చుట్టే మట్టె లాంటి వెండి తీగల చుట్టను మించు అంటారు). ఓర్పుతో చక్కగా ఫలించే ఆలోచన ఎక్కడయినా, ఎవరికయినా ఒకటే . అన్నీ ఒక్కటయినప్పుడు ఆ ఒక్కడయిన వేంకటేశుని ఎందుకు కొలవవు? నీ జీవితాన్ని ఎందుకు సార్థకం చేసుకోవు?

చ.1: ఆకలి బాగా పెరిగితే– అన్నము –రుచి ని కోరుకొంటుంది.(బాగా ఆకలిగా ఉన్నవానికి ఉడికీ ఉడకని అన్నము కూడా రుచిగానే ఉంటుంది. ఈ పాదానికి పాఠాంతంముందేమో ! అర్థం సుగమం కాదు)

ఉత్సాహం(జోక) పెరిగితే – పాపము –మేలును కోరుకొంటుంది. (పాపము బాగా పెరిగి పెరిగి బద్దలవుతుంది. చివరకు స్వామి అవతరించి మేలు చేస్తాడు.

ప్రయత్నించిన(పైకొని) అవివేకికి పాపము కూడా ఉపకారము చేస్తుంది. (ప్రయత్నించి పుస్తకాలు చదువుతూ, పెద్దల ద్వార పాపఫలితము తెలుసుకొంటున్న

అవివేకి– అయ్యో ! నేను ఇలా చేయకూడదని తెలుసుకొంటాడు. అందువల్ల అతనికి అతని పాప జ్ఞానము ఉపకారము చేస్తుంది)

అక్కడ (ఆకడ)మూర్ఖునకు పుణ్యమైనా చెరసాల వంటిది.(అవివేకికి పాపము కూడా ఉపకారము చేసే సందర్భంలో – పెద్దల ద్వార విధి విధానాలు తెలుసుకోకుండా పుణ్య కార్యక్రమాలు చేసే మూర్ఖునికి– ఆ దోష సహితమైన పుణ్యము– చెరసాలలా– కష్టాలలో బంధిస్తుంది.)

చ.2: ప్రతిచోటా ఎండ పడినప్పటికి ఆనందపు నీడ (ఇంపునీడ) కోరడు.

అసత్యమైన (కందువ)సంసారము చేస్తున్నప్పటికీ సంసారి మోక్షము కోరడు ("ఎండ పడినవాడు నీడలోకి వెళ్లటం యుక్తము. అలాగే బాధలతో కూడుకొన్న ఈ ఎండలాంటి సంసారమును వదిలి నీడ లాంటి మోక్షము కోరటం యుక్తం " అని కవి ప్రబోధము) పద్ధతిగా(చందపు) నడుచుకొనే యోగికి సంసారములో ఉన్నప్పటికీ ఆ సంసారము ఉపకారము చేస్తుంది. చిత్రమైన (కందువ) సంసార బంధాలు కలవానికి, ఆ బంధాలే కట్టిన కట్లు.

చ.3: అంతటా(కలయ) చీకటియైతే కాని దీపము ఉంచుకోడు . (ఇడుకో అంటే ఉంచుకో అని అర్థము.;ఈ ఉంగర మిడుకొని పాతిక రూపాయలు అప్పియ్యి. శ్రీకాకుళం ప్రజలభాష వి.సి.బాలకృష్ణశర్మ 1975)

ఈ భూలోకములో చైతన్య శూన్యుడైతే కాని, అజ్ఞాని అయితే కాని (అజ్ఞుడైనగాని) జ్ఞానము(ఎరుక) వెతకడు.("చీకటి రావటానికి ముందే దీపము సిద్ధము చేసుకోవాలి. అలాగే అజ్ఞానులమైన మనము ఈ జన్మ ముగియటానికి ముందే జ్ఞానాన్ని అన్వేషించాలి" అని కవి ఉపదేశం.)

శ్రీ వేంకటేశుని దాసునికి స్వామిని తలచుకొంటే చాలా(ఇంతా) జయము లభిస్తుంది. దేహ బలము (బలిమి) ఉన్నప్పటికీ స్వామిని తలుచుకోని చపల చిత్తునికి (చంచలునికి) అధికమైన దుఃఖాలు లభిస్తాయి.

(దేహ బలము కన్న మనో బలము ఇచ్చే స్వామిని తలుచుకొంటే దుఃఖాలు రావని కవి ప్రబోధము.)

84. మెరిచి

శ్రీ వేంకటేశుని శృంగార నాయకునిగా వర్ణిస్తూ, వారికి ఇష్టమైన అలమేలుమంగ శృంగారాన్ని అన్నమయ్య అందంగా మచ్చికతో నేలవయ్య అను కీర్తనలో వర్ణించాడు. తళుక్కున ప్రకాశించు అను అర్థంలో మెరిచి అని ఇందులో అన్నమయ్య ప్రయోగం.

పల్లవి: మచ్చికతో నేలవయ్య మదనసామ్రాజ్యలక్ష్మి
పచ్చిసింగారాలచేత బండారాలు నిండెను

చ .1: కొమరెతురుమునను గొప్పమేఘు ముదయించి
చెమటవాన గురిసె జెక్కులవెంట
అమర బులకలపైరు లంతటాను జెలువొంది
ప్రమదాలవలపులపంట లివె పండెను

చ 2: మించులచూపుల తీగెమెఱుగు లిట్టె మెరిచి
అంచె గోరికలజళ్లవె పట్టెను
సంచితపుకుచముల జవ్వనరాసులు మించె
పొంచి నవ్వుల మాని పోదిగొనె నిదిగో

చ3: అలమేలుమంగమోవియమృతము కారుకమ్మి
నలువంక మోహపుసోనలు ముంచెను
యెలిమి శ్రీవేంకటేశ ఇంతి నెట్టె కూడితివి
కొలదిమీరి రతులకొటార్లు గూడెను

(రేకు: 0949-5 సం: 19-281)

వేంకటేశ్వరా! మా అలమేలుమంగ చాలా సుకుమారి.ప్రేమతో సువిశాలమైన మన్మథ రాజ్యలక్ష్మిని పరిపాలించవయ్యా!

(మన్మథ రాజ్యలక్ష్మి వంటి నాయికతో దాంపత్యం చేయమని ఒక అర్థం. నాయికతో కలిసి మదన సామ్రాజ్య సంపదను -అనగా నిత్యనూతనమ్మెన రతి సుఖాలను అనుభవించమని ఇంకొక అర్థం) మీ శృంగారాలు ఎప్పటికప్పుడు కొత్తవి. ఆ కొత్త సింగారాలచేత ఒకటేమిటి లెక్కలేనన్ని బండారాలు(ధనము ఉంచు గృహములు) నిండిపోతాయి. (అంతగా లెక్కలేనన్ని శృంగారాలు మీరు అనుభవిస్తారని భావం)

చరణం1: నీతో సుఖాలనుభవించిన ,అనుభవిస్తున్న,అనుభవించబోతున్న మా అలమేలుమంగ అందాలు ఏమి చెప్పమంటావు!

చక్కని ఆమె కొప్పులో మేఘం పుట్టింది.(రతి క్రీడలో వివశురాలైన నాయిక జుట్టు మేఘాకృతిలో ఉన్నదని భావం) ఆ జుట్టు మీద అలవోకగా –నీ చేయి – అలా –చేరిందో–లేదో– చూసావా! ఆ మేఘం కరిగిపోయి ఆమె ,చెక్కిళ్ళమీద చెమట్ల వాన మొదలయింది. (రతిలో అలసిపోయిన అలమేలుమంగ చెక్కిళ్ళమీద చెమట్లను వానగా అన్నమయ్య పోలుస్తున్నాడు.

మేఘం చల్ల గాలి తగిలి ఎలా వర్షిస్తుందో– అలా స్వామివారి స్పర్శతో విడివడిన కొప్పు అనే మేఘం –చెమట్లు అనే వానను కురిపిస్తోందని అన్నమయ్య భావన)

చరణం2 : ఎక్కడయినా వాన కురిసిన వెంటనే పైరు మొలవటం మేము చూడలేదు. కాని నీ చల్లని చేతి స్పర్శతో మా అలమేలుమంగ చెక్కిళ్ళ వెంట కురిసిన చెమట్ల వానతో ఆమె శరీరమంతటా పులకలు అనే పైరు వెంటనే మొలకెత్తి సంతోషము కలిగించే వలపు పంటలు పండాయి.(సాధారణంగా పైరు, పంటఅను రెండు పదాలు మనం ఒకే అర్థంలో వాడుతున్నప్పటికీ రెండింటి మధ్య సూక్ష్మ భేదం ఉంది. ఇంకా గింజ పట్టని లేత మొలకలున్నది పైరు.గింజ ముదిరి ధాన్యమయితే పంట కోతకొస్తుంది.ఇక్కడ అన్నమయ్య మొదట పులకల పైరు అన్నాడు.తర్వాత వలపుల పంట అన్నాడు.)

చరణం3 : మా అలమేలుమంగ చలించే చూపులు చూస్తోంది.అసలే ఆమె శరీరంలో వానా కాలం చెమట్ల రూపంలో ఉంది కదా!

నీతో కలిసి చేసిన పోరాటాలలో ఏమి ఘర్షణలు జరిగాయో– ఏమోకాని– ఆ చూపులలో మెరపు తీగలు తళుక్కున ప్రకాశించాయి.(వాన పడుతున్నప్పుడు ఘర్షణ జరిగి వాతావరణంలో మెరుపులు సహజం కదా! ఇక్కడ నాయిక చెమట్ల వానకు తీగ మెరుపులు వచ్చాయని అన్నమయ్య చమత్కారం.) బారులు బారులు తీరిన కోరికలతో మా నాయిక శరీరమంతా ఝల్లని కంపిస్తోంది. వలపు పంటల రాబడితో పోగుచేసిన సంపదంతా– యవ్వనపు రాశులైన స్తనాలలో దాచిపెట్టింది. అందుకే అవి అన్నింటిని మించిపోతున్నాయి.ఇలా సంపదను పోగు చేసిన విషయాన్ని నువ్వు పొంచి ఉండి గమనించావని తెలుసుకొందేమో! ఆమె పెదవుల

మీదికి సిగ్గుల నవ్వుల వసంత ఋతువు వ్యాపించింది. మహాప్రభో! నువ్వు మా అమ్మ అలమేలుమంగతో కలిసిన కథా క్రమం ఏమి చెప్పమంటావు స్వామీ! ఆ సమయంలో మా అమ్మ అలమేలు మంగ పెదవి మీద నీ పెదవి అద్దటం చేత అమృతాల వర్షఋతువు కమ్ముకొంది. ఇక చెప్పవలసిన పనేముంది. మీ శరీరాల నాలుగు పక్కల మోహాల ప్రవాహాలు మొదలయి మిమ్మలిని ముంచెత్తాయి. అధికమ్మెన రతులు రాశులు రాశులుగా పెరుగుతుండగా (అనేకమ్మెన రతి భేదాలని భావం) శ్రీ వెంకటేశా! ప్రేమతో నాయికను కలిసావు.

పద ప్రయోగ పరమార్థం

నెలత చక్కదనమే నిండు బండారము నీకు(18-108) అని ఇంకో కీర్తనలో నాయిక అందమే నాయకునికిబండారమని చెప్పిన అన్నమయ్య ఈ కీర్తనలో కొత్త సింగారాలచేత లెక్కలేనన్ని బండారాలు (ధనము ఉంచు గృహములు) నిండిపోతాయి అంటున్నాడు. ఏ భావనకి ఆ భావన అందంగా ఉంది. ఎవరి బండారమయినా బయటపడితే బాధ పడతారు. కాని మన అన్నమయ్య భావనల బండారాలు బయటపడుతున్నకొద్దీ పచ్చి పచ్చిగా భాష సింగారాలు పోతుంది.

85. మూసిన ముత్యము

మొలస్కా జాతికి చెందిన ముత్యపు చిప్పలలో సహజ ముత్యాలు తయారవు తాయి. కొన్ని ఇసుకరేణువులు ముత్యపు చిప్పలోకి వచ్చి ఒక చలనం కలిగించిన తర్వాత, ముత్యపు చిప్ప వాటి పైకి ఒక ద్రవ పదార్థాన్నివిడుదల చేస్తుంది. అది గట్టిపడి ఆనక ముత్యంగా మారుతుంది.కాబట్టి ఒక రకంగా చెప్పాలంటే ముత్యం మూసి ఉన్న చిప్పలో తయారయ్యేది కాబట్టి ముత్యానికే ఇంకొక పేరుగా మూసిన ముత్యం అని చమత్కారంగాచెప్పుకోవచ్చు. (నా "అన్నమయ్య అన్నమాట" పుస్తకంలో మూసిన ముత్యాలకేలే కీర్తన వివరణ)

మూసిన ముత్యమంటే 1.అణగిమణగి యుండునది. 2. తెలిసియు తెలియనట్లు నటించువాఉడు. 3. ఎక్కువగా మాట్లాడనివాడు. అను అర్థాలున్నాయి. అయితే అన్నమయ్య మూసిన ముత్యమంటే తెలిసియూ తెలియనట్లు నటించే వాడు అనే అర్థంలో ఎక్కువగా వాడాడు. ఒక దశావ తార కీర్తనలో ఈ మూసిన ముత్యాన్ని ఎంత చమత్కారంగా కవి వాడాడో తెలుసుకొనే ప్రయత్నం చేద్దాం.

పల్లవి: వీడివో యిదె వింతదొంగ
వేడిపాలు వెన్న వెరజినదొంగ

చ.1: వెలయ నీట జొప్పువేసేటి దొంగ
తలగాననీక దాగు దొంగ
తలకక నేలదవ్వేటిదొంగ
తెలిసి సందెకాడ దిరిగేటి దొంగ

చ.2: అడుగుకింద లోకమడచేటి దొంగ
అడరి తల్లికినైన నలుగుదొంగ
అడవిలో నెలవైయున్న దొంగ
తొడరి నీలికాసెతో నుండు దొంగ

చ.3: మోస మింతుల జేయుముని ముచ్చుదొంగ
రాసికెక్కిన గుఱ్ఱంపు దొంగ
వేసాల కిటు వచ్చి వేంకటగిరిమీద
మూసినముత్యమై ముదమందు దొంగ

(రేకు: 0063-01సం: 01-322)

అర్థం

పల్లవి: ఎదుట ఉన్న వ్యక్తిని నిర్దేశించడంలో వీడీవో అనే పదబంధం అన్నమయ్య ఎక్కువగా వాడుతుంటాడు. (వీడుంఇదిగో) వేంకటాచలంలో మన కళ్ల కెదురుగా కనబడుతున్న వీడే వింత దొంగ. ఈ వేంకటేశుడే కృష్ణావతారంలో వేడిపాలు, వెన్న కొల్లగొట్టిన (వెరజిన)దొంగ

చ. 1: ఈ వేంకటేశుడే ప్రకాశిస్తూ మత్స్యావతారంలో నీటిలో తేలియాడు లేదా మార్గాలు వెదకు (చొప్పు వేయు) -దొంగ. కూర్మావతారంలో తల కనబడకుండా దాక్కున్న దొంగ. (తలదాచుకొనేది తాబేలు) చలించక వరాహావతారంలో భూమిని తన కోరతో తవ్విన దొంగ. తెలిసి తెలిసి నరసింహావతారంలో సంధ్యాకాలంలో (పగలుకాని, రాత్రి కాని) తిరిగిన దొంగ.

చ. 2: ఈ వేంకటేశుడే వామనావతారంలో తన అడుగు కిందలోకాన్నంతటిని అణచిన దొంగ అతిశయించి(అడరి) పరశురామావతారంలో తండ్రి మాట పాటించటం కోసం తల్లి పై కోపించి, ఆమెను సంహరించిన దొంగ రామావతారంలో అడవిని తన స్థానముగా (నెలవు) చేసుకొన్న దొంగ. అనుకరించి(తొడరి) బలరామావతారంలో నల్లటి కుచ్చెళ్లు పోసిన ధోవతి కట్టిన దొంగ

చ. 3: ఈ వేంకటేశుడే బుద్ధావతారంలో త్రిపురాసుర కాంతలను మోసము చేసిన కపటసన్యాసి రూపంలోని దొంగ. (ముని ముచ్చుదొంగ) కల్క్యావతారంలో ప్రసిద్ధి చెందిన(రాసికెక్కు) గుర్రాన్ని ఎక్కి, పాపాత్ములను శిక్షించు దొంగ.

ఇన్ని రకాల వేషాలు వేసి- ఇలా వచ్చి వేంకటాచలం మీద తెలిసియూ తెలియనట్లు నటించే వానిగా (మూసిన ముత్యం) తాను ఆనందంగా ఉంటూ, మనందరిని ఆనందంతో ఉంచే దొంగ.

పరమార్థం

"మూసినముత్యమువంటి మోసమే చాలు"(12-204) అని అన్నమయ్య స్వయంగా మూసిన ముత్యానికి మోసమనే అర్థం ఉందని పేర్కొన్నాడు.

అది సరే- స్వామివారిని మూసిన ముత్యమని - (తెలిసియూ తెలియనట్లు నటించేవాడు) మోసగాడని ఒక భక్తుడు అనవచ్చా?

అన్నమయ్యవంటి భక్తునికి ఆ హక్కు ఉంది. అన్నీ భగవంతుడే అయినప్పుడు

– ఆయనతో భక్తుడు సరసాలాడతాడు.కోపగించుకొంటాడు. ఎగతాళి చేస్తాడు. దొంగవంటాడు. ఏమన్నా – నిజమైన భక్తిని– స్వామి స్వీకరిస్తాడు. తనను ఎగతాళి చేసినప్పటికీ అన్నమయ్య వంటి భక్తుని కీర్తనలను యుగాల తరబడి ప్రజల నోళ్లలో దాచిపెడతాడు. స్వస్తి.

86. మేలు సుద్ది

శుభవార్త అను సంస్కృత పద బంధానికి "మేలు సుద్ది" అని తెలుగు దుస్తులు తొడిగాడు.అన్నమయ్య పద కల్పనలో ఒక మనోహరత్వముంటుంది. ఇంతకంటె ఈ సంస్కృత పదాన్ని తెలుగులో అందంగా చెప్పలేము అనే స్థాయిలో ఉండే అనువాద వైఖరి అన్నమయ్య సొంతం. **మేలుసుద్ది చాటరే యిందరికి(11-403), మేలుసుద్ది నీమొకాన మించీ నదే (11-439) చెలియా ఆమేలుసుద్ది చెప్పవే నాకు(14-343) చేవదేర మేలుసుద్ది చెప్పితి నీకయ్యా(22-324) చెప్పవచ్చితిమి నీకు చెలగి యీమేలుసుద్ది(22-526) మేలుసుద్ది చెప్పితేను మెచ్చవద్దా ఇకనైనా (23-013) : ఇదివో మేలుసుద్ది మీ కిన్నిటా విన్నవించితి(29-034)-** ఇలా మేలు సుద్దిని రకరకాల కీర్తనలలో అన్నమయ్య ప్రయోగించాడు. ఈ మేలుసుద్ది కీర్తనలన్నీ తిరుపతి లడ్డులే. వీటిలో ఒక కీర్తనను పూర్తిగ ఆస్వాదించే ప్రయత్నం చేద్దాం

పల్లవి: మేలుసుద్ది చెప్పితేను మెచ్చవద్దా ఇకనైనా
కాలుదొక్కుదువు పాన్పుకడకు రావయ్యా

చ 1: వెలది యొకతె నిన్ను వెదకీ నేమిటికో
సొలవక నీ మొగము చూపవయ్యా
పిలిచీ నప్పటనుండి పెదపెదయెలుగుల
పలుకవయ్యా యేల పరాకు నీకు

చ 2: వొడినేమోపెట్టుకొనివుండి నిన్నే తలచీని
అడిగాపె దెలుసుకోవయ్యా నీవు
నడివీది నిలుచుండి నన్ను నీకడకు నంపె
విడిది నీపొరుగే యీవింతలేల నీకు

చ 3: చేపమీద నేకతము చెప్పేనంటా నున్నది
నావంటిదే తానూనేమి చెప్పేవయ్యా
శ్రీవేంకటేశ నన్ను జేరి యిట్టె కూడితివి
సేవించే నాపెనే నేను చెప్ప నేల నీకూ (రేకు: 1303-1సం: 23-013)

ఈ కీర్తనలో అన్నమయ్య ఒక రాయ బారిగా మారి నాయికకు, వేంకటేశు

నికి సయోధ్య చేకూర్చే ప్రయత్నం చేస్తూ- తనకు ఎంతో ఆత్మీయుడైన స్వామి వారిని దబాయిస్తున్నాడు. బతిమిలాడుతున్నాడు. వేడుకొంటున్నాడు. వేళాకోళాలాడుతున్నాడు.

పల్లవి: ఓ వేంకటేశా ! నీకు ఎటువంటి శుభవార్త చెప్పాను. ఇకనైనా ఆ మాట చెప్పినందుకు నన్ను మెచ్చుకోవద్దా? బెట్టూ పోక , కాలుతొక్కుదువు కాని, పాన్పు దగ్గరికి రావయ్యా మగడా ! (కాలుదొక్కుట= సంగమము)

చ 1: వేంకటేశా ! ఆవిడెవరో ఒకావిడ నీకోసం ఇందాకటినుంచి వెదకుతోంది. ఆలస్యం చేయకుండా నీ మొగం కొంచెం ఆవిడకి చూపించవయ్యా ! సంతోషిస్తుంది.

అసలు నీకు ఏమయిందయ్యా స్వామీ ! ఇందాకటినుంచి పెద్ద గొంతు వేసుకొని ఆవిడ నిన్ను పిలుస్తూనే ఉంది. ఉలకవు. పలకవు. ఏందయ్యా ! ఈ పరాకు (పరధ్యానం) నీకు!

చ 2: ఆ మహాతల్లి తన ఒడిలోఏదో పెట్టుకొని నిన్నే తలుచుకొంటూ కూర్చుంది. కాస్త ఆవిడని విషయ మేమిటో అడగవయ్యా! ఆమె కష్టమేమిటో కొంచెం తెలుసుకో!

పాపం..నడి వీధిలో నిలబడి- నన్ను నీదగ్గరికి కష్టం తీర్చమని అడగటానికి పంపిందయ్యా! ఆవిడ గారి విడిది (తాత్కాలిక నివాస స్థానం) నీకు బాగా దగ్గరలో ఉంది. ఈ వింత వింత బెట్టులు ఎందుకయ్యా నీకు? !.

చ 3: ఏకాంతములో నీ శక్తి మీరి పోయే విషయాలేవో నీకు చెబుతాను అని ఆవిడ గారు అంటోంది. ఆవిడగారు కూడా నాలాంటిదే. ఏమి చెబుతావు? మాట్లాడవయ్యా బాబూ! శ్రీ వేంకటేశా ! నా దగ్గరికి వచ్చి నన్ను నీలో కలుపుకొన్నావు. ఆవిడ గారికి కూడా నాలానే సేవ చేసుకో ! అయినా నా పిచ్చి గాని నేను నీకు చెప్పాలా! నీకు అన్ని తెలుసు.

❖

ఓ వేంకటేశా ! నీకు ఎటువంటి శుభవార్త చెప్పాను. ఇకనైనా ఆ మాట చెప్పి నందుకు నన్ను మెచ్చుకోవద్దా అని కవి మొదలుపెట్టాడు. ఇంతకీ ఏమిటా మేలు సుద్ది? ఒక నాయిక వేంకటేశునికోసం ఎదురు చూస్తోంది అనే మాట శుభవార్త బయటి వాళ్లకి ఇది శుభ వార్తలా కనబడదు కాని, ప్రేమికులకి ఇది శుభవార్తే.

అన్నమయ్య ఆధ్యాత్మిక రంగంలో ప్రేమకి, భక్తికి అట్టే తేడా ఉండదు. ప్రేమలోనూ, భక్తిలోనూ సమానంగా ఉండే ఆర్తి అన్నమయ్య కవిత్వంలో అంతర్నాదం. స్వస్తి

87. మొలకనవ్వు

మొలక అంటే మొక్క, లేత అనే అర్థాలున్నాయి. అన్నమయ్య ఈ మొలక పదంతో ఆడుకొన్నాడు. మొలకనవ్వులు దొలకు ముద్దుజూపులతోడ (05-130) మొలకనవ్వులు లోలో మొరగెగాని (08-245)మొలకనవ్వులతోడ ములిగేవే(09-001) మొలకనవ్వులె కాని మోహ మెరగ రాదు(10-083) మొలకనవ్వులతోను మొక్కె మయ్య(11-057)మొలకనవ్వులను వాములు వేసేవు (13-068) ఇలా రకరకాల ప్రయోగాలు అన్నమయ్య సాహిత్యంలో ఉన్నాయి. చిగురు మోవిని మొలక మోవి (26-29) అంటాడు ఒకచోట. ఇక్కడ మొలకకు చిగురు అని లాక్షణికార్థం చెప్పుకోవాలి. పులకల మొలకల పున్నమ(26-337) అని పులకరింప చేస్తాడు ఇంకొక చోట. బాల్యాన్ని మొలక వయసు అంటాడు. (17-311) మరోచోట. ఇలా ఉన్న విశిష్టమైన అన్నమయ్య ప్రయోగాలలో మొలక నవ్వుల కీర్తన ఒకదాన్ని పూర్తిగా చదివి ఆనందిద్దాం.

అన్నమయ్య ఒక చెలికత్తెగా మారి స్వామి వారికి ఒక నాయిక సౌందర్య నివేదిక ఇస్తున్నాడు.

పల్లవి: చిత్తగించవయ్యా యీపె చెలువములు
కొత్తలుగా మోవి చిగురు చెంగలించెను

చ.1: జలజ లోచన నిండు జవ్వన వనములోన
మొలక నవ్వు వెన్నెల మోసులెత్తెను
వలరాజునెడి తోటవాడు పోదిసేయగాను
పులక జాజిననలు పూవక పూచెను

చ.2: కాంతనెరిగురుల చీకటి పొదరింటిలోన
వింత తుమ్మిదగూండ్లు విరివాయను
చెంత గాలియనే తపసి నెలవైయుండగాను
అంతటా నానందకళాలాని నిండుకొనెను

చ.3: సతి వలపుల పెద్ద జలజాకరములోన
తతి గన్నుల మీలు చందములాయను
అతివ యలమేల్మంగ యాకె శ్రీ వెంకటేశ్వర
రతిగూడ మోహనమరందములు గురిసె

(రేకు: 0163-1సంపుటం: 07-369)

అర్థం

పల్లవి: వేంకటేశ్వరా ! సావధానముగా వినవయ్యా ! ఈమె సౌందర్యములు ఎప్పటికప్పుడు కొత్తగా ఉండి, ఆమె మోవి అనే చిగురు ప్రకాశిస్తోంది.

చ.1: పద్మముల వంటి కన్నులు కలిగిన ఈమె నిండు యౌవనమనే అడవిలో లేత నవ్వు వెన్నెలలు మొలకెత్తుతున్నాయి. (అడవి గాసిన వెన్నెల చేయకు మహా ప్రభూ) మన్మథుడు అనే తోట వాడు పోషించుచుండగా, రక్షించుచుండగా పులకలు అనే జాజి పూలు - మొగ్గలు లేకుండా, ఆమె శరీరంలో ఒకే సారిగా పూచాయి. (పూవక పూచెను)

చ.2: వేంకటేశ్వరా ! ఈమె అందమయిన కురులనే చీకటి పొదరింటిలో వింత వింతగా తుమ్మెదలు గూళ్లు ఎక్కువ అయ్యాయి. (కురులు నల్లగా ఉన్నాయని చెప్పటానికి అందమైన ఊహ) ఆమె దగ్గరగా గాలి అనే రుషి నివాసమేర్పరుచుకొన్నాడు. అందుకే ఆమె శరీరమంతటా ఆనంద కళలను నొక్కి సంతోషిస్తున్నాడు. (రుషి బ్రహ్మానంద కళలను ఆస్వాదిస్తూ సంతోష పడతాడు. ఇక్కడ గాలి అనే తపస్వి కూడా అదే విధమైన ఆనందాన్ని ఆమె శరీరంలో పొందుతున్నాడు. ఆమె శరీరం బ్రహ్మానంద స్వరూపమని భావం)

చ.3: వేంకటేశ్వరా ! నాయిక వలపులు అనే పెద్ద సరస్సులో సమయాను గుణముగా (తతిన్) ఆమె కన్నులనే చేపలు రకరకాల సౌందర్య విధానాలు (చందాలు) ప్రదర్శిస్తున్నాయి.

ఇంతకీ ఆ నాయిక ఎవరనుకొంటున్నావు. ఆమె అలమేలు మంగ. వేంకటేశ్వరా! నీతో రతిలో కలిసి వ్యామోహాలనే మకరందాలను నీపై కురిపిస్తోంది.

పరమార్థం

బ్రహ్మోత్సవాలు తొమ్మిది రోజులయినతరువాత లోపాలకు ప్రాయశ్చిత్తంగా -తిరుమలలో- పదవరోజు రకరకాల పుష్ప జాతులతో వేంకటేశ్వర స్వామి వారికి పుష్ప యాగం నిర్వహిస్తారు.. అన్నమయ్య ఒక చోట పూవు బోణుల కొలువే పుష్ప యాగము(07-60) అంటాడు.ఆయన చూపు అది. ఆ పుష్ప యాగము లోని ఒక పూవు -ఈ మొలకనవ్వుల కీర్తన. స్వస్తి

88. రాయడి

ఉపద్రవం అనే అర్థంలో రాయడి అని అన్నమయ్య ప్రయోగం

పల్లవి: ఉదయాద్రి తెలుపాయె నుడురాజు కొలువిడె
అదనెగి రాడాయె నమ్మ నా విభుడు

చ.1: చన్నులపై ముత్యాల సరు లెల్ల జల్లఉనాయె
కన్నులకు గప్పొదవె గాంత నాకిపుడు
కన్నెకలువల జాతి కనుమోడ్చినది మీద
వెన్నెల వేసంగి మొగ్గ వికసించె గదవె

చ.2: పువ్వుల లోపలి కురులు బుగులుకొనగా నెసె
దవ్వులదుమ్మెద గములు తరమి డాయగను
రవ్వసేయశుకపికము రాయడి కోర్వగరాదు
అవ్వల నెవ్వతెపసల కలరున్న వాడో

చ.3: పన్నీట జలక మార్చి పచ్చకప్రము మెత్తి
చెన్నుగం గొప్పున విరులు చెరువం దురిమి
యెన్నంగల తిరువేంకటేశుం డిదె ననుం గూడె
కన్నులు మనసు నుం దనియం గరుణించెం గదవే

(రేకు: 0037-2సంపుటం: 06-149)

అన్నమయ్య ఈ కీర్తనలో ఒక విరహపు నాయికగా మారి వేంకటేశుని సంయోగము కోసము తపించాడు.(సంపుటము 06-149)

పల్లవి : ఉదయాద్రి తెలుపాయె ఉడురాజు కొలువిడె

చంద్రుని ఉదయముతో తూర్పు కొండ తెల్లగా మారింది. ఆకాశములో చంద్రుడు కొలువు తీరాడు .

అదనెరిగి రాడాయెనమ్మ నా విభుడు నా ప్రభువైన వేంకటేశ్వరుడు ఈ అద్భుతమైన సమయము తెలుసుకొని ఇంకా రాడేమిటమ్మ ! (మేమిద్దరము కలవటానికి ఇది చాలా మంచి సమయము. ఈ విషయము తెలిసికూడా ఇంకా వేరే నాయిక దగ్గరే ఉన్నాడు... ఇంకా రాడేమని నాయిక బాధ)

1వ చరణం : నా స్తనములపై ఉన్న ముత్యాల హారాలు చల్లగా అయ్యాయి.

ఓ కోరదగిన ఆడుదానా!(కాంత) ఈసమయములో నా కన్నులను ఏదో మూసేసినట్లయిందే!

స్వచ్ఛమైన (=కన్నె) కలువపూల జాతి పారవశ్యంతో ముడుచుకుపోయింది. (చంద్రుడు ఉన్నప్పుడూ కలువలు వికసించాలి. కాని ఆనందంతో ముకుళిస్తున్నాయని కవి చమక్కు.)

వెన్నెల అనే , వేసవి వలె వెచ్చగా ఉన్న విరియని మొగ్గ ఇప్పుడు వికసించింది.(వెన్నెల చల్లగా ఉండాలి కాని, నాయిక విరహముతో ఉంది కాబట్టి వెన్నెల ఆమెకు వేడిగా మారింది. అందుకే కవి వేసంగి మొగ్గ అనే పేరు – వెన్నెలకు పెట్టాడు.)

2వ చరణం : నాకురులంతా పువ్వులతో నిండి యున్నాయి. అందువల్ల పువ్వులలోపల ఉన్న నా తల వెంట్రుకల పరిమళము (=బుగులు కొనగా) ఇంకా బాగా ఎక్కువయింది(=నెరసె).(నా తలవెంట్రుకలు మంచి వాసనతో ఉంటాయి. పువ్వుల వాసన జత కలిసింది. ఇక వాసన పెరగకుండా ఎలా ఉంటుంది?)

ఈ వాసనలకు ఆకర్షితమై అదుగో – తుమ్మెదలు గుంపులుగా పువ్వుల కురుల మీదికి వచ్చి పడుతున్నాయి. (=తరమి డాయగను)

నిందలు చేసే ఆ పావురాల, కోకిలల బాధకి, ఉపద్రవానికి (రాయడి) ఓర్వలేకపోతున్నాను. (ఇష్టమైన వాళ్లు మాట్లాడుతుంటే వినాలని కోరిక. చిలుకలు, కోకిలల కూతలు విడి సమయాలలో ఇష్టమే కాని, విరహపు సమయాలలో చాల బాధను కలిగిస్తాయి. అందువల్ల అవి కూస్తుంటే నాయికకి నిందలు చేసినట్లు అనిపిస్తోందని కవి వర్ణన.)

అవతల ఏ నాయిక శృంగార చాతుర్యాలకి (=పసలకు) వేంకటేశ నాయకులవారు సంతో షిస్తున్నారో ! నన్ను మాత్రము ఇలా విరహపు బాధలకు గురి చేస్తున్నారు

3వ చరణం : కమ్మనైన, చల్లనైన పన్నీట స్నానము చేయించి, చల్లదనము, మంచి పరిమళము గల కర్పూరము పూసి, అందంగా (=చెన్నుగా)కొప్పులో పూలు అందంగా తురిమి, ఎన్నంగల తిరువేంకటేశు డిదె ననుగూడె స్తుతించుటకు యోగ్యుడైన శ్రీవేంకటేశుడు

ఇదుగో ! నన్ను కలిసాడే!

నా నేత్రాలు, మనస్సు తృప్తి పడేటట్లుగా నన్ను కరుణించాడు గదే!

పరమార్థం

కన్నె కలువల జాతి కనుమోడ్చినది మీద

సాధారణంగా కవి సమయాల్లో కలువ పూలు చంద్రుని రాకతో వికసిస్తాయని వర్ణిస్తారు. అన్నమయ్య విలక్షణంగా ముడుచుకొంటున్నాయంటున్నాడు. బాగా అనందం కలిగినప్పుడు ఒక్కోసారి ఆ సంఘటననో- వ్యక్తినో తలుచుకొని కళ్లు పారవశ్యంతో మూతపడటం లోకంలో జరుగుతుంటుంది. అన్నమయ్య ఈ పారవశ్యపు ఆధిక్యాన్ని వివరించటానికే పారవశ్యపు ముకుళింత ప్రస్తావన తెచ్చాడు.

ఈ పాటలో మొదటి రెండు చరణాల్లోను విరహము , చివరి చరణములో సంయోగము చెప్పబడింది.జీవుడు భగవంతుని కోసము తపించాలి. అప్పుడు తప్పకుండా చివరకు స్వామి దయ ప్రసరిస్తుందనే సందేశము ఈ కీర్తన ఇస్తోంది

89.వట్టి మాకులిగిరించు

తీపి పదార్థాన్ని ఏ వైపునుంచి ఆస్వాదించినా తియ్యగానే ఉంటుంది. స్వామి నామాన్ని ఎన్ని రకాలుగా పిలిచినా, ఏ పద్ధతిలో పిలిచినా స్వామికి, భక్తునికి ఇద్దరికీ హాయిగానే ఉంటుంది.అందుకే వేంకటేశ్వరుని తమిళనాడులోని తిరుచ్చికి ఆనుకుని ఉండే ఉభయ కావేరీ నదుల మధ్యన ఉన్న శ్రీరంగనాథునిగా పిలుచుకొంటూ, తానొక ప్రేయసిగా, రంగనాథుని ప్రియునిగా భావించి అన్నమయ్య కుమారుడు పెద తిరుమలాచార్యుడు **రంగ రంగ రంగ పతి రంగనాథ** అనే చక్కటి కీర్తన రచించాడు. వట్టిమాకులిగిరించు– ఎండిన చెట్లు చిగిరించు అనే జాతీయాన్ని అందంగా ఈ గీతంలో వాడాడు కవి

పల్లవి: రంగ రంగ రంగపతి రంగనాథ, నీ
సింగారాలే త రవాయ శ్రీరంగనాథ

చ.1: పట్టిపగలే మాతో బలచగా నవ్వేవు
వొట్టు లేల పెట్టుకొనే వో రంగనాథ
వొట్టు లేల పెట్టుకొనే వో రంగనాథ
వట్టిమాకు లిగిరించు వడి నీ మాటలు వింటే
రట్టిడి వీమేర మీకు రంగనాథ

చ.2: చేతులు చాచేవు నీవు చేరి నా చన్నులమీద
రాతిరి మాయింటికి రా రంగనాథ
యీతల నీ నవ్వులకే యిక్కువలు గరగితి
బూతుల దిట్టకుమీ పోపో రంగనాథ

చ.3: కావేరీరంగమున కాంతపై పాదాలు చాచి
రావు పోవు యెక్కడికోయి రంగనాథ
శ్రీవేంకటాద్రిమీద చేరి నన్ను గూడితివి
యేవలచిన నీవే యిటు రంగనాథ (రేకు: 17–5సం: 17–101)

"ఈమధ్య వేషాలు బాగా వేస్తున్నావు"అని తెలుగు లోగిళ్ళలో ఆత్మీయులు అనుకొంటుంటారు.నిజంగానే ఎదుటి వాళ్ళేదో దుర్మార్గాలు చేస్తున్నారనికాదు. అలా అనటంలో ఒక ముద్దు ముచ్చటా ఉన్నాయి. అది అనుభవించేవారికే

తెలుస్తుంది. తెలుగు నాడి బాగా తెలిసిన కవి ఆ జాతీయాన్ని ఇక్కడ సందర్భోచితంగా వాడాడు.

ఎప్పుడన్నా ఏ రాత్రి పూటో తిక్క తిక్కవేషాలు వేస్తే- పోనీలే- మా రంగనాథుడే అని ఊరుకొంటానుకాని- అవ్వా- మట్టమధ్యాహ్నము- పట్ట పగలే- నా వైపు చూసి -అదోరకంగా-చిలిపిచేష్టలు-స్ఫురించేటట్లు సన్నగా నవ్వుతావా! అదుగో- మళ్ళీ -నవ్వలేదంటావ్ ! ఒట్టు పెట్టుకొంటావ్! ఏమిటయ్యా రంగనాథా! ఎంతబాగా మాట్లాడి మమ్మలిని బోల్తాకొట్టిస్తావ్-ఎండిపోయిన చెట్లు కూడా నీ మాటలు వింటే చిగురిస్తాయి.నువ్వు రట్టడివి.నీ గురించిఎవర్నన్నా చెప్పమంటే చాలు- ఎన్ని నిందలు వేస్తారో! అదుగో! ముందుకొస్తున్నావ్! హద్దు దాటావా! నేనసలే మంచిదాన్ని కాను.ఆ-

నవ్వటంలో బరువుగా నవ్వటం,పలచగా నవ్వటం- ఇలా రెండు రకాలు ఉన్నాయంటున్నాడు అన్నమయ్య.లోపల కుళ్ళు, కుట్ర ఏమీ లేకుండా

ఉన్నసందర్భంలో నవ్వు దీర్ఘంగా వస్తుంది.ఇది బరువు నవ్వు.మనస్సులోపల తాను తప్పు చేస్తున్నానని తెలుసు.తన తప్పును ఎదుటివారు గ్రహిస్తున్నారని తెలుసు. అప్పుడు ఏడవలేక వచ్చేది పలుచటి నవ్వు. రంగనాథుడు ఈ పల్చటి నవ్వు నవ్వుతున్నాడని అన్నమయ్య ప్రేయసి పాత్రలో దబాయిస్తున్నాడు.

వట్టిమాకులిగిరించు- ఎండిన చెట్లు చిగిరించు అనే జాతీయాన్ని అందంగా ఈ సందర్భంలో వాడాడు కవి.ఇది తిట్టు కాని పొగడ్త. పొగడ్త కాని తిట్టు.ప్రేయసీ ప్రియులు సున్నితంగా ప్రేమతో తిట్టుకొనేటప్పుడు కొన్ని మాటలు కారప్పూసల్లా కరకరమంటున్నా- అదోరుచిగాఉంటాయి. అన్నమయ్య ఇటువంటి భాషాప్రయోగాలలో సిద్ధహస్తుడు. .

ఏమయ్యా రంగ నాథా! ఎప్పుడు చూసినా ఆ కావేరి రూపంలో ఉన్న లక్ష్మీదేవి మీద కాళ్ళుచాచి ఉంటావు. ఎక్కడికి రమ్మన్నా రావు. ఆ ప్రదేశాన్ని వదిలి పోవు.

రామానుజుని శ్రీ వైష్ణవ సిద్ధాంతానికి పట్టుగొమ్మగా నిలిచిన పవిత్ర వైష్ణవ పుణ్యక్షేత్రం "శ్రీరంగం". "ఇండియన్ వాటికన్"గాదీనికి పేరుంది.భారతదేశంలోని వైష్ణవ ఆలయాల్లోకెల్లా ఇది చాలా పెద్దది.సుమారు 156 ఎకరాల విస్తీర్ణంతో ఉన్న ఈ దేవాలయ గరాళేయంలో విష్ణుమూర్తి ఆదిశేషుడిపై పక్కకి ఒరిగి పడుకొన్న ఆకారంలో దర్శనమిస్తుంటాడు.దీనినే అన్నమయ్య వర్ణించాడు.'ఎక్కడికి

రావు పోవు' అనే మాటలు నాయిక చలోక్తిగా అన్న మాటలు. ఆ మహానుభావుడు సర్వాంతర్యామి.

ఎక్కడికి రావు పోవు కాని ఈ వేంకటాద్రి మహిమ ఏమిటో ...ఇక్కడికి చేరి నీ ప్రేయసినైన నన్ను కలిసావు. అదేమిటో ఎక్కడ చూసినా నాకు నువ్వే కనబడుతున్నావు.శ్రీ రంగంలో చూసినా నువ్వే. తిరుమలలో చూసినా నువ్వే.

పరమార్థం

ఇక్కడ ప్రేయసి మధుర భక్తి సంప్రదాయంలో భక్తుడు.నన్ను కూడావంటే నా మనస్సులో అలా స్థిరంగా నిలిచిపోయావని అర్థం.

రంగం మంటే స్థానం. "ఇదంహీ రంగం", ఇదే అసలు స్థానం అంటే, ఈ లోకంలో ఎన్నెన్నో ఉన్నా మనల్ని తరింప చేసే స్థానం-శ్రీరంగం గోదాదేవి వ్రతం ఆచరించి రంగనాథుణ్ణి పొందిన రోజుని భోగి అంటారు. ఆ రంగ నాథుడే వేంకటేశుడు. కనుకనే ఇప్పటికీ బ్రహ్మోత్సవాల్లో గోదా ధరించిన మాలనే తెప్పించుకొని ధరించి, గోదా చేపట్టిని చిలుకనీ తాను చేత ధరించి, పొంగిపోతూ ఊరేగుతాడు.అందుకే వేంకటేశున్ని రంగనాథునిగా భక్తి పారవశ్యాలతో పొగిడి అన్నమయ్య తాను తరించి మనలను తరింపచేసాడు.

90. వింటి పండుగాయ

సీత పెండ్లిలో శివుని విల్లు పండుగయిందట రామునికి.

అన్నమయ్య కొత్త భావమది.

శివుని విల్లు రాముడు విరిచాడు,-ఇలాచెప్పుకొన్నాం కాని పండుగ శబ్దం ఏ కవి చేసినట్లు లేదు.

లోకములో ఎవరి మీదన్నా బాగా ప్రేమ , అభిమానం ఉన్నప్పుడు ఊరికే ఉత్తుత్తిగా "వీడిని నమ్మకూడదురా!" అని ముద్దు ముద్దుగా కొన్ని సందరాలేలో అంటారు కదా ! ఈ నమ్మకూడదనే ముద్దుల జాతీయముతో శివుని విల్లు పండుగను అన్నమయ్య కలిపాడు. కీర్తనలో దీని పూర్వాపరాలు తెలుసుకొందాం

పల్లవి: నూతులు దవ్వగబోతే బేతాళములు వుట్టె
కాతాళపు లోకులాల కంటిరా యీసుద్దులు

చ.1: మీఱిన పుత్రకామేష్టి మించి లంకకు బైవచ్చె
ఆఱడి రామావతార మసురబాధ
తూ ఱీసీతపెండ్లి హరుదొడ్డ వింటిపండుగాయ
పాఱి పాఱి నమ్మ నెటువలెవచ్చు వీరిని

చ.2: చూడ కేకయరాజ్యము చుప్పనాతిపాపమాయ
వేడుక మాయమృగము వేటాయను
వాడికె సుగ్రీవుమేలు వాలికి గండాన వచ్చె
యీడుగాని రాచపుట్టు యెట్టు నమ్మవచ్చును

చ.3: వుమ్మడి గోతులకూట ముదధికి గట్లు వచ్చె
తమ్మునిబుద్ధి రావణుతల వోయను
పమ్మి శ్రీవేంకటేశుని పట్టానకే యింతానాయ
యిమ్ముల నిట్టిదేవరనెట్టు నమ్మవచ్చును

(రేకు: 0102-02సం: 02-008)

అర్థం

పల్లవి: లోకంలో అందరికి దాహపు బాధ తీరుతుందని నూతులు తవ్వబోతే పిశాచాలు పుట్టాయట.

అలా మంచి చేయ బోతే చెడు జరుగుతుంది అని ఒక సామెత చెప్పినట్టు, రాములవారి కథలు ఉన్నాయి.

ఓ కోపాల లోకంలో ఉండే ప్రజలారా ! (కాతాళపు లోకులాల)రాములవారి కథలను ఆ దృష్టితో చూసారా ! (లోకంలో అధిక శాతం ప్రజలు కోపానికి వశులని అన్నమయ్య తీర్మానం. కాదనగలమా !)

చ. 1: సంతానం లేదు అని తెగ బాధ పడి, దశరథ మహారాజు పుత్ర కామేష్టి అనే మంచి పని చేసాడు.

దశరథుడు చేసిన మంచి పని లంక కొంప మీదికి వచ్చింది.(పై వచ్చె)

కష్టాలు పడే (ఆడి) రామావతారం – రాక్షసులకు బాధ కలిగించింది.

కీర్తి కరంగా లోకంలో వ్యాపించిన (తూఱి) సీతమ్మ పెండ్లిలో శివుని పెద్ద విల్లు రాముడు విరిచాడు. ఆ చప్పుడు లోకాలన్నింటికి భయం పుట్టిస్తే – ఈ రాముడు గారేమో సీతమ్మతో పెండ్లి పండుగ చేసుకొన్నాడు.

తడవ తడవకి (పాఱి పాఱి) వీరిని ఈ సీతారాములను ఎలా నమ్మాలో తెలియటం లేదు. (పైకి ఆక్షేపించినట్లు కనబడుతున్న ఈ అన్నమయ్య పంక్తులలో రాముని పరాక్రమం , కీర్తి వ్యంగ్యంగా పొగడబడ్డాయి)

చ. 2: చూడగా కైకేయి వాళ్ల నాన్నగారికి సంబంధించిన ప్రసిద్ధమైన కేకయరాజ్యము ఓర్వలేని (చుప్పనాతి) మంథర పాపంతో పేరు లేనిదయింది. (శిబి కొడుకు అయిన కేకయునివలనకేకయ రాజ్యము అని పేరు వచ్చింది)

సీతమ్మ సంతోషంతో మాయలేడి వేటకు గురయింది.

వ్యవహారంలో (వాడికె) సుగ్రీవునికి రాముడు చేసిన మేలు వాలికి ప్రమాద కరమయింది (గండాన వచ్చె)

పోలిక లేని(ఈ డుగాని) క్షత్రియుడైన (రాచపుట్టు) ఆ రాముడిని ఎలా నమ్మాలి?

(రాముడిని ఎలా నమ్మాలి అంటూ అతను పోలికలేని వాడని కవి పొగుడుతున్నాడు. జయహో)

చ. 3: ఒక్కసారిగా (ఉమ్మడిగా) కోతుల గుంపు అంతా కలిసింది. సముద్రము మీద నడవటానికి వీలయిన తాళ్లు– వంతెనలు ఏర్పడ్డాయి.(కట్లు వచ్చె)

తమ్ముడైన విభీషణుని బుద్ధి రావణుని తలతెగేటట్లు చేసింది

అసలు ఇదంతా అతిశయించిన (పమ్మి) వేంకటేశ్వరుని రూపంలో ప్రస్తుతం ఉన్న ఆనాటి రాముని పట్టాభిషేకం కోసమే జరిగింది.

ఇంత చేసిన మనో హరుడైన ఈ శ్రీరాముని ఎలా నమ్మవచ్చు?(నమ్ముకొంటే తరిస్తారని ఉపదేశం)

పరమార్థం

ఆత్మీయ సంభాషణల్లో "నువ్వు తక్కువ వాడివి కాదురా !" అని అప్పుడప్పుడు వాక్యాలు దొర్లుతుంటాయి.

ఇది పైకి నిందలా కనబడుతున్నా – లోపల పొగడ్త. ఈ అన్నమయ్య కీర్తన కూడా ఇదే వరుసలో నడిచింది. స్వస్తి.

91. వీరిడితనము

పిచ్చితనము అనే అర్థంలో వీరిడి తనము అనే ప్రయోగము అన్నమయ్య చేసాడు.

పల్లవి : అన్నిటా జాణడు అలమేలుమంగపతి
పన్ని నీకు మేలువాడై పరగివున్నాడు

చ1. పట్టినదే పంతమా పతితోడ నీకిప్పుడు
యిట్టె నిన్ను వేడుకోగా నియ్యకోరాదా
వొట్టి యప్పటినుండి నీవొడి వట్టుకొన్నవాడు
గట్టువాయ తనమేల కరగవే మనసు

చ2. చలములే సాదింతురా సారెసారెనాతనితో
బలిమి బిలువగాను పలుకరాదా
కలపుకోలు సేసుక కాగిలించుకున్నవాడు
పెలుచుదనములేల పెనగవే రతిని

చ3. చేరి ఇట్టె బిగుతురా శ్రీవేంకటేశ్వరునితో
మేరతో నిన్నేలగాను మెచ్చగరాదా
యీరీతి నిన్ను పెండ్లాడె యెడయక వున్నవాడు
వీరిడితనములేల వెలయవే మరిగి (27-562 1794వరేకు)

అలమేలుమంగమ్మ ఏదో చిలిపి తగాదాలో వేంకటేశ్వరుని దూరంగా నెడుతోంది. అన్నమయ్య ఒక చెలికత్తె రూపంలోకి మారిపోయి అమ్మవారికి "అలా చేయ కూడదే!" అంటూ పెద్దరికంతో మంచి మాటలు చెబుతున్నాడు.

❖

అన్నిట్లోనూ అలమేలుమంగ భర్త వేంకటేశుడు నేర్పరి . విలాసవంతుడు.

ప్రయత్నించి , సిద్ధపరచి నీకు వలపు కాడుగా, మంచివాడిగా ప్రవర్తిస్తున్నాడు.

చ1. ఇప్పుడు నీ భర్తతో పట్టినదే పంతమా? పట్టినోడుపర్కఅంటె చూసినోడుజెల్లఅంటడు అదుగో తోక అంటే ఇదుగో పులి అంటాడు. వేంకటేశు ని మీద ఎవరో చెప్పిన వన్నీ నమ్మద్దు. ఎందుకే ఇప్పుడవన్నీ!?

అదుగో క్షణములో దగ్గరికి వచ్చి తప్పయిపోయిందని నిన్ను వేడుకొంటున్నాడు కదా ! అంగీకరించవచ్చు కదా !

సిగ్గూ , చిమటా ఏమీ లేనప్పటినుంచి , అంత చిన్నతనందగ్గరినుంచి నీ ఒడిని పట్టుకొన్నవాడు కదటే!

ఇప్పుడింత గయ్యాళి తనమెందుకే! పాపం చూడు! ఆ వేంకటేశుడు ఎంత బేలగా చూస్తున్నాడో ! మనస్సు ను కరిగించవే !దయతో వాడిని చూడవే!

చ2. మాట్లాడితే వాడితోటి మాటి మాటికి పట్టుదలలు పోతావు. ఈర్ష్య చూపిస్తావు. ఏమన్నా బాగుందటే! ఎవరన్నా ఇలా చేస్తారా!

ఉదారంగా , సౌమ్యంగా అమ్మడూ అని పిలుస్తున్నాడు కదే ! పలకటానికి నీకేమయింది!?

స్నేహం చేసుకొని, దగ్గరితనం చూపిస్తూ కౌగిలించుకొన్నాడు కదే!

ఇంకా శుభ్రంగా వాడితో సుఖాలలో తగాదాపడు. ఊరికే సుఖాలను దూరం చేసుకొని ఈ కాఠిన్యాలు, నిర్దయలు ఎందుకే?

చ 3 : సరే! ఏదో తప్పు చేసాడని కాసేపు అనుకొందాం. ఇప్పుడు క్షమించమని దగ్గరికి చేరాడు కదా ! ఇంకా మా వేంకటేశునితో ఈ బిఱ్ఱెమిటే తల్లీ !

సుఖాల సరిహద్దు దగ్గర నీతో పరిపాలన చేసే సత్తా ఉన్నవాడు మాస్వామి. వాడిని కాస్త మెచ్చుకోవే ! నిన్ను ఈ విధంగా ఆత్మీయంగా పెండ్లి చేసుకొన్నవాడు. నిన్ను ఎప్పుడూ విడవకుండా ఉండేవాడు.

శుభ్రంగా మా వేంకటేశునితో కథా కాల క్షేపాలలో మోహాలలో మునిగిపోతూ ప్రకాశించవే తల్లీ !మా స్వామిని దూరంగా నెట్టే పిచ్చి తనాలు ఎందుకే!?

❖

(పదమూ, వ్యాఖ్యా, పాటా చదివాను. విన్నాను. అభినందనలు. అన్నీపాకాన పడుతున్నవి. వ్యాఖ్య సంవాద విశ్లేషణ అంచులు తాకుతున్నది. పద శరీరంలోని అంతర్యామిని భావింపజేస్తున్నది. యుగళ గాత్రం కవికీ, చెలికీ సంకేతాలు. రాగం విషయం సంగీతజ్ఞులు విశ్లేషించగలరు.

ప్రకృష్టబంధమైన కావ్య విస్తృతి 'ప్రబంధ' శరీర మైతే, దాని సూక్ష్మ రూపమైన 'పదం' శరీరి.

ఇలాంటి పదాలే పరిశోధకులకు ప్రేరకాలు. శ్రీ వే0కటపతి ఇందులో

'అలమేలుమంగపతి'గా వర్ణితుడు. అది పె.తి. ముద్ర. పెదతిరుమలయ్య తన పదాలన్నిటినీ తండ్రి ఆనతిని , తన విశిష్టమైనముద్రతోనే కూర్చుకొన్నా, వేర్పాటులేక తండ్రి పలికించినట్లుగానే పాడుకున్నాడు. రేకులలోనూ అలాగే చెక్కించుకొన్నాడు. మరి ఈ చర్చ ఇది మనకు పరిశోధన దృష్టితో మాత్రమే.

ఈ పాట లో 'తిరువెంకట' ముద్రగానీ, 'వెంకటనాథ' ముద్రగానీ లేకపోవడం – 'అలమేలుమంగపతి' ముద్ర ఉండడం గుర్తింపదగిన అంశాలు.

అన్నమాచార్యులను భావించినపుడల్లా నాకు పెదతిరుమలాచార్యుల తన్మయత వారి వాఙ్మయ సేవా మదిలో మెదిలే అంశాలు. (10-10-2015 face book annamaiah లో పెద్దలు వేటూరి ఆనందమూర్తిగారు ఈ నా వ్యాఖ్యను చదివి వ్రాసిన మాటలు)

92. వెన్నెలరేకులు

వెన్నెలంటే ఏకవికయినా చాల ఇష్టం. అన్నమయ్య కూడా అందుకు మినహాయింపు కాదు. వెన్నెలతో కవి అనుబంధాన్ని పెంచుకొంటాడు. ఇతర పదాలను కూడా వెన్నెలతో (లో) కలిపి మురిసిపోతాడు.

వెన్నెలకువ్వ (వెన్నెలకుప్ప), వెన్నెల గాదె బోయు(అసాధ్యమగు పనిని ప్రారంభించటం), వెన్నెలమొలక(చిన్ని వెన్నెల)వెన్నెల యెండలు(వేడి రగిలించే వెన్నెలలు) వెన్నెల బాయలు(వెన్నెల బయలు)వెన్నెల నాడు (పూర్ణిమ-) ఇలా ఎన్నో పదబంధాలు అన్నమయ్య సాహిత్యంలో చల్లదనాన్ని కురిపిస్తాయి.

సంస్కృత పదమయిన పౌర్ణమికి "వెన్నెలనాడు" అని చక్కటి అనువాదం చేసిన అన్నమయ్య శేముషికి నమస్కరిస్తూ , వెన్నెల రేకులను వెదజల్లిన ఒక అన్నమయ్య కీర్తనను తలచుకొందాం

పల్లవి: చిత్తగించుమిదె చెలియవిలాసము
పొత్తులుగలపీ భోగంబులకు

చ 1: వెన్నెలరేకులు వెదచల్లీ నదె
సన్నల సెలవుల సకియా
కన్నులమొక్కులు కానుకలొసగీ
నిన్ను జూచి యిదె నివ్వెరగులను

చ 2: జక్కవపిట్టల సంతముసేసీ
అక్కున గప్పుచు నతివా
చక్కనిమోవిని చవులటు గొలిపీ
నెక్కొని నీపై నేస్తంబులను

చ 3: పలుకుఉ దేనియలు పలుమరుజిలికీ
మెలుపురతుల నలమేల్ మంగ
యెలమిని శ్రీవేంకటేశ కూడితివి
అలరీ నీతో నదె సరసములా (రేకు: 1835-3సం: 28-200)

అర్థం

పల్లవి: వేంకటేశ్వరా ! నీ స్నేహితురాలు అలమేలు మంగ సొగసులు, ఒయారాలు చెబుతాను. మనసుపెట్టి, సావధానంగా విను. ఆమె ప్రపంచంలో ఎన్ని భోగాలున్నాయో అన్ని భోగాలను ఉమ్మడిగా (పొత్తుల) ఒకేసారి కలపి నీకు అందచేస్తుంది.

చ 1: వేంకటేశ్వరా ! నీ స్నేహితురాలు పెదవుల చివర చేసే సంజ్ఞల ద్వారా(సన్నల సెలవుల) వెన్నెల రేకులను నీపై వెదజల్లుతోంది. నిన్ను చూచిన పారవశ్యములలో (నివ్వెరగులను) – ఇదిగో –కళ్లలో మొక్కుల కానుకలు ఇస్తోంది.స్వీకరించవయ్యా !

చ 2: చక్రవాక పక్షులను సొంతము చేసుకొని (సంతముసేసీ) తన వక్షస్థలములో (అక్కున) వాటిని ఎగరనీయకుండా కప్పుతోంది. (చక్రవాక పక్షులవంటి కుచములు గలది అనటానికి ఇదొక అందమైన వక్రోక్తి)

కమ్మటి పెదవిపై ఇష్టములు ప్రదర్శిస్తూ
నీపై స్నేహాలను పాదుకొలుపుతోంది. (నెక్కొని)

చ 3: మాటలలో తేనెలను అనేకసార్లు చిలికి
అలమేలు మంగ రతులలో నేర్పును(మెలుపు) చూపించింది.
శ్రీ వేంకటేశా ! తృప్తిగా (ఎలమి) ఆమెతో కలిసావు.
సరసాలలో నీతో ఆమె కూడా ప్రకాశించింది.

పరమార్థం

కలువరేకులు, పూల రేకులు – ఇలాంటివి కవిత్వాలు చదివే వాళ్లందరికి పరిచితాలు కాని, వెన్నెల రేకులను సాహిత్యానికి పరిచయం చేసిన ఘనత అన్నమయ్యదే.

పెదవుల చివర చేసే సంజ్ఞల ద్వారా వెన్నెల రేకులను నాయిక స్వామిపై ఎలా వెదజల్లుతుందండీ ? పెదవులచివర గుర్తులేమిటండీ ? అవి నాయకునికి ఎలా అర్థమవుతాయండీ ? వాటికి వెన్నెలరేకులకు పోలిక ఎలా కుదురుతుందండీ – ఇలా ఎవరన్నా ప్రశ్నిస్తే– శిరసి మాలిఖ. – మాలిఖ. అటువంటి వారికి అన్నమయ్య కవిత్వాన్ని నివేదించే అదృష్టాన్ని – ఓ బ్రహ్మ దేవుడా ! నా నుదుటి మీద రాయకు. స్వస్తి.

93. వెల్లివిరి

శ్రీ అన్నమాచార్యులు, అక్కలమ్మల కుమారుడు శ్రీ తాళ్లపాక పెద తిరుమలా చార్యులు అందరికి తెలిసేటట్లుగా అను అర్థంలో **హరి నీవు నాకు లంచమేమిచ్చేవు** అను కీర్తనలో **వెల్లివిరిగా** అను పద ప్రయోగము చేసారు. ఓ హరీ ! నువ్వు నాకు లంచమిచ్చినా– నువ్వు చేసిన తెలివి తక్కువ పనులు నీ భక్తులకు చెప్పకుండా ఉంటానా? అంటూ అయ్య అన్నమయ్య పద్ధతిలో దేవుడు చేసిన ఘన కార్యాలను నిందాస్తుతిలో పెద తిరుమలాచార్యులవారు వర్ణించిన కీర్తన ఇది.

పల్లవి: హరి నీవు నాకు లంచ మేమిచ్చేవు అన్నిమర్మములు చెప్పుదునా
దొరవంటా మొక్కి నీ దాసులతోడ తుచ్ఛపు నీ చేతచెప్పుదునా

చ.1: ఆల్లనాడు నీవు మైలన్న చొక్కయ్య నంటుకొన్నసుద్దిచెప్పుదునా
గొల్లెతలవాడ చీకటి నీ తప్పు కోరి చేసినది చెప్పుదునా
వెల్లివిరిగా రేపల్లెలోపలి వెన్నముచ్చిమలు చెప్పుదునా
తల్లిబిడ్డ నొక్కవానిగ జేసిన ధర్మపుతగవు చెప్పుదునా

చ.2: మేటి మీనవై ఆకటికి జిన్నమీల దిన్నసుద్ది చెప్పుదునా
పాటించి నీ సరిబావమరదికి బండి రొప్పినది చెప్పుదునా
గాటపు టసురకామినులతోడ కల్ల లాడినది చెప్పుదునా
యీటువెట్టుకొని నీపు బోయదాని యెంగిలి దిన్నది చెప్పుదునా

చ.3: దీనవృత్తిఁ బోయి బలిచక్రవర్తిఁ దిరిసికొన్నది చెప్పుదునా
ఆనించి శ్రీపతిపాదాలు నీమెడ నంట గట్టుకొంట చెప్పుదునా
దానవాంతక శ్రీ వేంకటేశ్వర దైవమని నిన్నుజెప్పుదునా
పానిపట్టి శరణంటే గాచేట పర మేకాంతము చెప్పుదునా

(పె.అ.రేకు: 0003-04సం: 15-017)

అర్థం/పరమార్థం

పల్లవి : 1. హరీ! నువ్వు నాకు లంచము ఏమిస్తావు. నీకు అంత శక్తి లేదులే. నువ్వు లంచమిచ్చినా నీ ఘన కార్యాలు నేను చెప్పకుండా ఉంటానా ?
2. నువ్వు దొరవే . నీకు మొక్కుతాను.
కాని, నీ సేవకులయిన భక్తులకు నీ తుచ్ఛపు పనులు– దుర్మార్గపు పనులు

చెప్పనా !చెప్పకుండా ఉంటానా !?

01 వ చరణము : 1. మహాను భావా ! ఆనాడు చొక్కయ్య గుట్టమీద మైలన్న చొక్కయ్య నంటుకొన్న సంగతి చెప్పమంటావా !(నిజామాబాద్ జిల్లా భీంగల్ మండల కేంద్రంలో చొక్కయ్య గుట్ట ఇప్పటికి చూడవచ్చు.ఇక్కడ నరసింహ స్వామి పేరు చొక్కయ్య . ఆయనకు మైలన్న చొక్కయ్య అని ఇంకొక పేరున్నట్లుంది.ఇక్కడ పూర్వం అంటూ సొంటూ ఉండేది కాదు. శుచికి, అశుచికి పెద్ద భేదం లేదు. అన్నిటిని స్వామి నైవేద్యంగా స్వీకరిస్తాడు. శుచికి, అశుచి పాటించని ఆనాటి సంగతి చెప్పమంటావా అని నాయిక బెదిరింపు)

2. ఇక గొల్ల స్త్రీలు ఉండే వీధిలో చీకట్లో నువ్వు కోరి చేసిన తప్పు కథా కమామిషు చెప్పమంటావా !

3. అందరికి తెలిసేటట్లుగా (=వెల్లివిరిగా) రేపల్లెలో తమరు చేసిన వెన్న దొంగతనాలు (=ముచ్చిమలు)చెప్పుదునా !

4. తల్లి ఉత్తర. బిడ్డ పరీక్షిత్తు. అశ్వత్థామ ప్రయోగించిన అస్త్రము తల్లి ఉత్తర గర్భములో ఉన్న పరీక్షిత్తుకు ప్రాణ సంకటమయింది. అప్పుడు అందరూ కృష్ణుని వేడుకొన్నారు. "నేను సదాబ్రహ్మచర్యమును అవలంబించి, సత్యము పలుకుతూ, ధర్మము తప్పని వాడిని అయితే ఈ బాలుడు బ్రతుకుగాక "(భారతము అశ్వమేధ పర్వము తృతీయాశ్వాసము) అని శ్రీకృష్ణుడు పలికాడు. బిడ్డ బతికాడు.

తల్లి బిడ్డ ఆనందంలో ఒక్కటయ్యారు. ఆరకంగా వాళ్లని అనందంలో ఒక్కవానిగా చేసాడు కృష్ణుడు.

స్వామీ ! ఆ ధర్మపు తగవు నాకు అర్థం కావటంలేదు. చెప్పమంటావా! ఎంతోమందిని పెళ్లి చేసుకొన్న తమరు బ్రహ్మ చర్యము పాటించానని చెప్పటం ఏమిటి? దానిని నిజం చేస్తూ ఆ బిడ్డ బతకటం ఏమిటి? ఎవరన్నా వింటే నవ్వుతారు కదయ్యా! ఆ కథా కమామిషు మళ్లీ చెప్పమంటావా?

02వ చరణము : 1. మత్స్యావతారములో పెద్ద చేపగా మారి , అనేక చిన్న చేపలను తిన్నావు. ఆ చేపలను తిన్న కథ చెప్పమంటావా ?

2. నీరథం (=బండి) వెంట రొప్పుతూ పరిగెత్తుతూ "మా సరివాడవా మా పాప గొనిపోవ" అని నిన్ను గద్దించిన నీ సరి (=సమమైన) బావమరిదిని రుక్మిని ఎంత చక్కగా ఆదరించావో ! (=పాటించి) (ఓ తుంటరోడా ! దేంట్లో సమమని అని అడక్కు.)

పాపం ! నీ బావ మరిది రుక్మిని బంధించి తల, మూతి గొరిగావు. ఏమి ఆదరించావు .

3. త్రిపురసంహారానికై నువ్వు ధరించిన అవతారం బుద్ధావతారం.

" త్రిపురాసురులు వేదాచారాలను పాటిస్తున్నారు. వారి భార్యలు పతివ్రతా శిరోమణులు. బ్రహ్మ వరంతో అభేద్యమైన నగరాలు, అమృతకూపం లభించాయి. అందుచేత వారిని ధర్మభ్రష్టులుగా చేసి, అమృతకూపాన్ని నిర్మూలిస్తే తప్ప జయటం సాధ్యం కాదు" అని దేవతలకు మాట ఇచ్చావు.

ఆ తరువాత ఒక సన్యాసి రూపం లో త్రిపురాసురుల కొలువులో ప్రవేశించావు. వారిని తన మాయమాటలతో ఆకట్టుకొని. వేదవిహితమైన ధర్మాలు నిరర్థకాలని, సదాచారమనే దానికి అసలు అర్థం లేదని, సుఖసంతోషాలతో యదేచ్ఛగా జీవించటమే పరమార్థమని వాదించి వారిని విశ్వసింపచేసి త్రిపురాసులను ధర్మభ్రష్టులు చేసావు.

ఆ తరువాత త్రిపురాంగనల అంతఃపురానికి వెళ్ళావు. శిలలకు పూజచేస్తే ప్రయోజనం లేదని, దానికి మారు అశ్వత్థ వృక్షానికి (రావి చెట్టుకు) పూజ చేస్తే కోరుకున్నవన్నీ లభిస్తాయనీ నమ్మించావు.. శుక్రవారం నాడు సుస్నాతలై వివస్త్రలై అశ్వత్థవృక్షాన్ని ఆలింగనం చేసుకుంటే మనోవాంఛలన్నీ ఫలిస్తాయని ఒక వ్రతవిధానంలా బోధించావు.

ఆ అసురాంగనలు నీ మాటలు నమ్మి శుక్రవారం ఉదయాన్నే స్నానం చేసి వివస్త్రలుగా తమ ఉద్యానానికి వెళ్ళారు. అప్పటికే నువ్వు అశ్వత్థరూపం ధరించావు.. త్రిపురాంగనలు ఆ చెట్టును కౌగలించుకున్నారు. ఆశ్వత్థనారాయణు డవైన నీ ఆలింగనసుఖాన్ని వారు అనుభవించారు.ఆ విధంగా త్రిపురాసురులను ధర్మభ్రష్టులు చేసావు. త్రిపురాంగనల పాతివ్రత్యబలాన్ని నశింపచేసావు.

ఇవన్నీ మళ్లీ మరొకసారి చెప్పమంటావా !?

4. సమానము చేసి, పోల్చి(=ఈటువెట్టి) ఆ బోయకన్య శబరి పెట్టిన ఎంగిలి పండ్లు తిన్నావు. ఆ కథ చెప్పమంటావా !

03వ చరణము :

1. దరిద్రపు నడవడికతో (=దీన వృత్తి) ఆ బలి చక్రవర్తి దగ్గరికి వెళ్లి , బిచ్చ మెత్తుకొన్న కథ చెప్పమంటావా !?

2. అలకపూనిన సత్య భామ పాదాలకు తలను నొక్కి(=ఆనించు) , ఆవిడ ఒక్క తన్ను తంతే ఆ పాదాలను నీతలకి, మెడకు చేర్చిన (=అంటగట్టు)కథ చెప్పమంటావా!

3. దానవులను చంపిన ఓ వేంకటేశ్వరా ! ఇన్ని చేసిన నిన్ను దైవమని నేను చెప్పమంటావా !

4. ప్రయత్నించి(=పానిపట్టి) నీకు శరణు అని చెబితే రక్షించే నీ శ్రేష్ఠమయిన ఏకాంతము గురించి చెప్పమంటావా !

❖

94. సహజి

సొమరిపోతు అనే అర్థంలో సహజి అనే పద ప్రయోగాన్ని అన్నమయ్య **మహినుద్యోగి గావలె** కీర్తనలో చేసాడు. అన్నమయ్య సామాజిక కవి.భక్తితో పాటు సమాజంలోని చీకటి కోణాలను స్పృశించి, వెలుగు రేఖలను అందించాడు. మానవులు సోమరులు కాకూడదని,మనిషన్నవాడు నిరంతరం ఏదో పని చేస్తూనే ఉండాలని మహినుద్యోగి గావలె కీర్తనలో తెలిపాడు.

పల్లవి: మహినుద్యోగి గావలె మనుజుడైనవాడు
సహజివలె నుండేమీ సాధింపలేడు

చ.1: వెదకి తలచుకొంటే విష్ణుడు గానవచ్చు
చెదరి మచితే సృష్టి చీకటౌ
పొదలి నడచితేను భూమెల్లా మెట్టి రావచ్చు
నిదిరించితేగాలము నిమిషమై తోచు

చ.2: వేడుకతో జదివితే వేదశాస్త్రసంపన్నుడౌ
జాడతో నూరకుండితే జడుడౌను
వోడక తపసియైతే వున్నతోన్నతుడౌ
కూడక సోమరియైతే గుణహీనుడౌను

చ.3: మురహరుఁ గొలిచితే మోక్షము సాధించవచ్చు
వెరవెగకుండితే వీరిడియౌను
శరణంటే శ్రీవేంకటేశ్వరుడు రక్షించును
పరగ సంశయించితే పాషండుడౌను

(రేకు: 0147-02సం: 02-212)

సహజి అంటే సహజమైన వాడు.పుట్టినవాడు పుట్టినట్టే ఏ పని లేనివాడు అని అర్థం పెద్దలు చెప్పారు.మొత్తం మీద సహజి అంటే సోమరిపోతు అని చెప్పుకోవచ్చు. పని చేయనివాడు- తనలోని శ్రమ గుణాన్ని లోకానికి పంచేయని వాడు -తనకు తానుబరువవటమే కాదు. లోకానికి కూడా బరువవుతాడు.లోకంలో పుట్టిన ప్రతివాడు ఏదో ఒక మంచి పని నిరంతరం చేస్తూనే ఉండాలి.నేనేమీ చేయలేననే వాడు ఏమీ సాధించలేడు.పని చేయకుండా తిండి తినేవాడిని దొంగ అంది

వేదం.ఆ వేద వాక్యానికి అందమైన భాష్యం అన్నమయ్య పల్లవి.

బాలకృష్ణుడు వెదికేతే కాని పట్టుబడేవాడు కాడు.దీనివెనకాల ఒక రహస్యముంది. అతను వెతుకదగిన వాడు అని ఉపనిషత్తు భగవంతునికి నిర్వచన మిచ్చింది. అందుకే అన్నమయ్య వెతికి తలుచుకొంటే విష్ణుడు కనబడతాడని చెప్పాడు. నిరంతర సాధన చేయాలి.మనస్సులో స్వామి రూప ప్రతిష్ఠ జరిగిన తర్వాత, ఆయనని తలుచుకోవటం మానుకోకూడదు.ఒక వేళ నీ మనస్సు చెదిరి మరిచిపోతే– ఈ ప్రపంచం ఒక చీకటి గుడారమవుతుంది.నువ్వు వెలుగును చూడలేని గుడ్ల గూబవవుతావని అన్నమయ్య హెచ్చరిక.

నడక మొదలు పెడితే చీమ కూడా వేల మైళ్ళ దూరం దాటుతుంది.ప్రయత్నం మొదలు పెట్టక పోతే గరుత్మంతుడుకూడా ఒక్క అడుగు ముందుకు వేయలేడు.దీనినే అన్నమయ్య తనదైన శైలిలో చెప్పాడు. భూమెల్లా ఒక పనికి సంకేతం.చైతన్య శీలివయితే ఏదయినా సాధిస్తావు. నిద్ర పోతుంటే –అనగా పనిచేయకుండా ఉంటే కాలం నీకోసం ఆగదు.కళ్ళు లేక పోయినా కావ్యాలు వ్రాసిన వారున్నారు. కాళ్ళు లేకపోయినా శిఖరాలు ఎక్కిన వారున్నారు.కళ్ళు, కాళ్ళు ఉండి కూడా, పెద్దలిచ్చిన ఆస్తితోపాడె మోసే వాళ్ళకి కూడ బరువై చరిత్రలో ఆనవాళ్ళు లేకుండా మిగిలిన వాళ్ళున్నారు.ప్రయత్న శీలివి కమ్మనే పద కవితా పితామహుని వాక్యం శిరోధార్యం.

కష్టపడి చదవటం కాకుండా , ఇష్టపడి చదవాలని ఈ నాటి విజేతల గ్రంథరచయితలు ఘోషిస్తున్న విషయాన్ని కొన్ని వందల ఏళ్ళక్రితం అన్నమయ్య అనే మానసిక శాస్త్ర వేత్త చెప్పాడు.ఇష్టం గా చదివితే వేద శాస్త్రాలు నీకు బాగా వస్తాయి. ఏదో నామకః – చదివినట్టుగా తల చేతులు ఊపుతూ సైగలు చేస్తుంటే,చదువురాని మందమతివవుతావని అన్నమయ్య హెచ్చరించాడు.అమ్మ బాబోయ్ ! నేనిన్ని పుస్తకాలు చదవాలా! అనుకొనే ఆలోచనా దశనుంచి 'నేననుకొన్న విషయానికి సంబంధించి ఇంకా చాల పుస్తకాలు చదవాలి అనే ఆలోచనను విద్యార్థిలో కలిగించే విద్యా వ్యవస్థ రావాలని కవి ఆకాంక్ష.

తపస్సు చేయటంలో ఓడిపోకు. ఉన్నతుడివి అవుతావు. ఓడిపోయి ఇంకా ఏం చేస్తానులే అనుకొని సోమరివయ్యావా!గుణ హీనుడివి అవుతావు. తపస్సంటే ముక్కు మూసుకొని కూర్చొని చేసే ధ్యానమే కాదు.ఒక పని మీద సంపూర్ణమైన

ఏకాగ్రత.అ ఏకాగ్రతను వదులుకోవద్దని ఆంతర్యం. బ్రహ్మదేవుడు నారదుడిని పిలిచి మూడు లోకాలు తిరిగి అక్కడి పరమార్థం చూసి రమ్మన్నాడు. తల మీద దీపం పెట్టుకుని... దీపం ఆరిపోకుండా, ఒరిగిపోకుండా వెళ్ళాలని ఒక నిబంధన పెట్టాడు.. సరేనన్నాడు నారదుడు. త ల మీద దీపం పెట్టుకుని మూడు లోకాలు తిరగడానికి బయలుదేరాడు. తల మీద దీపం మీదే ధ్యాస ఉంచి జాగ్రత్తగా లోకాలన్నీ తిరిగి బ్రహ్మ దగ్గరకు వచ్చాడు. నారదుడిని చూడగానే సంతోషంతో మూడు లోకాలలోని విషయాలు చెప్పమని అడిగాడు బ్రహ్మ. తన ధ్యాసంతా తల మీద ఉన్న దీపం మీద ఉంది కనుక లోకాలు చూడలేకపోయానని చెప్పాడు నారదుడు. అతనిలోని ఏకాగ్రతకు సంతోషించాడు బ్రహ్మదేవుడు. అటువంటి ఏకాగ్రత అవసరమని , జీవితంలో ఎప్పుడూ ఓడిపోవద్దని అన్నమయ్య సందేశం.

ముందునే రాక్షసునిచంపిన శ్రీహరిని ధ్యానిస్తే మోక్షం లభిస్తుంది. ఉపాయం లేకపోతే పనికి మాలిన వాడివవుతావు. ఉపాయాలు ఏడు రకాలు సామము, భేదము, దానము, దండము. మాయ, ఉపేక్ష, ఇంద్రజాలము. నాయకుఁడు నాయిక యొక్క కోపమును పోఁగొట్టునపుడు ఉపయోగించెడు ఉపాయములు ఆరు. సామము, భేదము, దానము, నతి, ఉపేక్ష, రసాంతరము. అన్నమయ్య చెప్పిన ఉపాయానికి ఇవన్నీ కాకుండా పొందటం అనే అర్థం చెప్పుకొంటే సమన్వయం అవుతుంది. స్వామిని ఈ జన్మలో పొందకుంటే జన్మ సార్థక్యం లభించదని వెర్రి వాళ్లమవుతామని ఆన్నమయ్య భావంగా గ్రహించవచ్చు.

స్వామిని శరణు వేడుకొంటే అతను తప్పకుండా రక్షిస్తాడు. ఎందుకు శరణు వేడాలని సందేహపడితే వేద బాహ్యుడివి అవుతావని కవిసందేశం. ఆధ్యాత్మికతకు, లౌకికతకు మధ్య వంతెన వేసిన కవులు చాలా అరుదు. వారిలో అన్నమయ్య ప్రథమ గణ్యుడు.

95. సమేళి

ప్రాస పదాలతో అన్నమయ్య నడిపించిన కీర్తన వలపులు వలపులు వయ్యాళి. ఇందులో సమేళి పదానికి నిఘంటువులు అర్థాన్ని ఇవ్వలేదు. సందర్భానుసారంగా సన్నిహితుడు అనే అర్థం సరిపోయినట్లు అనిపించింది. కీర్తన మొత్తం చదివిన తర్వాత అందరూ ఆ అర్థాన్ని అంగీకరిస్తారని ఆకాంక్ష.

పల్లవి: వలపులు వలపులు వయ్యాళి
చలమరి మరుడును సమేళి

చ.1: నెలతమోమునకు నీకనుచూపులు
నిలువున ముత్తెపు నివాళి
కొలదికి మీరిన గురుకుచములకును
తొలకు నీమనసు దువాళి

చ.2: వనితనిండు జవ్వన గర్వమునకు
ఘనమగు నీరతి కరాళి
వెనకముందరల వెలదిమేనికి నీ
పెనగు గోరికొన పిసాళి

చ.3: పడతికోరికల భావంబునకును
కడుగడు నీతమి గయాళి
చిడిముడి మగువకు శ్రీ వేంకటపతి
విడువనికూటపు విరాళి (రేకు: 0150-2సంపుటం: 07-292)

భావం :

వేంకటేశ్వరుడు,అలమేలు మంగ మధ్య నడిచిన ప్రేమను అన్నమయ్య వలపుల విస్తట్లో వడ్డిస్తున్నాడు.

ఓ వేంకటేశ్వరా! నీకు అమ్మవారికి మధ్య నిండు ప్రేమలు ఆ నిండు ప్రేమల విహారాలు చాలాబాగున్నాయి. పనిలో పనిగా ఆ అసూయా శీలుడైన మన్మథుడు మీదగ్గరకు చేరాడు స్వామీ! నీ కళ్ళ చూపులు మా అమ్మవారికి నిలువునా నిండారా పోసిన ముత్యాల హారతులు.పరిగెత్తేటప్పుడు ఒకే వేగాన్ని హెచ్చు తగ్గులు లేకుండా పాటించే గుర్రపు పరుగు లా నీమనస్సు మా అమ్మవారి బరువెక్కిన స్తనాల

గమ్యం వైపు ప్రయాణం చేస్తోంది.

మా అమ్మవారి యవ్వనమనే గర్వానికి నీ రతి క్రీడ ఒక విజృంభణా శక్తి.ఆమె శరీరముయొక్క వెనక ,ముందు ప్రదేశాలపై నీ గోటి గాటు ప్రకాశిస్తోంది.

మా అమ్మవారి కోరికలు భావాలతో విజ ృంభిస్తుంటే,వాటితో నీకోరిక - ధిక్కరిస్తూ మాట్లాడుతూ గయ్యాళితనం చూపుతోంది. మనస్సులో తొందరపడుతుండే మా అమ్మవారికి నీవిడువని కలయిక మోహము మా బాగాసరిపోయింది స్వామి!

96. సింగిణి

ఇంద్రధనుస్సు" అను సంస్కృత పదానికి అన్నమయ్య తన సాహిత్యంలో వాడిన అచ్చ తెలుగు పదం "సింగిణి." తెలంగాణా ప్రాంతంలో దీనినే సింగిడి అంటారు.నెల్లూరు ప్రాంతములో అయితే ఒళ్లు విరచుకొనుట అనే అర్థంలో "సింగిడించుకొను" అంటారు.

ఒక అందగత్తె ఒళ్లు విరచుకొనే క్రియ- సింగిణి (ఇంద్రధనుస్సు) యొక్క అను భూతిని కలిగించటం వల్ల ఎవరో ఈ "సింగిడించుకొను" అను పద బంధాన్ని కల్పించి ఉంటారు.అది వ్యాప్తి లోకి వచ్చింది.

ప్రజలతో మమేకమై తిరిగిన అన్నమయ్య ప్రజా బాహుళ్యములో ఉన్న ఈ "సింగిణి" పదానికి తన సాహిత్యంలో చోటు కల్పించాడు.

ఆ సింగిణి కీర్తన చదువుకొందాం.

పల్లవి: ఇదివో మంచివేళ యికనెన్నడు
యెదుటనే మరుని జయించవచ్చు నిప్పుడు

చ 1: కాంతనిలువెల్లా నీకు కనకపురథము
బంతినున్న పిఱుదులే బండికండ్లు
పొంతనున్న కుచములే పూవులగుత్తులు నీకు
ఇంతటను మరుని జయించవచ్చు నిపుడు

చ 2: వెలదిపయ్యదకొంగు విజయధ్వజము నీకు
చెలువబొమ్మలే సింగిణివిండ్లు
అలరినచూపులే అక్షయబాణములు
యెలమి మరుని జయించవచ్చు నిపుడు

చ 3: అలమేల్మంగకాగిటి హస్తములే పగ్గాలు
చెలగినపెనుగొప్పే శిఖరము
నెలవై శ్రీవేంకటేశ నీవే రథికుడవు
యిలలోన మరుని జయించవచ్చు నిపుడు

(రేకు: 1363-3సం:23-375)

అర్థం

పల్లవి: ఓ వేంకటేశా ! ఎదురుగా ఉన్న మన్మథుని ఇప్పుడు జయించటానికి ఇదుగో –మంచి వేళ కుదిరింది. ఇక ఇలాంటి సమయం ఎన్నడూ రాదు.

చ 1: యుద్ధానికి వెళ్లాలంటే రథం, రథానికి అలంకారంగా పూల గుత్తులు ఇలాంటి సామగ్రి ఉండాలంటావా ! ఎదురుగా ఉన్న నీ ప్రియురాలు అలమేలు మంగమ్మ పూర్తిగా నీకు బంగారు రథం.

వరుసగా ఉన్న పిరుదులు ఆమె శరీరమనే రథానికి ఉన్న బండిచక్రాలు దగ్గరగా ఉన్న ఆమె స్తనములే నీకు పూవుల గుత్తులు. ఇక బయలుదేరు. ఇప్పుడు ఆమన్మథుని జయించటానికి కావాలిసినవన్నీ సమకూరాయి.

చ 2: నీ అలమేలు మంగమ్మ పైట కొంగు నీకు విజయము కొరకు ఎగురవేసే జెండా వంటిది.

ఆమె కనుబొమలు ఇంద్రధనుస్సులు.

తన యొక్క సంతోష కరమైన చూపులు తరిగిపోని బాణాలు.

ఆనందంతో నువ్వు ఇప్పుడు ఆ మన్మథుని జయించవచ్చు.

చ 3: అలమేల్మంగ కౌగిలిలోని నీ చేతులే రథాన్ని నడిపించే పగ్గాలు. ప్రకాశించు ఆమె పెద్ద కొప్పు (తలయందు దోపిన వెండ్రుకలముడి) రథము యొక్క శిఖరం (కొన) నివాస స్థానమయిన శ్రీ వేంకటేశా ! నీవే రథమునెక్కి యుద్ధము చేసేవాడివి ఇక చెప్పేదేముంది. ఈ భూలోకంలో – చాలా తేలికగా – ఇప్పుడు– ఆ మన్మథుని జయించవచ్చు.

పరమార్థం

కవులు మన అనందం కోసం ఎలాగయినా రాయగలరు.

అమ్మని బంగారు రథమని అన్నమయ్య అన్నాడు.

తెనాలి రామకృష్ణుడు కాశీ నగరంలో ఉన్న రథాలు త్రిపురాసుర సంహారంలో ఉన్న శంకరుని రథాన్ని చూసి ఎగతాళి చేస్తున్నాయన్నాడు.

సారథి ఛాందసుండు బడిసాగదు చక్రయుగంబు ప్రాత పం
చారపు గుఱ్ఱముల్ రథియు శౌర్యమునం దరమాని సాత్మ వి
స్తారము ఖండఖండములు తానఉట మాసరి" యంచు దత్పురిం
దేరులు నవ్వు శంకరుని తేరిని గేతన కింకిణీ ధ్వనిన్ (పాండురంగ మాహాత్మ్యం)

త్రిపురాసుర సంహారానికి శివుడు వెళ్ళినప్పుడు, భూమి ఆయనకు రథంగా, బ్రహ్మ సారథిగా సూర్య చంద్రులు రథానికి చక్రాలుగా , నాలుగువేదములు ఆ రథానికి గుఱ్ఱాలుగా ఉన్నాయి.

కాశీపురంలో ఉన్న రథాలు శంకరుని రథాన్ని చూసి మా ముందు నువ్వేమి పనికి వస్తాయని నవ్వుతున్నాయట.

ఎందుకంటే శివుని రథ సారథి బ్రహ్మ ఛాందసుడట(చాదస్తుడు. అసలు ఛాందసుడు అంటే వేదపండితుడు) రథచక్రాలయిన – సూర్యచంద్రులలో. ఒకటి పెద్దది ఒకటి చిన్నది –ఇక కట్టిన గుఱ్ఱాలు. అంటే మార్పులేని పాతరీతి నడకలు కలిగిన వేదాలు .ఇక రథి శివుడు అరమానిసి (అర్ధనారీశ్వరుడు) కదా! రథం భూమి. అది అతుకులు బొతుకులు. ఇటువంటి లోపాలున్న శివుని రథాన్ని కాశీపురిలోని మేటి రథాలు తమకి కట్టిన జెండాకి ఉన్న చిరుగంటల చప్పుళ్లతో ఎగతాళి చేస్తున్నాయి.

కాశీ పురంలో ఉన్న రథాల గొప్పతనాన్ని చెప్పటానికి శివుని రథాన్ని తెనాలి వారు కవిత్వంలో తక్కువ చేసారు.

ఈ కీర్తనలో అలమేలు మంగమ్మ అనే రథం ముందు మన్మథుని రథం తక్కువని, – ఆమాట కొస్తే – మన్మథ సామర్థ్యం ఏపాటిదని– అన్నమయ్య– మన్మథుని ఇక నువ్వు జయించేస్తావని వేంకటేశునితో ఆత్మీయ భాషణ చేసాడు.

ధనుః పౌష్పం ...(సౌందర్య లహరి 6) శ్లోకంలో దక్షిణ దిక్కుగా వీచే మలయమారుతము మన్మథుని రథంగా శంకర భగవత్పాదులు వర్ణించారు.

అన్నమయ్య అలమేలు మంగమ్మ వేంకటేశ్వరుని రథంగా ఈ కీర్తనలో వర్ణించారు.

జీవన యాత్రలో దేహమే రథంబీ ఆత్మ రథి, బుద్ధి సారథి, మనస్సు పగ్గాలు, ఇంద్రియాలు గుర్రాలు, విషయాలు బాటలు. ఆ రథి అయిన వేంకటేశుడనే పరమాత్మని రథిక శబ్దంతో ఈ కీర్తనలో అన్నమయ్య జ్ఞప్తి చేసాడు.

మరి అలాంటి పరమాత్మని – మన్మథ విజయానికి కదలమని – లౌకిక పరంగా ఎందుకు కవి వ్రాసాడు?.

మన కోసం.

మన ఆనందం కోసం.

పరమాత్మ విషయాలను కవిత్వంలో తలచుకొంటూ ఆనంద పడే మనస్సు క్రమంగా ఆయనవైపు మళ్లాలని, ఆయనలో లీనం కావాలని కవి ఆశయం.

అన్నమయ్య ప్రభావంతో కూచిమంచి తిమ్మకవి **"వింతయగు సింగిణీవిండ్లు వీనిబొమలు."** (రాజశేఖర విలాసము 2 ఆ.) అని నాయకుని కనుబొమలు ఇంద్రధనుస్సులని చెప్పాడు.

ధనుస్సు – ఇంద్రధనుస్సు

ఈ రెండింటిలో ఇంద్ర ధనుస్సు మనలిని ఎక్కువగా ఆకర్షిస్తుంది.

అన్నమయ్య ప్రతి శృంగార కీర్తన ఒక ఇంద్రధనుస్సు. స్వస్తి.

97. సొగిసి

"ఒరేయ్! నీకిది చాలదా! ఇంకా ఎక్కువ కావాలా! ఉన్నదాంతో సరిపెట్టుకోరా "ఇది తెలుగు వాళ్ళు మాట్లాడుకొనే నిత్య సంభాషణలో కొన్ని భాగాలు. ఇందులో ఎక్కువమంది ఉపయోగించే "చాలదా!" అను క్రియతో అన్నమయ్య **'చాలదా హరి నామ సౌఖ్యామృతము'** అంటూ కీర్తన ప్రారంభించాడు. ఇందులో అందమగు, ఇంపగు అను అర్థాలలో **సొగిసి** అను విచిత్ర పద ప్రయోగము చేసాడు.

పల్లవి: చాలదా హరినామ సౌఖ్యామృతము దమకు
చాలదా హితవైన చవులెల్ల నొసగ

చ.1: ఇదియొకటి హరినామ మింతైనజాలదా
చెదరకీ జన్మముల చెలు విడిపించ
మది నొకటె హరినామ మంత్రమది చాలదా
పదివేలు నరకకూపముల వెడిలించ

చ.2: కలదొకటి హరినామ కనకాద్రి చాలదా
తొలఉగుమని దారిద్ర్యదోషంబు చెఱచ
తెలివొకటి హరినామ దీపమది చాలదా
కలుషంపు కఠినచీకటి పారద్రోల

చ.3: తగువేంకటేశు కీర్తన మొకటి చాలదా
జగములో కల్పభూజంబు వలెనుండ
సొగిసి యీ విభునిదాసుల కరుణ చాలదా
నగవుజూపులను నున్నతమెపుడు జూప

(రేకు: 0008-04సం: 01-052)

అయ్యా మానవులవారూ ! తమకు శ్రీ హరి అనే పేరును జపించటం వలన కలిగే సుఖం సరిపోదా! అశాశ్వతములైన ఇతర సుఖాలు ఎందుకు? మేలైన రుచులను ప్రసాదించే హరి నామం మీకు చాలదా! లోకంలో ఇతర రుచులకోసం వెంపర్లాట ఎందుకు?

అధికమైన గౌరవ వచనం కూడా ఒక్కోసారి ఇబ్బంది కలిగిస్తుంది. ఒక వ్యక్తిని గౌరవంగా పిలవాలంటే మీకు అంటే సరిపోతుంది. "తమకు" అంటే అది

అధికమైన గౌరవ వచనం. అది ఒకోసారి వ్యంగ్యంగా గౌరవ హీనతను చూపిస్తుంది.నీచ మార్గాలలో పడి , అసలైన మార్గాన్ని వీడుతున్న వారి విషయంలో ఒక్కోసారి చురుక్కుమనిపిస్తేనే బండి ముందుకు నడుస్తుంది.దైవారాధనను వీడి అన్యారాధనలో కాలం గడుపుతున్న వారిని భక్త కవి కావాలనే తమరు అన్నాడు.

ఈ జన్మలనేవి చెరసాలలు. ఒక చెరసాలనుంచి ఇంకో చెరసాలకి మార్చినట్లు ఈ జన్మనుంచి మరొక జన్మలోకి వస్తున్నావు.ఈ చెరసాలలు పోవాలంటే జన్మ రాహిత్యం కలగాలంటే నిన్ను హరినామమే రక్షిస్తుందిరా !

అనేక నరకాలను తప్పించుకోవాలంటే నీ మనస్సులో హరి అనే మంత్రాన్ని తలుచుకో!పదివేల నరకకూపాలంటే పదివేలు ఉన్న నరకాల బావులని ముక్కస్య ముక్కార్థం చెప్పుకోకూడదు. "మీరొచ్చారు. అదే మాకు పదివేలు."అని తెలుగులో వాడుతుంటాం.ఇక్కడ పదివేలంటే చాల ఎక్కువ అని అర్థం. అన్నమయ్య చెప్పిన పదివేల నరకకూపాల్లోని పదివేలకి కూడా అదే అర్థం. పురాణాలు చెప్పిన దాని ప్రకారం ఉన్న చనిపోయిన తర్వాత శిక్ష అనుభవించే రకరకాల నరకాల్లో పూయోదకం అనే ఒక నరకం ఉంది.ఇది ఒక కూపం. అంటే బావి. మలమూత్రాలు, చీము, నెత్తురు, ఉమ్మి, వెంట్రుకలు, ఎముకలు, మాంసఖండాల వంటివి మురిగి ముక్కిపోయి గబ్బుకంపు కొట్టే కాలుష్య జలం ఇందులో ఉంటుంది.ఇటువంటి నరకాలు పోవాలంటే జన్మ రాహిత్యం కలగాలంటే మనస్సులో సదా హరినామాన్ని తలుచుకోవాలని భక్త కవి సందేశం.

దుర్గతిని పొందిన వాడు దరిద్రుడు.దరిద్రునికి బంగారపుకొండ కనబడితే - వాని సొంతమయితే ఆ ఆనందం వర్ణనాతీతం.హరినామంకూడా బంగారపుకొండ.దరిద్రాలౌ పోగొడుతుందని అన్నమయ్య అభయం.

పాపం కఠినమైన చీకటి లాంటిది.అంటే కన్ను పొడుచుకొన్న కనబడని చీకటి. ఆ చీకటిలో వెలుతురు ఇచ్చే దీపం హరి అనే పేరు.హరి అనే పేరు సర్వ పాపాలను హరిస్తుంది.

అన్నమయ్య తన కీర్తన ఎలాంటిదో చెప్పకుండా చెబుతున్నాడు. వేంకటేశ్వర స్వామిని స్తుతించే కీర్తన ఒక్కటి చాలు. ఆ కీర్తన కల్పవృక్షంలా కోరినవన్నీ ఇస్తుందని కవి వాక్కు.అన్నమయ్య కీర్తన కూడా అలాంటిదే.భక్తితో అర్థం చేసుకొని చదివితే మంచి ఫలితాలను ఇస్తుంది.

స్వామివారి అందమే అందం. ఆ అందాన్ని చూసి ఆనందించే స్వామివారి భక్తుల దయ ఉంటే చాలు. నీ జీవితమంతా నవ్వుల చూపులే. అంటే సంతోషమే. నీ బతుకంతా ఔన్నత్యమే అని కవి చెబుతున్నాడు. భగవంతునికంటె నిజమైన భక్తుడు గొప్పవాడు. ఆ భక్తుల దయ లభించినా మనబ్రతుకు ధన్యమవుతుందని అన్నమయ్య ప్రబోధం.

చాలదా అని అన్నమయ్య అన్నాడు. ఆయన కీర్తనలు ఎన్ని చదివినా చాలదు అని మన జవాబు.

98. సేసపాలు

అలమేలుమంగమ్మ పెళ్లిలో చేసిన తమాషాలను **పెనగొన్నకాగిళ్ల** అను కీర్తనలో వర్ణిస్తూ అన్నమయ్య ఇందులో తలంబ్రాలను సేసపాలు అన్నాడు.

పల్లవి: పెనగొన్నకాగిళ్ళ పెండ్లాడవయ్యా
అనిశము బాయలేని అలమేలు మంగను

చ.1: అంకెల మంచిగుణము లనేటినూలున నీకు
కంకణదారాలు గట్టె గలికి
లంకెలుగా నీపై వలపు లనేబంగారుతో
కొంకులేనిమనసుల కొంగుముళ్లు వేసెను

చ.2: ఆసల నిండుఉజూపు లనేటిమేటిమొగ్గల
బాసికము గట్టె నీకు బడతి
వాసితో నవ్వుల నేవలువముత్యాలనే
సేసపాలు సిగ్గున దోసిట నీపై నించెను

చ.3: బెరసి మనోరథము పెండ్లిపీటమీద
మరిగి నిన్నుఁ గూడె మగువ
ఆరుదై శ్రీవేంకటేశ అధరామృత బువ్వ-
మెరవు లేనిరతులయింట విందు వెట్టెను

(రేకు:0677-1సంపుటం:14-457కీ)

అర్థం

ఓ వేంకటేశా ! ఎప్పుడూ (అనిశము) నిన్ను విడువలేని (పాయలేని) అలమేలు మంగను, మెలితిరిగిన (పెనగొన్న) కౌగిళ్లలో (కాగిళ్ళ) పెండ్లాడవయ్యా!

చ.1: చక్కని ఆడుది మా అలమేలుమంగమ్మ (కలికి) నీ సమీపంలో చేరి (అంకెల) మంచిగుణములనే నూలును కంకణాలు కట్టుకొనే దారాలుగా మలిచి నీకు (కంకణదారాలు) కట్టింది. సంకోచము లేకుండా (కొంకులేని) వలపు లనే బంగారముతో, బంధాలు (లంకెలు) వేసి మనసుల కొంగు చివర ముడులు వేసింది (కొంగుముళ్లు వేసెను) (నీకు వశవర్తి యైనదని ఇంకొక అర్థము.)

చ. 2: నిండుచూపు లను మేటి మొగ్గలతో ఆశలు చూపుతూ (ఆసల) పెండ్లిలో వధూవరుల నొసట కట్టెడు మౌక్తికహారము (బాసికము) నీకు అలమేలుమంగమ్మ (పడతి) కట్టింది.

ఆధిక్యముతో (వాసితో) నవ్వులనే విలువైన (వలువ) ముత్యాలను తలంబ్రాలుగా మార్చి (సేసపాలు) సిగ్గుతో దోసిటనుంచి తదుపరి నీ తలపై పోసింది(నించెను)

చ. 3: మా అలమేలుమంగమ్మ కోరిక (మనోరథము) వ్యాపిస్తుండగా (పెరసి) పెండ్లిపీఁటమీఁద అలవాటయి(మరిగి) నిన్ను పొందింది. (ఎన్నిసార్లు నిన్ను ఎన్ని అవతారాల్లో పెండ్లిచేసుకొందో కదా ! శ్రీవేంకటేశ ! ఆశ్చర్యకరముగా (ఆరుదై) మెరుపులు చూపించని (మెరవు లేని) సంభోగాల ఇంటిలో(రతులయింట) అధరామృత మనే బువ్వను నీకు విందుగా పెట్టింది. (విందు వెట్టెను)

99. సోబన

ఇదె పెండ్లిలగ్న వేళ కీర్తనలో శ్రీవేంకటేశ్వర స్వామి పెండ్లి ముచ్చట్లు అన్నమయ్య చనువుగా ఆయనకే విన్నవిస్తున్నాడు. ఇందులో శుభము అను అర్థంలో సోబన అను పదాన్ని అన్నమయ్య ప్రయోగించాడు.

పల్లవి: ఇదె పెండ్లిలగ్న వేళ యింటికి నీకు
సుదతిమోవిచిగుళ్ళు సోబనపత్రికలు

చ.1: తొయ్యలి చూచినచూపు తుమ్మిదపేరటాండ్లు
నెయ్యమున నవె నీకు నివాళ్ళు
పయ్యదలో చన్నులు పరగ బూజగుండలు
నియ్యడ గంత కవె నిమ్మపండ్లు

చ.2: చెలియ నవ్విననవ్వు జిగి నీకుదలబాలు
చెలగి బువ్వాన కవె చిలుపాలు
పలుకుల సరసాలు బలుమంగళాష్టకాలు
మలసి యవె మదనమంత్రాలు

చ.3: వనిత కాగిలి నీకు వాటపు బెండ్లిచవిక
దినము నదె దోమతెరమంచము
వినయపు రతులు శ్రీవేంకటేశ యిద్దరికి
కనుగొన నవె మీకు కంకణదారాలు (రేకు: 0775-1సం:16-439)

భావం

పల్లవి: స్వామీ! అదుగో నీ పెండ్లి వేళ సమీపిస్తోంది. పెండ్లికి ఆహ్వానించే శుభలేఖలు ఎక్కడంటావా!అదుగో! చక్కనిపలువరుసకలిగిన అమ్మ అలమేలుమంగ లేత చిగుళ్ల వంటి పెదాలు రా...రమ్మని ఆహ్వానించే శుభలేఖలు.

చరణం1 : పెళ్లిలో ఆశీర్వదించే ముత్తైదువులు ఎక్కడంటావా! అదుగో స్వామీ! మా అమ్మ చూసే తుమ్మెదల్లాంటి చూపులు ముత్తయిదువులు.(ముత్తయిదువులు సుఖంగా ఉండమని ఆశీర్వదిస్తూ పాటలు పాడతారు. తుమ్మెదఝంకార ధ్వనులు ఆ ఆశీర్వాదాలని భావం)

మాఅమ్మ చూసే తుమ్మెదల్లాంటి చూపులునీ ముఖం చుట్టూ తిరుగుతున్నాయి

కదా! అవేనయ్యా! నీకు ప్రేమతో ఇచ్చే మంగళారతులు.

వివాహ వేదికలో ఉంచే కుండలు ఏవయ్యా! అంటున్నావా! స్వామీ! మా అమ్మ పైటలో ఉన్న స్తనాలు ఆ కుండలు. అవి ఉభయతారకాలు. ఈ వివాహ సమయంలో పెండ్లిలో ఉప్పు-పప్పు-బియ్యము పెట్టెలో ఉంచి తీసుకొని పోయి పెండ్లి వారికి ఇచ్చునవి కూడా అవే. (పెండ్లివారు వేంకటేశుడని ఇక్కడ గ్రహించాలి)

చరణం2 :

స్వామీ! మా అమ్మ నవ్వే నవ్వులు వివాహకాలంలో దోసిళ్లతో ఒకరి తలపై ఒకరు పోసికొను తలంబ్రాలు. (నవ్వులు నాలుగు పక్కకి విరబూస్తాయి. తలంబ్రాలు కూడా అలాగే విస్తరిస్తాయి కనుక నవ్వుకి, తలంబ్రాలు కి పోలిక.)

ఆనవ్వులే పెండ్లివారితో సహ భోజనం చేసే బువ్వపు బంతిలో తియ్యనిపాలు. (ఇష్టమైనవారి నవ్వు రుచిగా ఉంటుంది. కనుక రుచిగా ఉన్న పాలతో పోలిక.)

స్వామీ! మీ ఇద్దరు మాట్లాడుకొనే సరసాల మాటలు పెండ్లి సమయంలో చదివే దీవెనలు .స్వామీ!మీ ఇద్దరి విజృంభణను కలపటానికి మన్మథుడు చదివే మంత్రాలు కూడా ఆ సరసపు మాటలే.

చరణం3 :

స్వామీ! అమ్మ వారి కౌగిలి నీకు అనుకూలంగా పెండ్లిలో వేసే నాలుగు కాళ్ల మంటపం. (కౌగిలిలో నీవి,ఆవిడవికలిపి మొత్తం నాలుగు కాళ్లు. అందుకే నాలుగు కాళ్ల మంటపంతో పోల్చానయ్యా!) ప్రతిదినము ఒకరికొకరికి సుఖాన్నిచ్చే దోమతెరమంచం కూడా అమ్మ వారి కౌగిలి. అవునుకదా!

శ్రీ వేంకటేశా!కార్యం నెరవేరేవరకు చేతికి విప్పని దారాలు ఏవయ్యా! దేనితో పోలుస్తానంటావా!స్వామీ! మీ ఇద్దరిరహస్యమ్మెన-మంచి పద్ధతులు- ఒకరికొకరు నేర్పే -కలయికలు కంకణదారాలు. ఆ కంకణ దారాలు.విప్పకయ్యా స్వామీ! మాకు శుభాన్నిచ్చేవి అవే.స్వస్తి.

పరమార్థం

పెండ్లి ఇద్దరికి సంబంధించిన వ్యవహారం. కనుక అన్నమయ్య కూడా ప్రతి పోలిక రెండింటికి అన్వయించాడు. ఉదాహరణకి అమ్మ నవ్వే నవ్వులు వివాహకాలంలో దోసిళ్లతో ఒకరి తలపై ఒకరు పోసికొను తలంబ్రాలు ఆనవ్వులే పెండ్లివారితో సహ భోజనం చేసే బువ్వపు బంతిలో తియ్యనిపాలు .అది ఈ కీర్తనలో చమత్కారం.స్వస్తి.

100. సోవల

ఎదుట ఉన్న అను అర్థంలో గోవింద గోవిందయని కొలువరె అను కీర్తనలో అన్నమయ్య సోవల అను పదాన్ని ప్రయోగించాడు.

పల్లవి : గోవింద గోవిందయని కొలువరె
గోవిందాయని కొలువరె

చ1. హరియచ్యుతాయని యాడరె
పురుషోత్తమాయని పొగడరె
పరమపురుషాయని పలుకరె
సిరివరయనుచును జెలగరె జనులు

చ2. పాండవవరదా అని పాడరె
అండజవాహను కొనియాడరె
కొండలరాయనినే కోరరె
దండితో మాధవునినే తలచరే జనులు

చ3. దేవుడు శ్రీవిభుడని తెలియరె
సోవల యనంతుని చూడరె
శ్రీవెంకటనాథుని చేరరె
పావనమైయెపుడును బ్రదుకరె జనులు (10-02)

ఓ ప్రజలారా ! మీరు గోవిందా ! గోవిందా అంటూ గోవిందుని కొలవండి.

1.ఓ ప్రజలారా ! హరీ ! అచ్యుతా ! అంటూ ఆడండి. పురుషోత్తమా అని స్వామిని పొగడండి. పరమపురుషా ! అని స్వామిని పలుకరించండి. లక్ష్మీ దేవికి ఇష్టమైన వాడా అంటూ శబ్దం చేయండి.

2.ఓ ప్రజలారా !పాండవులకు వరములు అనుగ్రహించిన వాడా అంటూ పాడండి. గరుత్మంతుడు వాహనముగా కలిగిన వాడా ! అని పొగడండి. కొండల రాజు అంటూ ఆయనను కోరండి. గొప్పగా మాధవుడిని తలుచుకోండి.

3. ఓ ప్రజలారా ! ఈ వేంకటేశుడు లక్ష్మీదేవి భర్త అని తెలుసుకోండి. ఎదుట ఉన్న అనంతుని చూడండి. శ్రీ వేంకట నాథుని చేరటానికి ప్రయత్నించండి .

ఎప్పుడూ పవిత్రంగా బతకండి.

పరమార్థం

ఇది తాళ్లపాక చిన తిరుమలాచార్యుల వారి రచన. తాళ్లపాక చిన తిరుమలా చార్యులు అన్నమయ్య మనుమడు. ఇది చిన తిరుమలాచార్యులు రాసాడని చెబితే తప్ప, ఈ కీర్తన రచయిత అన్నమయ్యే అని అందరూ నమ్ముతారు. అది ఆ తాళ్ల పాక వంశ మహిమ. భక్తి వారి గళములో, గంటంలో సమానంగా హెచ్చు తగ్గులు లేకుండా నినదించింది.

గోవిందా అన్న పదం వేంకటేశునికి చాలా ఇష్టమైన పదం. అందుకే తాళ్ల పాక కవులకి కూడా చాల ఇష్టమైన పదం. ఈ కీర్తన కిరీటంలో మూడు గోవింద పదాల మణులు విరాజిల్లుతున్నాయి. పనికి మాలిన రాజులకి, అధికారులకి సేవ చేయట మేమిటి? వాళ్లని కొలవట మేమిటి? చక్కగా గోవిందా అంటూ గోవిందుని కొలుచుకో అను సందేశం కీర్తనలో పల్లవించింది.

ఈ కీర్తనలో క్రియా పదాలు కవి భావనా వాహినిలో ఆడుకొన్నాయి. ప్రతి పంక్తి చివర క్రియా పదం సంబోధనాత్మకమై భక్త జనులకు కర్తవ్యాన్ని నిర్దేశించింది.

శ్రీదుడు, శ్రీ ధరుడు అను పదాలను పలికితే ఐశ్వర్యము లభిస్తుంది. ఏ పనిలో అయినా జయం కావాలనుకొనేవారు రామ, పరశురామ, నృసింహ, త్రివిక్రమ నామాలను పలకాలి. విద్యాభ్యాసము చేసేవారు ప్రతిరోజూ పురుషోత్తమ అని పలకాలి. కష్ట బంధాలు తొలగిపోవాలనుకొనేవారు దామోదర నామాన్ని పలకాలి.కంటి రోగాలు పోవాలనుకొనేవారు పుష్కరాక్ష నామాన్ని జపించాలి.భయము తొలగిపోవాలనుకొనేవారు హృషీకేశ నామాన్ని ఉచ్చరించాలి.మందులు తీసుకొనే ఔషధ కర్మ సేవలో అచ్యుత నామాన్ని పలకాలి. ఇలా మనస్ఫూర్తిగా నమ్మి పలికితే ఒక్కో నామానికి ఒక్కొక్క ఫలితం లభిస్తుందని అగ్ని మహా పురాణములో ఉంది. (284వ అధ్యాయము) ఈ కీర్తన చదివినవారికి ఆ ఆయాయా ఫలితాలు వస్తాయి.

పాండవవరదా అని పాడరె

పాండవులను శ్రీ కృష్ణుడు ఆదుకొన్న సందర్భాలు ఒకటా రెండా ! శ్రీ కృష్ణుడు లేని పాండవులు మొక్కలు కాలేని విత్తనాలు. పాండవులను తీర్చిదిద్దింది కృష్ణుడు. కృష్ణుడు నిర్యాణము చెందినప్పుడు అర్జునుడు ఏడుస్తూ చెప్పిన ఈ

పద్యం సుప్రసిద్ధం.

"మన సారథి/మన సచివుడు,
మన వియ్యము, మన సఖుండు, మన బాంధవుడున్ ,
మన విభుడు, గురుడుదేవర
మనలను దిగనాడి చనియె మనుజాధీశా!"

అర్జునుడు ద్రౌపదిని పెండ్లాడింది కృష్ణుని కటాక్షం వల్ల. ఇంద్రుని నుండి గాండీవాన్ని గ్రహించింది కృష్ణుని వల్ల. పాండవులు రాజసూయ యాగం చేయగలిగింది కృష్ణుని సహాయం వల్ల. పాంచాలి మనం కాపాడాడు. ముక్కోపియైన దుర్వాసుని శాపంనుండి రక్షించాడు. అర్జునునికి పాశుపతాస్త్రం ఇప్పించాడు. ఇలా కృష్ణుడు చేసిన సహాయాలు ఎన్నెన్నో . అందుకే కవి **పాండవవరదా అని పాడరె** అన్నాడు

అండజవాహను కొనియాడరె

కశ్యప బ్రహ్మ భార్య వినత.భర్తనుండి ఇద్దరు మంచి కుమారులు పుట్టేటట్లు వరం పొందింది.మొదటి కుమారుడు అనూరుడు.అమె రెండవ గర్భం(పిండం) అండంగా(గుడ్డుగా) మారింది.దానిని నేతికుండలో ఉంచారు. ఐదు వందల సంవత్సరాల తర్వాత వినతకు సంబంధించిన రెండవ గుడ్డు పగిలి అందులోనుండి గరుత్మంతుడు పుట్టాడు. (ఆది 02-36)గుడ్డునుంచి పుట్టాడు కనుకనే గరుత్మంతునికి అండజుడు అని పేరు.

గరుత్మంతుడు యుద్ధంలో దేవతా వీరులను అనేకమందిని జయించాడు. తల్లి దాస్యం పోవటం, కోసం అమృతాన్ని అపహరించినప్పటికీ, నిజాయితీగా రుచి చూడలేదు. తనది కానిదానిపట్ల నిరాసక్తతతో ఉండే గరుత్మంతుని గుణాలకు విష్ణువు మెచ్చుకొన్నాడు. అతనిని వరంకోరుకొమ్మన్నాడు. నీ ఎదుట భక్తితో నిన్ను సేవించే అదృష్టం ఇమ్మన్నాడు గరుత్మంతుడు.

నాకు వాహనంగా, నాజెండాగా ఉండమని విష్ణువు అనుగ్రహించాడు. (మహా భారఆది 02-104-106)ఆవిధంగా గరుత్మంతుడు స్వామికి వాహనమయ్యాడు. శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో ఐదవ రోజు గరుడవాహన సేవ చాలా పేరు పొందింది. ఈ రోజు మాత్రమే స్వామివారి మూలమూర్తి మీద ఉన్న మకరకంఠి, లక్ష్మీహారం,ఊరేగించే మలయప్ప స్వామికి అలంకరిస్తారు. అది

గరుడ వాహన ప్రత్యేకత.

సోవల యనంతుని చూడరె

అన్నమయ్య సందిగ్ధ పదాలలో సోవల ఒకటి. దీనికి ఎదుట,ప్రత్యక్షంగా అని శ్రీ వేటూరి ఆనందమూర్తిగారు అర్థం చెప్పారు. రవ్వా శ్రీ హరిగారు దీర్ఘములైన, అందమైన అని అర్థాలు చెప్పారు. (అన్నమయ్య పద కోశం -618 పే.) ఎదుట అను అర్థం ఇక్కడ సరిపోతోంది.

శ్రీమహావిష్ణువునకు ఉండే అనేక పేర్లలో 'అనంతుడు' ఒకటి. అనంతుడంటే ఆది అంతములు లేనివాడని ఒక అర్థం. ప్రపంచమంతా నిండినవాడని నిండిన వాడని ఇంకొక అర్థం. భాద్రపద శుక్ల చతుర్ది రోజున ఆచరించే వ్రతాన్ని చేసే వ్రతాన్ని 'అనంత చతుర్ధశి వ్రతమని', 'అనంతపద్మనాభ వ్రతమని పిలుస్తారు.

గ ృహస్థులు ధరించే యజ్ఞోపవీతంలోని మూడవ పోగు -అనంతుడు. ఇతడు ధైర్యాన్ని ప్రసాదిస్తాడని శ్రుతి. ధైర్యం సంగతి ఎలా ఉన్నా- అనంతమైన సంపదకు నిలయమైన వాడని సంపదలను ప్రసాదిస్తాడని ఇటీవల కేరళ వృత్తాంతం నిరూపించింది.

పావనమైయెపుడును బ్రదుకరె జనులు

మనసంప్రదాయంలోని గొప్పతనాన్ని ఈ కవి వాక్యం నిరూపిస్తుంది.

పవిత్రంగా బతకండని కవి ఉపదేశం. సుఖంగా బతకండని మన శాస్త్రాలు చెబుతుంటాయి. సుఖం పవిత్ర జీవనం వల్లనే లభిస్తుందని కవి వాక్కు. పవిత్రత దైవ సాన్నిధ్యంలో లభిస్తుంది. దేవుని గురించి మాట్లాడుకొంటుంటే లభిస్తుంది. దేవుని గురించి పాడుకొంటుంటే లభిస్తుంది. ఇది తాళ్ల పాక కవులు ఆచరించి, చెప్పిన జీవన సత్యం. ఆ సత్యాన్ని అనుసరించిన వారు పవిత్రులవుతారు. అనుమానమే లేదు. స్వస్తి.

డా. తాడేపల్లి పతంజలి

పుట్టిన తేదీ : **15-07-1963**

తల్లిదండ్రులు : తాడేపల్లి సుశీల, పార్వతీశశాస్త్రి

భార్యాపిల్లలు : తాడేపల్లి మీనాక్షి,(అర్థాంగి) దీప్తి, కావ్య(పిల్లలు)

ప్రస్తుత ఉద్యోగం : అసోసియేట్ ప్రొఫెసర్ ఇన్ తెలుగు,
ప్రభుత్వడిగ్రీ కళాశాల, పటాన్ చెరు, మెదక్‌జిల్లా

ముద్రిత గ్రంథాలు : **1.** నాటిభారతంలో నేటి సమాజం,**(1996)**
2. మామాకలాపం,**(1997)**
3. భావనలు,**(2004)**
4. శ్రీమన్నారాయణీయము**(2006),**
5. భవిష్యపురాణము,**(2010)**
6. అన్నమయ్యగీతోపదేశాలు,**(2011)**
7. అన్నమయ్యఅన్నమాట,**(2012)**
8. ప్రాచీనప్రబంధం, ఆధునిక సంతకం**(2014),**
9. అన్నమయ్య కౌముది **(2015)**
10. శ్రీ శివ మంగళాచరణ సురభి**(2016)**

ప్రభుత్వ అవార్డులు : జాతీయ స్థాయిలో ఆకాశవాణి
ఉత్తమ హాస్య రచయిత అవార్డు**(1996)**

రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధ్యాపక అవార్డు(2010)

వ్యాసాలు : వివిధాంశాలపై 100కి పైగా వివిధ పత్రికల్లో

కథలు : ఇరవైకి పైగా కథలు వివిధ పత్రికల్లో

బిరుదు : అన్నమయ్య పదసేవక

అభిరుచి : శివశక్తిసాయిటీవీ చానల్లో శ్రీనాథుని శివరాత్రి మాహాత్మ, హరవిలాస ప్రవచనాలు, రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ సాహిత్య వేదికలపై కావ్యాలు, భగవద్గీత, ఉపనిషత్తులు మొదలైన వాటిపై ప్రసంగాలు, ఆకాశవాణిలో వివిధ సందర్భాల్లో అనేక ప్రసంగాలు, కవిత్వానువాదాలు,

అభిలాష : అడ్డుగోడలు లేకుండా ఆకాశంలా కనిపించే విశ్వ సాహిత్యాన్ని చేతనయినంతగా ఆస్వాదించటం, వీలయినంతగా అర్హులకు ఆ పరిమళాలని పంచిపెట్టడం.

కీ॥శే॥ శ్రీమతి శాంతమ్మ

(9 మే 1926 - 23 మే 2016)

హిందూధర్మంలో ప్రధానాంశాలైన పురాణేతిహాసాల విషయ పరిజ్ఞానం,
నీతి-భక్తి-నామ ప్రార్థనలు, మంత్రజపాదులు, సదాచారం క్షుణ్ణంగా తెలిసిన
ఆధ్యాత్మికజీవి మా అమ్మ 'శాంతమ్మ'.
తొలిగురువుగా నాకు దిశానిర్దేశం చేసి నా వ్యక్తిత్వవికాసానికి అహరహం శ్రమించి
నన్ను విజయసాధకుడిగా కన్నా విలువలున్న వ్యక్తిగా తీర్చిదిద్దాలన్న తపనతో
జీవించిన మహోన్నత మాతృమూర్తి 'శాంతమ్మ'.
తను ఊహించిన శిఖరాలను, ప్రమాణాలను అందుకోలేక పోయానేమోనన్న
సంశయం నన్ను వెంటాడుతుంటే ఆప్యాయంగా, అభయముద్రతో సాంత్వన
చేకూర్చిన కరుణామూర్తి మా అమ్మ 'శాంతమ్మ'.
జీవితంలో ఎదురయ్యే అనేకానేక ఒడిదుడుకులను ఎదుర్కోగల ఆత్మవిశ్వాసాన్ని
వెలిగించిన తేజోమూర్తి మా అమ్మ 'శాంతమ్మ'.
అమ్మలలో అరుదైన మా అమ్మ జగదంబలో కలిసిపోయింది.
అయినా ఆమె వెలుగు, ఆమె చల్లదనం, ఆమె రక్షాకవచం ఎల్లవేళలా నన్ను
స్పృశిస్తూ నిత్యచైతన్య పథికుడిగా ప్రోత్సహిస్తూనే ఉంటాయి.
అమ్మ నిరంతరం పలకరిస్తూనే ఉంటుందనే భావనతో పులకరిస్తూనే ఉంటాను.

- వరప్రసాద్